ఉదయగిరి మహనీయులు

సంగ్రహకర్త:

మహమ్మద్ హనీఫ్ అయాజ్ ఖాలిది చిష్తియల్ ఖాదరీ

M.A., B.Ed.,

ఉదయగిరి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా. (ఆం.ప్ర)

ఉదయగిరి మహనీయులు

సంగ్రహకర్త:
మహమ్మద్ హనీఫ్ అయాజ్ ఖాలిది చిష్తియల్ ఖాదరీ, M.A., B.Ed.,
7-76, షామీర్ సాహెబ్ వీధి,
ఉదయగిరి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా. (ఆం.ప్ర)

ప్రథమ ముద్రణ : 2026

ప్రతుల సంఖ్య : 500

ప్రతుల కొరకు :

ప్రచురణ :

అంకితం

తమ కరుణ కటాక్షములతో నన్ను
తమ పాద పద్మముల చెంత చేరదీసిన
ఆధ్యాత్మిక సద్గురువు
హజరత్ ఖ్వాజా అబుల్ ఫైజ్ షా
మొహమ్మద్ ఖాలిద్ వజూది
ఖాదరీ చిష్తి సుహర్వర్దీ
హైదరాబాదు వారికి.

– మహమ్మద్ హనీఫ్ అయాజ్ ఖాలిది
చిష్తియల్ ఖాదరీ

ముఝె ఆప్నే బులాయా ఏ కరం నహీ తొ క్యాహై
ముఝె అప్న తుం బనాయా ఏ కరం నహీ తొ క్యాహై
(నన్ను మీ చెంత చేరదీసి మీవానిగా చేసుకొనుట
ఇది మీ కరుణ కటాక్షము గాక ఏమిటి)

ముందుమాట

17వ శతాబ్ధంలో రాజ్యస్థాపనకై కర్ణాటక రాజ్యం నుంచి కోటాధిపతులు, నవాబులు ఉదయగిరి వచ్చారు. ఈ దుర్గం సముద్ర మట్టము నుంచి 3079 అడుగుల ఎత్తులో ఉంది. ప్రకృతి రమణీయ దృశ్యాలు, లోతైన పచ్చటి లోయలు, గలగల మని పారే నీటితో మనసు ఆహ్లాద పరుస్తున్నది. ఇక్కడ ఆధ్యాత్మిక ప్రేరణ కలిగించే ఏకాంత వాతావరణం, కొందరు మహనీయులను అరబ్బీ, పారసీ పండితులను, సాహితీవేత్తలను చివరి శ్వాస వరకు ఉదయగిరిలోనే ఉండేటట్లు చేసింది.

అనుమ సముద్రము పేట రహమతాబాద్‌లో వెలసిన మహనీయులు హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబేరసూల్ గారిని ఆనాటి వివిధ ప్రాంత నవాబులు, ధనవంతులు తమ ప్రాంతానికి రమ్మన్నారు. శాశ్వతంగా ఉండిపోవలసిందిగా మనవి చేశారు. ఆయన వారి మనవి ఆలకించక ఉదయగిరి జాగీరుకు సంబంధించిన అనుమసముద్రం పేటను ఎన్నుకొని ఆధ్యాత్మిక పరంగా ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత చేకూర్చారు.

ఉదయగిరిలో సమాధియై ఉన్న మహనీయులు, ఆధ్యాత్మిక, సాహిత్య, పాలన రంగాలలో అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొంది ప్రసిద్ధిగాంచారు. ఇక్కడ విభిన్న సంస్కృతులు వున్నా సోదర భావముతో మెలుగుతున్నారంటే ఆనాటి మహనీయుల సమైక్య భావన, భిన్నత్వములో ఏకత్వ బోధన, వారి ఆధ్యాత్మిక ఆచరణ ప్రభావము అనక తప్పదు.

ఉదయగిరి మహనీయుల పూర్వీకులు నవాయిత్‌లు. వీరు మదీనా దేశస్తులు. ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం ఖురైష్ తెగకు చెందినవారు. క్రీ.శ. 1332లో భారతదేశాన్ని చేరి వివిధ ప్రాంతాలలో ఆధ్యాత్మిక, సాహిత్య పరిపాలన రంగాలలో కీర్తి గడించారు. ఈనాటికి నవాయిత్ వంశస్తులు మదరాసు, హైదరాబాదు, ముంబాయి, భట్‌కల్, కొంకణం ప్రాంతాలలో సేవలందిస్తూ ఖ్యాతిగడిస్తున్నారు.

ఈ రచన ద్వారా ఉదయగిరి మహనీయుల గురించి, నవాయిత్ వంశ గొప్పతనం గురించి నేటికి పలు ప్రాంతాలలో వారి వంశస్తులు అందిస్తున్న ఆధ్యాత్మిక, సాహిత్య సేవలను గురించి తెలియజేశాను.

అద్వైత, ఆధ్యాత్మిక ప్రేరణ కలిగించే ఈ ఉదయగిరి మట్టిలో, ఎలాంటి మాణిక్యాలు దాగి వున్నాయో వివిధ చారిత్రక గ్రంథాల ద్వారా తెలుసుకొన్న నేను తెలుగు భాషలో పుస్తక రచన గావించి ఉదయగిరి ప్రాముఖ్యతను హిందూ ముస్లిం సోదరులకు తెలియజేయాలనే ఉద్దేశముతో ప్రారంభించిన ఈ రచనా కార్యం దేవుని దయతో నేడు పూర్తయినందుకు సంతోషిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని చదివిన పాఠక లోకం ఉదయగిరి స్థల ప్రాధాన్యతను గుర్తిస్తుందని నా ఆశ, ఆకాంక్ష.

ఉదయగిరి
తేది :

ఖ్వాజా అబుల్ ఫారుఖ్ షా మొహమ్మద్ హనీఫ్
ఖాలిది చిష్తియల్ ఖాదరీ
ఉదయగిరి

కృతజ్ఞతలు

ఈ గ్రంథ రచనలో నాకు సహకరించిన వారు :

1. శ్రీ డా. హసనుద్దీన్ అహ్మద్, (I.A.S (Rtd.) హైదరాబాద్.
2. శ్రీ సయ్యద్ మహమూద్ హుసైని, (I.A.S (Rtd.) హైదరాబాద్.
3. శ్రీ అరుద్ర, ప్రముఖ సాహితీవేత్త, సినీకవి, మద్రాసు.
4. శ్రీ సయ్యద్ సలావద్దీన్ మొహమ్మద్ అయ్యూబ్ ఛీఫ్ ఖాజి గవర్నమెంట్ ఆఫ్ తమిళనాడు, మద్రాసు.
5. శ్రీ ఉబేదుల్లా, M.A., లైబ్రేరియన్, దీవాన్ సాహెబ్ బాగ్, మద్రాసు.
6. శ్రీమతి పర్వీన్ రూబి, లైబ్రేరియన్ సెంట్రల్ లైబ్రరీ, హైదరాబాద్.
7. శ్రీ డాక్టర్ అబ్దుల్ వహాబ్ తస్నీం, M.A.Ph.D. రీడర్, వి.ఆర్.కాలేజీ, నెల్లూరు.
8. శ్రీమహమ్మద్ మజ్‌హర్‌అలీ, మద్రాసు.
9. శ్రీసయ్యద్ మూసా అబ్దాల్ చిష్తి, ఉదయగిరి.
10. శ్రీ సయ్యద్ దావూద్ హుసైని రూహ్ చిష్తి, ఉర్దూ మున్షీ వి.ఆర్. హైస్కూలు, నెల్లూరు.
11. జమీన్‌రైతు వార పత్రిక సిబ్బంది, నెల్లూరు.
12. శ్రీ అబ్దుల్ రవూఫ్ ఖాలిది చిష్తియల్ ఖాదరి డాక్యుమెంట్ రైటర్, నెల్లూరు.
13. శ్రీ సమద్ భారతి, బీదర్.
14. శ్రీ మహబూబ్ మస్తాన్ ఖాలిది చిష్తియల్ ఖాదరి, M.A., M.Sc., M.Ed., ఉదయగిరి.
15. శ్రీ రహమత్ బాషా ఖాలిది చిష్తియల్ ఖాదరి, ఉదయగిరి.
16. శ్రీ సయ్యద్ గౌస్ సాహబ్ I.A.S. జాయింట్ కలెక్టర్, హైదరాబాద్.
17. శ్రీ సయ్యద్ సజ్జాద్ సాహబ్, హైదరాబాద్.
18. శ్రీ డాక్టర్ రాహి ఫిదాయి కడప.
19. శ్రీ సయ్యద్ మహబూబ్ బాషా ఆస్థాన ముతవల్లి సిద్దోటు.
20. శ్రీ సయ్యద్ హంజా హుసైని ఖాలిది, ఉదయగిరి.
21. శ్రీ నఖీబ్ గౌస్ మొహియుద్దీన్, ఉదయగిరి.
22. శ్రీ ఉదయగిరి ఫయాజ్, సీనియర్ జర్నలిస్ట్.
23. శ్రీ మహ్మద్ అక్రమ్ హనీఫ్, నెల్లూరు.

ఆధారగ్రంథాలు

1. తజ్కిరతుల్ ఔలియా -ఎ-దక్కన్ - అబ్దుల్ జబ్బార్, మల్కాపూరి.
2. ఖాన్వాద-ఎ-ఖాజీ బదరుద్దౌలా - అఫ్జలుల్ ఉలేమా మొహమ్మద్ యూసుఫ్ కోకన్, ఎం.ఏ., ఎం.లిట్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ అరబిక్, పర్షియన్ అండ్ ఉర్దూ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్.
3. అరబిక్ అండ్ పర్షియన్ ఇన్ కర్నాటిక్ - మహమ్మద్ యూసుఫ్ కోకన్
4. బహరె రహమత్ - అబూసయీద్ వాలా
5. అఖీదతుత్తాలిబైన్ - హజరత్ షా నిజాముద్దీన్
6. తారిఖున్నవాయత్ - అజీజ్ జంగ్ విలా, హైదరాబాదు.
7. తారీఖ్ ఉద్గీర్ - దీవాన్ సాహెబ్ బాగ్ లైబ్రరీ, మదరాసు.
8. తారుఫ్ - డా.షఫియా ఖాదరీ, ఎం.ఏ.పి.హెచ్.డి, అమెరికా.
9. అబ్దుల్ హఖ్ సావీ - కావిష్ బదరి, మదరాసు.
10. గాలిబ్ ఔర్ హైదరాబాద్ - అహమద్ షకేబ్, హైదరాబాద్.
11. మౌలానా బాఖర్ ఆగా వెల్లూరి షఖ్ సియత్ ఔర్ ఫన్ డా.జాకిరా గౌస్ మద్రాస్
12. ది ఆర్కలాజికల్ సర్వే ఆఫ్ సౌత్ ఇండియా
13. రౌజతుల్ ఖుదసియా - షాయఖ్ అలీ షాయఖ్

విషయ సూచిక

1.	ఉదయగిరి దుర్గము - కొన్ని విశేషాలు	1
2.	నవాయిత్ వంశము	7
3.	దీవాన్ సాహెబ్ బాగ్ గ్రంథాలయము	12
4.	హేజరత్ ఫఖియ అతా ఖాజీ అహమద్ షాఫీ	13
5.	హేజరత్ ఖాజీ మహమూద్ కబీర్	15
6.	హేజరత్ సిబఖ్తుల్లా నవైతి ఉర్ఫ్ షా సాహెబ్	17
7.	హజరత్ మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇమాముల్ ముదర్రసీన్	19
8.	హజరత్ అహ్మద్ అబుతురాబ్ ఖాదరీ	32
9.	హజరత్ సయ్యద్ ముస్తఫా అలీ ఖాన్	35
10.	హజరత్ అబ్దుల్లా షహీద్	38
11.	నవాయిత్, వాలజా పరిపాలనలో ఉదయగిరి ఖిల్లా దారులు	41
12.	హజరత్ సయ్యద్ బదరుద్దీన్ అలీ ఖాన్	42
13.	హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబేరసూల్	44
14.	హజరత్ షేఖ్ మఖ్దూమ్ అబ్దుల్ హఖ్ సావీ	69
15.	హజరత్ మౌలానా బాఖర్ ఆగా వెల్లూరి	78
16.	హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్	88
17.	హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ హజరత్ వజూదీషా	100
18.	హజరత్ మహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేఖ్ సాహెబ్	102

19. హజరత్ అమీరుద్దీన్ అలీషా 103

20. హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖైరుద్దీన్ ఫాయఖ్ 107

21. హజరత్ మౌల్వీ మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ 108

22. హజరత్ మౌల్వీ గులాం మొహియుద్దీన్ మౌజిజ్ 114

23. హజరత్ హకీం గులాం అలీ మూసా రజాఖాన్ రాయఖ్ 117

24. హజరత్ అబూసయీద్ నఖ్ష్ బందీవాలా 118

25. హజరత్ షాయఖ్ అలీఖాన్ షాయఖ్ 120

26. హజరత్ మీరా మొహియుద్దీన్ వాఖిఫ్ 125

27. హజరత్ సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ 127

28. హజరత్ షేఖ్ మహమ్మద్ ఉస్మాన్ సావీ 139

29. హజరత్ మౌల్వీ అబ్దుల్ వహాబ్ మదరుల్ ఉమ్రా 148

30. హజరత్ మౌల్వీ మొహమ్మద్ సిబగ్‌తుల్లా ఖాజీ బదరుద్దౌలా 153

31. హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖాలిస్ 163

32. హజరత్ అబ్దుల్ వహాబ్ పీర్ 164

33. హజరత్ షొహదా (గంజె షహిద్) 165

34. హజరత్ ఫాఛాపీర్ ఔలియా 167

35. హజరత్ ఖాదర్ సాహెబ్ ఔలియా 168

36. హజరత్ ఫరీదుద్దీన్ పాషా 170

37. హజరత్ దుర్వేష్ ఔలియా 171

38. హజరత్ షాషా వలి 180

39. హజరత్ హబీబుల్లా జుకా 181

40. హజరత్ మీరాఁ సయ్యద్ షా మొహమ్మదుల్ హుసైనియల్ ఖాదరి వుర్ఫ్ సయ్యద్ అహ్మద్‌సా పీర్ 186

41. హజరత్ హాజీ మొహమ్మద్ గౌస్ 193
42. హజరత్ ఖాదర్ మొహియుద్దీన్ ఖాక్ సార్ 195
43. హజరత్ ఝుట్ పట్ బీబీ దర్గా 199
44. బస్టాండులో బస్ షెల్టర్ ప్రక్కన గల దర్గా 200
45. ఔలియా అల్లా (అనకట్ట ప్రక్కన గల సమాధులు) 201
46. మూఏముబారక్ ప్రాధాన్యత–హజరత్ మఖ్దూమ్ అబ్దుల్ హఖ్ సావి భక్తిభావం
– ఉదయగిరియందు మూఏముబారక్ 202
47. దర్శనీయ ప్రదేశాలు
1. నషాన్ ఎ ముబారక్ హజరత్ మహబూబె సుబహానీ రజి. 207
2. నషాన్ ఎ ముబారక్ హజరత్ జైనుల్ అబిదీన్ (అబిద్ పాషా) 208
3. అస్తాన ఏ ఖాదరియా ఒ ఖాన్ ఖాహె చిష్తియా 209
4. అస్తాన ఏ చిష్తియా 211
5. నషాన్ ఎ ముబారక్ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ 212
48. సయ్యద్ హజరత్ మియా చిష్తి 213
49. ఉదయగిరి వజ్రం – హనీఫ్ ఉస్తాద్ 216
50. గ్రంథ రచయిత ఆధ్యాత్మిక పరంపర 222

ఉదయగిరి దుర్గం
కొన్ని విశేషాలు

పురావస్తు పరిశోధకశాఖ ఆధారాలనుబట్టి ఉదయగిరి దుర్గం సముద్రమట్టం నుంచి 3079 అడుగుల ఎత్తులో ఉంది. పచ్చని చెట్లు, ఎత్తైన కొండ శిఖరాలు, గలగలపారే సెలయేళ్లు, పక్షుల కిలకిల రావాలు, రాతిపొరల నుంచి జాలువారె జలాలు, కనువిందు చేసే ఎత్తైన వృక్షాలతో వేసవి వినోదానికి పర్యాటకులను ఉదయగిరి దుర్గం ఆకర్షిస్తోంది. ఈ దుర్గం పై ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. రాజులు, నవాబులు, ఆంగ్లేయులు పరిపాలించిన ఉదయగిరి దుర్గం చరిత్రలో ఎంతో పేరు సంపాదించుకుంది. ఆనాడు ఈ దుర్గాన్ని పరిపాలించిన వారి ఆనవాళ్లు వారి శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా కనిపిస్తాయి. దుర్గంపై బురుజులు, మసీదులు, రక్షక స్థావరాలు నేటికి చెక్కుచెదరకుండా పర్యాటకులు చూసేందుకు ఆసక్తికరంగా ఉన్నాయి. కొండల రాతి పొరల నుంచి వచ్చే నీటిని

కాలువ ద్వారా ప్రవహించేలా చేసి ఉదయగిరి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ప్రప్రథమంగా లంగుల గజపతిరాజు ఒక కోటను నిర్మించాడు. శ్రీ కృష్ణ దేవరాయలు కూడా తన కాలములో ఒక కోటను నిర్మించి దానికి పత్తికొండ అని పేరు పెట్టాడు. అలాగే మీర్‌జుమ్లా ఒక కోటను నిర్మించి దానికి చార్‌ఖిలా అని నామకరణం చేశాడు. ఈ కొండపై మొత్తము 11 కోటలుండేవి. వీటిలో ఎనిమిది కొండ పై భాగాన మూడు కింది భాగానా ఉండేవి. కొండ చివర గల కోటను చేరుటకు దారి ఉంది. కాని ఆ దారిగుండా ప్రయాణం చాలా కష్టతరం. కోట చుట్టు శత్రు దుర్భేధ్య రక్షణ ఉన్నందున పై భాగాన గల సైనికులతో పోటీకి శత్రుసైన్యం తట్టుకోజాలదు. ఒక వేళ శత్రుసైన్యం పై భాగాన చేరుకున్నా పాలకులను ముట్టడించుట కష్టం. కారణ మేమనగా కొండ చుట్టుగల సొరంగ మార్గాలే. వాటి గుండా వారు పారిపోగలకు.

కొన్నిచోట్ల పెద్ద రాళ్లను చెక్కి సొరంగ ద్వారాలు తయారు చేశారు. రాతి తలుపు మూస్తే సొరంగ మార్గం పూర్తిగా కనిపించదు. ద్వారానికి ఇరువైపుల భయకంరమైన పెద్ద లోయలున్నాయి. కొండ మధ్యన రాతి ద్వారాలు, రాయి, ఇసుక సున్నంతో కట్టబడిన గోడలున్నాయి. చిన్న మసీదుకు సమీపంలో ఒక ద్వారముంది. దానికి కొద్ది దూరములో పారసీ భాషలో ఒక శిలాఫలకం, దానికి అతి సమీపంలో తెలుగు భాషలో మరో శిలా ఫలకం కనిపిస్తుంది. ఆ ఫలకంపై "ఆదివారం పుష్యమాసం విఖారి సంవత్సరం" అని దాని అనువాదం. కొండ మధ్య ఒక సొరంగముందని దానిగుండా 5 మైళ్ళ దూరం వరకు వెళితే మరో కొండకు చేరుకోవచ్చని చెబుతోంది.

అబ్దుల్లా కుతుబ్‌షా ఆజ్ఞపై 10.55 హిజ్రీ అనగా క్రీ.శ. 1645లో మహమ్మద్ సయీద్ అను సైనికాధికారి (మీర్‌జుమ్లా) ఉదయగిరి కోటను జయించాడు.

మసీదులు :

కొండపై రెండు మసీదులున్నాయి. కొండ చివరి భాగాన ఉన్న మసీదు పెద్ద మసీదు అని, కొండ మధ్యన బురుజు లకు, రాజమహలుకు దగ్గరలో గల మసీదును చిన్న మసీదు అంటారు.

గోఫా మసీదు - చిన్న మసీదు వెనుక

చిన్న మసీదు :

ఈ మసీదుకు మూడు ఆర్చీలు న్నాయి. పైకి వెళ్ళడానికి మెట్లున్నాయి. దాని నిర్మాణంలో ఇనుము, కొయ్య వాడలేదు. మసీదులో ఫారశీ భాషలో ఒక రాతి ఫలకం ఉండేది. ఇటీవలే దానిని ఎవరో పగుల గొట్టారు. కొన్ని అక్షరాల్లో స్పష్టత లేదు. కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి. ఈ మసీదు పేరు మస్జీద్ నూర్. కాని ఈ మసీదును చిన్న మసీదు అంటారు.

బదౌర్ ఫఖర్ షహ్‌సిపా ఖుతుబ్ అబ్దుల్లా	సిపాఫత్ హుస్ను సాదత్ హుసైన్ ఖాన్ జారా
బనామి మస్జిద్ నూర్ అబద్ ఔజ్ బఖ్త్ మజార్	---------- ---------

మసీదు ఆవరణలో ఏడు సమాధులున్నాయి. వీటిలో రెండు మాత్రము ఇసుక, సున్నపు కట్టుబడితో చేయబడినవి. వీరు ఈ మసీదుకు సంబంధించిన వారని అనిపిస్తుంది. మసీదుపై భాగము చుట్టూ నాలుగు గోడలున్నాయి. వీటిలో 28 ఆర్చీలు, 4 మీనారులు (గుమ్మటాలు) ఉండేవి. ఇక్కడ కూడా నమాజు చదివేవారు. ప్రస్తుతం అవి కూడా ధ్వంసమైనాయి.

నిర్మాణ నైపుణ్యాన్ని, శిలా శాసనాన్ని బట్టి ఈ మసీదు అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి ఉదయగిరిని కొంత కాలం గోల్కొండ నవాబులైన కుతుబ్‌షాహి వంశస్తులు పాలించారని గ్రహించవచ్చు. ఈ మసీదును 'చిన్న మసీదు' అని కొందరంటారు. 1071 హిజ్రీ అనగా క్రీ.శ. 1660లో మీర్‌జుమ్లా (సేనాధిపతి) అను హోదాగల వ్యక్తి షేక్ హుసైన్ గారి పర్యవేక్షణలో గోల్కొండ అధిపతి అయిన అబ్దుల్లా కుతుబ్‌షా ఆజ్ఞానుసారం ఈ మసీదు నిర్మించబడినది.

పెద్ద మసీదు :

కొండ అంచునగల మసీదును పెద్ద మసీదు అంటారు. కొండ అంచున నిర్మించి నందున ఈ మసీదు చాలా దూరము నుంచి కనిపిస్తుంది. దీనికి ఒకే ఆర్చి గలదు. దీనిలో 15 మంది నమాజు చదవగలరు. పైకి వెళ్ల డానికి మెట్లు గలవు. కాని ఆ మెట్ల గుండా పైకి వెళ్ళడానికి అందరూ సాహసించ లేరు. ఈ మసీదును తమ విజయానికి చిహ్నంగా నిర్మించారని తెలుస్తోంది. ఈ మసీదులో 5 అడుగుల పొడవు, 2 అడుగుల వెడల్పు గల పారసీ భాషలో చెక్కిన శిలాఫలకముండేది. దాని లిపి అంత సులభంగా అర్ధమయ్యేది కాదు. గోడలో బిగించబడిన ఆ శిలాఫలకాన్ని కూడా ఎవరో త్రవ్వి తీసి ఎటు విసిరివేసారో తెలియలేదు.

కోట :

ఉదయగిరి కోటను లంగుల గజపతిరాజు నిర్మించాడు. తదుపరి దానిని వేద రాజులు స్వాధీన పరచుకున్నారు. వారి అనంతరం అచ్యుతపతి, గజపతి రాజులు ఆక్రమించారు. గజపతి అచ్యుత, అనంత అను వారు ఆఖరి రాజులు. అనంత రాజును విజయనగర రాజైన శ్రీ కృష్ణ దేవరాయలు ఓడించి ఈ కోటకు అధిపతి అయ్యాడు. తదనంతరం తిమ్మరసు, తిమ్మరసుని నాయనగారు అధిపతులయ్యారు. మీర్‌జుమ్లా ఇక్కడి అధిపతిని ఓడించి ఈ కోటను ఆక్రమించాడు. గోల్కొండ నవాబుల పాలనానంతరం బ్రిటీషు, ఈస్టిండియా కంపెనీ వారి రాజ్యాధిపత్యం వరకు ఆర్కాటు నవాబులు నవాయిత్ వంశస్తుడు సాదతుల్లాఖాన్, మొహమ్మదలి వాలజా, అజీముద్దౌలా పాలించారు. వీరి కాలములో సయ్యద్ ముస్తఫా అలీఖాన్, సయ్యద్ బదరుద్దీన్ అలీ ఖాన్, సయ్యద్ అబ్దుల్‌ఖాదర్‌ఖాన్, సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ ఉదయగిరి కోటకు అధిపతులుగా ఉండిరి.

కొండ పైకి పోవుటకు రాళ్లతో మెట్లు చేయబడినవి. పూర్వము నవాబులు ఏనుగుల మీద ఈ దారిన పోయేవారు. కొండ మధ్యలో కొన్ని విశేషాలు గలవు. ధాన్యం భద్రపరచడానికి ఇసుక, సున్నంతో కట్టబడిన గోదాములలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. భూమి లోపల కూడా మందుగుండు సామాగ్రి భద్రపరచడానికి ఆయుధగారాలు, కొండ మధ్యలో కొన్ని రాజమహాళ్లు వాటికి దక్షిణాన ఉద్యాన వనాలుండేవి. వాటి గుర్తులు నేటికీ కాన వస్తాయి. ఈ ప్రాంతంలో ఒక చిన్న ఇల్లుంది. దానిని ఆషూర్ ఖానా (పీర్ల చావిడి) అని కొందరు, స్త్రీల గోషా మసీదు అని మరికొందరంటారు.

టపకా :

రాజమహలుకు వెళ్ళే దారిలో ఒక ప్రాంతం వస్తుంది. దానిని 'టప్కా' అని పిలుస్తారు. పెద్ద పెద్ద శిలల నుండి నీటి చుక్కలు ఎల్లప్పుడు కారుతూ ఒక రాతి తొట్టెలో పడుతుంటాయి. టపా–టపా అను శబ్దంతో ఆ చుక్కలు కారుతున్నందుకు దానిని టప్కా అని పేరు పెట్టారు. ఇందులోని నీరు చాలా చల్లగా ఉంటుంది. ఈ దారి గుండా వెళ్ళే వారు ఈ నీటిని త్రాగి కొంతసేపు కూర్చొని సేదదీరుతారు. ఇక్కడ అతిశీతల వాతావరణం ఉంటుంది. ఇక్కడ కూర్చున్న వారికి ఇది చలికాలమా అన్నంత చల్లగా ఉంటుంది. ఈ ప్రాంతపు ప్రకృతి సౌందర్యం రమణీయంగా ఉంటుంది. ఈ దారి గుండా నడుచు వారికి మనో ఉల్లాసం కలుగుతుంది. ఇచ్చటి నుండి పైకి చూస్తే పెద్ద కొండ భాగముంటుంది. ఈ కొండ మాపై పడిపోతుందా అని చాలా మందికి భయం కలుగుతుంది. శత్రువులు ఈ దారి గుండా పైకి వెళ్ళడానికి వీలు లేకుండా పలుచోట్ల రాళ్లను నునుపుగా గోడలవలే చెక్కడమైనది. ఈ టప్కా దారి గుండా శత్రుసైన్యం నడిచిన పై నుండి పెద్ద పెద్ద రాళ్ళను క్రిందికి త్రోసి వారిని హతమార్చవచ్చు.

ఈ మార్గాన కొంత పైకి వెళ్ళిన తర్వాత ఒక జండా చెట్టు వస్తుంది. హజరత్ ఫరీదుద్దీన్ పాషా మహనీయుని పేరిట వెలసిన ప్రాంతమిది. కొందరు మొక్కుబడి చేసుకొన్న భక్తులు ఇచ్చటకు వచ్చి జెండా ప్రతిష్టించి దీపాన్ని వెలిగించి చదివింపులతో (ఫాతిహా) మొక్కుబడి తీర్చుకొంటారు. దారి చివరలో మూడు పెద్ద రాతిద్వారాలున్నాయి.

రాజమహలుకు చేరాలంటే ఈ ద్వారాల గుండా వెళ్ళాలి. మొదటి ద్వారం కొంత దూరం నుండి ఒక బురుజువలె కనిపిస్తుంది. ఈ ద్వారం పై నుండి కూడా ఎదురు వచ్చు శత్రువులపై దాడి జరుపవచ్చు. ఈ ద్వారాల వద్ద సిఫాయిలు పహరా కాసేవారు. ఈ మూడు ద్వారాలు దాటకుండా రాజమహలు చేరలేరు.

రాంబుగ్గ-కరీంబుగ్గ :

రాజమహలు దాటి కొద్ది దూరం వెళ్ళితే కుడి ప్రక్కన ఒక దారి వస్తుంది. ఆ దారి గుండా కొంత దూరం వెళ్లాక రెండు చిన్న ఊట బావులు కనిపిస్తాయి. ఒక దానిని రాంబుగ్గ అని రెండో దాన్ని కరీంబుగ్గ అని అంటారు. ఈ పేర్లనుబట్టి ఆనాటి హిందూ ముస్లిం సమైక్యత వెల్లడవుతుంది.

పెద్ద మసీదుకు పడమటి దిశగా ఒక బావి ఉంది. అక్కడికి చేరడానికి మెట్ల మార్గముంది. ఆ మార్గాన్ని హజార్ సిఢీ(వేయి మెట్లు) అంటారు. ఇది చాలా ఇరుకైన దారి. ఆ దారి గుండా ఒక్కొక్క వ్యక్తి మాత్రమే వెళ్లగలడు. దారికి కుడివైపు అగాధమైన లోయ ఉన్నందున చాలా జాగ్రత్తగా నడవాలి. హజార్ సిఢీ, పెద్ద మసీదుకు మధ్యన ఒక రాతి కట్టడముంది. దానిని గుర్రపు శాలగా చెబుతారు. ఇందులో 20 రాతి స్తంభాలున్నాయి. గుర్రపుశాలకు దగ్గరలో ఒక బావి ఉంది. అది గుర్రాల కోసమే త్రవ్వినట్లుంది రాళ్ళ నుండి సహజంగా వచ్చుచున్న రుచికరమైన, శుభ్రమైన నీరు కాలువల ద్వారా పట్టణానికి సరఫరా అవుతున్నది. ఈ నీటిని కోన నీరు అంటారు.

కొండకు ఉత్తరాన దుర్గంపల్లెకు వెళ్ళే మార్గంలో రెండు దర్గాలున్నాయి. మొదటి దర్గా హజరత్ ఖాదిర్‌సాహెబ్ ఔలియా గారిది, రెండో దర్గా ఝట్‌పట్ బీబీ దర్గా అని అంటారు. కాని ఆ దర్గా ఏ మహనీయునిదో తెలియడం లేదు. కొండకు వచ్చే వారు ఈ దర్గాలను దర్శించుకుంటారు. అదేదారిన కొంత దూరం వెళ్ళిన దుర్గంపల్లె వస్తుంది. అక్కడ ఒక దేవాలయం గలదు. దానిని కాశీ విశ్వేశ్వర మందిరమని ప్రతీతి. వంతను రాయసుప్రు కంటుమ రాజు వల్లభాయ ఈ మందిరాన్ని నిర్మించెను. ఇక్కడ ఒక కోనేరు ఉంది. దానిని వలప్రాయ(వల్లభాయ) కోనేరు అని పిలుస్తారు. ఎన్నో చారిత్రక విశేషాలు కలిగిన ఈ కొండకు విహారయాత్రగా ఎల్లప్పుడు జనం వస్తూనే ఉంటారు.

1. నవాయిత్ వంశము

ఇస్లాం మత పాండిత్యంలో నిష్ణాతులై ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నవాయిత్ వంశానికి చెందిన కొందరు మహనీయులు ఉదయగిరిలో స్థిరపడుటకు, నవాయిత్ అనబడుటకు గల కారణాలు, ఆ వంశ మూలపురుషుని గురించి కొంత తెలుసుకోవడం చాలా అవసరం.

1) నవాయిత్ వంశపు పండితులు మద్రాసు నవాబైన అమీరుల్ హింద్ మహమ్మద్ గౌస్‌ఖాన్ తమ రచన "గులిస్తానే నస్బ్"లో నవాయిత్‌లను గురించి ఇలా రాశారు". హజ్రత్ జాఫర్ తయ్యార్ గారి కుమారులలో నాయత్‌లు ఉన్నారు".

2) మహమ్మద్ ఖాశిం ఇబ్నె మొహమ్మద్ హాషిం సాహెబ్ రచన "తజ్కిర ముషాహిద తుల్ అస్ఫియా"లో నవాయిత్ పదానికి అర్థము "ఐక్యత" అని చెప్పబడింది.

3) మౌలానా మొహమ్మద్ బాఖర్ ఆగాహ్ తమ రచన "నష్త్ హుల్ గబరియా"లో ఇలా రాశారు. "వీరి వంశపు మూలపురుషుని పేరు నాయత్ అంటారు. వీరు ప్రవక్త హజరత్ మహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం వారి

వంశమునకు చెందిన హజరత్ కన్నాన గారి కుమారులు నజర్‌కు సంబంధించిన వారు, నాయత్ ఖురైష్‌కు సంబంధించిన ఒక జాతి. వీరు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివ సల్లం వారితో నజర్‌బిన్ కనానతో కలిసేవారు. వీరు మదీనాలో ఉండే వారు. హిజాజ్‌బిన్ యూసుఫ్ సఖపి కాలంలో దేశాన్ని వదిలిరి. హిజాజ్ అను అతను వీరికి చాలా బాధలు పెట్టి ఎందరినో చంపివేసినందుకు నవాయితులు బసరా నుండి ఏడెనిమిది పడవలలో భారత దేశానికి బయలుదేరి వచ్చారు.

4) గులిస్తానే నస్బ్ రచయిత 'ఫాజిల్ ముతజర్' మౌల్వి ఖాదర్ ఆజమ్ ఖాన్ బహదూర్ గారు అల్లామా షేఖ్ జలాలుద్దీన్ సెవుతీ మొహద్దీన్‌షాహ్‌విరహ. తన గ్రంథము "కష్బుల్ అన్సాబ్"లో "ఈ వంశానికి "బనుల్ వాయత్ అబ్దుల్‌లాబ్ నాయత్ సంతతి" అని అన్నారు. మరి ఒక చోట "ఈ వంశం మదీనా నుండి దేశ త్యాగము చేసి బాగ్దాద్ నగరము చేరి అచటి నుండి మూడు దినముల ప్రయాణానంతరం వాయత్ అనే ప్రాంతాన్ని చేరినందుకు నవాయత్ అని పిలువబడినది".

5) కొందరు నిఘంటు ప్రవీణులు నవ్వాతి అను పదము సరియైనదని, దాని అర్థము పడవ నడుపువారని పేర్కొన్నారు.

6) ముజదుద్దీన్ అబూ తాహెర్ మొహమ్మద్ బిన్ యాఖుబ్ ఫయిరోజాబాదీ తమ రచన 'ఖాముస్'లో "నవాతి" అనగా సముద్రములో పడవ నడుపువారన్నారు.

7) మద్రాసుకు చెందిన 'నసీహున్ నస్బ్' రచయిత మౌల్వీ అజీముద్దీన్ గారు ముజదుద్దీన్ అబుతాహర్ మొహమ్మద్ బిన్ యాఖుబ్ ఫయిరోజాబాదీతో ఏకీభవించారు.

నవాయిత్ వంశాన్ని గురించి హైదరాబాదు ప్రముఖ వ్యక్తి డా.హసనుద్దీన్ అహ్మద్ ఐ.ఏ.ఎస్. రిటైర్డ్ గారి జేజనాయన షంషుల్ ఉలేమా నవాబ్ అజీజ్ జంగ్ విల గారు క్రింది విధంగా వివరించారు.

నవాయిత్ జాతి వంశ వృక్షం మూడు శాఖలు. ఈ శాఖల మూల వ్యక్తి ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం వారి వంశ పూర్వీకులు నజర్ బిన్ కనాన.

1. మొదటి శాఖ నాయత్ బిన్ నజర్‌తో ప్రారంభం అవుతుంది. నాయత్ బిన్ నజర్‌ను జద్దుల్ ఖురేష్ అని అరబ్బులు సంభోదించారు.
2. రెండవ వంశ పరంపర అబ్దుల్లా బిన్ జాఫర్ తయ్యార్ అనగా హజరత్ అలీ రజి. వారి అన్న గారితో కలుస్తుంది.
3. మూడవ పరంపర హజరత్ ఇమాం జాఫర్ సాధిఖ్ రజి. కుమారులు ఇస్మాయిల్‌తో కలుస్తుంది. ఇస్మాయిల్ కుమారులు అబ్దుల్లా. వీరి కుమారుని పేరు నవాయిత్. వీరు ఇమాం జాఫర్ సాధిఖ్ మనవడు.

భారతదేశంలో నవాయిత్ వంశపు మొదటి, రెండవ పరంపర అయిన బనునసర్, ఖురేష్‌లదే ఆధిక్యత. మూడవ పరంపరకు సంబంధించిన వారు చాలా తక్కువ. వీరు తమ పేర్ల ముందు సయ్యద్ ఉపయోగించరు. ఉదయగిరి మహనీయులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి తల్లి గారి జేజనాయన ఇమాముల్ ముద్రసీన్ మౌలానా మొహమ్మద్ హుసైన్ బీదరి షహీద్ మూడవ పరంపరకు చెందినవారు. వారు సయ్యద్ అని సంబోధించుట కాని వ్రాయుట కాని చేయవలదని తమ కుటుంబానికి ఉపదేశించారు. పాపులు తాము సయ్యద్‌లని గర్వపడుట భావ్యం కాదన్నారు.

బసరా దేశాధికారి పెట్టిన బాధలను భరించలేక 752 హిజ్రీ అనగా క్రీ.శ. 1332 సం. బసరా నుండి పడవలలో బయలుదేరి భారతదేశాన్ని చేరదలిచారు. కాని శత్రువైన బసరా అధికారి ఆజ్ఞపై పడవలు నడుపువారు భయపడి తమ పడవలను వదిలి వెనుదిరిగారు. పడవల్లోని ప్రయాణికులు పడవ నడుపుటలో ఆరితేరిన వారు గనుక పడవను నడుపుకొని బసరా నుండి క్షేమంగా భారత దేశపు తీర ప్రాంతమైన కొంకణం చేరుకొన్నారు.

భారతదేశములో మూడవ పరంపర క్రీ.శ. 769లో ప్రవేశించెను. తుగ్లక్

బహమనీ సుల్తానుల కాలంలో వీరు దక్కనులో ఉన్నారు. పడవ నడుపుటలో వీరు ప్రవీణులు కావున బసరా వారు వీరిని నవ్వాతి అని సంభోదించారు. 8వ హిజ్రీ అనగా 14వ శతాబ్ధంలో వీరు బసరా నుండి మలబారు కొంకణం చేరినపుడు ఆ ప్రాంతాలు బహమని, నిజాంషాహి, ఆదిల్‌షాహి రాజ్యముల హద్దులలో ఉండి అచ్చటి నుండి గుల్బర్గా, బీదర్, ఉదయగిరి, బద్వేలి, సిద్ధోటు చేరారు అచ్చటి నుండి చివరిగా ఆర్కాటు మద్రాసు చేరిపోయారు.

ఆదిల్‌షాహి, నిజాంషాహి, వాలజాహి పాలకులు వీరిని బాగా గౌరవించి గొప్ప పదవులిచ్చిరి. అర్హులకు తమ మంత్రులుగా, దివానులుగా నియమించుకొనిరి.

భారత దేశం చేరిన నవాయిత్ వంశపు పెద్ద అయిన ఫఖియాఅతా ఖాజి అహమద్ షాఫీ మొదలు ఈనాటి వరకు గల ఖాజి బదురుద్దౌలా నాయితి సంతతిని సూచించే సూచిక పక్క పేజీలో చూపడమైనది. నవాయిత్ వంశం పండిత వంశం. ఇస్లామి పాండిత్యములో ఒక్క భారత దేశమే కాదు ఇస్లామి దేశపు ప్రముఖ పండిత వంశం కూడా తన పాండిత్యపు గొప్పతనాన్ని ఈ వంశపు ముందు ప్రదర్శింపజాలదు. ఈ వంశపు 13వ సంతతి అయిన షర్ఫుల్ ముల్క్ మొహమ్మద్ గౌస్ గారి పుత్రులు మౌల్వీ అబ్దుల్ వహాబ్‌మదరుల్ ఉమ్రా, ఖాజి హబీబుల్లా, మొహమ్మద్ సిబఘ్తుల్లా ఉర్ఫ్ ఖాజి బదురుద్దౌలా వీరిరువురు మద్రాసులోనే గడిపారు.

కర్నాటకలో వుండిన వీరి కొద్ది పాటి రాజ్యం కూడా ప్రభుత్వ ఆధీనమైన పిమ్మట వీరి బిడ్డలు హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. వీరి వంశపు పండితులు, రచయితలు హైదరాబాదు, మద్రాసు, బెంగుళూరు, ముంబాయి, కొంకణం, భట్కల్ యందు తగిన సంఖ్యలో గలరు.

నవాయిత్ వంశపు సూచిక

1. ఫఖీయ అతా అహ్మద్‌షాఫి
↓
2. ఫఖీయ మఖ్‌దూమ్ ఇస్‌హాఖ్
↓
3. ఫఖీయ మఖ్‌దూమ్ ఇస్మాయిల్
↓
4. ఫఖీయ అబు మహమ్మద్
↓
5. ఖాజి అహ్మద్
↓
6. ఖాజి మహమూద్ కబీర్
↓
7. ఖాజి రజివుద్దీన్ ముర్తుజా
↓
8. ఖాజి హుసైన్ లుత్ఫుల్లా
↓
9. ఖాజి నిజాముద్దీన్ అహ్మద్ కబీర్
↓
10. మహ్మద్ అబ్దుల్లా షహీద్
↓
11. ఖాజి నిజాముద్దీన్ అహ్మద్ సగైర్
↓
12. మౌల్వీనాసిరుద్దీన్ మొహమ్మద్
↓
13. మహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ బహదూర్
↓
14. ఖాజి మహమ్మద్ సిబగ్ తుల్లా బదరుద్దౌలా
↓
15. ఖాజి మౌల్వీ హాజి అహ్మద్ సాహెబ్
↓
16. మహమ్మద్ హబీబుల్లా సాహెబ్ ముదజిల్ల లహుల్ ఆల సర్‌ఖాజి, మద్రాస్

2. దీవాన్ సాహెబ్ బాగ్ గ్రంథాలయము

“తారీఖ్ ఉద్గీర్” అను ఉదయగిరి చరిత్ర, ఉదయగిరి మహనీయులకు సంబంధించిన కొన్ని రాత ప్రతులు ఈ గ్రంథాలయమందు గలవు కాబట్టి ఈ గ్రంథాలయాన్ని గురించి కూడా రాయడం అవసరం. దక్షిణ భారత దేశమందు మద్రాసులోని రాయపేటలో గల నవాయిత్ వంశానికి చెందిన దీవాన్ సాహెబ్‌బాగ్‌కు ఒక ప్రత్యేక స్థానముంది. ఇక్కడ ఒక మసీదు, మద్రసా మరియు గ్రంథాలయము కలదు. మదరస-ఏ-మహమ్మదీయలో ఖురాన్ కంఠస్తము చేయు ఉచిత శిక్షణ కేంద్రం గలదు. గ్రంథాలయం పేరు “కుతుబ్‌ఖాన-ఏ-మహమ్మదీయ”. దీని నిర్వహణ నవాయిత్ వంశస్థులు చేపట్టి వున్నారు. శ్రీ ఉబేదుల్లా ఎం.ఏ.గారు గ్రంథాలయ లైబ్రేరియన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ వేలాది అరబ్బీ, పారసీ, ఉర్దూ పురాతన రాత ప్రతులున్నాయి. ఈ పుస్తక రచయిత అయిన నేను సమాచార సేకరణ నిమిత్తం అచ్చటకు వెళ్ళినప్పుడు హాలెండ్‌లోని “అల్‌ట్రెచ్” యూనివర్శిటీ నుండి అరబ్బీ భాషలో ఎం.ఏ. పట్టా పొందిన మిరియం కోవెలన్ అనే హాలెండ్ యువతి దక్షిణ భారతదేశపు సూఫీలపై పరిశోధన చేయు నిమిత్తం ఈ గ్రంథాలయానికి రావడమైనది. ఈ విధంగా ఎందరో దేశ విదేశ పరిశోధకులకు ఈ గ్రంథాలయం ఉపయోగపడుతోంది.

మద్రసయే మహమ్మదీయ, రాయపేట, చెన్నై

ఉదయగిరి షాహమీర్ సాహెబ్ వీధికి చెందిన అలనాటి మౌలానా అబ్దుల్‌బాసిత్ గారు, మదరాసులోని ఈ మద్రస యందు మౌల్వీ కోర్సు చదివారు.

3. హజరత్ ఫఖియ అతాఖాజీ అహమ్మద్ షాఫీ

ఫఖియ అతాఖాజి అహమ్మద్ షాఫీ భారతదేశంలో నవాయిత్ వంశపు తొలి పురుషుడు. ఫఖి అనగా ఇస్లాం ధర్మాలు పూర్తిగా తెలిసినవాడు. వీరికి ఫిఖా (ఇస్లాం మత ధర్మ శాస్త్రం) పై మంచి అవగాహన ఉండెడిది. బోధన వీరి ముఖ్య వృత్తి. వీరి కుమారుని పేరు ఫఖియ మగ్దూమ్ ఇస్హాఖ్.

ఒక రోజు ఒక వ్యక్తి ఫఖియ మగ్దూమ్ ఇస్హాఖ్ సన్నిధి చేరి మన:పూర్వకంగా ఇస్లాం మతం స్వీకరించెను. కాని ఇస్లాం మత సిద్ధాంతాల పట్ల పూర్తిగా అవగాహన కాక ముందే అతను హఠాన్మరణం చెందెను. ఈ అకాల మరణం గురించి తెలుసుకొనిన మగ్దూమ్ తన తలను మోకాళ్ళపై ఉంచి విచారపడుచుండెను. కొద్దిసేపటి తరువాత వంచిన తల పైకెత్తగా ముఖం సంతోషంతో కళకళలాడుతోంది. "కొన్ని నిముషాల ముందు దు:ఖంతో కన్నీరు కార్చుచుండిన మీరు ఇప్పుడు చాలా సంతోషంగా ఉండుటకు గల కారణమేమి" అని కొందరడిగితే "పూర్తిగా ఇస్లాం మత విషయాలు తెలుసుకొనని ఆ వ్యక్తి ఇంత తొందరగా చనిపోయినందుకు నాకు చాలా దు:ఖం కలిగింది. అంతలో నాకు పరలోకం కనిపించింది. మున్కీర్, నకీర్ (విచారణ చేసే దేవదూతలు) ఆ వ్యక్తి వద్దకు వచ్చి దేవుని ప్రవక్తను గురించి ప్రశ్నించగా. "నేను

నిన్న ఇస్లాం స్వీకరించాను మగ్దూమ్ ఇస్హాఖ్ గారి చేతిపై ఈమాన్ (విశ్వాసము) తెచ్చినాను" అని ఆ వ్యక్తి దేవదూతలకు సమాధానమిచ్చాడని, ఈ మాట వినిన దేవదూతలు అక్కడి నుంచి వెళ్ళిపోయి తిరిగి వచ్చి ఇతనిని దేవుడు క్షమించినట్లు దైవాజ్ఞ పత్రాన్ని తెచ్చి చూపించారు. ఈ దృశ్యాన్ని చూసిన నేను చాలా సంతోషపడ్డానని మగ్దూమ్ ఇస్హాఖ్ చెప్పారు.

మగ్దూమ్ ఇస్హాఖ్ ఇంటి ఖర్చుకై తన తల్లి చేతికి రోజు నాలుగు అణాలు (రూపాయిలో నాల్గవ భాగం) ఇచ్చేవారు. ఈ కొద్దిపాటి పైకంతో ఎన్నో పనులు జరిగిపోయి ఇంకా మిగిలేది. ఎప్పుడైన తన శిష్యుని ద్వారా పైకం పంపితే అది పూర్తిగా ఖర్చు అయి పోయేది, ఈ విషయం పై ఒక రోజు తల్లికి సందేహం కలిగి అడిగితే "అమ్మా! అది ఒక రహస్యం. ఈ విషయం ఎవరితో చెప్పవద్దన్నారు".

4. హజరత్ ఖాజీ మహమూద్ కబీర్

అవి బీజాపూర్‌ను చక్రవర్తి అలి ఆదిల్‌షా పరిపాలించిన రోజులు. 980 హిజ్రీ అనగా క్రీ.శ. 1560 తరువాత ఖాజి మహమూద్ కబీర్ మక్కా, మదీన యాత్రకై బయలుదేరారు. మక్కా నుంచి మదీనా చేరక ముందు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం తమ పవిత్ర సమాధి వద్ద వుండే సేవకునికలలో కనబడి "భారత దేశము నుంచి మా మిత్రుడొకడు వచ్చుచున్నాడు. ముందుకు వెళ్లి స్వాగతం పలికి సకల గౌరవ మర్యాదలతో తీసుకొని రండి" అని ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞానుసారం ఆ సేవకుడు మదీన మునవ్వరా నుంచి బయలుదేరి 'బయరలీ' అను ప్రాంతానికి చేరి భారత దేశపు బిడారులకై ఎదురు చూస్తున్నారు. కొంతసేపటికి బిడారులు అక్కడికి చేరాయి. సేవకుడు ఖాజీమహమూద్‌తో కలసి ఏదో అడుగబోతుండగా "ఏ వ్యక్తి కోసం మీరు నిరీక్షిస్తున్నారో ఆ పాపిని నేనే" నని ఖాజీమహమూద్ అన్నారు. ఈ మాట వినిన ఆ సేవకుడు చాలా ఆశ్చర్యపోయి తనకు కలిగిన కలను గురుంచి ఖాజీ గారికి చెప్పారు. ఎంతో గౌరవంగా మదీనా తీసుకెళ్లారు. అక్కడ ఉన్నని రోజులు సకల మర్యాదలతో చూశారు.

తిరిగి భారత దేశం చేరిన ఖాజీ మహమూద్ తన జీవితాన్ని బోధన, దైవ చింతనలో గడుపుతూ 995 హిజ్రీ అనగా క్రీ.శ. 1575 రబివుల్ అవ్వల్ నెల 7వ తేదీన స్వర్గస్తులయ్యారు. బీజాపూర్ కోట ప్రహరీ వద్ద వీరికి సమాధి చేశారు. క్రీ.శ. 1618లో బీజాపూర్ కోట ప్రహరీ మరమ్మతుకు చుట్టు పక్కల గల సమాధులను పగులగొట్టి నేల మట్టం చేయమని ఆనాటి చక్రవర్తి అయిన శివాజి ఆజ్ఞాపించెను. ఆజ్ఞానుసారం ఇతర సమాధులతో పాటు ఖాజీ గారి సమాధిని కూడ పగులగొట్టారు. ఆశ్చర్యకర విషయమేమనగా మరణించినవాడు తొడగబడిన కఫన్ (వస్త్రము) ఎంతో శుభ్రంగాను, శరీరం తాజాగాను కనిపించింది. ఈ వింతను చూసిన పనివారు తమ పర్యవేక్షకునితో విషయం వెల్లడించారు. పర్యవేక్షకుడు ఈ విషయాన్ని శివాజికి తెలిపాడు. విషయం తెలుసుకొనిన శివాజి "అలా అయితే తప్పకుండా అతనెవరో అవతార పురుషుడు అయి వుండవచ్చు"నని చెప్పి తాను ఈ వింతను చూడటానికి సమాధి వద్దకు వచ్చెను. కప్పబడిన గుడ్డను తీసి చూడదలచెను. హఠాత్తుగా సమాధిలో ఒక చేయి కదిలింది. ఈ దృశ్యాన్ని చూచిన శివాడి ఆశ్చర్యచకితుడై సదరు సమాధిని యధావిధిగా వుంచవలసిందిగా ఆజ్ఞాపించెనని చెప్పబడుచున్నది.

మౌత్ హై సబ్‌కొ అహలే హవస్‌కేలియే.
ఇష్క్ వాలేతో మర్‌కర్‌భీ మర్తే నహీ

సర్వర్

5. హజరత్ సిబగ్‌తుల్లా నవైతి ఉర్ఫ్ షా సాహెబ్

హజరత్ సిబగ్‌తుల్లా నవైతిగారు మంచి దస్తురికి మారు పేరు. వీరు ఉదయగిరి నివాసి. 1020 హిజ్రీ (క్రీ.శ.1611) షాబాన్ నెల మంగళవారం జన్మించారు. వీరి తండ్రి పేరు మౌలాన హబీబుల్లా. సిబగ్‌తుల్లాకి ఉన్నతస్థాయి విద్య అందలేదు. తండ్రి ద్వారా ఆధ్యాత్మిక రంగంలో కొంత జ్ఞానం సముపార్జించుకున్నారు. వీరికి భూతవైద్యంలో అనుభవం కలదు. కఠినమైన జబ్బును కూడా నయము చేసేవారు.

ఒకనాడు బీజాపూరులో షేక్ లుత్ఫుల్లా అను వ్యక్తి భూత ప్రభావానికిలోనై ఎందరిచేతనో వైద్యం చేయించినా జబ్బు నయంకాలేదు. హజరత్ సిబగ్‌తుల్లా ఆ రోగిపై తమ దృష్టి కేంద్రీకరించి చూడగా "నేను ఐదు వందల మందిని నాశనం చేశాను మీది ఒక లెక్కా!" అని ఆ రోగి పెద్దగా కేకలు పెట్టాడు. ఖాజీ గారు చేసిన పనితనానికి ఆ భూత పీడ విరగడై లుత్ఫుల్లా ఆరోగ్యవంతునిగా మారారు.

ఇదే విధంగా బీజాపూరు సుల్తాను మొహమ్మద్ ఆదిల్‌షా గారి సతీమణి పై కూడా భూత ప్రేత ప్రభావంపడింది. అర్ధరాత్రి సమయంలో వారి ఇంట్లో రాళ్ల వర్షం కురిసేది. ఎందరో వైద్యులు చికిత్స చేసినా ప్రయోజనం కాన రాలేదు. ఒక రోజు "షా సాహెబ్ వారి దృష్టిని మీ వైపు మరలిస్తే ఈ కష్టం శాశ్వతంగా తొలగిపోతుంది" అని ఇబ్రాహీం ఖాన్ ఆదిల్‌షాకు సలహా ఇచ్చారు. వెంటనే ఆదిల్‌షా తమ పరిస్థితిని షా సాహెబ్‌కు తెలుపుతాము" అని చెప్పండని సలహా ఇచ్చారు. యధాప్రకారం రాళ్ళ వర్షం ప్రారంభమైంది. వెంటనే పై విధంగా పలుకగా రాళ్ల వర్షం ఆగిపోయింది.

షా సాహెబ్ మేనమామ సయ్యద్ మహమ్మద్ రజా ఒకసారి పెద్ద వ్యాధి బారినపడ్డారు. ఎన్ని వైద్యములు చేయించినా వ్యాధి నయం కాలేదు. చివరకు షా

సాహెబ్ తల్లి హబీబుర్రహమాన్ తన కుమారుని వద్దకు వచ్చి మేనమామ పరిస్థితి వివరించి ఒక మంచి అంత్రం ఇమ్మన్ని కోరారు. షా సాహెబ్ ఒక తాటాకు పై అంత్రము రాసి దీనిని నీట ముంచి ఆ నీటిని రజా గారి గొంతులో ఒకటి రెండు చుక్కలు పోసిన అల్లా దయతో వ్యాధి తగ్గునని చెప్పారు. షా సాహెబ్ చెప్పినట్లు నీటి చుక్కలు కడుపులో చేరిన వెంటనే మరణావస్థలో ఉన్న రోగి కళ్ళు తెరిచాడు, వ్యాధి కూడా తగ్గింది. ఆరు మాసాలు ఆరోగ్యంతో ఉండిన రజా గారు ఏడో మాసంలో మరల ఆరోగ్యం చెడి పరిస్థితి మొదటికొచ్చింది. ఈసారి షా సాహెబ్ అంత్ర మివ్వడానికి ఇష్టపడలేదు. చివరకు ఆ వ్యాధితోనే రజా మరణించారు. షా సాహెబ్ తన మిత్రులతో "మొదటిసారి అంత్రం కోరినప్పుడు అంత్రమిచ్చుటకు నా ఆత్మ ఇష్టపడింది. కాని ఈసారి నాకు ఏదో ఒక శక్తి తాయిత్తు ఇవ్వవద్దని ఆజ్ఞాపించునట్లు అనిపించింది" అని చెప్పారు. చివరిలో వీరు ఉదయగిరి చేరారని తెలియుచున్నది.

షా సాహెబ్ తమ 50వ ఏట 1070 హిజ్రీ రజ్జబ్ నెల 20వ తేదిన స్వర్గస్తులయ్యారు. ఉదయగిరి పెద్ద మశీదు వెనుక గల దర్గా బహుశా వీరిదే. వీరి పేరు షాషావలీ అని పెద్దల ద్వారా విన్నాను. యదార్థం దేవునికెరుక. ప్రతి ఏటా ఈ దర్గా ఉరుసు జరుగును.

షేక్ హబీబుల్లా :

షేక్ హబీబుల్లా, షా సాహెబ్‌కు కుమారులగుదురు. వీరిని కొందరు మియా సాహెబ్ అని పిలిచేవారు. ఒక రోజు మియాగారు తమ మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) ఖ్వాజా అలీతో "నీవు వెళ్లి ఆ ఏనుగును యిటు తీసుకొనిరమ్ము" అని ఆజ్ఞాపించారు. ఆ ఏనుగుమదంతో మత్తెక్కి ఉంది, దాని వద్దకు పోవుటకు నాకు ధైర్యం చాలటం లేదని శిష్యుడు జవాబిచ్చాడు. "నీవు వెళ్లి పిలువు" అని గురువు ఆజ్ఞాపించగా శిష్యుడు ఏనుగు వద్దకు వెళ్లి "మియా గారు నిన్ను పిలుస్తున్నారు" అని అనగానే ఆ ఏనుగు వచ్చి మియా గారి ముందు నిలబడింది. ఏనుగును కొంతసేపు చూచిన మియా గారు మరలా వెనుదిరిగి పొమ్మని ఆజ్ఞాపించారు, ఏనుగు వెనుదిరిగి వెళ్ళిపోయెనని "రాహతుల్ ఖులూబ్" అను పుస్తకంలో వ్రాయబడినది.

మియా గారు తమ 26వ ఏట స్వర్గస్తులయ్యారు. వీరి కుమారుడు షేక్ మహమ్మద్ సిబగ్‌తుల్లా ఖమర్ నగర్ (కర్నూలు)లో స్థిరపడి అక్కడే స్వర్గస్తులయ్యారు.

6. హజరత్ మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇమాముల్ ముదర్రసీన్

ఖాజీహుసైన్ లుత్ఫుల్లా

↓

మీరా అబ్దుల్ ఖాదర్

↓

మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇమాముల్ ముదర్రసీన్ షహీద్

మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇమాముల్ ముదర్రసీన్ ఉదయగిరి మహనీయులైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరి తల్లి మరియం సాహిబాకు జేజ నాయన ఆగుదురు. వీరి తండ్రి పేరు మీరా అబ్దుల్ ఖాదర్. మొహమ్మద్ హుసైన్ 1069 హిజ్రీ అనగా క్రీ.శ. 1658లో బీజాపూరులో జన్మించారు. తండ్రి

మరణానంతరం వీరి పోషణ భారం తల్లి అగ్నాసాహిబా పై పడింది. మొహమ్మద్ హుసైన్ ఎల్లప్పుడు జిక్రొ అజ్కార్(మంత్ర పఠనము)లో గడిపేవారు. ఒకనాడు బీజాపూరు ప్రముఖుడైన ముల్లా మొహమ్మద్ జుబేరి అంతర్జ్ఞాన విషయం గురించి మొహమ్మద్ హుసైన్‌తో చర్చించి తనకన్న ఇతనే ఎక్కువ విషయ పరిజ్ఞానం గలవాడని, ఏ వ్యక్తియందు అంతర్ జ్ఞానముండునో, ఆ వ్యక్తితో ఎవ్వరు పోటీకి రాజాలరని ముల్లాజుబేరి వెల్లడించారు.

వివాహం :

రెండో ఆదిల్ షా చక్రవర్తి ఛీఫ్ సెక్రటరీగాను, షాజహాన్ చక్రవర్తి దర్బారు యందు రాయబారిగా పని చేసిన ఖ్వాజా నిజాముద్దీన్ అహ్మద్ కబీర్ గారు మొహమ్మద్ హుసైన్‌కు చిన్నాయన అగుదురు. వీరి కుమార్తె బీబీఅహ్మదీయాను మొహమ్మద్ హుసైన్ వివాహమాడి జీవనోపాధి అన్వేషణలో గుల్బర్గా సమీపంలోని హసనాబాద్ చేరారు.

సున్నీగా మారిన షియాపండితుడు :

అది ఔరంగజేబు ఆధిపత్యంలోని కోటాధిపతుల కాలం. ఒకనాడు షియాతెగకు చెందిన పండితుడొకడు బీదరు వచ్చి తన ఉపన్యాస శక్తిని ఇతరుల ముందు ప్రదర్శించటం ప్రారంభించాడు. “జామియా మసీదు ఉపన్యాస వేదికపై కూర్చొని నేను కూడా ఇమామత్ (నమాజు చదివించుట)కు అర్హుడనే విషయాన్ని వివిధ ఆధారాలతో రుజువు చేస్తూ ఉపన్యసిస్తాను. దానిని కాదనే ధైర్యం ఏ సున్నీ పండితునికుందో నేను చూస్తాను” అని గర్వంతో పలికాడు. విషయం తెలుసుకున్న మొహమ్మద్ హుసైన్ ఆ శుక్రవారపు నమాజు చదివించడానికి జామియా మసీదు వెళ్ళారు. అంతలో షియా పండితుడు లేచి ఉపన్యాస వేదిక (మింబర్) వైపు నడిచాడు. ఇది గమనించిన మహమ్మద్ హుసైన్ అతని చేయి పట్టుకొని “ఇటు ఎక్కడికి వెళు తున్నావు? మొదట నాతో మాట్లాడు తరువాత వెళ్ళెదవు గాని”. అని అతనిని తమ ఎదుట కూర్చోబెట్టుకొని నీవు ఏమనదలచినావో ముందు నాతో చెప్పమనిరి. తాను షియా అని, అయిన ఇమామత్ చేయు హక్కు తనకూ ఉన్నదనే విషయాన్ని గురించి

నిరాధారంగా వాదించాడు. మొహమ్మద్ హుసైన్ దానిని ఖండించారు. అయినను తన వాగ్ధాటి, వాక్ చాతుర్యంతో తప్పుడు ఉపన్యాసమిచ్చి ఎదుటి వారిని మోసపుచ్చుడం ప్రారంభించాడు. పరిస్థితి గమనించిన మొహమ్మద్ హుసైన్ కోపోద్రిక్తుడై షియాపండితుని గడ్డం పట్టుకొని పైకెత్తి “అటు చూడు సర్వరే ఆలం మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లం వారు, వారి ఇద్దరు అనుచరులైన హజరత్ అబూ బకర్ రజి. హజరత్ ఉమర్ రజి.లతో ఎలా వచ్చి ఉన్నారో!” అని గంభీరంగా పలికారు. పవిత్ర మూర్తులను ఒక్కచోట చూసిన షియా పండితుడు నివ్వెరపోయాడు. వెను వెంటనే మొహమ్మద్‌హుసైన్ అతని గుండెపై చేతిని ఉంచగా అతని తప్పుడు ఆలోచనలు దూరమై మౌల్వి గారి చేతిపై బయియత్ చేసి (ఆధ్యాత్మిక శిష్యరికం పొంది) సున్నీ ముస్లింగా మారిపోయాడు.

మొహమ్మద్ హుసైన్‌తో మొగలాయి చక్రవర్తి ఔరంగజేబు:

ఆధ్యాత్మికంగా, పాండిత్యపరంగా ప్రఖ్యాతిగాంచిన మౌల్వీ మొహమ్మద్ హుసైన్‌ను కలుసుకొను ఉద్దేశంతో క్రీ.శ. 1476లో చక్రవర్తి ఔరంగజేబు బీదరు వచ్చారు. మౌల్వీ గారి గొప్పతనాన్ని తెలుసుకొన్న చక్రవర్తి, బహమని మంత్రి అయిన ఖ్వాజా మహమూద్ గావా చే నిర్మించబడిన “మద్రస-ఏ-మహమూద్ గావా అను ప్రభుత్వ పాఠశాలలో క్రీ.శ. మౌల్వీ మొహమ్మద్ హుసైన్ గారిని ప్రిన్సిపాల్‌గా నియమించి. “ఇమాముల్ ముదర్రసీన్” (బోధకుల మార్గదర్శకుడు) అను బిరుదుతో సత్కరించి కష్‌నూర్ జాగీరు (పరగణా) రాసి ఇచ్చారు.

ఔరంగజేబుకు మౌల్వీ సలహా :

అనేక పెద్ద గ్రామాలలో ఇటీవల హింసాకాండ మితిమీరి పోయిందని దానిని రూపుమాపడానికి ప్రతి పరగణాలో ఒక పండితుడు, ఒక గణాంకుడు ఒక ఖాజీ (న్యాయాధిపతి) ని నియమిస్తే ఇస్లాం మత సిద్ధాంతాలపై ప్రజల జీవనశైలి నడుచునని చక్రవర్తికి మౌల్వీగారు సలహా ఇచ్చారు. మౌల్వీగారి గొప్పతనాన్ని గుర్తించిన చక్రవర్తి వారి సలహాను అంగీకరించి అమలు పరిచారు.

బీదర్‌లో అశాంతి :

బీదర్‌లో ముస్లింలపై కొందరు దౌర్జన్యాలు చేయుచుండిరి. ఆనాటి ముస్లింఖిల్లా దార్లు (కోటాధిపతులు) దౌర్జన్యాలను రూపు మాపి శాంతిని నెలకొల్పలేకపోయారు. అశాంతి, అల్లకల్లోలాలు రోజు రోజుకు పెచ్చుమీరాయి. సైనికాధికారులకు పరిస్థితి తెలిసినా దౌర్జన్యకారులను సన్మార్గంలో నడపలేకపోయారు. పరిస్థితిపై ఆగ్రహించిన మౌల్వీ, ఔరంగజేబుకు ఒక ఉత్తరం రాశారు. “ఈ దేశాన్ని మీకన్న ముందు ఇద్దరు బిద్దతీ (ఇస్లాం మతంయందు లేని ఆచారాలు ప్రవేశపెట్టు వారు) రాజులేలిరి. వారి వల్ల విసుగు చెందిన ఒక పండితుడు దేవునితో ఓ అల్లా! ఈ రాజులిద్దరిని తొలగించి వారి స్థానంలో ఒక సున్నీ రాజును నియమించమని వేడుకొనగా అల్లా మిమ్ములను ఆ స్థానంలో రాజుగా నియమించాడు. అయిన మీ పాలనలో కూడా కొందరు అల్లకల్లోలాలు సృష్టిస్తూ సయ్యద్ వంశస్థుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారు. మీ పాలనను గత రాజుల పాలనతో పోల్చుకుంటే మీకన్న గత రాజులే మిన్నయని, ప్రజలు తిరిగి ఆ రాజులనే నియమించమని దేవునితో ప్రార్థించుచున్నారు” అని రాశారు. ఈ జాబు చదివిన ఔరంగజేబు మనసుపై చెరగని ముద్రపడింది. వెంటనే తన రాజ్యంలో అశాంతికి కారకులైన జమీందారులను అణచివేయడానికి అబ్దుల్లాఖాన్‌ని నియమించారు.

మౌల్వీ గారు మరి ఒక జాబులో ఇలా రాశారు “దక్కను పట్టణాలందు, గ్రామాలందు ముస్లిములు ఎలా ఉన్నారంటే వారికి కనీసం కలిమా (పూజకు అర్హుడు దేవుడొక్కడే, హజరత్ మహమ్మద్ రసూలల్లా సో.దేవుని ప్రవక్త అని కూడా తెలియకున్నది. వీరు ఇస్లాం మత ఆచారవ్యవహారాలకు చాలా దూరంగా ఉన్నారు. వీరిని చక్కబరచడమే నా ధ్యేయం. వాణిజ్యాధికారి, బోధకుడు లేని పరగణాలో వాళ్ళిద్దరిని నియమించినా వారచ్చటి ముస్లింలకు ఇస్లాం మతాన్ని గురించి బోధించగలరు. అదే విధంగా ఒక ఆచార్యుని కూడా నియమించాలి. అతడు షరియత్ నెపంతో హరాం (నిషేధించబడిన) సొమ్మును పొందకూడదు. ఈ కాలంలో ప్రతి చోట హరాం సొమ్ము అనుభవిస్తున్నారు. బీజాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల

నిజాయతీపై నాకు పూర్తి విశ్వాసముంది. వారిద్దరిని మీ వద్దకు పంపుతున్నాను. మొహమ్మదాబాద్ (బీదర్)కు చెందిన పరగణాలలలో రెండు పరగణాల అధికారాన్ని వీరికియ్యవలసినదిగా గౌరవనీయ అధ్యక్షుల వారి దస్తూరితో ఈ ఉత్తరాన్ని తమకు పంపుతున్నాను. శ్రీ వారు నా మనవి అంగీకరించి వీరిద్దరిని నియమిస్తే కొన్ని రోజుల్లోనే ఆచార వ్యవహారాలు తెలియని వేలాది మంది ముస్లింలను వీరు దారికి తేగలరు. అలాగాక నీతినిజాయితితో లేని అధికారిని నియమిస్తే కలహాలు, అత్యాచారాలు పెరిగిపోయే ప్రమాదముంది. అదే ఒక నీతిమంతుడైన అధికారిగాని ఉంటే తన ఆధిపత్యాన్ని నీతినిజాయితీతో చెలాయించగలడు. కేవలం వ్యక్తి సామర్థ్యంపై ఆధారపడితే ఆ సామర్థ్యం కలహాలు సృష్టించుటకు కూడా ఉపయోగపడవచ్చు. కాబట్టి మీరు సామర్థ్యంకంటే నీతి నిజాయితీకే ప్రాధాన్యత ఇస్తారని ఆశిస్తున్నాను" అని వ్రాశారు.

మౌల్వీ గారు పంపిన ఆ ఇద్దరు వ్యక్తులలో ఒకరు వారి చిన్నాయన ఖాజీ నిజాముద్దీన్ అహ్మద్ కబీర్ కుమారుడు మొహమ్మద్ అబ్దుల్లాషహీద్, రెండో వ్యక్తి ఉదయగిరి మహనీయులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరి గారి జేజనాయన సయ్యద్ ముస్తఫా అలీఖాన్.

దర్బారు అమీరుతో మౌల్వీగారి వ్యతిరేకత :

ఇస్లాం మత సిద్ధాంతాల పట్ల చాలా సూక్ష్మగ్రాహియైన మొహమ్మద్ హుసైన్ వాటిని తు.చ. తప్పకుండా అమలు చేసేవారు. పారసీ, ఉర్దూ సాహిత్యంలో పేరు ప్రతిష్ఠలు గాంచిన "గుల్జారే ఆజం" రచయిత మౌలానా బాఖర్ ఆగా వెల్లూరి మౌల్వీ గారికి అనేక గౌరవ ప్రదమైన పురస్కారాలు అందించారు. షరీయత్‌కు వ్యతిరేకంగా పనులు చేసే వారిని మౌల్వీగారు ఖండించి అలాంటి పనులను వెనువెంటనే ఆపు చేసేవారు. ఈ విషయంలో పెద్ద పెద్ద ధనవంతులనే కాదు చక్రవర్తి ఔరంగజేబును కూడా అడ్డుకున్నారు.

ఒక రోజు ఔరంబజేబు దర్బారుకు చెందిన పెద్ద అమీరు బీదరు వచ్చాడు. అతను విలాస పురుషుడు. సంగీత, నాట్యమంటే చాలా ప్రీతి. బీదరులో సంగీత నాట్య వినోద సభను నిర్వహించదలచాడు. విషయం తెలుసుకొనిన కొందరు ఇది

అసాధ్యమని, మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇక్కడ ఉన్నంత వరకు ఇటువంటి సభలు నిర్వహించుట ఎవరి తరము కాదని వెల్లడించారు. పరిస్థితి తెలుసుకొనిన ఆ అమీరు "పరవాలేదు నేనే ఒంటరిగా ఈ సభను నిర్వహించుకొంటాను. ముత్తఖీ, ముతషరా (షరీయత్ సిద్ధాంతాలపై నడుచువారు)లను లోనికి రానివ్వను" అని చెప్పి ప్రఖ్యాత గాయకులను, నర్తకీ మణులను రప్పించి సభను ఏర్పాటు చేసుకున్నాడు. లోనికి ఎవ్వరిని ప్రవేశించకుండా ద్వారము వద్ద కాపలాదారులను ఉంచాడు. విషయం తెలుసుకొనిన మౌల్వీగారు "ఓ తప్పు త్రోవలో నడిచేవాడా! నీకిదేమి దుర్బుద్ధి? నీ కనులపై కప్పి ఉన్న ఏమరుపాటు తెరను తొలగించుకో. నిన్ను నీవే నరకపు గుంతలో పడనీకు. ఈ ప్రపంచం ఒక వ్యవసాయ క్షేత్రంలాంటిది ఇక్కడ నీవు ఏ పంటను పండించుకొందువో అదే పొందుదువు. నీ ఈ ఠీవీ, ఈ అహంకారం శాశ్వతం కాదు. ఈ ఫకీరు మాటలు గ్రహించి నడుచుకొ. లేనిచో నీవు శిక్షార్హుడగుదువు" అని అమీరును హెచ్చరిస్తూ ఉత్తరం వ్రాశారు.

మహిమ :

మౌల్వీ గారు ఆ ఉత్తరాన్ని రాయబారి చేతికిచ్చి కొద్ది మట్టిని తీసుకొని ఏదో మంత్రం చదివి ఆ మట్టిపై ఊది "ఈ మట్టిని ద్వారము వద్ద ఉండే కాపలా దారులపై చల్లి నీవు లోనికి వెళ్ళి ఈ ఉత్తరాన్ని అమీరుకిచ్చి తిరుగు జవాబు తీసుకొని రమ్మ" అని రాయబారికి ఆజ్ఞాపించారు. సంగీత నృత్య సభ జోరుగా సాగుతోంది. రాయబారి ద్వారము వద్దకు వెళ్ళి మౌల్వీగారిచ్చిన మట్టిని కాపలాదారులపై చల్లాడు. మట్టి ప్రభావంతో కాపలాదారులు నిద్రావస్థలోకి వెళ్ళిపోయారు. వెంటనే రాయబారి లోనికి వెళ్లి జాబును అమీరు చేతికిచ్చాడు. జాబును చూసిన అమీరు ఆశ్చర్యచకితుడై ద్వారము వద్ద ఇందరు కాపలాదారులున్నా ఈ వ్యక్తిలోనికి ప్రవేశించడం ఇది మౌల్వీగారి మహిమ కాక యింకేముంటుందని మనసులో అనుకొని వెంటనే నృత్య సభను నిలిపివేశాడు. "ఓ మహనీయ! మనిషి వల్ల అప్పుడప్పుడు పొరపాటు జరిగిపోతుంటుంది ఇది సహజం. దయచేసి నన్ను క్షమించి దీవించుదురని ఆశించుచున్నాను". అని

అమీరుకి తిరుగు జవాబు పంపెను. తదుపరి కాపలాదారులను పిలిచి ఎవ్వరినీ లోనికి రానివ్వవద్దని మీకు ఆజ్ఞాపించినను ఆ వ్యక్తిని లోనికి ఎందుకు రానిచ్చారని అమీరు ప్రశ్నించాడు, ద్వారం దగ్గర మేమెవ్వరినీ చూడలేదే! అని కాపలాదారులు జవాబిచ్చారు.

మౌల్వీ మొహమ్మద్ హుసైన్ వద్ద జిన్నాత్ (భూతముల) పిల్లలు చదువుట:

మొహమ్మద్ హుసైన్ గారి పాఠశాలలలో కొందరు జిన్నాత్ (భూతము)ల బిడ్డలు కూడా చదివేవారు. వీరిలో అబ్దుర్ రహమాన్ అనుభూతపు బిడ్డ మౌల్వీ గారికి శిష్యుడు. ఒక రోజు ఒక పాములను ఆడించువాడటు వచ్చి తన పనితనాన్ని ప్రదర్శించుచుండెను. అబ్దుర్ రహమాన్ మౌల్వీ గారితో "స్వామీ! నేను పాముగా మారిపోతాను. ఈ పాముల వానితో నన్ను పట్టుకోమని చెప్పండి" అని వెంటనే పాముగా మారిపోయి ఒక రంధ్రములో దూరిపోయెను. రంధ్రంలోకి వెళ్లుతున్న ఆ పామును పాములవాడు చూసి దానిని పట్టుకొనుటకు చాలా ప్రయత్నించాడు కాని సాధ్యపడలేదు. చివరికి తన రెండో ప్రయత్నంతో పామును పట్టుకొని తన బుట్టలో వేసుకొనెను. బుట్టలో వేసుకొనుటకు ఇష్టపడని మౌల్వీగారు దానిని వదలపెట్టమనెను. నేను ఈ పాము ద్వారా చాలా సంపాదించుకోగలనని చెప్పి పాముల వాడు దానిని వదిలి పెట్టుటకు ఇష్టపడలేదు. మౌల్వీ గారు పాముల వానికి కొంత డబ్బిచ్చి దానిని విడిపించుకున్నారు. ఆ పాము మరల యధాస్థితికి వచ్చి బాలునిగా మారాడు. పాముల వాడు చేసిన ప్రయోగానికి నీవు బయటకు ఎందుకు వచ్చావు? అని మౌల్వీగారు ప్రశ్నించగా "నాలుగు దిశల నుంచి మంటలు నన్ను చుట్టుముట్టాయి. నేనిక తప్పించుకోలేననిపించినది" అని ఆ బాలుడు జవాబిచ్చాడు. జాగ్రత్త సుమా! ఇక మీదట ఇలాంటి పనులు చేయరాదని మౌల్వీగారు హెచ్చరించారు.

మౌల్వీ గారు ఎక్కువగా రియాజత్ (సాధన) చేసేవారు. ఛిల్లా (ధ్యానము) దినములందు ఒకసారి భూతములకు గిట్టని వస్తువు తిన్నారు. దానివల్ల భూతములకు చాలా కష్టము కలిగింది. ఇక మీదట అలా జరగదని భూతములతో మౌల్వీగారు

వాగ్దానం చేశారు. జిక్రొ అజ్కార్ (జపతపములు) క్రమం తప్పకుండా చేసెడివారు. వీరు వైద్యానికి బదులు దేవుని ఆశీర్వాదాలపై ఆధారపడేవారు. ఒకసారి గుల్బర్గా తదితర ప్రాంతాల్లో కలరా వ్యాధి వ్యాపించింది. దానిని రూపుమాపుటకై "షేక్ అహ్మద్ సలానానిగార్"' పేరిట మౌల్వీ గారు దువా (మంత్రము) రాసి పంపినారు.

ఖురాను కంఠస్తం :

కేవలం 27 దినాల్లో మౌల్వీ గారు ఖురాను కంఠస్తం చేశారు. ఒక సంవత్సరం రంజాన్ మాసంలో తరావీ నమాజు చదివించుటకై హాఫిజ్ (ఖురాను కంఠస్తం చేసిన వ్యక్తి) లభ్యం కాలేదు. మామూలు నమాజు చదివించమని నమాజీలు మౌల్వీ గారిని కోరారు. ఇక మౌల్వీ గారికి తప్పలేదు. "అలంతరా" అను సూరా (మంత్రము)తో ప్రారంభిస్తారని అందరు భావించారు. ఈ పద్ధతి అంతట ఉండేది. కాని హాఫీజ్ ప్రారంభించే విధంగానే "సూరయేబఖరా"తో నమాజును చదివించడం ప్రారంభించారు. ఇలా మూడు దినాలు గడిచాక "స్వామీ! మీరు హాఫీజ్ కారుగదా! అయినను మీరు ఖురాను తొలి నుంచి ప్రారంభించి వరుసగా చదువుతున్నారే! అని ఆశ్చర్యముతో అందరు ప్రశ్నించారు. కేవలం 27 దినములలో ఖురాను కంఠస్తం చేసిన మౌల్వీ "ఇది దైవ ప్రసాదం" అని సమాధానమిచ్చారు.

హజరత్ ఇమాం హుసైన్ రజి. పై భక్తి భావం :

షియా తెగకు చెందిన ఆచారాలంటే మౌల్వీ గారికి గిట్టేది కాదు. కాని వీరి హృదయ మందు హజరత్ ఇమాం హుసైన్ రజి. వారి సంతతిపై ఎనలేని భక్తి భావం వుండేది. ప్రతి యేట మొహరం నెల ఆరంభం నుంచి వారిని తలచుకొంటూ దు:ఖసాగరంలో మునిగే వారు. ఈ దినాలలో హజరత్ ఇమాం హుసైన్ రజి.కు ఎదురైన కష్టాలను తలచుకొని ఏడ్చెడి వారు. అన్న పానీయాలు కూడా విడిచిపెట్టేవారు. ఏదైన తిని మాట్లాడండని ఎవరైన కోరితే, ఆకాశంపై ఆ దూతలే ఇమాం హుసైన్‌ను గురించి దు:ఖిస్తూ కన్నీరు కారుస్తుంటే నేనెలా తినగలను? అనే వారు.

గ్రంథ రచనలు :

వీరు అనేక గ్రంథ రచనలు చేశారు. "తఫ్సీర్ సూరతులల్ ఫాతిహా"లో సూరయే ఫాతిహా గురించి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల్లో పీరీమురీది (సూఫీతత్వం) పరిభాషను ఎక్కువగా ఉపయోగించారు. దాని ప్రతి (కాపీ) మదరాసులోని నవాబ్ అమీర్‌నవాజ్ జంగ్ గ్రంథాలయంలో గలదు.

మౌల్వీ గారికి హజరత్ షాహమీర్ ఔలియా కడప వారితో సంబంధం :

జగత్ ప్రఖ్యాత మహనీయులైన హజరత్ మఖ్దూం జహా నియా జహా గష్త్ రహ. వారి వంశానికి చెందిన మొదటి షాహమీర్ ఔలియా గారికి మౌల్వీ మొహమ్మద్ హుసైన్ సర్‌పరస్త్ (నిర్వాహకుడు)గా ఉండినారు, షాహమీర్ గారు మౌల్వీ గారి శిష్యులని వారిద్దరి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెలుస్తోందని మదరాసు యూనివర్సిటీ ప్రొఫెసర్ మొహమ్మద్ యూసుఫ్ కోకన్ తమ రచనలో తెలిపారు.

షహీద్ అయిన మౌల్వి :

మౌల్వీ గారు పనిచేసే పాఠశాలకు ఆనుకొని ఒక మసీదుండెను. ఇక్కడ దూర ప్రాంత విద్యార్థులు వచ్చి విద్య నేర్చుకునేవారు. పాఠశాలకు మరో పక్క రాజు గారికి సంబంధించిన ఆయుధ సామాగ్రి గది కలదు. దానిని ఖాళీ చేయమని చెప్పినను ఖాళీ చేయలేదు. అది 1108 హిజ్రీ (క్రీ.శ.1696) రంజాన్ నెల 6వ తేదీ శుక్రవారము. మౌల్వీ గారు నమాజు చదివి ఉపన్యసించారు. ఉపన్యాసం ప్రతి శుక్రవారం వలె తొందరగా ముగించక అసర్ (సాయంత్రం) వరకు కొనసాగింది. చివరిలో బహుశా ఇది నా ఆఖరి ఉపన్యాసమని పలికారు. ఈ మాటల వెనుక దాగి వున్న రహస్యమేమిటో శ్రోతలు అర్థం చేసుకోలేకపోయారు. అసర్ నమాజు చదివి ఇంటికి వెళ్ళి స్నానం చేసి తెల్లని బట్టలు ధరించి తన శ్రీమతిని కూడా తెల్లటి బట్టలు ధరించమన్నారు. దైవ నిర్ణయానికి వ్యతిరేకంగా పెదవి మెదపరాదని ఆజ్ఞాపించారు.

రంజాన్ నెల ఇషా (రాత్రి) నమాజుకై మౌల్వీ గారు మసీదుకు వెళుతూ తమ ఇద్దరు బిడ్డలు నజీముద్దీన్ హసన్, అహ్మద్ అబుతురాబ్ (హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారి తాత గారు) లను తమ వెంట తీసుకొని వెళ్ళలేదు. తమ బావగారైన హాజీ మహమూద్‌ను కూడా నమాజులో పాల్గొననీయలేదు. “ఈ రోజు ఖియామత్ (ప్రళయం) ఉంది” అని పలికినను, విన్న వారు బహుశా వీచుచున్న ఈ తుపాను గాలిని గురించి అనుచున్నారేమోనని భావించారు.

తరావీ (రంజాన్ మాసంలో రాత్రివేళ మసీదులో చదివే నమాజు) కై ప్రతిరోజు వెయ్యి మంది వరకు హాజరయ్యేవారు. కాని ఆ రోజు మాత్రం మూడు వందలకు పైబడి జనం హాజరైరి. ఫరజ్ సున్నత్ నమాజు చదువుకొనిరి. ఇక తరావీ నమాజు ప్రారంభమైంది. మౌల్వీ గారు మొదటి దుగానాలో సూరయే ఇస్రా ప్రారంభ ఆయత్‌లు చదివారు. రెండో రకాతు చదివిన పిమ్మట ఖాయిదాలో కూర్చొని తష్‌హద్ చదువుచుండగా అకస్మాత్తుగా పెద్ద మెరుపు మెరిసి పెద్ద శబ్దంతో మశీదు, పాఠశాల అర్ధ భాగం కూలిపోయి పెద్ద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తప్ప మిగతా నమాజీలందరు చనిపోయారు. ప్రమాదం నుంచి బయటపడిన వారిలో మౌల్వీగారి మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) షేక్ వహాబ్, షేక్ హబీబుల్లా మూడో వ్యక్తి ఒక కసాయి. మట్టిని తొలగించి మృతదేహాలను బయటకు తీస్తుండగా ఖాయిదాలో కూర్చున్న మౌల్వీగారు ఖాయిదాలోనే ఉన్నారు. వారి షహాదత్ (చూపుడు) వేలు పైకి లేచి ఉంది. వారిముందు ఖురాను, దాని మీద నెత్తుటి మరకలున్నాయి. ఈ విధంగా షహాదత్ పొందిన మౌల్వీ గారిని ఇతర మృతులను ఎంతో భక్తితో సమాధి గావించారు.

ఇమాముల్ ముదర్రసీన్ మౌలానా మొహమ్మద్ హుసైన్ బీదరి షహీద్ రహ. గారిని గురించి ఎందరో పారసీ భాషలో రాశారు:

ఇమామె జమానా మొహమ్మద్ హుసైన్
కెజవాద్ అజ్ వజూదష్
గిరఫ్త్ అస్త్ జయీ
విలాయత్ మ ఆబీకే
మద్‌హోష్ బూద్ బర్ అర్ బాబదీ
ఫర్జ్‌మానంద్ దీ అజకబర్ఫ్
ఆసాబన్ వేష్ షతాఫ్
సరాపాజహా సోఖ్త్ అజ్‌బర్ఫ్ బీన్
పైరవీయత్ వజద్ జుల్ జలాల్
జ దునియా ఎ ఫానీ చౌపోషిదా అయీ
సర్ దఖ్ష్ ఖిరద్ గుఫ్త్ తారీఖ్ ఫౌత్
యఖీనన్ బిహిష్తి మొహమ్మద్ హుసైన్

అర్థం : మొహమ్మద్ హుసైన్ కాలపు మార్గదర్శి. వీరి అస్తిత్వంతో ఇస్లాం ధర్మ నిష్ఠకు అందమొచ్చె. వీరు సిద్ధపురుషత్వపు ఉన్నత దశకు చేరుకొన్నందున వీరిని ప్రశంసించుట పరమార్ధికుల ధర్మం. మృత్యువు వీరివైపు పిడుగువలె విరిగిపడినందున వీరేకాదు వీరితో పాటు జ్ఞాన ప్రపంచం కూడా కాలిపోయే. వీరు దేవుని దర్శనానికై ఈ అనిత్యమైన ప్రపంచంతో శాశ్వతంగా తమ దృష్టిని మరలించుకొనిరి. అదృశ్య ధ్వని వీరిమరణ తిథిని “మొహమ్మద్ హుసైన్ నిస్సందేహంగా స్వర్గస్తుడు” అని నిర్ణయించె.

మరో కవి మరణ తిథిని ఇలా రాశారు :

చౌ గుప్త షహీద్ ఆ ఇమామె జమా = రసీదా బదర్‌గాహె ఖుర్‌బె హుసైన్
బగుఫ్‌తార్ ఖిరద్ సాల్ తర్‌హీల్ ఔ = యఖీనన్ బిహిష్తి మొహమ్మద్ హుసైన్

అర్థం : కాలపు మార్గదర్శి అయిన వీరు వీరమరణం పొంది హజరత్ ఇమామ్‌హుసైన్ రజి. వారి ఆస్థానానికి దగ్గరవగా అనగా వీరు వీరమరణపు సమూహములో

చేరిపోయినందున జ్ఞానము వీరి మరణతిథిని "వీరు నిస్సందేహంగా స్వర్గీయులు" అని బహిర్గతపరచె.

మౌల్వీ గారికి మొహియుద్దీన్, అహ్మద్ అబుతురాబ్ (సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి గారి తాత) నిజాముద్దీన్ అలీ, నజ్ముద్దీన్ హసన్, జియావుద్దీన్ హసన్ అను ఐదుగురు కుమారులు ఒక కుమార్తె సాజనీ సాహిబా. వీరి శ్రీమతి ఖాజీనిజాముద్దీన్ అహ్మద్ కబీర్ కుమార్తె బీబీ మహమ్మదీయ తన 90వ యేట గుల్బర్గాలో స్వర్గస్తులయ్యారు. తల్లీ అగ్నా సాహిబా క్రీ.శ. 1686లో ఉదయగిరి వచ్చి ఇచ్చటనే సమాధి అయ్యారు.

హైదరాబాదులోని ప్రాచీన ప్రఖ్యాత వీధి "మొహల్లా ముదరస్ పురా"లో నేటికీ మౌల్వీగారి వంశానికి చెందిన వారున్నారు. సయ్యద్ నూరుల్లా ఖాద్రి (లేట్) గారి చిన్న కుమారుడు సిబగ్ తుల్లా ఖాద్రి గారు బీదర్‌లోని మౌల్వీగారి దర్గాకు సజ్జాదగా (పిఠాధిపతి) ఉన్నారు. వీరు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉరుసు కార్యక్రమం నెరవేర్చుచున్నారు. ప్రతి యేట రంజాన్ నెల 11వ తేదీన బీదర్‌లో ఉరుసు జరుగుతుంది. రైల్వే స్టేషన్‌కు దగ్గరలో గల నాలుగు రోడ్ల కూడలిలో మౌల్వీ గారి సమాధి ఉంది. ఆ సమాధి ఆవరణలో వారి సంబంధీకుల సమాధులున్నాయి. ఎంతో ఖ్యాతి గడించిన మౌల్వీగారి వంశస్థులు నేటికి దేశవిదేశాలలో ఉన్నత హెూదాల్లో ఉన్నారు. "తారుఫ్" అనే పుస్తక రచయిత్రి అయిన షఫియా ఖాద్రి (హైదరాబాదు నుంచి వెలువడు ప్రముఖ ఉర్దూ దినపత్రిక "మున్సిఫ్" సంపాదకుడు ఖాన్ లతీఫ్ ఖాన్ గారి వదిన అనగా ఉమర్‌ఖాన్ గారి శ్రీమతి) ఈ వంశానికి చెందినవారే. వీరు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఈ వంశపు మరో వ్యక్తి డా.సయ్యద్ కరీముల్లా ఖాద్రి గారు కూడా అమెరికాలోని కేన్సాస్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

మౌల్వీగారితో హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహబ్ మరియు హజరత్ వజూదీ గారి సంబంధాల సూచిక :

ఇమాముల్ ముదరసీన్

↓

నజ్‌ముద్దీన్ హసన్

↓

మొహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేక్ సాహబ్

↓

1. అష్రఫ్ సాహిబా 2. జైనబ్ సాహిబా (సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహబ్ శ్రీమతులు)
3. రొఖియ సాహిబా (సయ్యద్ మొహియుద్దిన్ మొహి శ్రీమతి)

↓

సయ్యద్ షామొహమ్మద్

↓

సయ్యద్ మొహమ్మద్ అబ్దుల్లా

↓

హజరత్ వజూది రహ.



7. హజరత్ అహ్మద్ అబుతురాబ్ ఖాదరి

ఖాజీ హుసైన్ లుత్ఫుల్లా
↓
మీరా అబ్దుల్ ఖాదర్
↓
మౌల్వీ మహ్మద్ హుసైన్ షహీద్
↓
అహ్మద్ అబుతురాబ్ ఖాదరి

హజరత్ అహ్మద్ అబుతురాబ్ ఖాదరి ఉదయగిరి మహనీయులైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి గారికి తాత. వీరు క్రీ.శ. 1684లో జన్మించారు. వీరి 12వ ఏట తండ్రి మౌల్వీ మొహమ్మద్ హుసైన్ స్వర్గస్తులయ్యారు. వీరి మొదటి శ్రీమతి పేరు షరీఫా సాహిబా, రెండో శ్రీమతి మరియం సాహిబా. కొంతకాలానికి వీరి తమ్ముడు నజ్ముద్దీన్ హసన్ ఖాదరి కడప జిల్లా బద్వేలు చేరారు. అక్కడి వారు వీరిద్దరిని భక్తి మర్యాదలతో చూసేవారు. బడే సాహెబ్ జాదే, ఛోటే సాహెబ్ జాదే (పెద్ద స్వాములు, చిన్న స్వాములు) అని పిలిచేవారు. ఆనాటి కడప ప్రభువైన అబ్దుల్

హమీద్‌ఖాన్ (అబ్దుల్ హలీంఖాన్ గారి తాత అయిన అబ్దుల్ మజీద్ ఖాన్) గారి తండ్రి. వీరి సమాధులు కర్నూలు ఉస్మానియా కాలేజి ప్రక్కన గల గుమ్మటమందు గలవు. వీరిద్దరిని రాచమర్యాదలతో స్వాగతం పలికి, వీరి ఖర్చులకని కొన్ని మాగాణి భూములు కేటాయించారు. ప్రతి ఏట నెలసరి కానుకగా వంద, రెండు వందల రూపాయలు వీరికి సమర్పించుకునేవారు. వీరిరువురు ఆర్కాటు వెళ్లి వచ్చేవారు. ఆర్కాటులో వీరి తమ్ముడు నిజాముద్దీన్ అలీగారు ఉండేవారు. వీరిని ఆర్కాటు తొలి నవాబైన నవాయిత్ వంశపు సాదతుల్లా ఖాన్ చాలా గౌరవించేవారు. రోజుకు ఐదు రూపాయలు ఖర్చులకని నిర్ణయించారు. వీరు సయ్యద్ అలీ మొహమ్మద్ అల్‌ముత్తఖీ గారి వద్ద మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) అయ్యారు. వీరి సమాధి తాజ్‌పురాలో గురువు గారి దర్గాకు పడమటి వైపు కట్టబడిన నాలుగు గోడల మధ్యగలదు. కొంత కాలానికి నజ్ముద్దీన్ హసన్ బద్వేలు నుంచి గుల్బర్గా వెళ్లి అక్కడే తమ 73వ ఏట స్వర్గసులయ్యారు. అహ్మద్ అబుతురాబ్ ఖాదరి బద్వేలులో ఉంటూ 1723లో తమ 40వ ఏట అక్కడనే స్వర్గస్తులయ్యారు. వీరి సమాధి బద్వేలులోని ఖలీఫా ఖాజామియా మసీదు ఆవరణలో కలదు. వీరికి మొదటి శ్రీమతి షరీఫా సాహిబాతో ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలు కలిగారు. కుమారుడు బాదషామొహియుద్దీన్ మజ్‌జూబ్ (సమాధినిష్టుడు) ఉండిరి. వివాహమై బిడ్డలు కూడా కలిగారు. 1203వ హిజ్రీ అనగా క్రీ.శ.1788సం. మొహరం నెల 12వ తేదీన ఉదయగిరిలో స్వర్గస్తులయ్యారు. అహ్మద్ అబుతురాబ్ ఖాదరి మొదటి కుమార్తె అగ్నా సాహిబా ఉర్ఫ్ అక్మల్‌మాసాహిబా వివాహం అబ్దుల్లా షహీద్ కుమారుడు నిజాముద్దిన్ అహ్మద్‌సగైర్‌తోను, రెండో కుమార్తె మరియంసాహిబా వివాహం బదరుద్దీన్ అలీ (అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ గారి తండ్రి)తో జరిగింది. వీరు తమ 90వ ఏట ఉదయగిరిలో స్వర్గస్తులయ్యారు. మూడో కుమార్తె హబీబ్‌సాహిబా వివాహం అబ్దుల్లా షహీద్ కుమారుడు మొహమ్మద్ లుత్‌ఫుల్లాతో జరిగింది. అహ్మద్ అబుతురాబ్ రెండో శ్రీమతి మరియం సాహిబాకు ఫాతిమాసాహిబా జన్మించారు. వీరి వివాహం నజ్ముద్దీన్ హసన్ కుమారుడు మొహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేక్‌సాహెబ్‌తో అయింది. వీరు ప్రముఖ కవులైన గులామ్ మొహియుద్దీన్ షాయఖ్, మీరా మొహియుద్దీన్ వాఖిఫ్‌లకు జేజమ్మ అవుతారు. వీరి కుమార్తెలైన అష్రఫ్ సాహిబా వారి తదుపరి జైనబ్ సాహిబాను హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ వివాహమాడారు.

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ

తాత గారి వంశ వృక్షం

మౌల్వీ మొహమ్మద్ హుసైన్ బీదరీ షహీద్
= బీబీ మొహమ్మదీయ (ఖాజీ నిజాముద్దీన్ అహ్మద్ కబీర్ గారి కుమార్తె)
వీరు గుల్బర్గాలో స్వర్గస్తులైరి

↓

- సాహిబుని సాహిబా = ఖాజీ మన్‌జలే సాహెబ్ ఉర్ఫ్ మియా సాహెబ్
- జియావుద్దీన్ హుసైన్
- నజ్‌ముద్దీన్ హసన్ = ఉమ్ముల్ ఫజ్ల (సయ్యద్ హబీబుల్లా గారి కుమార్తె)
- నిజాముద్దీన్ అలీ = బేగం సాహెబా
- అహ్మద్ అబుతురాబ్ = 1. షరీఫా సాహెబు = 2. మరియం సాహెబా
- మొహమ్మద్ బాదషా మొహియుద్దీన్ (1788లో ఉదయగిరిలో స్వర్గస్తు లయ్యారు)

↓ (అహ్మద్ అబుతురాబ్)

- ఆయెషా సాహెబా
- బాదషా మొహియుద్దీన్ (అవధూత) 1203 హి.లో ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు
- ఆగ్నా సాహెబా ఉర్ఫ్ మా సాహెబా = నిజాముద్దీన్ అహ్మద్ సగైర్ (అబ్దుల్లా షహీద్ కుమారులు)
- మరియం సాహెబా ఉర్ఫ్ సాహిబుని సాహిబా = సయ్యద్ బదరుద్దీన్ అలీ (సయ్యద్ ముస్తఫా కుమారులు)
- హబీబ్ సాహెబా = హుసైన్ లుత్ఫుల్లా (అబ్దుల్లా షహీద్ కుమారులు)
- ఫాతిమా సాహెబా = మహమ్మద్ హుసైన్ (వీరు నజ్‌ముద్దీన్ హసన్ కుమారులు)

↓ (మరియం సాహెబా)

- సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహబ్ ఖాదరి (1221 హిజ్రి క్రి.శ. 1806 మొహఱం నెల 28న ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు)
  = 1. అష్రఫ్ సాహిబా
  = 2. జైనబ్ సాహిబా
  (వీరిరువురు మొహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేక్ సాహెబ్ కుమార్తెలు)
- బంగీ సాహెబా

8. హజరత్ సయ్యద్ ముస్తఫా అలీఖాన్

సయ్యద్ ముస్తఫా అలీఖాన్ సయ్యద్ బదరుద్దీన్ అలీఖాన్ గారికి తండ్రి (సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారి)కి జేజనాయన. వీరి తండ్రి పేరు సయ్యద్ ఇబాదుల్లా. వీరిది బీజాపూరు. వీరు గొప్ప దైవభక్తులు. ఇస్లాం సిద్ధాంతాలపై తు.చ. తప్పకుండా నడిచేవారు. వీరు నీతి నిజాయితీకి మారుపేరుగా ఉన్నందున ఇమాముల్ ముదర్రసీన్ మౌలానా మొహమ్మద్ హుసైన్ బీదరీ షహీద్ గారి సిఫార్సుపై చక్రవర్తి ఔరంగజేబు వీరిని 1108 హిజ్రీ అనగా క్రీ.శ. 1696లో ఉదయగిరి కోటకు అధిపతిగా నియమించెను. వీరు మొహమ్మద్ హుసైన్‌కు శిష్యులగుదురు. వీరి కాలమందే నవాబ్ దావుద్‌ఖాన్ పన్ని స్థానములో నవాయిత్ వంశానికి చెందిన మొదటి ఆర్కాటు నవాబు (పాలనాధికారి)గా సాదతుల్లా ఖాన్‌ను ఔరంగజేబు నియమించెను. ఔరంగజేబు మరణానంతరం దక్షిణ భారతదేశంలో మొగలాయిల పాలన పూర్తిగా దెబ్బతింది. దక్కన్‌లో నిజాము తన సార్వభౌమాధికారం ప్రకటించుకొనెను. నవాబైన సాదతుల్లా ఖాన్ ఆర్కాటులో నాయతీవంశ పాలనకు పునాది వేసెను. వీరి కాలంలో సయ్యద్ ముస్తఫా అలీఖాన్‌ను ఆసిఫ్ జా తమ సంతకం, సాదతుల్లా ఖాన్ ముద్రతోటి ఉదయగిరి కోటకు అధిపతిగా నియమించెను. కర్నాటకలో నవాయత్ వంశం వీరితోనే ఆరంభమైనది.

సాహిత్యాభిమాని, కవి :

ఢిల్లీ నివాసి, ప్రముఖ పారశీ కవి, రచయిత అయిన మీర్జా అబ్దుల్ ఖాదర్ బేదిల్ గారి శిష్యుడు మొహమ్మద్ అమీన్ ఇస్రాయిలీ ఒక మారు కడపకు విచ్చేసిన సందర్భముగా ముస్తఫా అలీఖాన్ స్వాగతం పలికారు.

మిర్జా అబ్దుల్ ఖాదర్ బేదిల్ :

బేదిల్ క్రీ.శ.1644లో ఒక సూఫీ కుటుంబంలో పుట్టారు. అది షాజహాన్ చక్రవర్తి పరిపాలన కాలము. బేదిల్ పారసి భాషలో ప్రముఖ కవి. అతని సూఫీ తత్వపు కవిత్వమును గురించి ప్రముఖ ఉర్దూ కవులు గాలీబు, ఇక్బాల్ ప్రశంసల వర్షం కురిపించారు. బేదిల్ మామూలు కవి కాదు ఒక ప్రఖ్యాత సూఫీ కవి. విశ్వములోని అణువణువుపై దృష్టిపెట్టి ప్రతి వస్తువు మూలాన్ని తెలుసుకొను ప్రయత్నంలో మునిగారు.

బేదిల్

ఇక్బాల్


గాలిబ్

రూమి

ఇక్బాల్ బేదిల్‌ను "ముర్షదె కామిల్" (ఆధ్యాత్మిక పరిపూర్ణ గురువు) అని పొగిడితే గాలీబు "బహరె బే కరా (అంతములేని సముద్రము) అనెను. ప్రఖ్యాత కవి నియాజ్ ఫతపూరి ఇలా అంటారు "15 ఏళ్ల నుండి బేదిల్ గురించి అధ్యయనం చేస్తున్నాను. కాని ఈ సముద్రము నుండి ఒక బిందువును కూడా పొందలేక పోయాను".

బేదిల్‌కు బాల్యము నుండియే తసవ్వుఫ్ (సూఫీ విద్య) గురించి ప్రత్యేక అభిరుచి గలదు. దైవరహస్యాన్ని నెరిగిన ఆరిఫుల సభలకు హాజరయ్యే వారు. తన ప్రారంభ జీవితములో సూఫీలు, వలీలు(దైవమిత్రులు) మొదలగువారి సాంగత్యంలో ఆధ్యాత్మికంగా ఎంతో లాభం పొందెనని తన రచన "చహార్ అన్‌సర్"లో తెలిపారు. మహనీయులు చూపిన ఆత్మ బోధన మార్గములో నడిచిన బేదిల్ ఎన్నో మజలీలు చేరారు.

బేదిల్ పద్యములో గద్యములో తన ప్రతిరాతలోను సూఫీతత్వం అర్థమవుతుంది. వీరు పారసీ శాస్త్రీయ సాహిత్యాన్ని ప్రత్యేకంగా సూఫీసాహిత్యాన్ని లోతుగా అభ్యసించెను. ప్రఖ్యాత ఆధ్యాత్మిక పారసీ కవులైన బూఅలీసీనా, సనాయి మౌలానా రూమి ప్రభావం వీరిపై పడెను. వీరి దీవాన్ (కవితా సంకలనం) చహార్ అన్‌సర్‌లో వీరి గజళ్ళు విరివిగా దొరుకును. బేదిల్‌కి వివిధ భాషలపై మంచి పట్టు గలదు. చరిత్ర, సంగీతం, వ్యాకరణంలో ప్రావీణ్యత గలదు. ఆధ్యాత్మిక, వైద్య, ఖగోళశాస్త్రాల పట్ల మంచి అవగాహన కలదు. వీరి రచనలో అధిక భాగం "వహదతుల్ వజూద్" అనగా అద్వైత ఉనికి కానవచ్చును.

ఇంతటి మహనీయుని శిష్యుడైన అమీన్ ఇస్రాయిలిని కడప నవాబైన అబ్దున్నబీ గారితో పాటు ఉదయగిరి కోటాధిపతి సయ్యద్ ముస్తఫా అలీఖాన్ గౌరవ మర్యాదలతో స్వాగతం పలికారు. దీంతో వారికి భాషా సాహిత్యం పట్ల ఎంతటి అభిరుచి గలదో అర్థమవుతోంది. ఇది ఉదయగిరి వాసులకు ఎంతో గర్వకారణం. మౌల్వీ మొహ్మద్ హుసైన్ గారి చిన్నాయన ఖాజీ అహ్మద్ కబీర్ గారి కుమారుడు మొహమ్మద్ అబ్దుల్లా షహీద్(వీరి సమాధి తాడిపత్రిలో గలదు)తో ముస్తఫా అలీఖాన్‌కు మంచి సంబంధాలుండేవి. చివరి వరకు ఉదయగిరిలో ఉండిన సయ్యద్ ముస్తఫా అలీ గారి సమాధి పెద్ద మశీదుకు ఆనుకొనియున్న మఖ్‌బర (నాలుగు గోడల మధ్య)లో గల సమాధులలలో పడమటి వైపున గల మొదటి సమాధి.

సయ్యద్ ముస్తఫా అలీఖాన్ సాహెబ్ గారి సమాధి

9. హజరత్ అబ్దుల్లా షహీద్

1080 హిజ్రీ క్రీ.శ. 1669 లో బీజాపూరులో అబ్దుల్లా షహీద్ జన్మించారు. తండ్రి పేరు ఖాజీ నిజాముద్దీన్ అహ్మద్ కబీర్. వీరు మౌల్వీ మొహ్మద్‌హుసైన్‌కు చిన్నాయన కుమారుడు. సయ్యద్ ముస్తఫా అలీ ఖాన్ గారికి మంచి మిత్రుడు. పారసీ, అరబీ భాషల్లో ప్రావీణ్యత సంపాదించారు. షాఅబ్దుల్లా ఖాదరి హైదరాబాది గారి వద్ద మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) అయ్యారు. మౌల్వీ మొహమ్మద్ హుసైన్ గారి సిఫార్సుపై చక్రవర్తి ఔరంగజేబు వీరిని గుల్బర్గాకు గణాంకాధికారిగా నియమించెను. వీరికి "షరీయత్ ఓ సదారత్ పనా", "షరాఫత్ ఓనజాత్‌దస్తగాహ", "ఫజాయిల్ ఓ ఇఫాజత్ మూర్తిబతా", "జామియల్ కమాలాత్ ముస్తజీమియుల్ హసనాత్", "ఖాజియుల్ ఖజాత్" మొదలగు గొప్ప బిరుదులు లభించాయి. ఔరంగజేబు మరణానంతరం కడపజిల్లా సిద్దోటులోని తమ మిత్రుడు సయ్యద్ ముస్తఫా అలీఖాన్ (ఉదయగిరి కోటాధిపతి) గారి ఇంట్లో ఉంటూ క్రీ.శ. 1710లో ప్రముఖ మహనీయులు ఫరీదుద్దీన్ అత్తార్ రహ. గారి రచన మంతిఖుల్ తైరుల్ లషేఖ్, 1711లో ప్రముఖ సూఫీ, కవీ అబ్దుల్ రహమాన్ జామీ గారి రిసాలా (సంచిక)ను కాపీ చేశారు. వీరు

చాలా కాలం బద్వేలులో గడిపి మహ్మదీయుల రాజ్యస్థాపన జరిగిన పిమ్మట ఆర్కాటు వెళ్ళారు.

ఒక రోజు వీరు ఏకాంతంలో గడుపుతూ లోనికి ఎవ్వరిని రానీయవద్దని ద్వారపాలకుని ఆజ్ఞాపించారు. అంతలో వీరి ముర్షద్ (ఆధ్యాత్మిక గురువు) గారి కుమారుడు రాగా ద్వార పాలకుడు లోనికి అనుమతివ్వనందున వారు వెనుదిరిగారు. కొద్దిసేపటి తరువాత విషయం తెలుసుకొన్న అబ్దుల్లా వెంటనే గురువు గారి కుమారుని వద్దకు వెళ్లి క్షమాపణ కోరారు "మీ రాక ముందు నేను ఏకాంతమందుండినాను. మీ తండ్రి గారు ప్రత్యక్షమై ఒక ప్యాలా (పాన పాత్ర) నాచేతికిచ్చి దీనిని తాగమన్నారు. నీకు షహాదత్ (వీర మరణం) లభించునని ఆజ్ఞాపించారు. కొంత కాలానికి ఆర్కాటు నవాబు సాదతులల్లా ఖాన్ వీరిని తాడిపత్రి ఖిల్లాదారుగ నియమించారు. తమ బాధ్యతలను చక్కగా నెరవేర్చుచుండగ శిస్తు చెల్లించుటకు నిరాకరించిన రైతులు, జమిందారులతో తలపడమని కర్ణాటక నవాబు సాదతుల్లాఖాన్ ఆజ్ఞాపించారు. క్రీ.శ. 1732లో వీరి మధ్య జరిగిన పోరాటంలో ఒక తుపాకి గుండు చెవికి తగిలి తమ 65వ ఏట వీర మరణం పొందారు. వీరితో పాటు వీరి మూడో కుమారుడు హుసైన్ లుత్ఫుల్లా కూడా వీర మరణం పొందారు. అనంతపురం జిల్లా తాడిపత్రి జామా మశీదు ఆవరణలో వీరి సమాధులున్నాయి. వీరి మరణతిధిని కవి అయిన వీరి మిత్రులు సయ్యద్ ముస్తఫా అలీఖాన్ గారు పారశీ భాషలో ఇలా రాశారు.

జాత్ అబ్దుల్లా చొ అజ్ తఖ్దీర్ హాఖ్
కజ్ షికింజ్ దాం ఖైదిష్ కస్నరస్త్
దర్సివాద్ తాడపత్రి షద్ షహీద్
యాఫ్త్ ఆలీ రుతుబా ఆ ఏజద్ పరస్త్
సాల్తారీఖష్ బజుస్తం హాతిఫీ
గుఫ్త్ అబ్దులల్లాల షహీద్ అక్బర్ అస్త్

అర్థం : సత్యపురుషుడు అబ్దుల్లా తమ అదృష్ట ప్రకారం తాడిపత్రిలో వీర మరణం పొంది బంధ విముక్తి అయినందుకు "అబ్దుల్లా గొప్ప వీరమృతుడు" అను మరణతిధి

వాణి నాకు అందింది.

ఖాజీ బదరుద్దౌలా కుమారుడు హాజీ అహ్మద్ తమ రచన 'తారీఖే అహ్మది'లో ఎవరైనా కడుపునొప్పితో గాని తేలు కుట్టినందుకు గాని బాధపడుచుండిన, అబ్దుల్లా షహీద్ సమాధి చిటికెడు మట్టిని నీటిలో కలిపి తాగించిన వెంటనే బాధ తొలగిపోతుందని, దీంతో అబ్దుల్లా ఎంతటి దైవభక్తులో అర్థమగుతుందని రాశారు.

అబ్దుల్లా షహీద్ సమాధి

10. నవాయిత్, వాలజా పరిపాలనలో ఉదయగిరి ఖిల్లాదారులు

నవాయిత్ వంశ పాలన క్రీ.శ. 1710–1763 వరకు కొనసాగెను. అంతర్గత విభేదాల కారణంగా పాలన క్షీణదశకు చేరెను.

వాలజాహి పాలన బాధ్యత ఆసిఫ్ జా, అన్వరుద్దీన్ ఖాన్ షహమత్ జంగ్‌కు అప్పగించి గవర్నరుగా చేసెను. ఇతను గోపము (ఖైర్ అబాద్) వాసి. నిజాముల్ ముల్క్ వెంట హైదరాబాదు చేరెను. అన్వరుద్దీన్ ఖాన్ గవర్నర్ అయినందుకు నవాయిత్ వంశ స్థానంలో అన్వరీ (వాలజాహి) వంశం 1744లో చోటు చేసుకుంది. ఆర్కాటు నవాబుల వాలజాహి వంశకాలములో సర్వేపల్లి, ఉదయగిరి, సిద్దోటు నవాయిత్ ఆధీనమందుండెను.

అజీముద్దౌలా : వీరి పెద్ద కుమారుడు మునవ్వర్ ఖాన్. ఇతనికి ఇద్దరు కుమారులు మొహమ్మద్ అలీ వాలజా (వీరి సమాధి తిరుచునాపల్లిలో గలదు). రెండవ కుమారరుడు అబ్దుల్ వహాబ్ ఖాన్. నెల్లూరుతో పాటు ఉదయగిరి వీరి ఆధీనమందుండెను. అజీముద్దౌలా మరణించిన మూడు మాసములకు 1820లో నవాబు మునవ్వర్‌ఖాన్ ఆజంకు తండ్రి పీఠానికి అధిపతిగా కర్నాటక గౌరవ నవాబుగా చేయడమైనది.

11. హజరత్ సయ్యద్ బదరుద్దీన్ అలీఖాన్

సయ్యద్ బదరుద్దీన్ అలీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారికి తండ్రి. వీరి తండ్రి పేరు సయ్యద్ ముస్తఫా అలీ. వీరు ఆనాటి హైదరాబాదు రాజ్యంలోని నక్కళ్ళపల్లె ప్రాంతంలో ఉండేవారు. వీరి వద్ద నక్కళ్ళపల్లె నర్సన్నపంతులు కుమారుడు అక్కన్న పంతులు పారశీ భాష నేర్చుకునే వారు. ప్రాపంచిక విషయాలతో విసుగు చెందిన సయ్యద్ బదరుద్దీన్ అలీ తమ శిష్యుడు అక్కన్న పంతులుతో కలిసి దేశ సంచారముగావిస్తూ చెన్న పట్టణము (చెన్నై) చేరారు. అక్కడ ఒక ప్రయాణికుల వసతి గృహములో బస చేశారు. కొందరి ద్వారా విషయం తెలుసుకొనిన ఆనాటి ఆర్కాటు నవాబు నా పిన్నమ్మ కుమారుడు అలా వసతి గృహములో బస చేయుట భావ్యం కాదని తలచి. వెంటనే అక్కడకు బయలుదేరారు. బదరుద్దీన్ అలీని ఎంతో ప్రేమానురాగాలతో కలుసుకొని మాట్లాడి తమ వెంట మహలుకు తీసుకెళ్లారు. భోజన సమయానికి నా శిష్యుడైన అక్కన్న పంతులు భోజన విషయం ఆలోచించండని మనవి చేశారు. నవాబు తమ దీవాణమును పిలిచి అక్కన్న పంతులు భోజన సదుపాయాలను గురించి ఆజ్ఞాపించారు. ఆజ్ఞానుసారం పంతులు గారి ఆహారము బట్టల పట్ల శ్రద్ధ వహించారు.

బదరుద్దీన్ అలీ గారికి నవాబు దుస్తులు :

నవాబు తలపాగా, కోటు వగైరా తెప్పించి బదరుద్దీన్ గారిని ధరించమని కోరారు. నా శిష్యునికి కూడా తగిన దుస్తులు కావలెనని బదరుద్దీన్ అలీ కోరగా పంతులు గారికి కూడా దుస్తులిచ్చారు. నవాబు వద్ద ఉన్నన్ని రోజులు వీరికి ప్రత్యేక మహలు కేటాయించారు. అందులో ఒక చోట శిష్యునికి పారశీ బోధించుచుండిరి.

బదరుద్దీన్ అలీ గారితో నవాబు నెల్లూరు ప్రాంతానికి బయలుదేరుట :

చెన్న పట్టణమందు సయ్యద్ బదరుద్దీన్‌అలీ, అక్కన పంతులు కొన్ని మాసాలు గడిపారు పిదప ఆర్కాటు నవాబు తన దేశ పర్యటన కోసం కొంత సైన్యంతో నెల్లూరు బయలుదేరడానికి నిర్ణయించారు. వీరిని తమ వెంట రమ్మని కోరారు. బదురుద్దీన్ అలీ ఏనుగు అంబారీపై, అక్కన్న పంతులు గుఱ్ఱంపై బయలుదేరారు. కొన్ని దినాల తరువాత వీరు నెల్లూరు చేరారు.

జూపల్లె లక్ష్మణరావు పై ఫిర్యాదు :

నెల్లూరు చేరిన వీరికి నెల్లూరు ఫౌజుదారు మధ్వపతి పురుషోత్తం పంతులు విందు ఏర్పాటుచేశారు. విందు ఆరగించే సమయాన్ని గమనించి "ప్రభూ! ఉదయగిరి జాగీర్‌దారు జూపల్లె లక్ష్మణరావు రెండేళ్ల నుంచి వాగ్దానం ప్రకారం కప్పం చెల్లించుటలేదు. ఎన్నోసార్లు ఆజ్ఞాపత్రం జారీచేసినా, కనీసం ప్రత్యుత్తరము కూడా పంపుటలేదు. మాతో యుద్ధం చేయు ఉద్దేశంతో ఉన్నాడని తెలియుచున్నది. ఈ విషయంలో ప్రభువు గారి ఇష్టం" అని విన్నవించారు.

యుద్ధ సన్నాహానికై బదరుద్దీన్ అలీకు ఆజ్ఞాపించుట :

ఫిర్యాదు వినిన ఆర్కాటు నవాబు "మీరు నాకు తమ్ముని లాంటి వారు అలాగే వీరులు. నేను నెరవేర్చదలచిన బాధ్యతను మీచే నెరవేర్చదలిచాను" అన్నారు. నవాబు గారి ఉద్దేశాన్ని గ్రహించిన బదరుద్దీన్ అలీ కొంత సైన్యాన్ని తమ వెంటబెట్టుకొని నెల్లూరుకు ఉత్తరాన గల సింగరాయకొండ చేరి, అక్కడి నుంచి జూపల్లె లక్ష్మణరావుపై యుక్తితోటి దండయాత్రగావించారు. అతని శిరస్సు వధించి నెల్లూరులోని నవాబు గారికి సమర్పించారు. ఉదయగిరిని స్వాధీనపరచుకొనిన మీదట సాదతుల్లా ఖాన్ తమ ముద్రతోటి 1719లో ఉదయగిరి జాగీర్‌దారుగా బదరుద్దీన్ అలీఖాన్‌ను నియమించెను. వీరికి ఒక కుమారుడు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఒక కుమార్తె బనిగిమాసాహిబా జన్మించారు. వీరి సమాధి ఉదయగిరి పెద్ద మశీదుకు అనుకొనియున్న మఖ్‌బరాలో తండ్రి సయ్యద్ ముస్తఫా అలీ గారి సమాధి పక్కన గలదు. వీరి శ్రీమతి మరియం సాహిబా తమ 90వ ఏట ఉదయగిరిలో స్వర్గస్తులయ్యారు.

12. హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబె రసూల్

హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబెరసూల్ గారి తండ్రి పేరు హజరత్ ఖ్వాజా ఆలంనక్ష్ బందీ. వీరు తూరాన్ (ఇరాన్) నుంచి భారతదేశానికి వచ్చి కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం (బెళగాం)లో స్థిరపడ్డారు. వారి వివాహం కూడా అక్కడే జరిగింది.

హజరత్ ఖ్వాజా రహమతుల్లా 1105 హిజ్రీ అనగా క్రీ.శ. 1693లో బెల్గాంలో జన్మించారు. కొన్నేళ్లకు తల్లి మరణించగా. తండ్రి మరో వివాహం చేసుకున్నారు. ఖ్వాజా పట్ల సవతి తల్లి ప్రేమ లేకపోయెను. ఇంటిలోని దానిమ్మ చెట్టును తానే

పెరికివేసి ఆ అభాండాన్ని ఖ్వాజాపై వేసెను. ఇలాంటి బాధలెన్నో అనుభవిస్తూ వచ్చిన ఖ్వాజా మనసుపై సవతి తల్లి ఈర్ష చెరగని ముద్ర వేసింది. దు:ఖితులైన ఖ్వాజా తమ తండ్రి అనుమతితో కర్నూలులోని పినతల్లి వద్దకు వెళ్లారు.

బాల్యము :

వీరి బాల్యం నుంచే విలాయత్ (సిద్ధపురుష) లక్షణాలు బహిర్గత మగుచుండెడివి. వీధిలోని పిల్లలు ఇటుకలతో అరుగు చేసి దానిపై వీరిని కూర్చోబెట్టి భక్తితో సలాం చేస్తూ వినయంగా నిలబడేవారు. "వీరు మా ముర్షద్ (ఆధ్యాత్మిక గురువు), వలీ అల్లా (దైవమిత్రులు) అందరు గౌరవమర్యాదలతో చూడండి అనే వారు". దీంతో వీరి మీద బాల్యం నుండే దివ్యకాంతి ప్రజ్వరిల్లు చుండెడిది. తర్వాత కాలంలో అది నూరు శాతం యదార్ధమైంది. వీరు తమ బాల్యములో నెయ్యి నూనెలతో చేసిన ఆహార పదార్థాలను తినకుండా తన భాగాన్ని పేదలకు ధీనులకు దానము చేసేవారు. నూనెలేని రొట్టెను మాత్రం తినేవారు. ఇది మహనీయత లక్షణాలలో ఒకటి.

కర్నూలులో ఉద్యోగం :

కర్నూలు అమీరు వద్ద కొంత కాలం రెండు గుర్రాల సేవ చేసే ఉద్యోగం చేశారు. రెండు గుర్రాల సేవపై వచ్చే జీతంలో ఒక గుర్రపు జీతాన్ని తమ పినతల్లి, సేవకుల ఖర్చులకు కేటాయించేవారు. రెండో గుర్రపు జీతాన్ని దానధర్మాలకు వినియోగించేవారు. అధిక సమయాన్ని దైవ ప్రార్ధనలో గడిపేవారు.

ప్రధమంగా వీరు అనేక మంది మహనీయులతో అవైసి సంబంధాన్ని పెట్టుకొనేవారు. అనగా దూరం నుంచి వారిని ధ్యానిస్తూ అనుగ్రహం పొందేవారు. ఒకసారి గుల్బర్గా వెళ్లి అక్కడ వెలసియున్న హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ గేసుదరాజ్ బందానవాజ్ సమాధి దర్శనంగావించి వారి ఆత్మానుగ్రహం పొందారు.

హజరత్ అలవీబరూం రహ. గారి శిష్యుడగుట :

హజరత్ అలవీబరూం వారి పూర్వీకులు అరేబియా దేశస్థులు. కర్ణాటక

రాష్ట్రంలోని బీజాపూర్‌లో స్థిరపడ్డారు. హజరత్ ఖ్వాజారహమతుల్లా హజరత్ అలవీబరూం గారి చేతిపై బయియత్ (ఆధ్యాత్మిక శిష్యరికం) చేసి ఖాదరియా పరంపరలో ప్రవేశించారు. ఎంతో కాలం గురుసేవలో ఉంటూ సాధన చేస్తూ పరిపూర్ణులయ్యారు. హజరత్ అలవీబరూం గారి సమాధి బీజాపూరులోని లంగర్‌బజారులో ఒక అరుగుపై వెలసి ఉంది.

కర్నూలులో కరువు :

కర్నూలులో మునుపెన్నడు ఎరుగని విధంగా ఒకసారి కరువు ఏర్పడింది. ప్రజలు తల్లడిల్లిపోయారు. ఆనాటి నవాబు ఇబ్రాహింఖాన్ కుమారుడైన ఎఫ్ ఖాన్ వర్షం కోసం ప్రార్థించమని ఎందరో ఫకీర్లు, ఆధ్యాత్మిక గురువులు, దైవభక్తులకు మనవి చేశారు. వారందరు ప్రార్థించినా ఫలితం దక్కలేదు. నవాబు కలత చెంది ఆలోచనలో పడ్డారు. అంతలో ఒక మజ్‌జూబ్ (సమాధి నిష్టుడు) అటు వచ్చి నవాబుకు ఖ్వాజా గారి ఇంటి దారిని చూపెట్టాడు. హజరత్ ఖ్వాజా గారి వివరాలు తెలుసుకొన్న నవాబు ఎంతో భక్తితో వారి సేవలో హాజరయ్యారు. నవాబు అక్కడికి చేరక మునుపే కూర్చుండె పరుపుపై గావుతకియా (పెద్ద దిండు) ఏర్పాటు చేయడమైనది. నవాబు గారికి స్వాగతం పలికి లోనికి తీసుకొనివెళ్లి పరుపుపై కూర్చుండబెట్టి రాక ఉద్దేశం అడిగారు. నవాబు తమ రాకకు కారణం వివరించారు. విషయం తెలుసుకొనిన హజరత్ ఖ్వాజా "ఇన్షా అల్లా బారిష్ అన్ ఖరీబ్ హోగీ" (దేవుడు తలిస్తే తొందరలో వర్షం కురుస్తుంది) అన్నారు. ఎప్పుడని నవాబు ప్రశ్నించగా "దేవుని ఉద్దేశం నేనెరుగలేను" అని ఖ్వాజా జవాబిచ్చారు. నవాబు మరు మాట్లాడక ఇంటికి బయలుదేరారు. అంతలో ఆకాశంపై మేఘాలు కమ్ముకున్నాయి. కొన్ని నిమిషాల్లోనే వర్షం మొదలైంది. దారిలోనే వున్న నవాబుకు బట్టలన్నీ తడిచి మోకాలి లోతు నీళ్లలో వెళ్లవలసి వచ్చింది. వెంటనేఖ్వాజా తమ ఉద్యోగం వదలి కేవలం నూటయాభై రూపాయలు నవాబు నుండి పొంది రెండు గుర్రాలను కొని మిగిలిన పైకం దైవమార్గంలో దానధర్మాలు చేస్తూ మక్కాకు ప్రయాణమయ్యారు.

మదరాసులో హజరత్ సయ్యద్ అహ్మద్ రఫాయిని కలుసుకొనుట:

హజరత్ ఖ్వాజా హజ్ కోసం మక్కా ప్రయాణం చేస్తూ మదరాసులోని మైలాపూరులో గల హజరత్ సయ్యద్ అహ్మద్ రఫాయి గారిని కలుసుకున్నారు. వారి ద్వారా ఆధ్యాత్మిక లాభం పొందదలచారు. కాని "మీ భాగం మక్కాలో గల హజరత్ అష్రఫ్ మక్కీ వారి వద్ద గలదు. వారి ద్వారా ఆ భాగాన్ని పొందవలసి వున్నది" అని వారు వెల్లడించారు.

ప్రయాణములో సత్కారం :

మక్కాకు ప్రయాణం చేస్తున్న ఎందరో ప్రయాణికులు వీరిని ఎంతో భక్తి మర్యాదలతో చూసేవారు. వీరు పడవలో ఏ పట్టణం, ఏ గ్రామం గుండా వెళతారో అక్కడి వారు తమ ఆధ్యాత్మిక శిష్యులు సేవకులు తమను చూసే విధంగా భక్తి మర్యాదలతో చూడసాగారు. వీరు మునుపెన్నడు హజ్‌చేయలేదు. వీరి గురించి ఎవరికిని తెలియదు. అయినా ప్రయాణంలో ఇలా గౌరవింపబడుట దైవకృప, వీరి ప్రవర్తన ప్రభావం.

మదీన మునవ్వరా బయలుదేరుట :

హజరత్ ఖ్వాజా తమ హజ్ పూర్తి అయిన పిమ్మట హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం వారి పవిత్ర దర్బారు దర్శనార్థం మదీన మునవ్వరాకు బయలుదేరారు. ప్రవక్త వారి పవిత్ర పాదపద్మాలు పడిన ఈ నేలపై ఈ గులాం పాదరక్షలతో నడుచుట తగదని భావించి హజరత్ ఖ్వాజా వాటిని వదిలివేశారు. భక్తి భావోద్రేకం అధికమై హృదయం పొంగి దు:ఖంతో, అశ్రునయనాలతో పెదవులపై దరూద్ పఠనం జారీ అయింది. ఆ సమయంలో కలుగు ఆత్మానందానుభూతిని హృదయమున్న వారే నెరుగుదురు.

హజరత్ అష్రఫ్ మక్కీ గారి శిష్యరికం :

మక్కా చేరిన హజరత్ ఖ్వాజా రహమతుల్లా గారు ప్రవక్త హజరత్ మొహమ్మద్

సొల్లెల్లాహు అలైహి వసల్లం వారిని స్వప్నంలలో దర్శించుకున్నారు. 'అష్రఫ్ మక్కీ వద్ద మీ భాగమున్నది' అని ప్రవక్త ఆజ్ఞాపించారు. హజరత్ అష్రఫ్ మక్కీ గారు మక్కాలోని ఆనాటి ఆధ్యాత్మిక గురువులలో ఒకరు. వీరి శిష్యులెందరో ఆత్మానుగ్రహం పొందుచుండిరి. హజరత్ మక్కీ 'బూఖ్ బసీ' అనే పర్వతంపై భగవధ్యానంలో ఉన్నారు. హజరత్ ఖ్వాజా అక్కడికి చేరి కొంత సమయం వేచియుండిరి. అవకాశం పొంది హజరత్ అష్రఫ్ మక్కీ వద్దకు వెళ్లి సలాము చేశారు. "ప్రవక్త గారి ఆజ్ఞానుసారం నేను మీ కోసం నిరీక్షిస్తున్నాను" అని హజరత్ అష్రఫ్‌మక్కీ పలికారు. నమాజు చదివి, దేవునికి కృతజ్ఞతలు తెలుపుకొని ఖ్వాజాకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించి, తమ శిష్యునిగా చేసుకొని గురు స్థానాన్ని కూడా ప్రసాదించారు. ఆధ్యాత్మిక సిద్ధాంతాలను క్షుణ్ణంగా తెలుసుకొని వాటి ఆచరణకై బీజాపూరు నివాసి అయిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ గారితో సంబంధం పెట్టుకోవాలని ఖ్వాజాను అష్రఫ్‌మక్కీ ఆజ్ఞాపించారు.

హజరత్ అష్రఫ్‌మక్కీ రహ. 1149 హిజ్రీ క్రీ.శ.1736 మొహరం నెలలో మక్కాలో స్వర్గస్తులయ్యారు. వారి సమాధి "జన్నతుల్ ముఅలా"లో ఉన్నది.

ఆత్మజ్ఞానంతో సిద్ధి పొందిన ఖ్వాజా కాబెతుల్లా హజ్‌చేసి అక్కడి నుండి మదీనా చేరి హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం వారిని దర్శించి భారత దేశానికి తిరుగు ప్రయాణమయ్యారు.

బాగ్దాదు చేరుకొనుట :

హజరత్ ఖ్వాజా తమ ధ్యేయాన్ని పొందుటకై బాగ్దాదులో వెలసియున్న జగద్గురువు హజరత్ మహబూబె సుబహాని సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జీలాని రహమతుల్లాహి అలై వారి దర్గాలో ఒక రాత్రి అంత నిలబడి ప్రార్థనగావించి తమ ధ్యేయాన్ని పొంది అక్కడి నుండి పయనమయ్యారు.

సంతానం :

హజరత్ ఖ్వాజాకు రెండు వివాహాలు జరిగాయి. మొదటి భార్యకు ఒక కూతురు జన్మించెనని చరిత్ర కథనం.

మహనీయుల్లో రకాలు :

హజరత్ ఖ్వాజా ఉద్దేశంలో మహనీయులు మూడు రకాలు

మొదటి రకం : వీరి స్థానం దేవునికి అంగీకృతమై ఉంటుంది. దానిని వారు కూడా తెలుసుకుంటారు. జనాల్లో వీరు మహనీయులుగా గుర్తింపబడి ప్రసిద్ధి చెందుతారు.

రెండో రకం : వీరి స్థానం దేవునికి అంగీకృతమై యుండి దానిని వారు కూడా నెరిగి ఉంటారు. కాని జనాల్లో ప్రత్యేక గుర్తింపు ఉండదు.

మూడో రకం : వీరి స్థానం దేవునికి అంగీకృతమై ఉంటుంది కాని వారి మహనీయతను వారు గాని జనులుగాని నెరుగరు.

ఖ్వాజా గారి కరామాత్ (మహిమలు) :

హజరత్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ ద్వారా అప్పుడప్పుడు మహిమలు బహిర్గత మగుచుండెడివి. కాని ఖ్వాజా వాటిని బహిరంగ పరచడానికి ఇష్టపడే వారు కాదు.

1. "హజరత్ ఖ్వాజా తమ అరేబియా ప్రయాణమందు వారి సేవకుడైన కబీర్ మొహమ్మద్‌ను వెంట బెట్టుకొని వెళ్లారు. వారు ఈ విధంగా చెప్పారు. మా ప్రయాణం అడవులు, కొండలు, లోయల గుండ సాగేది. ఒక రోజు మేము ఒక అడవిలో బసచేశాము. మూడు నాలుగు దినములు పస్తులుండినందుకు ఆకలి బాధ భరించలేక ఇక నేను పస్తు ఉండలేనని ఖ్వాజాతో అన్నాను. సహనం స్థిరత్వంతో ఉండుము. దేవుడు ఆహారం పంపదలచుచున్నాడని ఖ్వాజా నాకు ధైర్యం చెప్పారు. అయినా నేను సొమ్మసిల్లి స్పృహ తప్పాను. అది రాత్రి ఇషా నమాజు సమయం. నమాజుకై ఖ్వాజా నన్ను లేపారు. కళ్ళు తెరచి చూడగా అది ఒక అడవి. అక్కడ ఒక మసీదుంది. అందులో జనం ఉన్నారు. ఒక పెద్ద పళ్ళె మందు తీపి పదార్థం, రుచిగల భోజనం తెచ్చారు. నాతో పాటు ఇతరులను కూడా భోజనం చేయమని ఖ్వాజా ఆజ్ఞాపించారు. మేమందరం తృప్తిగా భోజనం చేసినా ఇంకా చాలా మిగిలి ఉంది. కోరిక ఉన్నచో రేపు ఉదయం కొరకు ఉంచుకోమని ఖ్వాజా ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞానుసారం

ఆహారం ఉంచుకొని నిద్రలోకి వెళ్లాను. తరువాత లేచి చూడగా అక్కడ మసీదు కాని జనంకాని లేరు. అంతా అదృశ్యం. ఎటు చూసిన అడవే. ఈ సంఘటనతో ఆశ్చర్యచకితుడైన నన్ను ఈ విషయం ఎవ్వరికి చెప్పరాదని ఖ్వాజా ఆజ్ఞాపించారు. "జీవితంలో ఇప్పటి వరకు ఈ విషయాన్ని రహస్యంగా ఉంచిన నేను నా ఈ ఆఖరి ఘడియలో నా వద్ద చేరిన మీ అందరి ముందు దాన్ని వెల్లడించవలసివస్తున్నది" అని కబీర్ మొహమ్మద్ నంద్యాలలో తమ ఆఖరి సమయంలో వారి వద్ద చేరిన వారికి పై విషయాన్ని బహిర్గత పరచారు.

2. హజరత్ ఖ్వాజా అరేబియా నుండి తిరిగి వచ్చిన 30 ఏళ్లకు తొలిసారిగా ఆర్కాటు, తిరుచునాపల్లి జిల్లాలందు గల దైవజ్ఞానులను కలుసుకొనుటకై కాలినడకన బయలుదేరారు. వారి వెంట విశ్వాసపాత్రుడైన గులాంహుసైన్ బాబి అను సేవకుడుండేవాడు. కాబూలు పంత్ నుంచి పీలేరు చేరవలసియున్నదని, అది తమ గమ్యస్థానమని ఖాజా వివరించారు. కొంత దూరం నడిచారో లేదో తహజుద్ నమాజుకు వేళ అయింది. నమాజు తదుపరి తమ వెంట ఉన్న శిష్యులతో ఇచ్చటి నుండి సమూహము ఉదయం నమాజు తరువాత బయలుదేరుతుందని, మీరందరు ఆ సమూహము వెంట రావలెనని, నేను మాత్రము అడవి, కొండల గుండా వెళ్ళెదనని, మిమ్ములను పీలేరు నందు కలుసుకుంటానని ఖాజా ఆజ్ఞాపించారు. కాని సేవకుడైన గులాం హుసైన్‌కు ఖ్వాజా గారి ఎడబాటు సమ్మతము కాలేదు. ఎంతో వేడుకున్న మీదట వారి వెంట వెళ్ళుటకు అవకాశం కలిగింది. ఆ రోజు ఆకాశంపై నల్లని మేఘాలు కమ్ముకున్నాయి. భూమి, చెట్లు, కొండలు కంటికి కానరాలేదు. భక్తి విశ్వాసము గల ఈ సేవకుడు మాత్రము ఖ్వాజాను అనుసరించుచున్నాడు. ఉదయం నమాజు సమయానికి గమ్యాన్ని చేరుకున్నారు. రాజబాట గుండా ప్రయాణం చేసినా ఇంత తొందరగా చేరలేమే! మునుపెన్నడు చూడని, నడవని ఈ మార్గంగుండా ఖ్వాజా ఇంత తొందరగా పీలేరు చేరుకొన్నారనేది సేవకునికి ఆశ్చర్యం కలిగించింది. కాని ఈ జగత్తు దైవ ప్రియుని దృష్టిలో ఆవగింజ సమానమే కదా!

3. హజరత్ క్వాజా కర్నూలు, నంద్యాలలో ఆసీనులగుచున్నప్పుడు రహమత్‌ఖాన్ అను నాందేడ్ నివాసి కోయిలకుంట్ల గ్రామము చేరి ఖ్వాజా సేవలో నౌకరుగా వుంటూ వారి వెంట తిరుగేవాడు. ఒక రోజు ఖ్వాజా ఆర్కాటు బయలుదేరుతుండగా తానూ వెంట వస్తానని వేడుకున్నాడు. "ప్రస్తుతం నీవు ఇక్కడే వుండు. దేవుడు తలిస్తే నిన్ను ఆర్కాటు రప్పించుకోవాలని ఉన్నాను" అని ఖ్వాజా పలికారు. వారు నన్ను అక్కడికి పిలుచుకొనుటకు నేనెవరిని? నేనంతటి వాడనా?" అని రహమత్‌ఖాన్ మనస్సులో అనుకున్నాడు. ఖ్వాజా ఆర్కాటు చేరిన మీదట ఒక రోజు రహమత్ ఖాన్ అన్న ఖ్వాజా సేవలో హాజరయ్యాడు. విషయమేమని అడుగగా తన జేజనాయన పేరు ఇనాయత్‌ఖాన్ ఖర్‌గోష్ అని నాందేడ్ నుంచి వచ్చానని పలికాడు. నీ తమ్ముని పేరు రహమత్ ఖానేనా? అని ఖ్వాజా ప్రశ్నించారు. తమ్ముని పేరు రహమత్‌ఖానేనని, అతడు ఊరు విడిచి వెళ్ళిపోయెనని, తల్లి దు:ఖంతో ఏడ్చి ఏడ్చి కలవరపడుచున్నదని, నేనాతనిని వెదుకుతూ ఉద్యోగాన్ని కూడా వదలి ఎన్నో బాధలు పడుతూ ఇంత వరకు వచ్చానని, అయినా అతనిని పొందలేకపోయానని తన బాధను వెల్లడించాడు. పరిస్థితి గ్రహించిన ఖ్వాజా ఒక నౌకరును కోయిల కుంట్లకు పంపి రహమత్‌ఖాన్‌ను ఆర్కాటుకు పిలువనంపారు.

మనస్సు జాగృతమైన వ్యక్తికి భూత, భవిష్యత్, వర్తమాన కాలాల జ్ఞాన ముంటుందనేది యదార్థం.

4. హజరత్ ఖ్వాజా కడప యందున్నప్పుడు కర్నూలు నిర్వాహకుడు, ఖ్వాజా శిష్యుడైన బహదూర్‌ఖాన్ పుల్‌జరీ మొదటి ఆసిఫ్ జా నిజాముల్ ముల్క్ కుమారుడైన నాసిర్ జంగ్‌ను బందరులో చంపివేశాడు. ఎంతో సంతోషపడుతూ ఈ విషయాన్ని ఒక జాబు ద్వారా ఖ్వాజాకు తెలియపరచాడు. జాబు అందుకొనిన ఖ్వాజా ఆ జాబు వెనుక "నీవు చాలా తప్పు పని చేశావు. రెండు నెలల్లో నీ తల కూడా తీసివేయబడుతుంది" అని రాసి పంపారు. వీరి మాట ప్రకారం రెండు మాసాల్లో హంతకునితో సహా నాసిర్ జంగ్‌ను చంపడంలో ఎందరి హస్తముందో వారందరూ హత్యగావింపబడ్డారు.

హజరత్ ఖ్వాజాతో చర్చించుటకై నవాబు హిదాయత్ మొహియద్దీన్ ముజఫర్ జంగ్ విచ్చేయుట :

రాయచూరు, ఆధోని తదితర జాగీరులకు జాగీరు దారుడు నవాబు మనవడు హిదాయత్ మొహియద్దీన్‌ఖాన్ ముజఫర్ జంగ్ రహ. కు వ్యాకరణ మందు నిఘంటువు యందు ఏదైన విషయాన్ని గురించి చర్చించుటలో మంచి ప్రావీణ్యతగలదు. హజరత్ ఖ్వాజా గారిని దర్శించి వారి కృపకుపాత్రుడు కావాలని వారి చిరకాల కోరిక. ఆనాటి కర్నూలు నవాబైన బహదూర్‌ఖాన్ గారు హిదాయత్ మొహియుద్దీన్‌ను తమ వెంట బెట్టుకొని వెళ్ళి ఖ్వాజా గారికి పరిచయం గావించారు. వారిరువురు ఖ్వాజా ఎదుట ఎంతో భక్తిభావముతో కూర్చుండి కొద్దిసేపటి తరువాత సంభాషణ మొదలుపెట్టారు.

"యాసయ్యుది అయ్ న మకానకుం" అని హిదాయత్ మొహియద్దీన్ అరబీ భాషలో పలికెను. "మాఫీహా మకానవా" అని ఖ్వాజా సమాధానమిచ్చారు. ఈ విధముగా నవాబు అడిగిన ఎన్నో ప్రశ్నలకు ఖ్వాజా సమాధానమిచ్చారు. వాజిబుల్ వజూద్ గుణములు (దేవుని గుణములు) ముమ్ కినుల్ వజూద్ యందు ఉండరాదు. ఈ విషయముపై కూడా ఖ్వాజా తగిన సమాధానమిచ్చారు. చర్చలో "భక్తుడు దేవునికి చాలా చేరువగును. అయినను భక్తుడు దేవుడు కాజాలడు. అదే విధంగా దేవుడు ఏ రూపంలోనైన మానవుడు కాలేడు. దేవుని స్థితిని భక్తుని స్థితిని ఎటువంటి స్పర్ధ లేకుండా అంగీకరించు వాడే పూర్ణ దైవజ్ఞాని. దేవుడు, భక్తుడు రెండు వేర్వేరు అస్థిత్వములుంటే దేవుని స్వభావము (జాత్) బందీ అవుతుంది. దేవుని స్వభావము నిర్ణీతమైనది కాదు.

కాబట్టి అది బందీ (మొఖయ్యద్) కాదు. పోలిక కనబరిస్తే హద్దు అవుతుంది. అనగా నిర్ణీతమవుతుంది. దైవజ్ఞానులు, పూర్ణ పురుషులు ఇలా నిర్ణీతము చేయరు. ఈ మార్గములో నడుచువారే మహనీయులు, మార్గ దర్శకులగుదురు.

"దైవ జ్ఞానపు మార్గ మిదియే".

పై విధంగా ముజఫర్ జంగ్ గారికి ఖ్వాజా సమాధానమిచ్చి తృప్తిపరిచారు.

హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ రహ. కర్ణాటక నవాబు మహమ్మద్ అలీ వాలజా మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో హజరత్ ఖ్వాజా పారశీ భాషలో వ్రాసిన ఉత్తరాల అనువాదము :

14జీ ఖైదా 1190 హిజ్రీ (క్రీ.శ.1778)

1. ఫకీరుల ప్రేమికులు, గౌరవనీయులు, భాగ్యవంతులు! దేవుడు మీకు క్షేమంగా ఉంచుగాక. ఆశీర్వాదముల అనంతరం తెలియజేయునది నేను క్షేమంగా ఉన్నాను. మీ క్షేమములు కోరుచున్నాను. మీ ఉత్తరము మీ పవిత్ర మనస్సుకు పవిత్ర భక్తి భావానికి దర్పణం. కష్టాలు తొలుగుటకై, సమస్యల పరిష్కారానికై, ఆయురారోగ్యాలకై, దేశమందు సుఖశాంతికై, శత్రు అపజయానికై ఆధ్యాత్మికంగా ప్రార్ధించుటకై మీరు కోరారు. ఈ కోరికలన్నింటిని గురించి తెలుసుకోవడమైనది. తప్పక దేవుడు సహాయపడును. పవిత్ర ఆత్మలపై గల భక్తికి బదులుగా వారి సహాయము ప్రజల సహాయ సంక్షేమముకై పాటుపడు వారికి తప్పక లభించును. భగవంతుడు తలచుకొంటే మీ హృదయపు కోరిక తప్పక నెరవేర్చును. నేను కూడా మీ హృదయపు కోరికలు తీరుటకై ప్రార్ధించుచున్నాను. పేదల బలహీనుల, అనాథల బందీల ప్రార్ధన దేవుడు తొందరగా ఆలకించును. ఇది యదార్ధం. కాబట్టి మానవసేవ ద్వార ప్రజల ప్రేమాభిమానములు సంపాదించండి. ఇది అన్ని కష్టాలను తొలగించు తాళపు చెవిలాంటిది. మీరు వ్రాసే ముందే నాచే నూతనంగా నిర్మించబడిన మశీదు "మస్జిద్ ఖబ్ తుల్ ఇస్లాం" ప్రవక్త హుజూర్ సొల్లెల్లాహు అలైహి వసల్లం పై భక్తిభావంతో అహ్మద్‌పూర్‌లో అమలులోకి వచ్చినది. మశీదు యందు "ఖత్మె హజరత్ రసూల్ సొల్లెల్లాహు అలైహి వసల్లం, ఖత్మె గౌసియా, ఖత్మె ఖ్వాజగా "చదువుటకై కొంత మంది పవిత్రులను నిర్ణయించడమైనది.

"తఫ్ సీర్ ఖుర్ఆన్ ఒ హదీస్ విర్ద్ (ఖుర్ఆన్ హదీసు వ్యాఖ్య పఠన) మాసూర దువాయే హసన, హసైన షమాయల్ తిర్మజి పఠణ ఏర్పాటు గావించినాను. వీటిని

మౌల్వీ ఖ్వాజా రహమతుల్లా ఇతర పండితులు ఎక్కువగా కోరారు. మీరు మీ మనస్సును అన్ని విధాల సంతృప్తిగా ఉంచండి. ఎక్కువ ఏమి వ్రాయను.

ఆశీర్వాదములు.

2. ఫకీరుల ప్రేమికులు, గౌరవనీయులు, పుణ్య పురుషులు, కీర్తిమంతులు దేవుడు మీకు క్షేమంగా ఉంచుగాక.

ప్రార్ధనానంతరం తెలియజేయునది నేను క్షేమంగా ఉన్నాను. మీ క్షేమములు కోరుచున్నాను. ఉత్తరముతో పాటు ఒక ముద్దర వేయబడిన ఒక సంచియందు మంచి మనస్సుతో పెట్టి పంపిన ఒక ఉన్ని, ఒక చర్మపు జుబ్బా ఈ వస్తువులన్నియు జీ ఖైదా నెల 24వ తేదీన అందినవి. వీటన్నింటిని మీ భక్తిని చూచి స్వీకరించాను.

దీనికంటే ముందు మీరు కొన్ని విషయాలను గురించి తెలుసుకోగోరారు. వాటికై హుజూర్ సొల్లెల్లాహు అలైహివసల్లం వారిని అనుసరించుట అవసరం. "అతియుల్లాహ వ అతియుర్రసూల" అని ఈ విషయంలో ఆయతు అవతరించినది. రెండవది న్యాయముతో వ్యవహరించాలి. ఫకీరులను, పండితులను పోషించాలి. భగ్న హృదయులను, అనాథలను ధీనులను సంతుష్టపరచాలి. ఖైదీలను విడుదల చేయించాలి. ఎందుకనగా ఈ విషయములో "అహసనా కమా అహసనల్లాహు అలైక" ఆయతు ఆవతరించినది. అనా ఇందల్ మున్ కసరత్ ఖులూబిహుం ప్రకారం భగ్న హృదయుల ప్రార్ధనలో చాలా ప్రభావం ఉంటుంది. దానితో కష్టాలు తీరిపోతాయి. బాహ్య, అంతర, ఆధ్యాత్మిక ప్రాపంచిక బాధలన్ని తొలగిపోతాయి. వీటిని ఆచరించినచో దైవశక్తి మీ కోరికలన్నింటిని తీర్చునని గట్టి నమ్మకముంది. "నీవు దైవాజ్ఞను పాటించక ఉండకుము. ప్రపంచములో ఎవ్వరును నీ ఆజ్ఞను పాటించక ఉండరు" అని షేఖ్ సాది రహ. తెలుపుచున్నారు. పాలకుడు దేవుని ఆజ్ఞను పాటించినంత వరకు దేవుడు కూడా అతని రక్షకునిగా, సహాయకారిగా ఉండును.

ఫరీదుద్దీన్ అహ్మద్‌ఖాన్‌కు నాకు పొరుగుగా ఉన్న పేదలను నేరము పై ఖాన్ గారి సద్దుగుడు. మీ సేవకులు బంధించారని నాకు ఈ మధ్య తెలిసింది. వారు నా మిత్రులు, తప్పు చేయని నిరపరాధులు. మీరు అధిపతులు. అధిపతి ధర్మాత్ముడు,

న్యాయాధిపతి అగును. కాబట్టి "లాతజ్‌రివా" ఆయతు ప్రకారం వారిని విడుదల చేయండి. వారు మహమ్మద్ అస్లంఖాన్‌కు బంధువులు కూడాను. పాత బంధుత్వాన్ని గుర్తిస్తూ కనికరించి వారిని విడుదల చేసిన గొప్ప పుణ్యఫలం లభించును.

3. ఫకీరుల ప్రేమికులు, గౌరవనీయులు! దేవుడు క్షేమముగా ఉంచుగాక

ఆశీర్వాదముల అనంతరము తెలియజేయునది మీ ఉత్తరం అందినది. మీ భక్తి, మొహమ్మద్ ఆసింఖాన్ ఆధ్యాత్మిక ఉన్నత స్థితి తెలిసినది. దేవుడు ప్రతిఫలం ఇచ్చుగాక.

మొహమ్మద్ ఆసింఖాన్ ఉదయగిరి వెళ్ళి అచటి పరిస్థితులు తెలియచేశారు. కొన్ని దినములలో వివరాలు తెలియును. దేవుని దయతో మీరు అన్నియు నెరుగుదురు. హుజూర్ సొల్లెల్లాహు అలైహివసల్లం వారి పవిత్ర ఆత్మ ద్వారా పనిచేయండి. ఆ పనితో దేవుడు అతని ప్రవక్త సంతోషపడవలె. ప్రతి వస్తువుపై దేవుని అధికారం కలదు. దేవుని కృపతో మీ యొక్క ఆధ్యాత్మిక, ప్రాపంచిక కోరికలు తప్పక నెరవేరును. శుభముకై దుస్తు పంపుచున్నాను. ఎక్కువ ఏమి వ్రాయను.

ఆశీర్వాదములు.

4. ఫకీరుల ప్రేమికులు, గౌరవనీయులు దేవుడు క్షేమంగా ఉంచుగాక.

ఆశీర్వాదముల అనంతరం తెలియజేయునది ఇచ్చట అంతా క్షేమమే, మీ క్షేమములు కోరుచున్నాను. ప్రేమ పత్రము అందినది. దానియందు విజయం సాధించిన సైన్యం నెల్లూరు చేరిన విషయమున్నది. సఫర్ నెల 7వ తేది శుక్రవారము ముస్లిముల పండుగ నాడు సైన్యం అచ్చట చేరినది. ఇంతకు ముందు ఖాజా ఆసిం ఖాన్‌చే పంపబడిన ఉత్తరం ద్వారా మీ భక్తి అభిమానము తెలిసినది. వారి మాటల ద్వారా కూడా భక్తి వెల్లడైనది.

ఆసింఖాన్ గారు సఫర్ నెల 6వ తేది గురువారము ఉదయగిరి బయలుదేరారు. ఎక్కువ ఏమి వ్రాయను.

ఆశీర్వాదములు

(సయ్యద్ ఆసింఖాన్ ముబారిజ్ జంగ్ గారు మొహమ్మద్ అలీ వాలజా కాలంలో హైదరాబాదు నుంచి మదరాసు చేరారు. ఉదయగిరిలో వెలసియున్న హజరత్ ఉస్మాన్ సావి జేజనాయన షేక్ మగ్దూం అబ్దుల్ హాఖ్ సావి గారి దర్గా(మద్రాసు) సమీపంలో ఒక ఖాన్ఖా (సూఫీలు ఫకీరులు ఉండు స్థలము) ఏర్పాటుచేశారు)

కవిగా హజరత్ ఖ్వాజా :

ఉర్దూతో పాటు పారశీ భాషలో కూడా ఖ్వాజా కవిత్వం అల్లేవారు. వీరి కలం పేరు రహమతుల్లా. తమ కవిత్వం ద్వారా ఆధ్యాత్మిక బోధనతోపాటు స్త్రీలకు సందేశాన్ని కూడా ఇచ్చేవారు. వీరి రచనలు "చహెల్ మసాయల్", "తంబీ ఉన్నీసా" ప్రసిద్ధి గాంచాయి. చెహల్ చార్ మసాయల్ హజరత్ అలవీబరూమ్ రహ. చేతిపై బయత్ చేసి (శిష్యుడై) కర్నూలులో వ్రాసిన తొలి రచనగా భావింపబడుచున్నది.

ఆనాటి ఉర్దూ భాషలో చహెల్ ఒ చార్ మసాయల్ నుంచి కొన్ని పంక్తులు :

అవ్వల్ ఇస్మే అల్లా: బోలూ షితాబ్ – షురూ మై కరూ ఏక్ సున్హరీ కితాబ్
సునో బాత్ మేరీ సొ దిల్ ఒ జాన్ సూ – లగావో తుంహీ దిల్సొ సుబ్హాన్ సూ
నజవార్ ఉస్కూ హై ఏసబ్ లిఖా – ఓ సాహెబ్ హై బేమిస్ల్ ఓ బే మాకా
ఇల్మ్కే తలబ్ మే రహెూ రోజ్ ఒ షబ్ – తొ పావో మర్తబా నజ్దీకె రబ్
ఖుదాయా బఖష్ సబ్ ముసల్మానకో – కె దునియా సె లే చలే ఈమాన్ తూ
కహె రహమతుల్లా యా రబ్బుర్ రహీం – ముఝే దీన్ పర్ రఖ్ సదా ముస్తఖీం

అర్థం : ప్రథమంగా దేవుని స్తుతిస్తూ నేనొక బంగారంలాంటి పుస్తకాన్ని ఆరంభిస్తున్నాను.

నా మాటను మనసుపెట్టి వినాలి. భగవంతునిపై మనసు పెట్టాలి. ఈ రాత లన్నింటికి అర్హుడు ఆ భగవంతుడే. అతనికి సాటిలేరు. అతడు నిర్ణీత స్థానంలేని సర్వాంతర్యామి. రేయి పవలు జ్ఞాన సముపార్జనలో గడిపినచో దేవుని వద్ద ఉన్నతు లవుతాం. ఓ భగవంతుడా! ముస్లింను క్షమించు. ఇహలోకంలో విశ్వాసవంతునిగా

చేసి పరలోకానికి తీసుకొని పొమ్ము ఓ దయామయుడా! పాలించువాడా రహమతుల్లాను కలకాలం ఇస్లాం మార్గంలో స్థిరంగా ఉంచు.

హజరత్ ఖ్వాజా గారి పారశీ భాషలో వేదాంత కవిత :

అజ్ దరూన్ ఖుద్ షనాస్ ఒ కార్‌బా గుఫ్తార్ నీస్త్ – బాదిలే వహదత్ నజర్‌కున్ యార్ బసే అగ్‌యార్ నీస్త్ బర్ జమాలీ దర్ కమాలీ తాలిబే దీదార్ బాష్ – గర్‌షనాసీ ఆన్ జమాలత్ కార్‌బా ఇన్‌కార్ నీస్త్

రహమతుల్లా హఖ్ బజూయిూ అజ్‌ఖుదీ ఖుద్ దూర్ కున్–ఖుద్ నబాషీ హఖ్ నుమాయద్ హుజ్జత్ ఓ తక్రార్ నీస్త్

అర్థం : నీ అంత:కరణాన్ని గురించి తెలుసుకో. ఇక మాటలు మానుకో. ఏకత్వపు దృష్టితో చూడు. ద్వైతాన్ని మనసు నుండి తొలగించు. భగవంతుని అన్వేషణలో ఉండు. అహాన్ని వీడు. రహమతుల్లా!

నీవు లేకున్నా సృష్టికర్త ఉండును. స్త్రీలను చక్కబెట్టుటకు ఇస్లాంలో లేని ఆచారాలను తొలగించు ఉద్దేశంతో ఈ సంపుటం వ్రాయబడింది. దీని పఠనంతో పాఠకులకు ప్రకాశవంతమైన అంతర్యంగల ఒక పరిపూర్ణ గురువు జనంతో అభిముఖుడైనట్లు అనుభూతి కలుగుతుంది. ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త డా.సయ్యద్ మొహియుద్దీన్ ఖాదరీ జోర్ తంబివున్నిసా అంశాన్ని గురించి ఇలా వ్రాస్తున్నారు.

"ఈ అంశపు ముఖ్య ఉద్దేశం స్త్రీలను చక్కబరుచుట. సామాజిక మత విషయాలలలోని దురలవాట్లను తీవ్రమైన పదజాలంతో తేటతెల్లబరచెను. మానవ ఇంద్రియ కాలపు అపవిత్రత, చెడ్డ నడవడిక దురలవాట్లను హజరత్ ఖ్వాజా వివరంగా బహిర్గతపరిచారు.

ఖసీదగౌసియా :

చెహల్ ఒ చార్‌మసాయిల్ ఖసీదా గౌసియ అనువాదం హైదరాబాదులోని ఇదారఏ అదబియాతె ఉర్దూ, సాలార్‌జంగ్ మ్యూజియం, అంజుమన్ తరక్కి ఉర్దూ (హింద్) ఢిల్లీ, పాకిస్తాన్ గ్రంథాలయాలందు గలదు.

తంబీ ఉన్నిసా నుండి కొన్ని పంక్తులు :

హంద్ బేహద్ హై ఉసీ సుబ్‌హాన్‌కూ – జో కియా పైదా జిస్మొ జాన్‌కు

దో జహా క ఖాలిఖ్ ఔర్ దాయం హై ఓ – సబ్‌ఫనా ఆఖిర్ కెత్రై ఖాయం హై ఓ

సున్ సుహాగన్ పంద్ హాఖ్ దిల్ జాన్ సే – మై కహూ అహదీస్ ఔర్ ఖుర్ ఆన్ సే

సున్ సుహాగన్ బాత్ మేరీ కర్ ఖుబూల్ – మై కహూ ఫర్ మాయె సో హజరత్ రసూల్

సున్ సుహాగన్ యాద్‌రఖ్ బాతా తమాం – పఢ్ దరూదా ఛోడ్ దే గీతా హరాం

హం దిఖానా రాహ్ దర్‌కార్ హై – కోయిచలో కోయీ నా చలో ముఖ్తార్ హై

గర్ చలో గేతో ఖుదా దేవే జజా – నా చలో గేతో యఖీనన్ పావే సజా

అర్థం : హజరత్ ఖ్వాజా రహమతుల్లా తమ రచన తంబీ ఉన్నీసాలో ప్రథమంగా దేవుని కొనియాడుతూ స్త్రీలను ముత్తయిదూ అని సంబోధిస్తూ ఉపదేశించుచున్నారు.

శరీరాన్ని సృష్టించి ప్రాణము పోసిన ఆ దేవుడే హద్దులేని పొగడ్తకు అర్హుడు. అతడు ఇహపరలోకాల సృష్టికర్త. సదా ఉండువాడు. సర్వం నాశనమైనను మిగిలేవాడతడే.

ముత్తయిదూ! ఈ ఖురాను, హదీసు మాటలను మనసు పెట్టి వినుము. నేను చెప్పే హజరత్ రసూలుల్లా సొలెల్లాహు అలైహివసల్లాం వారి ప్రవచనలను అంగీకరించుము. నా మాటలను గుర్తించుకొనుము. నిషేధపు గీతాలను వీడి దరూద్‌లను పఠించుము. ఇబ్లీషు (సైతాను) మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా, పవిత్రంగా ఉండుము. సన్మార్గంపై నడచినచో దేవుడు తప్పక ఫలితమిచ్చును. నడవక పోతిరా శిక్ష అనుభవించక తప్పదు.

హజరత్ ఖ్వాజా గారి అద్వైతాన్ని బోధించు సూఫీ తత్వపు కవితా పంక్తి :

ఏక్ హై ఔర్ నై షరీక్ దోజాన్ ఉసే–గైర్ ఉస్కె నై సమఝ్ పూజా కిసే

అర్థం : అతడొక్కడేనని, ద్వైతమనేదే లేదని, నీవెవ్వరిని ప్రార్థించుచున్నావో అతను తప్ప వేరే వాడనేదే లేదని భావించుము.

హాజరత్ ఖ్వాజా రహమతుల్లా తమ రచనలను చదివిన వారితో తమ గురించి ప్రార్థించమని కోరుట.

నుస్ఖయొ పఢకర్ దువా కర్నా ముఝే

సూరయే అల్ హంద్ బా యిఖ్ లాస్ సే

అర్థం : హాజరత్ ఖ్వాజా రహమతుల్లా తమ రచనలను చదివిన వారితో ఇలా అనుచున్నారు.

"నా రచనను చదివి నా కొరకు సూరయే ఫాతెహా (అల్హంద్) ఇఖ్లాస్తో దువా చేయండి".

ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లంతో హజరత్ ఖ్వాజా ప్రార్థించుట :

చెష్మె రహమత్ బికుషా సూయె ఆఫత్ జద్గా రహిమేకున్

జియాబె రహమత్ బిదిల్ సూఖ్తగాన్ రహిమెకున్

జానం అజ్ తిష్నలబీ సూఖ్తచేతద్బీరె కునం

యా మొహమ్మద్ బాహఖే తిష్నాలబా రహిమేకున్

సయ్యదా బర్ దరెతూ ఆమద్ అం దస్తెబగీర్ దస్తగిరి కున్

వాయె జానె జహా రహిమేకున్

కారెమా జురం ఒ ఖతాకారె తూ వాఫవస్త్ ఓ అతా

బాత ఫజ్జల్ బాగరీ బానె జహా రహిమేకున్

రహమతుల్లాకె తలబ్గారె ఇనాయత్ తూహస్త్

వఖ్త్ మెహరస్త్ బియాఖస్త దివా రహిమేకున్

అర్థం : ఆపదలందు గల వారిని కరుణతో చూడండి. దహన హృదయులకు కరుణ జలాన్నిచ్చి కనికరించండి. దాహమధికమై ఆపదలో ఉన్నాను. ప్రయత్నం ఏమి చేయజాలను. హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం! దప్పికగన్న వారిని కనికరించండి. నా స్వామి! మీ ద్వారముకడ వచ్చితిని. నన్ను ఆదుకొనవలె. ఓ

ప్రపంచ ప్రాణమా! దయచేయండి కనికరించండి. నేరము చేయుట మా పని క్షమించుట ప్రసాదించుట మీ పని. మీ అనుగ్రహంతో పేదలను కనికరించండి. రహమతుల్లా మీ అనుగ్రహాన్ని కోరుచున్నాడు. ఇది ఆదుకొను సమయం. దు:ఖితులను కనికరించండి.

హజరత్ ఖ్వాజా సన్నిధిలో ప్రముఖులు :

శక్తి సామర్థ్యములు, గౌరవ మర్యాదలు, గొప్ప అంతస్తు వైభవములు, పాండిత్య మందు ప్రావీణ్యత గల వారు ఖ్వాజాకు శిష్యులుగా ఉండిరి. ఆ ప్రముఖ వ్యక్తులలో కర్ణాటక నవాబు శ్రీ మహమ్మద్ అలీఖాన్ వాలజా, కడప నవాబులు అబ్దుల్ హలీంఖాన్, అబ్దుల్ హమీద్‌ఖాన్ (వీరి సమాధులు కర్నూలు ఉస్మానియా కాలేజి ప్రక్కన గల గుమ్మట మందు గలవు) అబ్దుల్ మజీద్‌ఖాన్, గంజికోట అధిపతి అబ్దుల్ సయిాద్‌ఖాన్, కర్నూలు నవాబు మనవ్వర్ ఖాన్, ఉదయగిరి ఖిల్లాదార్లు (కోటాధిపతులు) సయ్యద్ బదరుద్దీన్ అలీఖాన్ (సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారి తండ్రి), సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్, అఫజలుద్దీన్ మహమ్మద్‌ఖాన్ మద్రాసు, కర్నూలు నవాబు బహదూర్‌ఖాన్, నాసిర్‌జంగ్ హిమ్మత్ యార్‌ఖాన్, ఢిల్లీ చక్రవర్తి అహ్మద్‌షా అబ్దాలీ, షా అబ్దుల్లానక్ష్‌బందీ రహ. మొదలగు వారందరు. హజరత్ ఖ్వాజా గారి కరుణ కటాక్షపు కిరణాలతో లాభం పొందారు.

సయ్యద్ షా అబుల్ హసన్ ఖుర్‌బీ, సయ్యద్ కమాలుద్దీన్ కమాల్ లాంటి సూఫీలు దూరప్రాంతాల నుండి వీరి సన్నిధి చేరి వీరి వేదాంతబోధతో లాభం పొందేవారు.

హజరత్ ఖ్వాజా గారి సద్గుణాలు :

పరోక్షనింద : హజరత్ ఖ్వాజా పరోక్షంగా ఎవ్వరిని నిందించే వారు కాదు. అల్లర్లు, జగడములు, హింస, దౌర్జన్యములు సృష్టించే వారు కాదు. పరులను కూడా క్షమించి వారి తప్పులను దాచేవారు.

ఆహారపు అలవాట్లు : వీరి భోజన సమయం నిర్ణీతమైనది కాదు. వీరు ప్రత్యేకమైన వంటకాలు కోరేవారు కాదు. ఎండిన రొట్టె తినేవారు. శారీరక ఇంద్రియాను భూతులపై

వీరికి బాల్యం నుండియే అదుపు ఉండెడిది.

విందులలో పాల్గొనేవారు : ఆహ్వానిస్తే ఖ్వాజా విందులలో పాల్గొనేవారు. ప్రత్యేక స్థానాన్ని కోరక బంతిలో అందరి తోటి కూర్చొని ప్రవక్త గారి పద్ధతులను అనుసరించేవారు.

శుక్రవారపు అలవాటు : శుక్రవారము నాడు నమాజు తదుపరి "ఖత్మె ఖాదరియా ఒనక్ష్ బందియా" పూర్తి చేసి ఫాతిహా చదివేవారు. ఆ సమయంలో వారి యందు ఒక మార్పు కలిగి తమ ఆధీనమందుండేవారు కాదు.

హజరత్ మఖ్దూం సావి రహ. గారి దృష్టిలో హజరత్ ఖ్వాజా గారి స్థానము :

1. కర్ణాటక ప్రముఖ మహనీయులలో ఒకరైన షేక్ మఖ్దూం సావి మైలాపూరి వారు హజరత్ ఖ్వాజా రహమతుల్లా నాయబ్‌రసూల్ గారితో ఎక్కువగా కడప ప్రాంతంలో కలుసుకొనేవారు. వారు అరేబియా, ఆసియా ఇతర పశ్చిమ దేశాల పర్యటనగావించి ప్రముఖ మహనీయుల సాంగత్యంలో జ్ఞానపరంగా అనుభవాలను గడించారు. అయినను వారి జీవితమందు హజరత్ ఖ్వాజా లాంటి గురుత్వము, మర్యాద, యోగ్యతగల వ్యక్తి కానరాలేదు. వీరి సాంగత్యంలో ఉన్నంతసేపు నా జేజనాయనకు వారి ఆధ్యాత్మిక గురు సేవలో ఉన్నట్లు అనుభూతి కలిగేది. ఈ విషయము నా ఆధ్యాత్మిక గురువు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ చెప్పేవారు" అని ఉదయగిరి యందు వెలసియున్న హజరత్ ఉస్మాన్ సావి (ఉస్మాన్ సా హజరత్) గారు చెప్పేవారు.

ఉదయగిరి జాగీరుదారు నుండి హజరత్ ఖ్వాజా గ్రామములను కొనుట :

హజరత్ ఖ్వాజా గారి మహత్యములను గురించి విన్న ఉదయగిరి కోటాధిపతులు సయ్యద్ బదరుద్దీన్ అలీ వారి కుమారులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ గారి ఆహ్వానంపై ఖ్వాజా విచ్చేసి అనుమసముద్రము పేటలో స్థిరపడ్డారు. సయ్యద్

బదరుద్దీన్ అలీ, సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ గార్ల నుండి అనాసముద్రం పేటను కొనిరి. 1748లో సయ్యద్ బదరుద్దీన్ అలీ తమ స్వహస్తాలతో విక్రయపత్రం వ్రాసి రాజముద్ర వేసిరి.

ఒక గ్రామాన్ని హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లంకు అంకితంగావించుట :

హజరత్ ఖ్వాజా ఒక గ్రామాన్ని "అహ్మద్ పూర్" అని నామకరణం చేసి ప్రవక్త గారికి అంకితంగావించారు. ఆ గ్రామ రాబడి నుండి ఒక పైసా కూడా తాము ఖర్చు చేసే వారు కాదు. పైకమంతయు మదీన మునవ్వరాకు పంపించే వారు. కనీసం ఆ గ్రామ నీటిని కూడా వాడేవారు కాదు. అచ్చటకు పోవునప్పుడు రహమతాబాదు నీటిని మాత్రమే తమ వెంట తీసుకొనిపోయేవారు.

అల్వీపూర్ : తమ ఆధ్యాత్మిక గురువు (ముర్షద్) షేక్ అల్వీబరూం పేరిట ఒక గ్రామాన్ని "అల్వీపూర్" అని నామకరణం గావించారు. ప్రస్తుతం ఆ గ్రామాన్ని జువ్వల గుంటపల్లి అంటారు.

మశీదు నిర్మించుట :

హజరత్ ఖ్వాజా ప్రవక్త వారి ప్రేమ సాగరమందు మునిగి యుండిరి. తమ హృదయము, ప్రాణము హజరత్ మొహమ్మద్ మస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లం కొరకు త్యాగం గావించారు. తమ ప్రతి వస్తువు ప్రవక్త గారి పేరుపై వదిలి వారి మార్గంలో దానం చేశారు. వీరు 1176 హిజ్రీ అనగా క్రీ.శ. 1762లో నిర్మించిన మశీదుకు "మస్జిదున్నబీ" (ప్రవక్త మశీదు) అని నామకరణం గావించి మసీదు పై అలా వ్రాయించుట అది ప్రవక్త గారిపై గల ప్రేమ ప్రభావమే.

మశీదు నిర్మించబడిన తేదిని పారశీ కవితలో తెలుపుట :

బహర్ కస్ రా తుయీా ఉమ్మీదె రహమత్:. జ తొగ్రా సిక్క జద్ మన్ రహమతుల్లా

కె హాతిఫ్ గుఫ్త్ దర్ తారీఖే మస్జిద్:. నమూదంద్ మస్జిదే అక్సా రహమతుల్లా

అర్ధము : ప్రతి మనిషికై దయా కరుణ ఆశ నీవే. నీ దయ కరుణ నాణెమును నేను (రహమతుల్లా) చలాయించుచున్నాను. నీ దైవత్వమే స్థిరమైనది శాశ్వతమైనది. అవసరాన్ని తీర్చగలవాడవు నీవే. దైవవాణి మశీదు పునాది తిథిని "ఈ మశీదు అక్సా మశీదు వలె వున్నది" అని పలికెను.

జాన్ ఏ.సి. బాస్వెల్ నెల్లూరు మాన్యుయల్‌లో ఈ మశీదుపై 5 మీనార్లు, 7 బంగారు కిరీటములు మధ్య మీనారుపై బంగారు చంద్ర వంక అమర్చబడినదని. తరువాత బంగారు కిరీటము, నెలవంక, తీసివేయబడి నెలవంక హజరత్ వారి పవిత్ర సమాధి గుమ్మటముపై అమర్చబడియున్నదని వ్రాసెను.

హజరత్ ఖ్వాజా రహమతుల్లా - షరియత్ నిబంధన :

హజరత్ ఖ్వాజా గారి వ్యక్తిత్వం ఇస్లాం మత సిద్ధాంతాలపై అనగా షరియత్ నిబంధనపై ఉండెడిది. వీరు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం వారి ఆజ్ఞానుసారం నడుచుకొనుచుండిరి. ఆచరణలో కొద్దిపాటి లోటును కూడా రానీయలేదు. పేరు ప్రతిష్ఠలు తమ గొప్పదనం చాటుకొనుటకై అతి ఖర్చు చేయు వారి గురించి అసహ్యించుకొనేవారు. ప్రార్ధన, పరిత్యాగములో వీరికి వీరే సాటి. వీరి వ్యక్తిత్వ గుణగణాల ప్రభావం వీరి గుర్రాలపై గూడా పడినది. ఇతర గుర్రాల గడ్డిని తాము తినుట తప్పని వీరి గుర్రాలు భావించెడివి.

నాయబె రసూల్ అనబడుటకు కారణములు :

హజరత్ ఖ్వాజా ప్రవక్త వారు చూపిన మార్గములో తు:చ తప్పకుండా నడిచేవారు. లేచుటలో, కూర్చొనుటలో, నడుచుటలో, తిరుగుటలో, తినుటలో, త్రాగుటలో, మాట్లాడుటలో ప్రార్ధన, సాధన తదితర విషయాలందు వీరు ప్రవక్త గారిని అనుకరించేవారు. నూటికి నూరు శాతం షరియత్ సిద్ధాంతాలపై నడిచే వారు. అందువలన వీరు "నాయబే రసూల్" అనబడిరి.

షరియత్ సిద్ధాంతాలపై నడుచుచున్నప్పుడు అడ్డు వచ్చే శారీరక, మానసిక ఇంద్రియ కాలములను వీరు దగ్గరకు రానిచ్చేవారు కాదు.

ప్రపంచ ప్రఖ్యాత మహనీయులు మౌలానా జలాలుద్దీన్ రూమీ చెప్పినటుల "మానవునిపై కామ, క్రోధ ఇంద్రియ కాలములు ఒత్తిడి చేయునప్పుడు కామము, కోపము అధికమగును. మనిషి వీటికి బానిసై వీధులెంబడి తిరుగును. ఈమాన్ (విశ్వాసము)ను చెడగొట్టుటలో "కోపము" పాత్ర అధికంగా ఉండును. పరువు మర్యాదలను మంటగలుపుటలో "కామము" హస్తముంటుంది".

మక్కా నుండి తెచ్చిన "మేరాజ్" పుస్తకాన్ని అనువందించుటకై హజరత్ షాకమాల్‌కు ఇచ్చుట:

హజరత్ ఖ్వాజా కడప యందున్నపుడు హజరత్ సయ్యద్ జలాలుద్దీన్ మఖ్‌దూమ్ జహా నియా జహా గష్త్ రహ. వంశానికి చెందిన మఖ్ జనుల్ ఇర్ఫాన్ రచయిత, టిప్పు సుల్తాన్ ద్వారా "జామదక్కన్" అని బిరుదాంకితం గావింపబడిన చిత్తూరు జిల్లా గుర్రం కొండలో వెలసియున్న ప్రఖ్యాత సూఫీ కవి హజరత్ సయ్యద్ షా కమాలుల్లా హుసైని బుఖారి గారికి ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లంకు కలిగిన "మేరాజ్" గురించి అరబీ భాషలో వ్రాయబడిన ఒక పుస్తకాన్ని మక్కా నుండి తెచ్చి ఇచ్చారు. దానిని ఉర్దూ భాషలో అనువదించినచో మేరాజ్ మహాత్యమును గురించి తెలుసుకొన్న వారి విశ్వాసంలో తాజాదనం యేర్పడునని కోరారు. హజరత్ ఖ్వాజా గారి కోరికపై హజరత్ షా కమాలుల్లా అరబ్బీ పుస్తకాన్ని 1191 హిజ్రి అనగా క్రీ.శ. 1776లో ఉర్దూ పద్యరూపంలో అనువదించి. "మేరాజ్ నామా కమాలుల్లా బర్ ఫర్ మాయిష్ ఖ్వాజా రహమతుల్లా" అని నామకరణం గావించారు. హజరత్ షా కమాల్ గారి మనవడు హజరత్ సయ్యద్ అలీ మురాద్‌షా హుసైని బుఖారి రహ. దానిని 1307 హిజ్రి అనగా క్రీ.శ. 1889లో మద్రాసులో ముద్రించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు వాసి ఫఖైర్ సయ్యద్ యూసుఫ్ హుసైని నూరుల్ ఖాదరి గారు దానిని ఉర్దూ గద్య రూపములో వ్రాసి "హఖీఖతే మేరాజ్" అని నామకరణంతో ముద్రించారు.

వేదాంత జ్ఞానం : హజరత్ ఖ్వాజా రహమతుల్లా గారికి తసవ్వుఫ్ (వేదాంతం)

గురించి ఎంత జ్ఞాన ముండినదంటే వీరి ముందు కూర్చొని విన్న వారికి ఖ్వాజా గారు వేదాంత ప్రవీణులు అను అనుభూతి కలుగక తప్పదు. ఇస్లాం మత సిద్ధాంతాలపై నడుచుటయే జీవిత ధ్యేయంగా వీరు భావించారు.

దేవుని నెరిగిన జ్ఞానికి దైవ సామీప్యత, దైవ ప్రేమ లభించి పరిపూర్ణ జ్ఞాని అగును. అంతర్ జ్ఞానము (ఇల్మె బాతిన్) గల వానికి బాహ్య జ్ఞానము (ఇల్మె జాహిర్) కష్టతరమైనది కాదు. కాబట్టి హజరత్ ఖ్వాజా పుస్తకాలు చదవకనె ప్రతి ప్రశ్నకు, ప్రతి విషయానికి సరియగు సమాధానం ఇచ్చెడి వారు.

అస్థిత్వపు ఏకత్వం (వహదతుల్ వజూద్) : మానవుడు ఏకత్వాన్ని తెలుసుకొనుట ఈ క్రింది ఐదు విషయాలపై ఆధారపడి వున్నది. ఖ్వాజా గారికి వాటిని గురించి సంపూర్ణ జ్ఞానముండెడిది.

1) వహదతుల్ వజూద్ (అస్థిత్వపు ఏకత్వము)

2) మాయియత్ (వెంట, తోడు)

3) ఇందిరాజ్ (ప్రవేశము)

4) తజద్దిద్ ఇంసాల్వ్ (క్రొత్త ఉదాహరణములు)

5) జబ్ రొ ఇఖ్తియార్ (కృషి, అదృష్టము)

ఏకత్వము విద్యయందుపై విషయాలను గురించి తెలుసుకొనుట కేవలం అవసరమే కాదు మానవుని కర్తవ్యం కూడాను.

ఈ క్రింది విషయాలు వహదతుల్ వజూద్ శాఖకు చెందినవి :

1) షరియత్ (బాహ్య విద్య) యందు దో మాబూద్ (ఇద్దరు పూజితులు) అనుట మత బాహ్యత్వం అనగా కుఫర్ అగును. 2) హఖీఖత్ (అంతర్ విద్య) యందు దో మౌజూద్ (ఇద్దరున్నారనుట) మత బాహ్యత్వం అగును.

హజరత్ ఖ్వాజాపై విషయాలను అనుభూతితో ఉదాహరణములతో కనుగొని వాటిని గురించి తమ శిష్యులకు క్షుణ్ణంగా తెలియచేశారు. వీటిని తెలుసుకొన్న వారు ఏకత్వాన్ని గురించి తెలుసుకొనిన వారగుదురు.

దేవుని ఏకత్వాన్ని గురించి పారశీ భాషలో మానవునికి బోధించుట :

అజ్ దరూన్ ఖుద్‌షనాజ్ ఒ కార్‌బా గుఫ్‌తార్ నీస్త్
బాదిలే వహదత్ నజర్ కున్ యార్ బసే అగ్‌యార్ నీస్త్
బర్ జమాలి దర్ కమాలి తాలిబే దీదార్ బాష్
గర్ షనాసి ఆన్ జమాలత్ కార్‌బా ఇన్‌కార్ నీస్త్
రహమతుల్లా హాఖ్ బజూయీ ఆజ్ ఖుదీ ఖుద్ దూర్‌కున్
ఖుద్ నబాషి హాఖ్ నుమాయద్ హుజ్జత్ ఒ తకరార్ నీస్త్

అర్థము : నిన్ను నీవు తెలుసుకొనుము. నీ ఆత్మను కనుగొనుము. సంభాషించడం బహిర్గతపరచడం అనవసరం. దేవుని ఏకత్వంపై విశ్వాసముంచి నీ అంతరంగముపై దృష్టి నుంచుము. నీవు నీ ప్రియుని అద్వితీయునిగా సర్వాంతర్యామిగా పొందెదవు. అతని సౌందర్యాన్ని ప్రేమతో జ్ఞానంతో పొందు ఆశతో ఉండుము. నీవు అతని సౌందర్యాన్ని నెరిగిన ఇక అతనిని నిరాకరించు అవకాశమే లేదు. దేవుని సామీప్యత, ప్రేమాన్వేషణలో మనిషికి తన అస్థిత్వము గుర్తుకురాదు. సత్యమనునది బహిర్గతమగు శక్తిని కలిగి ఉంటుంది. దీనికి ఎటువంటి తర్కము, వాదము, ప్రమాణము అవసరం లేదు.

పుస్తక జ్ఞానాన్ని బోధించిన గురువు ఖ్వాజా గారి శిష్యునిగా మారుట :

హాజరత్ ఖ్వాజా తమ జీవనోపాధికై కర్నూలు యందున్నప్పుడు ప్రముఖ పారశీకవి, తాత్వికుడు హాజరత్ అబ్దుర్ రహమాన్ జామి రహ. రచించిన తత్వ గ్రంథం "కితాబుల్ వాహే" యొక్క విషయ జ్ఞానాన్ని హాజరత్ సయ్యద్ ఉమర్ సాహెబ్ రహ. వారి ద్వారా ఖ్వాజా తెలుసుకొనేవారు. వీరితో పాటు అనేకులు లాభాన్ని పొందారు. ఖ్వాజా గారి ముర్షద్ (గురు వర్యులు) హాజరత్ అష్రఫ్ మక్కీ

గారి దృష్టి ఏనాడు ఖ్వాజాపై పడెనో ఆనాటి నుండి హజరత్ ఖ్వాజా పరిపూర్ణ జ్ఞానిగా మారిపోయెను. చివరికి పరిస్థితి ఎలా మారినదంటే పుస్తక జ్ఞానాన్ని బోధించిన సయ్యద్ ఉమర్ సాహెబ్ ఖ్వాజా గారి శిష్యుడై వారి ద్వారా పుస్తక జ్ఞానాన్ని పొంద సాగిరి.

జిక్రో అజ్‌కార్ (స్తోత్రములు) : దైవ మార్గమున తమ గమ్య స్థానాన్ని తొందరగా చేరగోరు బాటసారులు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వ సల్లంపై అత్యధికంగా దరూద్ సలాం చదువుదురని హజరత్ ఖ్వాజా అనే వారు.

హజరత్ ఖ్వాజా రహమతుల్లా నాయబె రసూల్ పరమపదించుట :

ఆధ్యాత్మిక, ప్రాపంచిక విషయాలందు ప్రముఖ స్థానాన్ని వహించి ఎందరికో తమ కరుణ కటాక్షాన్ని ప్రసాదించిన ఖ్వాజా తమ 90వ ఏట చెవి క్రింది భాగములో చంపపై వ్రణము ఏర్పడి వ్యాధిగ్రస్తులాయిరి. 1195 హిజ్రి. రబియుల్ అవ్వల్ మాసము 26వ తేది అనగా 1781 సం. మార్చి నెల 22వ తేది శుక్రవారము సాయంత్రం నమాజు తదుపరి శిష్యులైన ఉదయగిరి జాగీర్దారు సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సాహబ్ ఖాదరి వారి అతిధ్యములో ఉండి ఉదయగిరి కొండపై పరమపదించారు. అర్ధరాత్రి దాటి స్నానం చేయించుచుండగా హృదయమందు జికిర్ (భగవత్ స్తోత్రము) చేయు శబ్ధం, గుండె కొట్టుకొనుట అచ్చట హాజరైనవారందరు గమనించారు. రాత్రికి రాత్రియే హజరత్ ఖ్వాజాను సేవకులు 30 మైళ్ళకు పైబడి దూరమున్న రహమత్ ఆబాదుకు తీసుకొని వచ్చి మరుసటి రోజు వీరు నిర్మించి యుండిన మశీదు ఆవరణములో సమాధిగావించారు.

హజరత్ ఖ్వాజా గారి పీఠానికి అధిపతి :

తమ తదుపరి తమ పీఠానికి ఒక అధిపతిని నిర్ణయించమని కొందరు ఖ్వాజా గారికి మనవి చేయగా “అవసరం లేదు” అని జవాబిచ్చారు. అయినను వారి

తదుపరి దొరసానమ్మ కోరిక మేరకు వారి ఖలీఫా రఫీయుద్దీన్ ఖందహారి సమస్యను చక్కగా పరిష్కరించారు. "మాకు సంతానం లేనందున నేను మిమ్ములను అర్హులని భావించుచున్నాను. మీరు శ్రీవారి పీఠముపై కూర్చొని ఇచ్చటి నిర్వహణ బాధ్యతలన్ని నెరవేర్చాలి. లేనిచో వచ్చే భక్తులు నిరాశతో వెనుదిరిగెదరు" అని దొరసానమ్మ వెల్లడించగా "నేను ఖ్వాజా గారి గులామును. వారి పీఠముపై కూర్చొనె సాహసం చేయలేను. వారి బంధువులలో గాని మీ బంధువులలో గాని ఎవరిని మీరు అర్హులుగా భావించెదరో వారిని ప్రతిపాదించండి. నే నిచ్చట ఉండి సేవచేస్తూ స్వామి వారి ఉపదేశాలను పీఠాధిపతికి వివరిస్తుంటాను" అని రఫియుద్ధిన్ ఖందహారి మనవి చేసుకొనెను. వారి మాటను అంగీకరించిన దొరసానమ్మ తమ సోదరుడు అక్బర్ గారి కుమారుడు హజరత్ మౌల్వీ గులాం నక్ష్బంద్ గారిని పీఠాధిపతిగా నిర్ణయించెను. రఫియుద్ధిన్ ఖందహారి గులాం నక్ష్బంద్ గారిని తమ చేతిపై శిష్యునిగా చేసుకొని ఖిలాఫత్ (ఉత్తరాధికారం) ప్రసాదించి షిజరా (పరంపర సూచిక) యందు తమ పేరు నమోదు చేయవలదని సరాసరి హజరత్ ఖ్వాజా గారితోనే సంబంధం పెట్టుకోవలెనని రఫియుద్దీన్ ఉపదేశించి శ్రీవారి పీఠంపై కూర్చోబెట్టి తమ దక్షిణ సమర్పించుకొని దొరసానమ్మ గారి సెలవు పొంది తిరిగి ఖందహార్ వెళ్ళిపోయిరి.

హజరత్ ఖ్వాజా గారి సమాధిపై గుమ్మటాన్ని నిర్మించుట :

హజరత్ ఖ్వాజా గారి శ్రీమతి హజరత్ హబీబా ఖాతూన్ (అమ్మాజీ) వారి ఆజ్ఞపై ఖ్వాజాగారి సమాధి పై గుమ్మటం నిర్మించబడెను. దర్గా నిర్మాణములో మదరాసు నవాబైన వాలజా కూడా భక్తి శ్రద్ధలతో పాల్గొనెను. ఖ్వాజా గారి దర్గా ఈనాటికి ప్రకాశించుచు దేశ విదేశాల నుండి దర్శనార్థం వచ్చు లక్షలాది మంది భక్తుల, వ్యాధిగ్రస్తుల జీవితాలను ప్రకాశవంతంగావించుచున్నది.

ఆతేహై జిత్‌నె లోగ్ నయీ పాతేహై హయాత్

హర్ వఖ్త్ బార్‌గాహ్‌సె ఫైజాన్ ఆమ్ హై



13. హజరత్ షేక్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావీ ఉర్ఫ్ దస్తగీర్ సాహెబ్

హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావీ గారు ఉదయగిరి యందు గల హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి గారి దర్గా ఆవరణములో వెలసియున్న హజరత్ ఉస్మాన్ సావీ (ఉస్మాన్ సా హజరత్) గారికి జేజనాయన అగుదురు. వీరు మదరాసు నివాసి. వీరి మనవడు ఉదయగిరి యందు ఉన్నందుకు వీరిని గురించి కూడా పాఠకులకు కొంత తెలియజేయు ఉద్దేశంతో వ్రాయడమైనది.

హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ పూర్వీకులు :

వీరి పూర్వీకులు టర్కీ దేశానికి చెందిన సావా ప్రాంతీయులు. రోమ్ చక్రవర్తుల వంశానికి చెందిన వీరు సావా నుండి మన దేశానికి వచ్చారు. బీజాపూరు రాజైన ఇబ్రాహిం ఆదిల్ షా వీరికి ముత్తాత అగుదురు. భారత దేశమందు వీరు

సైనికోద్యోగులుగా ఉండిరి. మఖ్దూం అబ్దుల్ హఖ్ గారు బీజాపూరు యందు జన్మించెను. వీరి ఆరేళ్ళ ప్రాయములో తల్లి, యుక్త వయసులో తండ్రి అబ్దున్నబీ ఆగా స్వర్గస్తులయ్యారు. వీరు బీజాపూరు పండితుల వద్ద అరబీ, పారశీ భాషలు అభ్యసించారు. తండ్రి మరణానంతరం వీరికి దైవాన్వేషణ మొదలాయెను. ఎచ్చటెచ్చటో తిరిగినను వీరి ధ్యేయం పూర్తికాలేదు. ఒకనాడు నిద్రావస్థలో ఉండగా గుల్బర్గాయందు వెలసియున్న మహనీయులు హజరత్ సయ్యద్ మొహమ్మద్ హుసైని గేసుదరాజ్ ఖ్వాజాబందా నవాజ్ వారి దర్శన భాగ్యము కలిగి వారిచే ఒక ఖడ్గం, పిడి కత్తిని పొందడమైనది. మెలకువ రాగా వీరి యందు ఒక విధమైన ఆవేశము, ఉత్సాహము ఏర్పడి ఇల్లు వదిలి తమ చెల్లెలు అజీజాను కలుసుకొనుటకై బిస్మత్ నగర్ (పాల్ఘాటు) బయలుదేరారు. ఊరు దగ్గర పడుచున్న కొద్ది వీరి ఆవేశం తగ్గుట ప్రారంభమయ్యెను. చెల్లెలి ఇంటికి చేరి అచ్చటి ప్రఖ్యాత మహనీయులు షానసీరుద్దీన్ ఇబ్నె జలాలుద్దీన్ ఖాదరితో కలుకొన్నారు. అంతలో మఖ్దూం సాపీ గారి ఆవేశము పూర్తిగా తగ్గి సంభాషించుట ప్రారంభించారు. సంభాషణ మధ్యలో "ప్రపంచములో భగవంతుని చూచుట సాధ్యమా?" అని అడగగా హజరత్ నసీరుద్దీన్ సాధ్యమని జవాబిచ్చారు. ఈ జవాబు విన్న మఖ్దూమ్ సావి గారి సంతోషానికి హద్దులేకపోయినది. వెంటనే హజరత్ నసీరుద్దీన్ చేతిపై ఆధ్యాత్మిక శిష్యుడై (మురీదు) వారి సేవలో చాలాకాలం గడిపారు. వీరు గొప్ప మేధావి. తమ కలుపుగోలు తనముతో అందరి మన్ననలను పొందే వారు. వీరికి తమ ఆధ్యాత్మిక గురువు షానసీరుద్దీన్ గారి కుమార్తెతో వివాహమాయెను.

ఆధ్యాత్మిక ఉత్తరాధికారం (ఖిలాఫత్) :

హజరత్ మఖ్దూమ్ సావి గారు ఆధ్యాత్మిక ఉత్తరాధికారం పొంది మక్కా మదీనా బయలుదేరారు. అచ్చట మూడేళ్ళు గడిపి ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం వారి ఆజ్ఞపై దక్కను చేరారు. వీరు మక్కా మదీనా యందు ఉన్నంతకాలం అనేక పండితులతో ఆధ్యాత్మికతను గురించి చర్చించారు. సమాత్రా ద్వీపము, జావా (ఇండోనేషియా) మళయా వెళ్ళారు. సమాత్రా రాజధాని "అచ్చి" యందు తమ తర్క, వివాద చర్చలతో కల్లోలాన్ని సృష్టించారు. బెంగాల్,

లాహెూర్, ఢిల్లీ పయనించారు. ఆ కాలపు మహనీయులతో కలిసారు. దక్కను చేరిన పిదప దక్కను వాసులెందరో వీరి ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం పొందారు.

హజరత్ మఖ్దూం సావీ గారి దృష్టిలో హజరత్ ఖ్వాజా నాయబే రసూల్:

"నేను అరేబియా ఆసియా ఇతర పశ్చిమ దేశాల పర్యటనగావించి ప్రముఖ మహనీయుల సాంగత్యంలో జ్ఞానపరంగా ఎంతో అనుభవాన్ని గడించాను. నా జీవితమందు హజరత్ ఖ్వాజాలాంటి గురుత్వము, మర్యాద యోగ్యతగల వ్యక్తి నాకు కానరాలేదు. వారి సాంగత్యంలో ఉన్నంత సేపు నా ఆధ్యాత్మిక గురు సేవలో ఉన్న అనుభూతి కలిగేది" అని హజరత్ మఖ్దూం సావీ గారు వెల్లడించేవారు.

హజరత్ మఖ్దూం సావీని గురించి సయ్యద్ అన్వరుల్లా పారశీ భాషలో ఇలా వ్రాశారు :

"ఈషాన్ రా దర్ ఉలూం తసవ్వుఫ్ వహఖాయిఖ్ కమాలె ఖుద్ రత్ బూద్. కిసీరా మజాల్ నబూద్ కె పేష్ ఈషాన్ కలాం హఖాయఖ్ బయాన్ నుమాయద్ వ అజీ ఇల్మ్ దంజంద్". (ముష్కాతున్ నబువత్ గ్రంధము నుండి)

అర్ధము : ఆధ్యాత్మిక జ్ఞానమందు వీరికి ఎంతటి ప్రావీణ్యత గలదంటే వీరి ముందు నిలబడి ఆధ్యాత్మికత (మారిఫత్) గురించి చర్చించుటకు ఎవ్వరు సాహసించలేరు. వీరి వద్ద శిష్యరికం పొందిన వారికి మాత్రమే వీరు దైవ రహస్యాన్ని వెల్లడించేవారు.

మోల్వీ బాఖర్ ఆగా వెల్లూరి పారసీ భాషలో మఖ్దూం అబ్దుల్ హఖ్ గారి ఆధ్యాత్మిక పరిపూర్ణత గురించి ఇలా అంటారు :

అబ్దెహఖ్ ముఖ్దూం అహలె మారిఫత్ = ఆంకె బూదష్ నూర్ ముత్లఖ్ దర్నిగాహ్
దర్బయాన్ కుల్ షయిఫికుల్ షయి = కోహ్రా సంజీద్ దర్ మీజాన్ కాహ్
గర్ ఖయాల్ రఫ్ అతిష్ ఆరద్ బదల్ = సర్ బఅలైయిన్ కుషద్ పాబంద్ జాహ్
హర్కె బీనా గష్త్ అజ్ ఇర్షాద్ ఔ = బీద్ దర్ హర్ జర్ర సద్ ఖుర్షీద్ జాహ
చోదస్ ఖుద్ బగుజిష్తా షుద్ బాఖి బహఖ్ = తా అబద్ సవీష్ ఫనా రా నీస్త్ రాహ్
ఖామ తారీఖ్ వఫా తిష్ జద్ రఖం = అంజద్ అహల్ మారుఫ్ రఫ్తా ఆహ్

అర్థము : మఖ్దూం అబ్దుల్ హఖ్ దేవుని నెరుగు జ్ఞానమందు ఎంతటి యోగ్యులంటె వీరి కనుచూపులలో దేవుని కాంతి కలగి ఉంది. వారికి ఖుర్ ఆన్‌లోని "కులు షయ్యిన్ ఫి కుల్లీ షయ్యిన్" వివరించుటలో ఎంతటి ఆధ్యాత్మిక జ్ఞానం కలదంటె వీరు పర్వతాన్ని గడ్డిపోచతో సమానపరచగలరు. ఒక వేళ వారి ఉన్నత్వమును తెలుసుకొను ఆలోచన మనసులో కలిగితే మనిషి తెలివి "అలైయిన్" అను అన్నిటికంటె ఎత్తుగల స్వర్గపు శిఖరం వరకు చేరుకోవాలి.

వారి ఉపదేశము పొంది దేవుని మార్గములో నడచి దృష్టిని సంపాదించిన వాడు ప్రతి అణువులో సూర్యుని వంటి ప్రకాశాన్ని చూడగలడు.

అస్తిత్వ వినాశము గావించి దేవునియందు లీనమైన వ్యక్తి మృత్యువుకు ఎన్నటికి మార్గం దొరకదు.

కలము వారి మరణతిథిని **"అంజద్ అహలె మఆరుఫ్ రఫ్త ఆహ్"** (దేవుని నెరిగిన వారి సర్దారు వెళ్ళిపోయిరి) అని వ్రాసెను.

వీరు మదరాసు చేరిన మీదట హజరత్ ఖ్వాజా రహమతులల్లా నాయబె రసూల్ (ఏ.ఎస్. పేట) గారి శిష్యుడై వారి సాంగత్యములో కొంత కాలం గడిపారు. వీరి మొదటి వివాహం వీరి ఆధ్యాత్మిక గురువు హజరత్ నాసిరుద్దీన్ షా గారి కుమార్తెతోను, వీరి రెండవ వివాహము హజరత్ ఖ్వాజా గారి కుమార్తె హాలీమా గారితోను మూడో వివాహం హాజి హుర్మతున్నీసా బేగంతో ఆయెనని చరిత్ర తెలుపుచున్నది. (అల్లాహు ఆలం బిస్సవాబ్).



హజరత్ మఖ్దూమ్ సావి గారి రెండవ శ్రీమతి హజరత్ ఖ్వాజా గారి కుమార్తె హలీమా సాహిబా సమాధి

హజరత్ దస్తగీర్ సాహెబ్ పవిత్ర సమాధి

హజరత్ మఖ్దూం సావి గారి సమకాలిక ఆధ్యాత్మిక గురువులు, పండితులు:

హజరత్ షా కమాల్, మహమ్మద్ షాహమీర్ గారి తండ్రి సయ్యద్ షా జమాలుద్దీన్ బొఖారీ వీరి సమకాలిక ఆధ్యాత్మిక గురువులు, పండితులుగా ఖ్యాతిగాంచారు.

హజరత్ మఖ్దూం సావి గారి రచనలు :

హజరత్ మఖ్‌దూమ్ సావీ గారు వంద గ్రంధాలు రచించారు. వీటిలో ఎక్కువ పారసీ భాషలో గలవు. ముప్పది రచనలు హైదరాబాదులోని ఓరియంటల్ మ్యాన్యు స్క్రిప్ట్ లైబ్రరీలోను, రీసర్చ్ లైబ్రరీలోను గలవు.

"జవాముల్ ఇస్రార్" "బయాన్ వాఖ" వీరి ప్రముఖ రచనలు. వీరు పుస్తక రచనలు గావించిన మీదట ఆధ్యాత్మికముగా ప్రవక్త గారి ఉత్తర్వు పొందుచుండెడి వారు. "కొన్ని పుస్తకాలను ప్రవక్త గారి అనుమతికై బార్‌గాహై నబవీ (ప్రవక్త గారి ఆస్థానం)యందు తీసుకొనిపోవడమైనది. కాని స్పష్టమైన ఆజ్ఞ లభించలేదు". అని హజరత్ సావి గారు వెల్లడించేవారు.

ఒక స్వప్నము : ఒక రాత్రి స్వప్నములో ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం గారిని ఇమాం (ముందు ఉండు వారు) గాను, తాను మఖ్తదీ (అనుయాయి)గా చూడడమైనది. ఢిల్లీ యందు గల షాజహాన్ ఆబాద్‌లోని ఒక మహనీయుడు "ఇటువంటి వ్యక్తి కాలపు మహనీయుడని, ఏల ననగా అచ్చట మీరు తప్ప రెండవ అనుయాయి లేదని" స్వప్న ఫలమును వివరించెను. దీనిని బట్టి హజరత్ మఖ్దూం సావి ఆకాలపు మహనీయుని (ఖుతూబెవఖ్త్) హోదాపై ఉండిరని తెలియుచున్నది.

జలచరాలతో హజరత్ సావి సంభాషించుట : మదరాసులోని మైలాపూరు యందు అర్ధరాత్రి సమయాన హజరత్ సావి సముద్ర తీరాన చేరి ఏకాంతమందు ఏకాగ్రతతో జపతపములలో లీనమయ్యేవారు. సముద్రపు జలచరాలు ఒడ్డున చేరి వారి భాషలో హజరత్ సావీతో సంభాషించుచుండెడివి.

హజరత్ ఉస్మాన్ సావి తండ్రి గారి సమాధి, చెన్నయ్.

హజరత్ మఖ్దూం సావి గారి ఆధ్యాత్మిక పరంపర : హజరత్ మఖ్దూం సావి హజరత్ షా నసీరుద్దీన్ గారి ఖలీఫా, హజరత్ షా నసీరుద్దీన్ హజరత్ దరియా మొహమ్మద్ గారి ఖలీఫా, హజరత్ దరియా మొహమ్మద్ హజరత్ రాజ్ మొహమ్మద్, హజరత్ హాజీ ఇస్ హాఖ్ గార్ల ఖలీఫా, హజరత్ హాజీ ఇస్ హాఖ్ హజరత్ రన్ సింగార్ ఖాన్ గారి, హజరత్ బుర్హానుద్దీన్ జానం బీజాపూరి, హజరత్ మీరాన్‌జీ షంషుల్ ఉష్షాఖ్ గార్ల ఖలీఫా, హజరత్ షంషుల్ ఉష్షాఖ్ హజరత్ కమాలుద్దీన్ బయాబాని గారి ఖలీఫా, హజరత్ బయాబాని హజరత్ మౌలానా జమాలుద్దీన్ అబ్దుల్లా మగ్‌రిబీ గారి ఖలీఫా, హజరత్ జమాలుద్దీన్ అబ్దుల్లా మగ్‌రిబీ హజరత్ సుల్తానుల్ అస్ఫియా హజరత్ ఖ్వాజయే ఖ్వాజాగా దక్కన్ సయ్యద్ మొహమ్మద్ హుసైని గేసూ దరాజ్ బందానవాజ్ (గుల్ బర్గా) గారి ఖలీఫా.

హజరత్ మఖ్దూం సావి గారి సంతానం :

వీరికి పదమూడు మంది కుమారులు, ఆరు మంది కుమార్తెలు కలిగారు.

కుమారులు : బాబా సాహెబ్, మొహియుద్దీన్ సాహెబ్, హానీఫ్ సాహెబ్, గులాం

హజరత్ దస్తగీర్ సాహెబ్ పవిత్ర సమాధి

సాహెబ్, అబూబకర్ సాహెబ్, అరబీ సాహెబ్, నసీర్ సాహెబ్, హుసైన్ సాహెబ్, మీరాన్ సాహెబ్, బుర్హాన్ సాహెబ్, అహ్మద్ సాహెబ్, మహమూద్ సాహెబ్ (వీరందరు హలీమా గారికి పుట్టారు), అబ్దున్నబి ఆలియాస్ మొహమ్మద్ అసదుల్లా సాహెబ్ (హజరత్ ఉస్మాన్ సావి ఉదయగిరి గారి తండ్రి) చివరి వారు.

హజరత్ మఖ్దూం సావి శిష్యులలో ప్రముఖులు : తమ నిర్విరామ కాల సాధనలో కోరికలను జయించిన హజరత్ మఖ్దూం సావి గారి శిష్యులలో అనేకులు ఉన్నత హోదాగల వారుండిరి. వీరిలో ఖ్వాజా అబ్దుల్లా ఖాన్, ఖ్వాజా రహమతుల్లా ఖాన్, నవాబ్ హైదర్ జంగ్, షేక్ ఫక్రుద్దీన్ మహంకారి నాయతీ బేఖుద్ సయ్యద్‌షా అబుల్ హసన్ ఖుర్బీ వెల్లూరి (మౌలానా బాఖర్ ఆగా గారి ఆధ్యాత్మిక గురువు) మొదలగు వారు ప్రముఖులు. బాఖర్ ఆగా అబ్దుల్ హఖ్ గారిని గురించి ఎన్నో కవితలు వ్రాశారు.

ఉదయగిరి మహనీయులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరి గారు హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావి గారి నుండి ఖిలాఫత్ (ఆధ్యాత్మిక ఉత్తరాధికారం) పొందారు.

హజరత్ సావి హిందూ ముస్లింల అభిమాని :

హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావి ప్రతి ఒక్కరిని సాధనకై ప్రోత్సహించెడి వారు. వీరు ఇస్లాం మత సిద్ధాంతాలపై తు.చ. తప్పకుండా నడిచేవారు. హిందూ ముస్లింలు వీరిని చాలా గౌరవ మర్యాదలతో చూచెడి వారు. వీరి జ్ఞానాన్ని బట్టి హిందువులు వీరిని "జ్ఞాన భాండారి"గా భావించెడి వారు. పట్టణ వాసులైన పండితులు, ప్రముఖులు వీరి సహచర్యములో ఎన్నో రాత్రులు గడిపేవారు. వీరందరు మఖ్దూం గారి వద్ద మురీదు(ఆధ్యాత్మిక శిష్యులు)లయ్యారు.

హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావి గారు పరమపదించుట:

వీరు 1165హి. అనగా క్రీ.శ. 1751 సం. రజ్జబ్ నెల 3వ తేదీన హైదరాబాదు యందు పరమపదించారు. వీరి దేహాన్ని ఒక కాఫిన్ పెట్టెలో ఉంచి హైదరాబాదులోని హజరత్ ఖ్వాజా రహమతుల్లా ఖాన్ దర్గా యందు 6 మాసములు భద్రపరచి పిమ్మట మదరాసులోని మైలాపూరు యందు సమాధిగావించారు. వీరి దర్గా మెరీనా బీచ్‌కు పడమరగా గల నటేషన్ రోడ్డు క్రిష్ణపేటలో దస్తగీర్ సాహెబ్ దర్గాగా పిలువబడుచున్నది.

1204 హిజ్రీ అనగా 1790లో మదరాసు నవాబైన అమీర్ వాలజా, షామహమూద్ హజరత్ గారి సమాధి పై గుమ్మటాన్ని నిర్మించెను. అచటి శిలాఫలకంపై దర్గా నిర్మాణము తేది గురించి పారశీ భాషలో ఇలా వ్రాయబడి ఉన్నది:

సాఖత్ ఈ గుంబద్ ఫలక్ ఆసా
హాతిమె హింద్ అమీర్ వాలజా
షా మహమూద్ బానషీన్ గర్ దీద్
ఇబ్న్ మఖ్దూం సాహెబ్ దర్గాహ్
హాతిఫే గైబ్ గుఫ్త తారీఖుష్
ఖబహ అర్ష మంజిలత్ నాగహా

అర్థము : హిందూ దేశపు హాతింతాయి, ఆర్కాటు పరిపాలకుడు అమీర్ వాలజా ఆకాశాన్ని చూచు గుమ్మటాన్ని షామహమూద్ గారి పర్యవేక్షణలో నిర్మించెను. "ఆకాశపు గుమ్మటము నేలపైకి వచ్చెను" అను తిథిని అదృశ్యపు ధ్వని పలికెను. వీరి సమాధిపై గుమ్మటాన్ని నిర్మించిన ఆర్కాటు నవాబు వాలజా తాను మరణించిన తన శవపేటికను ఒక రాత్రి హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావీ గారి సమాధి వద్ద ఉంచవలెనని ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞానుసారం సమాధి వద్ద ఉంచి మరుసటి రోజు దానము చేయబడెను.

ప్రముఖుల గౌరవ మర్యాదలందుకొనిన మఖ్దూం సావి గారి బిడ్డలు :

హజరత్ మఖ్దూం సావి (దస్తగీర్ సావి) ప్రముఖ నవాబయిన నిజాముల్ ముల్క్ ఆసిఫ్ జా తోటి వారు. రెండవ ఆసిఫ్ జా మీర్ నిజాం అలీఖాన్ కూడ వీరి భక్తులలో ఒకరు. మఖ్దూం సావి గారి బిడ్డలను వీరు చాలా గౌరవ మర్యాదలతో చూచెడి వారు. బ్రిటిష్ ప్రతినిధి అయిన లార్డ్ కారన్ వాలిస్ ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఆజ్ఞాపించి దస్తగీర్ సాహెబ్ (మఖ్దూం అబ్దుల్ హఖ్ సావి) గారి కుమారులైన మహమూద్ సావి గారికి మదరాసులో కొన్ని గ్రామాలను జాగీరుగా ఇప్పించెను. వీరి కుమారులలో షామహమూద్, షా అహ్మద్, షానసీర్ సావి, షాఅసదుల్లా (హదరత్ ఉస్మాన్ సావి ఉదయగిరి గారి తండ్రి) ప్రఖ్యాతులు.

హజరత్ మఖ్దూం సావి గారి ప్రవచనములు :

దురాచారిని, పాపిని శిష్యునిగా చేసుకొనరాదు. వారి ముందు కాబాయందు నమాజు చదివితే వేయి రకాతుల నమాజు చదివిన పుణ్యము లభించునని, అచ్చట తప్పు చేస్తే లక్ష తప్పులు లిఖింపబడతాయని చెప్పరాదని సావి అంటారు.

ఉరుసు : హజరత్ మఖ్దూం సావి గారి ఉరుసు ప్రతి యేట రజ్జబ్ నెల 2వ తేదీన మైలాపూరు యందు అతి వైభవంగా ప్రారంభమగును.

حضرت ابواحمد محمد عبداللہ صاحب مرحوم
کا انمول عطیہ

"مولانا باقر آگاہ ویلوری"۔
(یہ تصویر کتب خانہ امانتی دیوان صاحب باغ، چنائی کا مخزونہ ہے)

14. హజరత్ మౌలానా బాఖర్ ఆగా వెల్లూరి

మౌలానా బాఖర్ ఆగా నవాయిత్ వంశమునకు చెందిన వారు. ఈ వంశం ఖురేష్ తెగకు చెందినది. ఈ వంశ పరంపర ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లంతో కలిసిపోతుంది. ఈ వంశపు మూలపురుషుడు నజర్ బిన్ కనానా.

హువా హై బందయె బేజర్ తూ యార్ కా ఆగా
ఖురేష్ మేథా అగర్చే బడా నసబ్ తేరా

బాఖర్ ఆగా 1705లో బీజాపూరు యందు జన్మించిరి. హజరత్ ఖ్వాజా రహమతుల్లా నాయబె రసూల్ గారి ఆధ్యాత్మిక శిష్యులైన హజరత్ అబుల్ హసన్ ఖుర్బి గారి చేతిపై వీరు బయ్యత్ చేసి ఆధ్యాత్మిక శిష్యుడాయిరి. చివరిగా హజరత్

ఖ్వాజా నాయబెరసూల్ నుండి సఖ్ష్ బందియా, రఫాయియా పరంపరల అనుమతి పొందిరి. హజరత్ షేక్ మఖ్దూం సావి సేవలో ఉంటూ సాధనలో నిమగ్న మగుచుండిరి.

గురువు గారి ఉపదేశంతో ఆధ్యాత్మిక రీత్య వీరి యందు కలిగిన మార్పు గురించి ఇలా అంటారు:

హజరత్ ఖుర్బీ కె ఇర్షాద్ సె హూ-మస్త్ ఆగా
ఖౌల్ మన్సూర్ కా జారీ హై ఖుదా ఖైర్ కరె

(నా గురువు హజరత్ ఖుర్బీ ఉపదేశంతో ఆనంద పారవశ్యంలో ఉన్నాను. ప్రముఖ మహనీయుడు మన్సూర్ హల్లాజ్ "అనల్ హఖ్" నేనే సత్యమును అని అన్నందుకు ఉరి తీసిరి. అదే వాక్కు నానుండి జారి అగుచున్నది. దేవుడు మేలు చేయుగాక.)

హువాహు-ఫిల్ హఖీఖత్ మె ఉస్మె గుమ్
మజాజన్ హువాహు-ముసమ్మ నజద్ మర్దం

(శారీరకంగా నేను మనిషినే కాని యదార్థంలో నేను దేవుని యందు లీనమయ్యాను.)

ప్రముఖ సాహితీవేత్త ఆగా:

వీరు మంచి సాహిత్యపరులు. ఉర్దూ సాహితీ జగత్తులో కవితా విమర్శ పీఠిక "ముఖద్దమ షేర్-ఓ-షాయిరి" మొదటగా వ్రాసినది ఖ్వాజా అల్తాఫ్ హుసైన్ హాలీ అంటారు. కాని హాలి కంటే ముందు కవితా విమర్శ పీఠిక బాఖర్ ఆగా వ్రాసెనని చరిత్ర తెలియ జేయుచున్నది.

ఒక జాబులో హజరత్ ఖ్వాజానాయబె రసూల్ గారి ఆశీర్వాదములు కోరుట:

"ఈ నా హృదయపు జాబు హృదయమున్న వారి సేవలో పంపుచున్నాను.

నిర్జీవపు తనువు నుండి ఒక పవిత్ర ఆత్మ వైపు జాబు పంపు చున్నాను. ఈ జాబును ఒక పనికిమాలిన నీటి బిందువు సముద్రపు వైపు పంపుచున్నది. ఎండిపోయిన పొలము ఈ జాబును వర్షపు మేఘము వైపు పంపుచున్నది. ఒక అణువు నుండి ఈ జాబు ప్రకాశించు సూర్యుని వైపు పంప బడుచున్నది. ఒక పేద చీమ తన జాబును జమ్షీదు చక్రవర్తికు పంపుచున్నది. ఒక జాబును ఒక చిత్రము చిత్రకారుని వైపు పంప బడుచున్నది. ఉపాసకుల గురువర్యుల ఆస్థానమునకు అనగా ఈ జాబు రహమతాబాదుకు చేరాలి. ఈ ఖ్వాజా ఎలాంటి వారంటే మంచివారి పైన చెడ్డవారిపైన దేవుని కరుణ వలే వీరి అనుగ్రహము కలదు. వీరిని ప్రశంసించడం ఎవరి తరం? వీరి ఔన్నత్యపు హద్దును ఎవరు నెరుగ గలడు?

ఖ్వాజా! మీ వినాశపు సంపూర్ణత్వం ఎలా ఉన్నదంటే ఒక చోట కూర్చుండి ఎచ్చటెచ్చటో ఉందురు. మీకు శాశ్వతంగా భగవంతునియందు ఎంత వరకు లీనత్వం చెందారంటే “తలచు” అను విషయపు అవసరం మీకు లేకుండా పోయినది. మీ ఆత్మశక్తితో మీ ప్రతి శిష్యుని హృదయ మందు నిర్మలత్వం ప్రసాదించిరి. ఓ పాదుషా! మీ సుగుణము, ప్రవీణత వివరించు సామర్థ్యం నాయందు ఎక్కడిది? మీరు మీ స్థానాన్ని నెరుగగలరు. నేను విధి లేని స్థితిలో నా చెడు వృత్తాంతాన్ని మీ సేవలో వెల్లడించుచున్నాను. నేడు మీతో సరితూగు వాడెవడు లేడు. మీ శరణము కోరని వాడెవడు? నేను మీ సుగుణాలను చాలా వింటిని. వాటితో నా హృదయ మందు మీ రూపము చిత్రింపబడె. మీ దర్శన భాగ్యం పొంది ఉన్నతుడగుదామని సదా ఆలోచనలో ఉన్నాను.

ఓ పుణ్య పురుషుల సర్దారు! మీ సేవలో హాజరుకావలసియుండినది కాని అనుకూలించని కాల స్థితి వలన నేను ఏనాడు సేవలో హాజరుకాలేకపోతిని. అనేక కారణాలతో నేను మీ అనుగ్రహమునకు దూరమైతిని. ప్రస్తుతం ఒక అవసర నిమిత్తం ఇచ్చట హాజరైతిని. భగవంతుడు తలిస్తే తొందరలో మీతో కలుసుకొనే భాగ్యం పొందగలను. అప్పుడప్పుడు నా దీనస్థితిపై మీ చల్లని చూపుతో చూస్తారని ఆశించుచున్నాను. నాపై అనుగ్రహించి ప్రావీణ్యతను ప్రసాదించండి. నా హృదయం

దు:ఖభరితమై వివిధ ఆలోచనలలో మునిగియున్నాను. నేను కోరికల వలలో చిక్కుకొనియున్నాను. అయినను తమపై ప్రేమగలదు. నాకు ఎటువంటి సాధనలేదు, ఒక స్థానం లేదు. అయినను మీ సేవకుల జాబితాలో చేరు ఆశయున్నది. నేను నిరాధారుడను. నా గాయములు దాగియున్నాయి. ఓ నిరాధారుల ఆధారమా! మీకు సర్వము తెలుసు".

బాఖర్ అగాకు ప్రవక్త గారిపై భక్తి విశ్వాసాలు :

ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లంపై ఆగాకు గాఢమైన ప్రేమ విశ్వాసాలుండినవి. వీరి ప్రతి మస్నవి యందు భగవంతుని హంద్ (స్తోత్రము) తదుపరి ప్రవక్త గురించి "నాత్" (స్తోత్రము) వ్రాసేవారు. వారిని గురించి ఇలా అంటారు. "హర్ జిక్రసే ఇన్‌కా జిక్ర అఫ్‌జల్ హై" (ప్రతి స్తోత్రము కన్న వీరి స్తోత్రము శ్రేష్ఠమైనది). సాదత్ సర్‌మదీయ అను పుస్తకములో "మొహబ్బత్ మొహమ్మది" (మొహమ్మదు ప్రేమ) అను అంశమును గురించి వ్రాసిరి. తమ రచన దీవానె హిందీలో ఇలా వ్రాశారు :

హమారా మఖ్‌సదే కౌనైన్ మొహమ్మద్
మొహమ్మద్ హై మొహమ్మద్ హై మొహమ్మద్ హై
(మా ఇహపర ధేయము మొహమ్మదు మొహమ్మదు మొహమ్మదు)

నబీక జిక్ర్ హర్ షామ్ ఒ సహర్
అఫ్ జలుల్ అజ్‌కార్ హై అయ్ బషర్
(ఓ మనిషా రేయి పవలు అన్ని స్తోత్రముల కన్న ప్రవక్త స్తోత్రము శ్రేష్ఠమైనది)

ప్రవక్త హుజుర్ సొ. యందు తనను లీనము గావించమని ఒక చోట భగవంతునితో ఆగా ఇలా ప్రార్థిస్తారు :

కర్ ముఝే యూ-తెరే మహబూబ్ మె గుం
కెనా సంఝూ- ఫిర్ కభీ హుం ఔర్ తుం
(మీరు, నేనను భావం నాయందు ఎన్నడు కలుగ వలదు. ఓ భగవంతుడా! నన్ను నీ మిత్రునియందు అలా లీనముగావింపుము)

బాఖర్ ఆగా

పఛానత్ ఉస్కీహై తాఅత్ సే అవ్వల్
ఇబాదత్ బే పఛానత్ నై ముకమ్మిల్
పఛానత్ ఉస్కీ అవ్వల్ ఫర్జ్‌హై జాన్
ఇబాదత్ ఉస్కీ బాద్ అజ్ ఫర్జ్ కర్‌మాన్
అఖాయద్ పర్ అవ్వల్ పస్‌కర్ ఇబాదత్
కే తా దోజగ్‌మే తుపావే సాదత్
సున్‌కాన్‌సె దిల్‌కె అయ్ బిరాదర్
హై జిక్ర్ నబీకా ఫర్జ్ సబ్‌పర్
కర్‌తా హైఏజిక్ర్ దిల్‌కూరౌషన్
వీరాన్ జాన్‌కు మస్లె గుల్‌షన్

హజరత్ మహబూబె సుబహాని గురించి బాఖర్ ఆగా :

ప్రవక్త హుజూర్ సొల్లెల్లాహు అలైహి వసల్లంతో పాటు హజరత్ మహబూబె సుబహాని అబ్దుల్ ఖాదర్ జీలాని రహ. పై అమిత భక్తి కనబరచేవారు. ఖాదరియా పరంపరలో చేరిన (మురీదు అయిన) పిమ్మట వీరికి మనశ్శాంతి లభించినదని ఆగా అంటారు. హజరత్ మహబూబె సుబహాని గురించి ఒక ఖసీదాలో ఇలా వ్రాసిరి :

ఆసరా తేరె కరంకా హై జిసే
దూసరా మై హై ఓ మఖ్ బూల్ సమద్
హై తెరి ఇందాద్ పె హర్ దం ఉమ్మీద్
రహే తేరా ఫైజ్ జారి తా అబద్

(నీ దయ, ఆశ్రయం ఎవరైనా పొంది ఉంటే నేను అలాంటి రెండవ వ్యక్తిని, నీ కరుణకై నిరీక్షించువాడను. నీ అనుగ్రహం నాపై కలకాలం ఉండవలె).

హజరత్ ప్రవక్త గారి గృహసంబంధీకులపై భక్తి :

హజరత్ ప్రవక్త గారి గృహసంబంధీకులు, హజరత్ హుస్ సైన్ పై ఆగాకు చాలా భక్తి సంబంధాలుండినవి.

ఉల్‌ఫతే అహలే బైత్ సే ఆగా
హైదరాబాద్ హోగయా హై దిల్

(ప్రవక్త గారి గృహ సంబంధీకులైన హజరత్ హైదర్ అలీ, ఫాతిమా, హసన్ హుసైన్ రజి. ప్రేమతో నిండిపోయిన ఆగా హృదయం హైదర్‌ఆబాద్‌గా ఆయే) అనగా హృదయం హజరత్ అలీతో నిండియున్నది. రియాజుల్ జిన్నాలో ఇలా వ్రాస్తారు :

క్యాహోసకే కొయీ ఇన్‌కా సనా ఖ్వా-
జబ్ హంద్ సె పుర్ హై ఖుర్ ఆన్
అగర్ ఉఠాయా కొయీ ఇన్ కు దర్ మియా- సె
మూ- ఫిరాయా అప్నా ఓ ఖుర్ ఆన్ సె

(ఎవరు ప్రశంసించగలడు వీరిని గురించి. వీరి ప్రశంసతో ఖురానే నిండియుండె. ఎవరైన వీరిని తిరస్కరించారంటే వారు ఖురాన్‌ను తిరస్కరించారు).

పీర్ ఒ ముర్షద్‌ను గురించి ఆగా :

ఆగా తమ ముర్షద్ (గురువు) హజరత్ ఖుర్‌బీపై చాలా ప్రేమ, భక్తి కలిగి ఉండిరి. వారిని గురించి ఇలా ప్రశంసించారు :

ఓ పీర్ మెరా థా బ ఇర్‌ఫాన్
దేవే హాఖ్ ఉసే జజాఏ షాన్

(ఆ నా గురువు బ్రహ్మ జ్ఞానం గలవాడు. అతని గొప్ప తనపు ప్రతి ఫలం దేవుడు ఇచ్చుగాక)

భాఖర్ ఆగా శిష్యులలో ప్రముఖులు :

మదరాసులోని ఆనాటి ప్రముఖ అరబీ, పారశీ బోధకులలో మౌలానా భాఖర్ ఆగా ఒకరు. వీరి ఆధ్యాత్మిక మార్గదర్శకులు హజరత్ ఖుర్బీ కాలములోనె వీరి బోధనా చర్చలు దశదిశలా వ్యాపించాయి. వీరి వద్ద శిక్షణ పొందిన శిష్యులు మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. ఆగా తమ జీవిత కాలమందే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుడను స్థానం పొందారు. వీరి శిష్యులలో కూడా కొందరు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుడను స్థానాన్ని పొందగలిగారు.

మొదటి వాలజా : ఆర్కాటు నవాబు అయిన మొదటి వాలజా తన ఇద్దరు కుమారులు అమీరుల్ ఉమ్రా, ఉమ్‌దతుల్ ఉమ్రాలకు బోధించుటకు ఆగా గారిని ఉపాధ్యాయునిగా నియమించుకొనెను.

గులాం మొహియుద్దీన్ ఖాన్ మౌజిజ్ :

అమీరుద్దీన్ అలీషా ఉదయగిరి గారి వద్ద అరబ్బీ నేర్చిన మౌజిజ్ చివరిగా ఆగా గారి వద్ద విద్యాభ్యాసం గావించెను. ఆగా తరువాత బోధకులకు బోధకుడను స్థానాన్ని మౌజుజ్ పొందెను. మౌజిజ్ ఆగా గారి పీఠానికి అధిపతి అని జనులు భావించిరి.

గులాం అలీ మూసా రజా :

వీరు నవాయిత్ వంశానికి చెందిన వారు. వాలజా నవాబు దర్బారులో ప్రముఖ వైద్యునిగా సేవలందించారు. అరబీ, పారసీ గద్య పద్య రచనలో ఆగా గారి శిష్యరికం పొందారు.

సయ్యద్ అబూ సయీద్‌వాలా :

వీరు ఏ.ఎస్.పేట (రహమతాబాద్)లో జన్మించారు. మదరాసులో ఆగా గారి వద్ద విద్య నేర్చి ఆగా మరణానంతరం తిరిగి రహమతాబాద్ చేరారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురవు రఫీయుద్దీన్ ఖందహారి వద్ద మురీదు అయిరి. వీరు హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబేరసూల్ గారి జీవిత కాలపు సంఘటనలను గురించి ఒక పుస్తక రచన గావించారు.

గులాం మొహియుద్దీన్ ఖాదరి షాయఖ్ :

వీరు ఉదయగిరి నుండి మదరాసు చేరి అచ్చట ఆగా గారి శిష్యరికాన్ని పొందారు.

మీరా మొహియుద్దీన్ వాఖిఫ్ :

ఉదయగిరి నివాసి అయిన వాఖిఫ్ గారి వివాహము ఆగా గారి మనుమరాలితో ఆయెను. వీరు ఉదయరిగి నుండి మదరాసు చేరి ఆగా గారి వద్ద విద్య నేర్చిరి వీరు మదరాసులలో జరిగిన ముషాయిర-ఎ-ఆజం (ప్రధాన ఉర్దూ కవి సమ్మేళనము) కమిటిలో సభ్యులుగా ఉండిరి. మదరాసు యందు నవాబు ఆజం గారు స్థాపించిన "మదరస-ఎ-ఆజం" యందు వీరిని ఉపాధ్యాయునిగా నియమించిరి. మదరాసు ప్రభుత్వ ఏజంట్ మిష్టర్ బిల్ ఫోర్డ్ స్థాపించిన ఇస్లామిక్ గ్రంథాలయ కమిటికి వీరు సభ్యులుగా ఉండిరి. ఈ గ్రంథాలయము భారతదేశములో తొలి ఇస్లామిక్ గ్రంథాలయం.

మౌలానా భాఖర్ ఆగా గారు పరమ పదించుట :

ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలందు పేరు ప్రతిష్టలు గాంచిన భాఖర్ ఆగా 1806 సం. బక్రీదు నెల గురువారం తమ 62వ యేట మదరాసులో స్వర్గస్తులాయిరి. మైలాపూరు రోడ్డుకు పశ్చిమంగా వీరి ఇంటి వెనుక గల సొంత స్థలములో వీరిని సమాధిగావించిరి. ఇది క్రిష్ణా పేట వీధిలో హజరత్ మఖ్ధూం అబ్దుల్ హాఖ్ సావి (దస్తగిరి సాహెబ్) గారి దర్గాకు దగ్గరలో గలదు. ఇచ్చటి నుండి అతి సమీపంలో మెరీనా బీచ్‌గలదు. ఒక అరుగుపై గల వీరి సమాధిపై షర్ఫుల్ ముల్క్ ఖిద్‌మత్ ఫర్‌దుల్ అఫ్ర అని వ్రాసిరి. సమాధి చుట్టుప్రక్కల రెండు మూడు సమాధులుండెడివి. వాటిలో ఒక సమాధి వారి కుమార్తె సఫీయ (మహమ్మద్ సిబగ్‌తుల్లా ఉదయగిరి వారి శ్రీమతి) రెండవ సమాధి కుమారుడు మహమ్మద్ జాఫర్‌ది (హజరత్ వజూదిషా గారి ముత్తాతది అని అంటారు). మదరాసు సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం షబే బరాత్ నెలలో సమాధి దర్శనంగావించి ఫాతెహా చదివే వారికై తలుపు తెరచబడి ఉండెడిది. చుట్టుప్రక్కల చాలా అంగళ్ళు కొంత ఖాళీ స్థలము కూడా ఉండెడిది.

ప్రస్తుతం చుట్టు ప్రక్కల ఎత్తైన నిర్మాణాలు, ఫ్లాట్స్ ఉన్నందున సమాధి దర్శనార్థముకై వెళ్లు వారికి సౌకర్యము లేకుండాపోయినది.

ఉదయగిరిలో భాఖర్ ఆగా గారి సంతానం :

ప్రఖ్యాత సాహితీవేత్తగా అరబి పారశీ బోధకునిగా, పండితునిగా మదరాసులో పేరు గడించిన భాఖర్ ఆగా గారి సంతానం ఉదయగిరి యందు ఉండుట ఎంతో గర్వకారణం. భాఖర్ ఆగా మూడవ కుమార్తె ఆయెషాకు ఉదయగిరి నివాసి మీరా మొహియుద్దీన్ ఖాదరి వాఖిఫ్ (సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఉదయగిరి గారి బావ మరిది కుమారుడు)తో వివాహమాయెను. భాఖర్ ఆగా హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి ఉదయగిరి గారికి వరుసకు తాత అగుదురు. ఈ గ్రంథ రచయిత యొక్క ఆధ్యాత్మిక గురువు గారి గురువర్యులు హజరత్ బేకస్ నవాజ్ ఖ్వాజా షా అబుర్రజా సయ్యద్ బాదషా మొహియుద్దీన్ వజూదీ గారి తల్లి ఫాతిమా గారి జేజనాయన మహమ్మద్ జాఫర్‌కు భాఖర్ ఆగా తండ్రి అగుదురు. అనగా హజరత్ వజూదిషా గారి ముత్తాతకు బాఖర్ ఆగా తండ్రి అగుదురు.

నెల్లూరులో దస్తావేజులు :

"మౌలానా బాఖర్ ఆగా ఫన్ ఔర్ షఖ్సియత్" పుస్తక రచయిత్రి జాకిరా గౌస్ బాఖర్ ఆగా గారి బంధువైన దస్తగీర్ మొహియుద్దీన్ గారితో ఎంఏ సాహిత్యం పరిశోధన కాలంలో పరిచయమైనది. ఆగా గారి సమాధి నిర్మాణం, భూమి గురించి దస్తావేజులు, నెల్లూరుయందు వారి వద్ద గల ప్రాచీన గ్రంథాలయమును గురించి ప్రస్తావించారు. ఆస్తి గురించి దస్తావేజులు చూడదలచుకోలేదని. చూచట భావ్యం కాదని జాకిరా గౌస్ భావించారని తెలిపారు. భాఖర్ ఆగా గారి కుటుంబీకులు నెల్లూరులో స్థిరపడ్డారు. తెలుసుకొను అభిలాష ఉన్న ఈ కుటుంబం విద్య, జాతీయతాపరంగా చేసిన అనేక సేవల గురించి తెలుసుకోగలము.

హజరత్ వజూదిషా గారి తాత గారి వంశం నవాయిత్ వంశం. ఈ వంశం ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వ సల్లం వారి ఖురేష్ వంశానితో కలిసిపోతుంది.

హజరత్ వజూదిషా తమ కవితలో హజరత్ అలీ రజి.తో ఇలా వేడుకుంటారు.

తుంహారా మైతొ ఖనా జాద్ మౌరసీ హు-యా హైదర్

కరంకి ఎక్ నజర్ ముఝ్‌పర్ మెరే మౌలా మెరే అఖా

ఓ హైదర్ నేను మీ వంశానికి చెందిన వాడను. మీ కరుణ కటాక్షపు చూపు నాపై వుండాలి).

మరోచోట ఇలా అంటారు :

నఛోడో సబ్ర కా దామన్ వజూది

తుమ్ ఔలాదే షహీదె కర్బలాహో

(ఓ వజూది! మీరు కర్బలా మైదానమందు ఇస్లాం ధర్మం కొరతు ప్రాణత్యాగం గావించిన అమరవీరులు హజరత్ ఇమాం హుసైన్ రజి. వారి సంతతికి చెందినవారు గనుక ఎన్ని ఆపదలు, కష్టాలు కలిగినను సహనపు కొంగును విడువవలదు)

హజరత్ వజూదిషా తల్లి గారి వంశ వృక్షం

మహమ్మద్ బాఖర్ ఆగా

↓

మొహమ్మద్ జాఫర్

↓

మొహమ్మద్‌కరీముల్లా (వజుదిషా గారి తాత)
(1879లో నెల్లూరులో స్వర్గస్తులాయిరి)
= జైనబ్‌బీ ఉర్ఫ్ జైబుబి (వజుదిషా గారి అమ్మమ్మ)
(1909లో నెల్లూరులో స్వర్గస్తులాయిరి)

↓

ఫాతిమా ఉర్ఫ్ మాజాన్‌బి (వజుదిషా గారి తల్లీ)	అలీ హుసైన్ (1894లో స్వర్గస్తు లాయిరి)	మొహిముద్దీన్ హుసైన్	అహ్మద్ హుసైన్	యూసుఫ్ హుసైన్	సిబక్‌తుల్లా ఉర్ఫ్ ఛబ్బన్ హైదరాబాదులో స్వర్గస్తులా యిరి	రహీమా

15. హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ తండ్రి పేరు సయ్యద్ బదరుద్దీన్ అలీఖాన్. తల్లి పేరు మరియం సాహిబా. హజరత్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ తమ 11వ ఏట నవాబైన తమ తండ్రి వ్యాధిగ్రస్తులై తమ కుమారులను తమ ఆధ్యాత్మిక గురువు హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ రహమతాబాదు వారి ఆధీనపరచుచు "వీరు శ్రీవారి గులాములు. వీరిని అనుగ్రహించుచు ప్రాపంచిక, దైవమార్గమునకు మార్గదర్శకత్వం వహించవలెను" అని మనవి చేసుకొనెను.

అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్‌ను హజరత్ ఖ్వాజా "నా బిడ్డ" అని సంబోధించుట:

హజరత్ అబ్దుల్ ఖాదర్ సాహెబ్ బాల్యం నుండియే సత్‌ప్రవర్తన, దైవప్రార్థన, దాన ధర్మములందు మంచి పేరు గడించిరి. హజరత్ ఖ్వాజాపై వీరు పూర్తి భక్తి

హజరత్ ఖాన్‌సావలి సమాధులు

విశ్వాసములుంచిరి. వారి ప్రతి ఆజ్ఞను శిరసా వహించుచుండిరి. హజరత్ ఖ్వాజా వీరి సత్ ప్రవర్తన భక్తి భావమును చూచి "నా బిడ్డ" అని సంబోధించుచుండిరి. ఈనాటికి హజరత్ ఖ్వాజా గారి దృష్టి ప్రతి విషయంలో హజరత్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీపై యున్నది.

సింహాసనమధిష్టించుట :

తమ తండ్రి సయ్యద్ బదరుద్దీన్ అలీఖాన్ స్వర్గస్తులైన పిమ్మట 1744లో వాలాజాహి నవాబు అన్వరుద్దీన్ కర్ణాటక సుబేదారుగా ఉండెను. వాలాజాహి నవాబుల పరిపాలన వీరితోనే ఆరంభమైనది. నవాబు అజీముద్దౌలా అబ్దుల్ అలా ఖాన్ పరిపాలనలో సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌ను అహ్మద్‌ఖాన్ బహద్దూర్ నాసిర్ జంగ్ నిజాముద్దౌలా 1750లో అనగా తండ్రి బదరుద్దీన్ ఖాన్ తదుపరి ఉదయగిరిని సంభాలించుటకు ఆజ్ఞాపించెను. అంత:పుర స్త్రీలందరు కలసి రాజముద్రిక గల ఉంగరాన్ని సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారికి తొడిగించి సింహాసనంపై కూర్చుండబెట్టి "నవాబ్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ బహదూర్" అని పిలిచారు. వయస్సులో చాలా చిన్నవారైనందున పరిపాలనయందు సామర్థ్యం గల వీరి దీవాణు అక్కన పంతులు అధిపతిగా ఉండి, గుణగణాలందు నీతి నిజాయితి, ధర్మపాలన యందు ప్రఖ్యాతిగాంచెను.

ఆధ్యాత్మిక శిష్యుడు (మురీదు) అగుట :

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ వారి వద్ద ఆధ్యాత్మిక శిష్యుడై హజరత్ మఖ్దూం అబ్దుల్ హఖ్ సావీ నుండి ఆధ్యాత్మిక ఉత్తరాధికారము (ఖిలాఫత్) పొందిరి. ఫఖీరుల ఖర్చులకు గాను అనుమ సముద్రమును దేవుని పేరిట ఇచ్చెదను స్వీకరించండి అని గురువుగారైన హజరత్ ఖ్వాజాను వేడుకొనెను. ఆనాటి అనుమసముద్రముపేట సాంవత్సరిక ఆదాయం 300 హోణులు. అనగా రూ. 2500/- కాని ఉచితంగా ఈ కానుకను స్వీకరించుటకు ఖ్వాజా అంగీకరించలేదు. ఆ భూమిని ఖరీదుకు తీసుకొనెను.

ప్రముఖ ఆధ్యాత్మిక శిష్యులు :

హజరత్ ఉస్మాన్‌సావీ (ఉస్మాన్‌సా హజరత్ ఉదయగిరి), నెల్లూరు యందు చేపల మార్కెట్టుకు ప్రక్కన గల దర్గాయందు వెలసిన సఫ్‌దర్ అలీ ఉర్ఫ్ చినిగిష పీర్ వీరిరువురు అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారి ఆధ్యాత్మిక శిష్యులు.

హజరత్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ పరిపాలన :

18 సంవత్సరముల వయస్సులో ఒక రోజు వీరి దీవాణైన అక్కన్న పంతులు దర్బారు యందు కూర్చుండబెట్టి తాలూకాకు సంబంధించిన పన్ను వసూళ్ళు జమ ఖర్చుల పద్ధతిని గురించి తెలియజేసెను. తాను జాగీర్‌దారు గారి ఆజ్ఞానుసారం నడచుకొనసాగెను. కొన్ని దినములు గడిచిన పిమ్మట ఒక రోజు ఎందుకో బహు ఆనందంలో ఉండిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ తమ దీవాణు అక్కన్న పంతులుపై అనుగ్రహించి మహలుకు పిలువ నంపి తలపాగా, కోటు ప్రదాము చేసి "మీరేమి కోరుకుందురో కోరుకోండి" అని ఆజ్ఞాపించిరి.

అక్కన్న పంతులు గారి కోరిక :

ఉదయగిరి జాగిర్దారైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారి ఆజ్ఞానుసారం ఉదయగిరి నుండి నెల్లూరుకు వెళ్లే మార్గములో గల నందిపాడు గ్రామాన్ని

“నావారసులు వంశ పారంపర్యముగా అనుభవించుటకు ఇవ్వమని కోరారు. అలా ఇస్తే బాటసారుల కొరకు నేనొక వసతి గృహాన్ని నిర్మించి ఆ గ్రామ వసూలు సాంవత్సరిక ఆదాయం 30 హోణాలతో వారికి భోజన సదుపాయములు సమకూర్చెదను” అని అక్కన్న పంతులు మనవి చేసుకొనెను.

అక్కన్న పంతులుకు నందిపాడు గ్రామాన్ని ఇచ్చుట :

“ఉదారస్వభావుడు, నిజాయితీ పరుడైన మాదీవాణు అక్కన్న పంతులు తాను దాన ధర్మాలు చేసే ఉద్దేశంతో కోరినందుకు గాను పైకము వసూలగు పరగణ నందిపాడును నేను (సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్) మా దీవాణు అక్కన్న పంతులుకు వంశ పారంపర్యముగా అనుభవించుటకు దానపత్రమును, రాజముద్రిక తోటి వ్రాసి ఇవ్వడమైనది” ఈ విధముగా అక్కన్నపంతులు నందిపాడు గ్రామాన్ని పొందెను.

కప్పము చెల్లించకుండా జాగీరు అనుభవించుటకు కర్నాటక నవాబు ఉత్తర్వు పంపుట :

న్యాయమందు దాన ధర్మాలందు పేరొందిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ బహదూర్‌కు కాల పరిమితి లేకుండా ఎటువంటి కప్పము చెల్లించకుండా వారి వంశపారంపర్యముగా జాగీరు అనుభవించుటకు కర్ణాటక నవాబైన అజీముద్దౌలా ఉత్తర్వు పంపెను. కనీసము పండుగ ఖర్చులకైన ధనము స్వీకరించమని సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ కోరగా” మీ మాట ప్రకారమే నాలుగు మాసములకొకసారి మూడు వేల హోణులు (పదివేల ఐదు వందల రూపాయలు) కర్నాటక రయూసు ఖజనాకు పంపి రశీదు పొందండి” అని నవాబు తమ అంగీకారాన్ని తెలియజేసిరి.

నెల్లూరుకు సంబంధించిన కొన్ని గ్రామాలను కొనుట :

నెల్లూరు జిల్లాకు సంబంధించిన “అమానెక” తాలూకు మంచానూరు, రెడ్లదిన్నె, మట్టిపాడు, బిజ్జంపల్లె, బంగానిపల్లె (బండగానిపల్లె) ఈ ఐదు గ్రామాల జాగీర్‌దారులు

పూర్తి కప్పము చెల్లించనందున ఆనాటి నెల్లూరు దేశపు ఫౌజుదారు (సేనాధిపతి) అయిన మధ్వపతి పురుషోత్తం పంతులు ఆ గ్రామాలను వేలము వేసెను. ఉదయగిరి జాగీరుకు సమీపములో ఆ గ్రామాలున్నందున నవాబు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ వాటిని "మీమీ పేరిట ఆ గ్రామాలు కొనండి" అని వారి వకీళ్ళను ఆజ్ఞాపించిరి. వారి ఆజ్ఞానుసారం వకీళ్ళు తమ తమ పేరిట గ్రామాలను కొనిరి. వకీళ్ళ నుండి ఆ గ్రామాలు తిరిగి పొందిరి. తమ జాగీరు శిస్తు 3 వేల హోణిలతో పాటు ఈ ఐదు గ్రామాల శిస్తు 2 వేల హోణిలు మొత్తము 5 వేల హోణిలు నెల్లూరు ఫౌజుదారుని ఖజనాకు చెల్లించి రసీదు పొందుచుండిరి.

సంతానము : సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్‌కు ముగ్గురు కుమార్తెలు ఇద్దరు కుమారులు కలిగిరి. మొదటి కుమార్తె సర్వర్ సాహిబా. వీరి భర్త సయ్యద్ అలీ మెహమ్మద్ ఖాదరి ఉర్ఫ్ దస్తగీర్ సాహెబ్. ఉదయగిరి మండలములోని సర్వరా బాదు గ్రామాన్ని సర్వర్ సాహిబా పేరుతో పిలువబడుచున్నది. రెండవ కుమార్తె అమీన్ సాహిబా. వీరు యుక్త వయస్సులో స్వర్గస్తులాయిరి. మూడవ కుమార్తె మా సాహెబా. వీరి భర్త పేరు కరీముల్లా సాహెబ్. ఉదయగిరి మండలంలోని మా సాహెబ్ పేట గ్రామాన్ని మాసాహిబా పేరుతో పిలువబడుచున్నది. మొదటి కుమారుడు సయ్యద్ అబ్బాస్ అలీఖాన్, రెండవ కుమారుని అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ తమ జేజనాయన సయ్యద్ ముస్తఫా అలీఖాన్ గారి పేరు పెట్టినట్టుల తెలియుచున్నది (యధార్ధం దేవునికెరుక). వీరు తమ 10, 12వ సంవత్సరాల వయస్సు నుండియే మంచి తెలివి గల వారుగా గుణవంతులుగా గుర్తింపబడిరి. సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ తమ జీవిత కాలములోనే వీరికి కొన్ని గ్రామాలు ఇవ్వాలని నిశ్చయించుకొని చిరువేళ్ళ, భీమవరం, బందారపల్లె, జాగీరులను పద్ధతి ప్రకారం ముస్తఫాఅలీఖాన్ పేరిట వ్రాసి ఈ గ్రామాల ఆదాయాన్ని సరాసరి తమ పెద్దకుమారుడు అబ్బాస్ అలీఖాన్ గారికి అందినటుల ముస్తఫాఅలీ ఖాన్ చేత వ్రాయించుకొనిరి.

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి గారి మహిమలు:

నిత్యం భగవధ్యాన మందుండె ఈ ఆధ్యాత్మిక పరిపూర్ణ మహనీయుని ఎన్నో మహిమలు గలవు.

1. ఒక బ్రాహ్మణునికి కంటిచూపును ప్రసాదించుట :

ఆ బ్రాహ్మణుని పిలువనంపి లేత తమలపాకులు, వక్క, సున్నమును చిన్నపాటి రూకటిలో దంచి ఆ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసి దేవుని నామాలను పఠించి దానిని ఆ బ్రాహ్మణుని కనులపై ఉంచి పలుచటి గుడ్డతో కట్టుకట్టి "ఈ కట్టును నీవు విప్పవలదు. రేపు నా వద్దకు వచ్చిన నేను విప్పెదను" అని ఆజ్ఞాపించిరి. రాత్రి తాను ఆకట్టుపై నిదురపోయి మరుసటి రోజు శ్రీవారి వద్దకు చేరెను. వారు తమ చేతులతో కట్టు విప్పగా ఆ బ్రాహ్మణుని కంటి చూపు వచ్చి కండ్లు తేటతెల్లగా, కాంతివంతముగా కనబడెను. శ్రీవారు ఆ భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకొనిరి. సంతోషము పట్టలేని ఆ బ్రాహ్మణుడు శ్రీవారి ఎడల భగవంతునితో ప్రార్థించెను. శ్రీవారు ఫకీర్లను, పేదలను, అనాథలను, బ్రాహ్మణులను పిలువనంపి దానధర్మములు చేసి ఆ బ్రాహ్మణునికి బట్టలు, నగదు ఇచ్చి పంపిరి. ఈ మహిమను గురించి అనేక ప్రాంతాలలో చెప్పుకొనసాగిరి.

(తారీఖ్ ఊద్గీర్, దీవాన్ సాహెబ్ బాగ్, రాయపేట మదరాసు)

2. భగవంతునితో ప్రార్థించి వర్షము కురిపించుట :

ఒక సంవత్సరం వర్షము లేక పైర్లు ఎండిపోవుచుండెను. నీరు, మేత లేనందున పశువులు చనిపోసాగాయి. కరువుతో ప్రజలు కష్టనష్టాలకు గురి అగు చుండిరి. సదా దైవధ్యానములో మునిగియుండిన దైవభక్తులు సత్పురుషులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ఖాన్ సాహెబ్ తమ ప్రాంతములోని ప్రతి చెరువు వద్దకు వెళ్ళి పడమటి వైపు తిరిగి కొన్ని గంటలు దైవధ్యానములో లీనమయ్యేడి వారు. చివరికి భగవంతుడు తన భక్తుని మొర ఆలకించి వారు కూర్చున్న స్థలము నుండి చుట్టు ప్రక్కల 10 మైళ్ళ దూరము వరకు రెండు గంటల వ్యవధిలో చెరువులన్ని నిండిపోవునంత వర్షము

కురిపించెను. గ్రామాలందు పండిన కొన్ని పండ్లు ఫలములను శ్రీవారు తెప్పించి ప్రజలకు పంచిపెట్టి తాము మాత్రము ఆ రోజు ఉపవాసముతో గడిపిరి.

ఈ విషయాన్ని గురించి చాలా చోట్ల ప్రజలు చెప్పుకొనేవారు.

జీవితమందే సమాధిని తయారుచేసుకొనుట:

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి గారి అస్థిత్వం మహిమలతో నిండి యుండెను. దేవుని యందు లీనత్వం చెందిన వారు భూత భవిష్యత్ వర్తమాన కాల జ్ఞానము కలిగి యుందురు. ఫలానా సంవత్సరం ఫలానా మాసము ఫలానా తేది, ఫలానా గంటలో దేవుని సన్నిధి చేరుతానని శ్రీవారు వ్రాసిపెట్టిరి. వారి జీవిత కాలమందే ఆనాటి ఉదయగిరి పట్టణమునకు తూర్పున సమాధిని త్రవ్వించి దాని ప్రక్కన ఒక వేప మొక్కను నాటి దానిని జాగ్రత్తగా పెంచుచుండిరి.

వేప చెట్టు ప్రాముఖ్యత:

వివిధ వ్యాధులతో, గ్రహ దోషాలతో బాధపడే స్త్రీ పురుషులు స్వామి వారి సన్నిధి చేరి తమ బాధలను తొలగించమని వేడుకొనేవారు. "మేము మా కొరకు ఈ పట్టణానికి తూర్పు దిక్కున సమాధిని త్రవ్వించి ఒక వేప మొక్కను నాటించినాము. మీరు ప్రతి దినము ఆ వేప చెట్టు వద్దకు వెళ్ళి కొద్ది వేప ఆకును తిని దాని క్రింద కొంత సేపు విశ్రాంతి తీసుకోవలె. ఈ విధంగా ఎనిమిది దినములు చేసిన భగవంతుని దయతో మీ కష్టాలు తీరుతాయి" అని స్వామి చెప్పేవారు. జనులు అలా చేస్తూ తమ బాధల నుండి విముక్తి పొందేవారు.

శ్రీవారి వేపచెట్టు విశేషము:

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారిచే నాటబడిన వేపచెట్టు ఆకు యందు భగవంతుడు చెప్పనలవి కాని తీపి దనమును ప్రసాదించెను. ఆ ఆకును తిని జనము ఆశ్చర్యచకితులయ్యే వారు... వ్యాధిగ్రస్తులు ఆ చెట్టు క్రింద

ఎనిమిది దినములు గడిపి తమ బాధల నుండి విముక్తి పొంది స్వామి సన్నిధి చేరి తాము ఆరోగ్యాన్ని పొందిన విషయాన్ని వెల్లడించేవారు. వారు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్ళునప్పుడు స్వామివారు వారికి కానుకలిచ్చి పంపేవారు. నేడు ఆ చెట్టు ఉన్నను పూర్వపు తీపి గుణాలు మాయమయ్యాయి.

నెల్లూరు కలెక్టరు రాక: నెల్లూరుకు కలెక్టరుగా ఉండిన మిష్టర్ జే.బీ. త్రోవర్స్ అను ఆంగ్లేయుడు శ్రీ కృష్ణదేవరాయల కాలములో ఉదయగిరి కోట చాలా కట్టు దిట్టంగా కట్టబడినదను విషయాన్ని తెలుసుకొని దానిని చూచుటకై తన భార్యాబిడ్డలు ఉద్యోగులను వెంటబెట్టుకొని ఉదయగిరి వచ్చెను. నవాబైన హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి రాజభవన మందు కలెక్టరుకు విందు ఏర్పాటు చేసి గౌరవించిరి.

తమ బిడ్డలను ఉపదేశించుట:

నెల్లూరుజిల్లా ఈస్టు ఇండియా కంపెనీ వారి ఆధీనములోకి వచ్చిన రెండేండ్ల వరకు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి జీవించి యుండిరి. మృత్యువు ఆసన్నమైనప్పుడు తమ ఇద్దరు కుమారులను దగ్గరకు పిలిచి "ఇక నేను బ్రతకను. మీరు సత్ప్రవర్తన కలిగి మంచిపేరు సంపాదించాలి. నేను ఈ పట్టణానికి తూర్పున సమాధిని త్రవ్వించి అచట ఒక వేపమొక్కను నాటియున్నాను. దానిని జాగ్రత్తగా పెంచండి. నేను మరణించగా మీరు నా శరీరాన్ని శుభ్రంగా గుసుల్ (స్నానము) యిచ్చి ఆ సమాధియందు ఉంచవలయును. ప్రక్కన గల వేప చెట్టు నీడ నా సమాధిపై పడునట్లు చేయాలి. తొలి నుండి మాతోవుంటూ ఎంతో విశ్వాసము ప్రాణత్యాగము చూపి మా మేలు కోరిన నలక్క పల్లి అక్కన్న పంతులు, అతని కుటుంబము పట్ల నేనెలా మెలిగానో వారందరిని దగ్గరకు తీసి ఎలా పోషించానో మీరు కూడా అదే విధంగా వారిని పోషించాలి. అతనికి మేము నందిపాడు గ్రామాన్ని ఎలాంటి కప్పము కోరకుండా ఇనాముగా ఇచ్చినాము. మీరు తిరిగి దానిని స్వాధీన పరచుకొనరాదు. వారి నుండి ఎలాంటి శిస్తు వసూలు చేయరాదు. వారి యెడల ప్రేమాభిమానములు చూపాలి". అని ఉపదేశించి కన్నుమూసిరి.

ధనవంతుల పేదల కన్నీటితో మహనీయునికి తుది వీడ్కోలు:

సత్‌ప్రవర్తనగల, సద్గుణశీలురు, దైవభక్తులు, పూర్తిగా షరియత్ సిద్ధాంతాలపై నడిచే హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి ఉదయగిరిని ఒక పవిత్ర భూమిగా మలిచిరి. ఎల్లప్పుడు దైవ చింతనలో ఉండే ఈ నవాబు వద్దకు సుదూర ప్రాంతాల నుండి సైతం అనేకమంది భక్తులు దర్శనార్థం వచ్చేవారు. పరమతసహనం కలిగి భక్తి మార్గాన జీవించిన వీరు 1806 సం. మొహరం నెల 28వ తేది తమ 80వ ఏట పరమపదించి భగవంతుని సాన్నిధ్యాన్ని చేరిరి. ఉదయగిరి పట్టణ పేదలు, ధనవంతులు, ఫకీరులు వీరి గుణ గణాలను దైవభక్తిని ప్రశంసించుచుండిన దూరప్రాంతవాసులు ఆ మహనీయుడు స్వర్గస్థుడైన విషయాన్ని తెలుసుకొని కన్నీరు గార్చిరి. శ్రీవారి జీవితం నిరాడంబరం. వీరు పారమార్థిక గృహస్తునిగా దైవచింతనలో గడిపారు. దానధర్మాలు చేయుటలో ఎముకలేని చెయ్యిగా, మతసమతను పాటించిన మహనీయునిగా ఉండిరని ప్రశంచించుచూ ధనవంతులు, పేదలు వీరిని కన్నీటితో తుది వీడ్కోలు పలికిరి.

వీరి తదనంతరపు మహిమలు:

ఎందరో రోగస్తులు వీరి సమాధి వద్దకు వచ్చి మొక్కుబడులు చేసుకొంటూ దీపారాధన చేసి, సాంబ్రాణి వెలిగించి వేపచెట్టు ఆకును తింటూ, పది పదిహేను దినములు సమాధివద్ద గడిపేవారు. దేవుని కృపతో వారు ఆరోగ్యవంతులై వారి ఇండ్లకు చేరుకొనేవారు. ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రతి గురు, శుక్రవారములలో ఎందరో భక్తులు, వ్యాధిగ్రస్తులు వీరి సమాధి దర్శనార్థము దర్గాకు వచ్చి వీరి కృపకు పాత్రులగుచున్నారు.

గంధ మహోత్సవం:

శ్రీవారి గంధ మహోత్సవం ప్రతి యేట మొహరం నెల 28వ తేదీన జరుగును. ఈ గంధము హక్కుదారులైన సయ్యద్ నూరుల్లా సాహెబ్ వారి ఇంటి నుండి

బయలుదేరి తెల్లవారు జామున దర్గాషరీఫ్ చేరును. ఫాతెహా అనంతరం గంథ ప్రసాదం పంచబడును. ఈ ఉత్సవములో వేలాదిమంది హిందూ ముస్లిం భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులగుచుందురు. ఈ మహోత్సవములో దేశ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన ఖవాలీలచే పాటకచేరి జరుగును. ఈ గంథ మహోత్సవములో పాల్గొనిన దూరప్రాంత భక్తులు ఎంతో సంతోషానుభూతితో తిరిగి తమ తమ ప్రాంతాలకు చేరుకొందురు.

ఈ దైవ భక్తుని, పరిపూర్ణ మానవుని కరుణ కటాక్షపు కిరణాలు నేటికి ఉదయగిరిపై గలవు. ప్రతి శుక్రవారము దర్గాయందు భక్తులు సలాము, ఫాతిహా పఠించి పుణ్యఫలాన్ని శ్రీవారి ఆత్మకు సమర్పించుచుందురు.

సలాములు:

1) అద్దేఖాదర్ ఖాదరీ ఆప్ పె లాఖో-సలాం
సయ్యది షాహీ వలీ ఆప్ పె లాఖో-సలాం
నాయబె అహ్మద్ హై -పీర్ రహమతుల్లాకే మురీద్
ఆప్ జానే హైదరీ ఆప్ పె లాఖో-సలాం
ఆప్ నూరే పంజతన్ నాయబే గౌసే జమన్
జల్వఏ గంజే ఖఫీ ఆప్ పె లాఖో-సలాం
అయ్‌సఖీ ఇబ్నే సఖీ ఆప్ కె దర్ సె కభీ
కబ్‌గయా ఖాలీ కొయీ ఆప్ పె లాఖో-సలాం
హిందుఓ ముస్లింకి హద్ ఆప్‌నే రఖీనహీ-
ఫైజ్‌లియా హర్ కొయీ ఆప్ పె లాఖో-సలాం
హెూకే పరేషాన్ దిల్ దర్ పె జో పహుంచా ఆజీజ్
కర్‌దియా పల్‌మే గనీ ఆప్ పె లాఖో-సలాం

2) అయ్ అబ్దె ఖాదర్ ఖ్వాజా లేలో సలాం హమారా
లేలో సలాం హమారా లేలో సలాం హమారా లేలో సలాం హమారా

చహతే మురీదె ఖ్వాజా నాయబ్ రసూల్ హెూతుం
ఇబ్నే సఖీ హెూ షాహా జానే బతూల్ హెూతుం
కహతే ఖడే హై –ఇస్ జా లేలో సలాం హమారా
మష్హూర్ హై తుంహారీ షానే ఫఖీరీ ఖ్వాజా
తుంనే అమీరి మేభీ కీహై ఫఖీరీ ఖ్వాజా
అయ్ బే నజీర్ రాజా లేలో సలాం హమారా
చారో –తరఫ్ కియేహై –ఎహసాన్‌కీ నిగాహే–
ఆనేనదీ కభీ తుం ఉదగీర్ పే బలాయే –
రహమత్ హై అప్నీ హర్‌జా లేలో సలాం హమారా
దర్‌కో తుంహారె పాకర్ కోయీభీ హాత్ ఉఠాయా
జబ్ భీ అయాజ్ ఆకర్ దామన్ యహా –బిఛాయా
తుం కీన ఆర్జ్ బేజా లేలో సలాం హమారా

3) అబ్ద్ ఖాదర్ వలీ సబ్‌కె అయ్ మెహర్‌బా –
తుంపె లాఖో –దరూద్ తుంపె లాఖో – సలాం
దర్‌పె ఆకే ఎ కహతేహై –సబ్ బే కసా –
తుంపె లాఖో –దరూద్ తుంపె లాఖో – సలాం
ఫఖ్ర కర్‌తేరహే తుంపె నాయబ్ రసూల్
రహమతో – కే బరస్తే హై– రౌజే పె ఫూల్
ఖ్వాజా రహమత్ కా బట్‌తాహై సద్‌ఖా యహా–
తుంపె లాఖో –దరూద్ తుంపె లాఖో – సలాం
ఖాదిమా –సబ్ దరూదో–కొ పఢ్ తే హుయే
దర్‌పె ఆకే ఖడేహై–ఎ కహతేహుయే
ఎక్ నిగాహే కరం వాలిఏ బేకసా–
తుంపె లాఖో–దరూద్ తుంపె లాఖో – సలాం
ఫైజ్ పానేకి సబ్ ఆజ్‌కీ రాత్ హై
ముస్తఫాకె ఘరానేకి ఖైరాత్ హై

ఆప్‌కే హాత్ బట్‌తీహై రహమత్ యహా-
తుంపె లాఖో-దరూద్ తుంపె లాఖో - సలాం
హెూ కరంకీ నజర్ షెహర్ ఊద్‌గీర్ పర్
అర్జ్ కర్తాహై ఖాఖ్ సార్ చౌఖట్ ఉపర్
కోయీ ఝోలీ భీ ఖాలీ రహే నాయహా-
తుంపె లాఖో-దరూద్ తుంపె లాఖో - సలాం

నవాబ్ అజీముద్దౌలా అబ్దుల్ అలా ఖాన్, ఈస్టిండియా కంపెని:-

పై నవాబు కర్ణాటక నిర్వహణాధికారము ఈస్టిండియా కంపెనీకి స్వాధీనపరచెను. కంపెనీ పాలనలో వీరు కర్ణాటక నవాబుగా ఉండిరి. 1801 జూలై 31న కర్ణాటక తొలి రిటైర్డ్ నవాబుగా సింహాసన మధిష్ఠించెను. 18 ఏండ్ల వరకు ఆ పదవిలో కొనసాగెను. వీరి పెద్ద కుమారుడు మునవ్వర్ ఖాన్ ఇతనికి ఇద్దరు కుమారులు, మొహమ్మద్ అలీ వాలజ (వీరి సమాధి తిరుచునాపల్లిలో గలదు) రెండో కుమారుడు అబ్దుల్ వహాబ్ ఖాన్ నెల్లూరుతో పాటు ఉదయగిరి వీరి ఆధీనమందుండెను. అజీముద్దౌలా మరణించిన మూడు మాసములకు 1820లో నవాబు మునవ్వర్ ఖాన్ ఆజంకు తండ్రి పీఠానికి అధిపతి కర్ణాటక గౌరవనవాబుగా అంగీకరించడమైనది. వాలాజాహి కాలములో కూడా సర్వేపల్లి, ఉదయగిరి, సిద్దోటు నవాయత్ ఆధీనమందుండెను.

16. హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ - హజరత్ వజూదీషా

ఈ గ్రంధ రచయిత ఆధ్యాత్మిక గురువు హజరత్ ఖాలిద్ బిన్ జాన్ నిసార్ యార్ జంగ్ హైదరాబాది గారి గురువర్యులు హజరత్ వజూదీ షా రహ. గారికి హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారితో బంధుత్వపు సూచిక:

నజీముద్దీన్ హసన్ ఖాదరీ

↓

మహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేఖ్ సాహెబ్

= ఫాతిమా (అహమద్ అబుతురాబ్ ఖాదరీ గారి కుమార్తె, హజరత్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ పినతల్లి)

↓

అష్రఫ్ సాహెహా = సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్	జైనబ్ సాహెబా = సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ (అష్రఫ్ సాహెబా మరణానంతరం వీరిని వివాహమాడిరి)	రొఖియా సాహెబా = సయ్యద్ మొహియుద్దీన్ మొహి (ఖమ్మం తాలుకా తాహశీలుదారు)

రొఖియా సాహెబా

↓

సయ్యద్ షామొహమ్మద్ (హజరత్ వజుదిషా గారి జేజనాయన) = ఉమ్మతుల్ హబీబ్ ఉర్ఫ్ సాహెబ్ జాది (సయ్యద్ దర్వేష్ కుమార్తె)

↓

సయ్యద్ మొహమ్మద్ అబ్దుల్లా
= 1. ఫాతిమా ఉర్ఫ్ మాజాని (మొహమ్మద్ కరిముల్లా కుమార్తె, వజుదిషా గారి తల్లి)
= 2. రహీమా (మొహమ్మద్ కరీముల్లా కుమార్తె, వజూది షా గారి పినతల్లి

↓

ఒక సోదరి	సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఉర్ఫ్ ఫకీర్ సాహెబ్ మదరాసులో ఉర్దూ పత్రిక "మఖ్ బర్" ఎడిటర్	సయ్యద్ సుల్తాన్ మొహియుద్దీన్ ఉర్ఫ్ పీరాన్ (నెల్లూరు ప్రముఖ ఉర్దూ కవి హబీబుల్లా జుకా అన్న రసాగారి అల్లుడు)	హజరత్ బాదషా మొహియుద్దీన్ వజూదీ (హైదరాబాదు ప్రముఖ సూఫీ) = మహబూబ్‌బీ (నెల్లూరు జిల్లా)	ఖ్వాజా మొహియుద్దీన్ హైదరాబాదు న్యాయవాది, (ఆనాటి పోలీసు కార్యా నిర్వహణశాఖలో ఉండిరి).



పై వంశ వృక్షాన్ని బట్టి హజరత్ వజూదిషా "రహ" గారి జేజనాయన తల్లి రొఖియా సాహెబా హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరి గారికి మరదలు, పిన తల్లి కుమార్తె అగుదురు.

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ లాంటి మహనీయులతో బంధుత్వమున్న హజరత్ వజూదిషా గారి ఆధ్యాత్మిక పరంపర (సిల్‌సిల ఏ వజూదియా) ఉదయగిరిలో ఉన్నందుకు చాలా సంతోషించుచున్నాము.

17. మహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేఖ్ సాహెబ్

మహమ్మద్ హుసైన్ తండ్రి పేరు నజీముద్దీన్ హసన్ ఖాదరీ. మహమ్మద్ హుసైన్ వివాహము వీరి పెద్ద నాయన అహ్మద్ అబుతురాబ్ ఖాదరీ (అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారి తాత) కుమార్తె ఫాతిమా బేగంతో ఆయెను.

సంతానము : వీరికి ఇద్దరు కుమారులు ఆరు మంది కుమార్తెలు కలిగిరి. కుమారులు అహమ్మద్ అబుతురాబ్, మహమ్మద్ గేసుదరాజ్. కుమార్తెలు అష్రఫ్ సాహెబ్, జైనబ్ సాహెబా, పాఛీసాహెబా, సుల్తాన్ సాహెబా, రొఖియా సాహెబా, సకీనా సాహెబా.

హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ మొదట అషరఫ్ సాహెబాను వారి తదుపరి జైనబ్ సాహెబాను వివాహమాడిరి.

మహమ్మద్ హుసైన్ క్రీ.శ. 1806లో సఫర్ నెల 28వ తేది శుక్రవారము తమ 93వ ఏటా ఉదయగిరిలో స్వర్గస్తులైరి. వీరి మనవడు ప్రముఖ పారశీ కవి గులాం మొహియుద్దీన్ షాయఖ్ కవితా రూపములో మరణ తేదిని వ్రాసిరి.

వీరి కుమారులు అహ్మద్ అబుతురాబ్ (సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహబ్ ఖాదరి గారి బావ మరిది) గారికి "ఫిఖ్హా" అనగా ఇస్లాం మత సిద్ధాంతాల పట్ల మంచి అవగాహన వుండెను. వీరు కొంత కాలము ఉదయగిరిలో తమ బావగారైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ గారి వద్ద వుండి తదుపరి తమ బిడ్డలతో మదరాసు వెళ్ళిరి.

18. హజరత్ సయ్యద్ అమీరుద్దీన్ అలీ షా

సయ్యద్ అమీరుద్దీన్ అలీ షా పన్నెండేళ్లు ఉదయగిరి యందు గడిపారు. అరబీ, పారశీ వ్యాకరణకర్తగా ప్రఖ్యాతిగాంచారు. ఎందరో దూరప్రాంతాల నుండి వీరి వద్దకు వచ్చి అరబీ పారశీ అభ్యసించేవారు. హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ (ఏ.ఎస్. పేట) వీరికి ఆధ్యాత్మిక గురువు (ముర్షద్) అగుదురు. వీరు మహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ బహదూర్ గారికి సడుగుడు అగుదురు. సయ్యద్ ఖాసిం కుమారుడైన సయ్యద్ మొహియుద్దీన్ మొహి వీరి పారశీ రచనలు ముప్పది ఏడు పంక్తుల వరకు క్రోడీకరించి రచించారు. ఆ రచన గురించి అమీరుద్దీన్ అలీ షా గారిచే పీఠిక వ్రాయదలచారు. కాని అంతలో అమీరుద్దీన్ ఉదయగిరి నుండి మదరాసు పయనమగుటకు సిద్ధపడ్డారు. ఉదయగిరి జాగీరుదారు, వీరి పీర్ భాయి అయిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారితో చెప్పి ప్రయాణపు ఏర్పాటు గావించుకొన్నారు. మదరాసు బయలుదేరే ముందు వీరి ఆరోగ్యము దెబ్బతిన్నది.

1208 హిజ్రీ అనగా 1793 సంవత్సరం జీ ఖాయిదా నెల 4వ తేదీన వీరు కరూర్ (బహుశా గూడూరు కావచ్చు) చేరిన మీదట అచ్చట స్వర్గస్తులయ్యారు. నాయుడుపేట యందు వీరికి సమాధిగావించబడెను. ప్రతి సంవత్సరం మార్చి నెల 24వ తేది వీరి గంధ మహోత్సవం వైభవంగా జరుగుచున్నది. ఈ గంధం కమిటి అధ్యక్షులు దోర్నాదుల చెంచు కృష్ణయ్య గారి ఇంటి నుండి ఊరేగింపుగా దర్గా చేరును. హిందూ ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవములో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులగుచున్నారు.

వీరి మరణ తేదిని ప్రఖ్యాత పారశీ, ఉర్దూ సాహితీపరులు, కవి మౌలానా బాఖర్ ఆగా పారశీ భాషలో ఇలా వ్రాసిరి.

ఖిబ్లఅం హజరత్ అమీరుద్దీన్ బూద్ జాతిష్ గనీమత్ అయామ్
బాదజ్ అస్బాబ్ దునీవీ ఆజాద్ దాష్త్ ఖుద్ రా మీమ్ గుంనాంమ్

అర్థం : నా దిశ నా గమ్యం అమీరుద్దీన్. వారి స్వభావం విశేషమైనది. వారు ప్రాపంచిక వస్తువులతో దూరంగా ఉండేవారు. జనుల ముందు వారి స్థానాన్ని బయట పెట్టేవారు కాదు.

బూద్ బాయిల్మ్ ఓ జహద్ బాయీ– దాష్త్
దర్ఫన్ ఫార్మి మహారత్ తామ్

అర్థం : వారి యందు ధర్మనిష్ఠ పారశీ భాషపై మంచి పట్టు గలదు.

దర్ ఫన్ సదర్ బూద్ ఉస్తాదం
రహమతిష్ బాద్ అజ్ ఖుదాయే అనాం

అర్థం : నా గురువు నేర్పులో ముందు ఉండిరి. వారిపై దేవుని కరుణ ఉండుగాక.

గుఫ్త్ లబైక్ బహజారా– షౌఖ్
చూ– రశీద్ అజ్ హుజూర్ ఖాస్ పయామ్

అర్థం : దేవుని దర్బారు నుండి పిలుపు రాగా వేయి సంతోషాలతో 'హాజరైతి'ననెను.

సర్ ఫరో బర్దం అజ్ పయే తారీఖ్
దగర్ బయాన్ గం బదర్ద్ తమామ్

కె జద్ అజ్ ఖాతిర్ హుజీ–ఆగాహ

అరఫ్త నాజా– బసూయెదార్ సలాం

అర్థం : బరువైన హృదయంతో నేను వారి మరణతిథిపై ఆలోచించాను. బాధతో నిండిన నా హృదయం తెలిపినదేమనగా వారు సగర్వంగా భగవంతుని సన్నిధి చేరారు.

అమీరుద్దీన్ అలీ దర్ ఇల్మ్ ఒ దర్ ఫజ్ల్

కెమి జద్ దర్ జహా– అజ్ ఖుష్ బయా– కూస్

అర్థం : అమీరుద్దీన్ అలీ ప్రపంచంలో శాస్త్ర జ్ఞానమందు, విద్యా పాండిత్య మందు తమ తరుపున ఢంకా మ్రోగించారు.

బషహర్ జీ ఖాద తారీఖ్ దయెక్

షుదా అజ్ ఖిల్లత్ అజ్రా ఇ చూ మల్బూస్

బరోజ్ జుమ్మ ఒ దర్ పేట్ నాయర్

మొఖీమ్ ఖుల్ద్ షుద్ అజ్ ఫజ్ల ఖుదుస్

అర్థం : జీ ఖైదా నెల 11వ తేదీన ప్రసాదించబడిన భాగ్యం పూర్తి అయినది. దేవుని దయతో శుక్రవారం నాడు నాయుడుపేట యందు శాశ్వతంగా ఉండిపోయారు.

వలం అజ్ దీదఖూ– బారీద్ ఒ మీ గుఫ్త్

ఖిరద్ అజ్ దర్ద్ ఒ గం అఫ్సోస్ అఫ్సోస్

అర్థం : నా హృదయం కనుల ద్వారా రక్తాన్ని కురిపించి బాధతో నిండిపోయే.

మొహి తారిఖ్ గోయద్ బాద్ ఫోతిష్

అమీరుద్దీన్ రాషిద్ జాఫిర్దోస్

అర్థం : వారు మరణించగా మరణ తిథిని మొహి ఇలా అన్నారు. అమీరుద్దిన్ ప్రాణం స్వర్గమందు ఉంటుంది.

హజరత్ అమీరుద్దీన్ అలీషా ఇరువది ఒక్క సంవత్సరాలు వేలాది మందికి విద్యను బోధించిరి. వీరి రచన "రుఖ్ ఆతె అమీరి" అను పారశీ ప్రతి మదరాసులో మౌల్వీ గులాం మొహమ్మద్ మస్తు ఫిద్దౌలా బహదూర్ గారి గ్రంధాలయమందు

గలదు. ఇది 742 పేజీలతో కూడిన పుస్తకము. ప్రతి పేజి యందు 15 పంక్తులుగలవు. ఇందులో ఆనాటి స్థానిక, ఆధ్యాత్మిక రాజకీయ విషయాలు గలవు. ఈ పుస్తకాన్ని హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరి గారి సడ్డుగుడు ఖమ్మం తాలూక తహశీల్‌దారు మొహియుద్దీన్ మొహి కూర్చారు. వీరు కవి కూడాను. వీరి కలము పేరు "మొహి" వీరు క్రీ.శ. 1815లో స్వర్గస్తులయ్యారు. వీరి శ్రీమతి పేరు రొఖియాబీ. వీరు మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఉర్ఫ్ షేక్ సాహెబ్‌కు కుమార్తె అగుదురు.

సయ్యద్ మొహియుద్దీన్ "మొహి" హజరత్ వజూదిషా రహ. గారికి ముత్తాత అగుదురు.

19. హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖైరుద్దీన్ షాయఖ్

హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖైరుద్దీన్ కలము పేరు షాయఖ్. తండ్రి పేరు సయ్యద్ మాసూం ఖాన్ ఇమామి. నవాబ్ వాలాజా మంత్రి అయిన సయ్యద్ ఆసిం ఖాన్ ఇమామికు సవతి తమ్ముడు అగుదురు. 1188 హి. క్రీ.శ. 1744లో షాయఖ్ ఉదయగిరి యందు మౌల్వీ సయ్యద్ అమీరుద్దీన్ అలీ వద్ద పారసీ నేర్చెను. అమీరుద్దీన్ అహ్మద్ వద్ద అరబీ పూర్తిగావించారు. తమ పారసీ కవితలను సరిదిద్దుటకై మౌలానా బాఖర్ ఆగా ముందు ఉంచేవారు. వీరు అరబ్బీలో కూడా కవిత్వం అల్లే వారు. అనతి కాలములోనే గొప్ప బోధకుని హోదా పొందారు. నవాబ్ గులాంగౌస్ ఖాన్ వీరి కవిత్వాన్నీ, భాషా నైపుణ్యాన్ని గురించి పొగిడారు. మౌలానా బాఖర్ ఆగా తదుపరి ఎందరో విద్యార్థులు తమ కవితలను సరిదిద్దుటకై షాయఖ్ ముందు ఉంచేవారు.

షాయఖ్ 1232హి. క్రీ.శ. 1816లో హైదరాబాదు వలస వెళ్ళారు. అచ్చట రాజా చందూలాల్ వీరిని గౌరవ మర్యాదలతో స్వాగతం పలికారు. నెలకు ఐదు వందల రూపాయలు గౌరవభృతి నిర్ణయించారు. జీవితపు చివరి రోజులు ఒక గొప్ప ఉపాధ్యాయునిగా, కవిగా గడిపారు. వీరు 1242 హి. క్రీ.శ. 1826లో స్వర్గస్తులయ్యారు. "ఇన్ షా – ఏ–షాయఖ్" పేరుతో దీవాన్ (కవితా సంకలనం) వదిలారు.

20. హజరత్ మౌల్వీ మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ బహదూర్

మౌల్వీ మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ బహదూర్ క్రీ.శ. 1752 రంజాన్ నెల 17వ తేదీ శుక్రవారం ఆర్కాటులో జన్మించారు. వీరి తండ్రి పేరు మౌల్వీనాసిరుద్దీన్ మొహమ్మద్. మొహమ్మద్ గౌస్ జ్ఞాపకశక్తి చాలా బలహీనంగా ఉండేది. వీరి జేజనాయన ఖాజీ నిజాముద్దీన్ అహ్మద్ సగైర్ తమ అంతర దృష్టిని వీరిపై ఉంచి ప్రార్థించారు. మొహమ్మద్ గౌస్ స్వప్నంలో హజరత్ షేఖ్ అబ్దుల్ ఖాదర్ జీలాని మహబూబె సుబహానీ రజి. గారిని చూశారు. వారు తమ పవిత్ర చేతితో మొహమ్మద్ గౌస్‌కు జమ్ జమ్ నీటిని త్రాపించారు. నిద్దుర లేవగా వారి యందు ఒక ప్రత్యేక మార్పు కనబడెను. వారి జేజనాయనతో స్వప్నమును గురించి వివరించగా అధిక విద్య లభిస్తుందని పలికారు. అప్పటి నుంచి జ్ఞాపకశక్తిలో యెవ్వరు ఆయనకు సాటిరాలేకపోయారు. అతి తక్కువ కాలములో ఎంతో జ్ఞానం సముపార్జించుకొన్నారు.

రాయవేలూరు పాఠశాలలో ప్రవేశం :

మౌలానా బాఖర్ ఆగా గారి ఆధ్యాత్మిక గురువర్యులు మౌలానా సయ్యద్‌షా అబుల్ హసన్ ఖుర్‌బి గారు క్రీ.శ. 1768లో రాయవేలూరులో స్వర్గస్తులయ్యారు. వారి స్థానంలో వారి కుమారుడు మౌలానా సయ్యద్‌షా అబ్దుల్ లతీఫ్ జూఖీఅల్ ముతూఫీ ఉండేవారు. ఆ పాఠశాలలో మౌల్వీబాఖర్ ఆగా వెల్లూరి అల్ ముతూఫి విద్యార్థులకు పారశీ ఇతర శాస్త్రములు బోధించేవారు. ఆ కాలములో ఫిఖ్హ బోధించడంలో మౌల్వీ అమీనుద్దీన్ అహ్మద్‌ఖాన్ ప్రఖ్యాతిగాంచారు. విద్యనార్జించుటకు మొహమ్మద్‌గౌస్‌ను వారి తండ్రి అమీనుద్దీన్ అహ్మద్ ఖాన్ వద్దకు పంపారు.

ప్రఖ్యాత గ్రంథ నకలుగావించుట :

మౌల్వీ అమీనుద్దీన్ అహ్మద్‌ఖాన్ వద్ద చదివిన "ఇల్మ్ మనాజిర" అనే తర్క గ్రంథము "అల్ ఆదాబుల్ బాఖియా ఫి షర రసాలతు షరీఫియా లాబదుల్ బాఖి బిన్ గౌసుల్ ఇస్లాముల్ సిద్దీఖి"ని మొహమ్మద్ గౌస్ తమ చేతితో నకలుగావించారు.

వేదాంత విద్య (తసవ్వుఫ్) ఆర్జన :

తిరుచునాపల్లిలో ఆనాటి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మౌల్వీ వలియుల్లా బిన్ మొహమ్మద్ అబ్దుల్ అజీముల్ బిహారి గారి వద్ద వేదాంత విద్య నేర్చి. 1782లో మొహమ్మద్ బిన్ సులైమానల్ జజూలీ గారి ప్రముఖ గ్రంధము "దలాయలుల్ ఖైరాత్" నిత్యపారాయణముగావించుటకు అనుమతి పొందారు.

హదీసు, సుభాషితములు చదివి వినిపించుట :

మదరాసు వచ్చి నవాబ్ అమీరుల్ ఉమ్రా వద్ద ఉద్యోగములో చేరిన మొహమ్మద్ గౌస్ రబీవుల్ అవ్వల్, రబీవుస్సాని ప్రత్యేక దినములందు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం, జగత్ గురువు హజరత్ మహబూబె సుబహాని రజి.లను గురించి హదీసు, జీవిత చరిత్రలు చదివి వినిపించేవారు. నవాబు స్వర్గస్తులైనంత వరకు ఈ పద్ధతి కొనసాగెను.

కలలో ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొ. గారిని దర్శించుకొనుట:

నవాబ్ మొహమ్మద్ అలీ వాలజా స్థాపించిన పాఠశాలయందు ప్రధానోపాధ్యాయునిగా పనిచేయుటకు 1790లో బీహారు నుండి ప్రఖ్యాత పండితులు మౌల్వీ అబ్దుల్ అలీ బహరుల్ ఉలూంను మదరాసు ఆహ్వానించడమైనది. మదరాసు ప్రక్క ప్రాంతాల విద్యార్థులు ఆ పండితునితో లాభము పొందేవారు. మొహమ్మద్ గౌస్ కూడా ఆ పాఠశాలలో చేరదలచి ఏదో కారణాన విరమించుకొన్నారు. చివరికి వారిజేజనాయన ఖాజి నిజాముద్దీన్ అహ్మద్ సగైర్ చెప్పిన విధంగా ప్రశ్న చూచారు. ఆ రాత్రి స్వప్నములో హజరత్ ప్రవక్త సొ. వారి అనుచరులతోటి ఒక సమూహమందు

విచ్చేసిరి. మౌలానా అబ్దుల్ అలీ కూడా అచ్చట ఉండిరి. వారి ముఖము హజరత్ ప్రవక్తసా. ముఖము వలె కనబడుచున్నది. హజరత్ ప్రవక్త సా. మొహమ్మద్ గౌస్‌కు జంజం నీటిని త్రాపించమని అబూబకర్ సిద్దీఖ్‌కు ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞానుసారం కడుపునిండుగా అనగా కనుల నుండి నీరు వచ్చునంత వరకు నీటిని త్రాపించడమైనది. ఆ స్థితిలో మెలకువరాగా ఎంతో మనశ్శాంతి, సంతోషానుభూతి కలిగెను. బంధుత్వంలో చిన్నాయన అయిన మౌల్వీ గులాం అబ్దుల్ ఖాదర్ (మహమ్మద్ అబ్దుల్లా షహీద్ మనవడు)కు స్వప్నము వివరించగా జంజం నీటితో కడుపు నిండిపోవుట అధిక విద్యనొసంగునని స్వప్న ఫలం వెల్లడించిరి.

మౌలానా అబ్దుల్ అలీ వద్ద విద్యనార్జించుట :

మౌల్వీ మొహమ్మద్ గౌస్ స్వప్నము చూచిన తదుపరి అబ్దుల్ అలీ గారి వద్ద తర్క, వేదాంత గ్రంధాలు చదివారు.

నవాబు గారి శిక్షకునిగా పనిచేయుట :

నవాబు అమీరుల్ ఉమ్రా తమ కుమారుని శిక్షకునిగా మొహమ్మద్ గౌస్‌ను నియమించారు. ముందుకెళ్లి ఆ శిష్యుడే 1801లో నవాబు అజీముద్దౌలా బిరుదుతో సింహాసనమధిష్టించెను.

సిద్దోటు (సిద్ధవటము) చేరుట :

మొహమ్మద్ అలీ వాలజా మరణించగా వారి పెద్దకుమారుడు ఉందతుల్ ఉమ్రా 6 సంవత్సరములు పరిపాలించెను. కాని మొహమ్మద్ గౌస్‌కు తమ అభివృద్ధి అవకాశాలు కానరాలేదు. తమ ఇద్దరి కుమార్తెల వివాహం చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుటకై హైదరాబాదు వెళ్లదలచారు. తమ శ్రీమతి మరియు ఇద్దరు బిడ్డలతో 1798 రబ్బివుల్ అవ్వల్ మాసములో మదరాసు నుండి హైదరాబాదు బయలుదేరారు. అదే నెల 20వ తేదీన కడప జిల్లా సిద్దోటు చేరారు. ఇచ్చట తమ సడ్డుగుడు అయిన సయ్యద్ మొహియుద్దీన్ (హజరత్ వజూదిషా ముత్తాత) కుమారుడు సయ్యద్ ఖాసింతో తమ పెద్ద కూతురు ఫాతిమాకు వివాహమై వుండెను. తమ శ్రీమతిని, ఇద్దరు బిడ్డలను

అచ్చట వదిలి రబివుల్ అవ్వల్ నెల 25వ తేదీన సిద్దోటు నుండి బయలుదేరి రబ్బివుల్ ఆఖర్ నెల 14వ తేదిన హైదరాబాదు చేరారు. సిద్దోటులో ఒక దు:ఖ కరమైన సంఘటన జరిగెను. వారి శ్రీమతి హలీమాబీ పాముకాటుకు గురియై రబ్బివుల్ ఆఖర్ నెల 30వ తేదిన మరణించారు. ఆనాటికి ఇద్దరు కుమారులు మౌల్వీ అబ్దుల్ వహాబ్ 5సం. మౌల్వీ మొహమ్మద్ సిబగ్‌తుల్లా 2సం. వయస్సు కలిగి ఉండిరి. వీరే మదరుల్ ఉమ్రా, ఖాజి బదరుద్దౌలా అను బిరుదులతో ప్రసిద్ధిగాంచారు.

హదరాబాదులో ఒక మజ్‌జూబ్ తటస్థపడుట :

మొహమ్మద్ గౌస్ హైదరాబాదులో ఉండగా ఒక రోజు ఒక మజ్‌జూబ్ (సమాధి నిష్టుడు) తటస్థపడి "మీరిచ్చటకు ఎందుకు వచ్చారు? ఇచ్చట మీకు ఎటువంటి స్థానము లేదు" అని పలికెను. కష్టాలలో ఉన్న గౌస్ ఈ మాట విని ఇంకను సహనము కోల్పోయారు. మంచి పదవులు దొరకు ఆశ ఆడి ఆశ ఆయెను.

ఉదయగిరికి ప్రయాణమైన మొహమ్మద్ గౌస్ :

మొహమ్మద్ గౌస్ 1800లో సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారి ఆహ్వానం మేరకు తిరిగి ఉదయగిరి చేరుటకు పల్లకీలో ప్రయాణమైరి. అడవి గుండ కొంత దూరం రాగా ఒక పెద్ద పులి ఎదురాయెను. దానిని చూచి భయభ్రాంతులైన పల్లకీ మోయువారు పల్లకి వదలి అడవిలో పారిపోయారు. కొంతసేపటి తరువాత మెల్లగా వచ్చి చూడగా అచ్చట పెద్దపులి లేదు. పల్లకిలో ధైర్యంగా కూర్చొన్న మొహమ్మద్ గౌస్ యేదో పఠించుచున్నారు. మీకు పెద్దపులి యేమీ చేయలేదా? అని వారు అడుగగా యేమి చేయలేదు. మీకు కూడా యేమిచేయదు అని జవాబిచ్చారు. పల్లకిలో కూర్చొని హజరత్ బుసెరి రహ. వారి ఖసీదా "బుర్దాషరీఫ్" పఠించుచుండిరి. ఉదయగిరికి చేరిన మొహమ్మద్ గౌస్‌కు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ వారి కుమారుడు సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ సకల గౌరవ మర్యాదలతో చూచారు. వారి ఖర్చులకై నెలకు 15 హోణులు అనగా యాబది రెండున్నర రూపాయలు నిర్ణయించారు. గౌస్ గారి జేజమ్మ ఆగ్నా సాహెబా ఉరఫ్ మా–సాహెబా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారికి పినతల్లి అగుదురు. అదే సం. జమాదిఉస్సాని నెల 13వ తేదిన

ఉదయగిరి నుండి సిద్దోటు చేరి ప్రముఖ కవి మౌల్వీ గులాం మొహియుద్దీన్ మౌజిజ్‌కు తమ మనుమరాలు హలీమాబీ జన్మించిన విషయాన్ని తెలుపుటకు సంతోషించుచు ఒక ఉత్తరం, రమజాన్ నెల 17వ తేదిన మరో ఉత్తరం వ్రాశారు. వారు తమ కుమార్తె ఫాతిమా బేగం పురుడు తదుపరి తల్లి బిడ్డను వెంటబెట్టుకొని మరల ఉదయగిరి చేరుకొన్నారు. వీరితో పాటు వీరి తల్లి హుసేన్‌బీ, ఇద్దరు కుమారులుండిరి. వీరు ఉదయగిరిలో ఉన్నంత కాలం పఠనములో, విద్యార్థులను బోధించుటలో గడిపారు.

1801లో మదరాసు చేరుట :

1801 జమాదియుల్ అవ్వల్ నెల ఒకటవ తేదీన ఉదయగిరి నుండి మదరాసు చేరారు. కొంత కాలానికి అమీరుల్ ఉమ్రా కుమారుడు అబ్దుల్ అలీఖాన్‌ను "నవాబ్ అజీముద్దౌలా" అను బిరుదాంకితంగావించి సింహాసనముపై కూర్చుండబెట్టారు. మౌలానా బాఖర్ ఆగా గారి సిఫారసుతో మౌల్వీ మొహమ్మద్ గౌస్‌ను నవాబ్ అజీముద్దౌలా నెలసరి 130/-లు వేతనముతో తమ దీవానుగా నియమించుకొనెను. 9వ తేదీన దీవాను పదవి నలంకరించెను. ప్రజల వినతి పత్రాలను స్వీకరించి నవాబు అజీముద్దౌలా ముందు ఉంచేవారు.

గొప్ప బిరుదులతో నవాబు గారిచే సత్కరింపబడుట :

మొహమ్మద్ గౌస్ నిజాయితీగా తమ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చుచుండగా నవాబుగారు వీరి గుణగణాలతో ప్రభావితులై 1804 జీఖాయిదా నెల 17వ తేదీన తమ ఆజ్ఞాపత్రము ద్వారా "షర్ఫుల్ ముల్క్ షర్ఫుద్దౌలా గాలిబ్ జంగ్" లాంటి గొప్ప బిరుదులతో సత్కరించిరి. నౌబత్ (నగారావాద్యము) పల్లకి, అల్లకపు అంచు కుచ్చు గల జండా, నగారా, ఐదువేల గుర్రాలు, ఏనుగులు ఉంచుకొను అధికారము వీరికి ఇవ్వబడినది.

నవాబుగారి ఆస్తులు - మౌల్వీ మొహమ్మద్ గౌస్ :

కర్ణాటక రాజ్యాన్ని ఆంగ్లేయులు వశపరచుకొని అన్ని జిల్లాలకు ఈస్టు ఇండియా కంపెని తరపున కలెక్టర్‌లను తహశీలుదారులను నియమించడం జరిగినది. మదరాసు,

హైదరాబాదు, నథర్ నగర్, సాత్‌గఢ్ నందు గల నవాబు గారి సొంత ఆస్తుల నిర్వాహక బాధ్యత వహించుటకై నిజాయితీగల వ్యక్తులను ఏర్పాటు చేయు బాధ్యతను మౌల్వీ మొహమ్మద్ గౌస్ పై ఉంచడమైనది.

ఒక సంవత్సరము గడిచిన మీదట 1805 జీహజ్జ నెల 9వ తేదిన కర్ణాటక నవాబు అజీముద్దౌలా తరపున మౌల్వీ మొహమ్మద్ గౌస్ గారికి ఉన్నత హోదా పీఠాన్ని మంజూరు చేయబడినది. వారికి సకల గౌరవ మర్యాదలు లభించుచుండెను. కాని నవాబుగారి అనవసరమైన ఖర్చులను ఆపుట వీరి వల్ల కాలేక పోయెను. అదియును గాక ఆంగ్లేయుల పాలనలో ఇస్లాం షరీయత్ నిబంధనలను అమలుపరచుట వీరికి సాధ్యపడలేదు. అందువలన మూడు సంవత్సరములు పనిచేసి 1808 రమజాన్ నెల 11వ తేదిన తమ పదవికి రాజీనామ చేసిరి. మొహమ్మద్ గౌస్ బహుశా కోపంతో రాజీనామా చేసి ఉంటారని నవాబుగారు అనుమానపడ్డారు.

ప్రఖ్యాత రచయితగా బోధకునిగా మొహమ్మద్ గౌస్ :

తమ జీవితపు చివరి 15 సంవత్సరాలు బోధనలో, అరబి, పారశి ముప్పదిఒక్క గ్రంధాల రచనలో, దైవ ప్రార్ధన, ఆధ్యాత్మిక సాధనలో గడిపారు. వీరి కుమార్తె ఫాతిమా భర్త గారైన సయ్యద్ మొహమ్మద్ ఖాసిం నవాజ్ ఖాన్ హజరత్ వజుదిషా గారి జేజనాయన సయ్యద్ షా మొహమ్మద్‌కు అన్న గారగుదురు.

మౌల్వీ మొహమ్మద్ గౌస్ స్వర్గస్తులగుట :

ప్రముఖ పండితునిగా, బోధకునిగా ప్రఖ్యాత రచయితగా నిజాయితీపరునిగా దక్షిణ భారతదేశమందు ప్రసిద్ధిగాంచిన మౌల్వీ మొహమ్మద్ గౌస్ 1992 సం. సఫర్ నెల 11వ తేది శనివారము రాత్రి స్వర్గస్తులయ్యారు. మదరాసులో వాలజా మశీదు ఆవరణలో ఉత్తరాన మౌల్వీ వజీయుల్లా అల్ ముతూఫీ గారి సమాధి ప్రక్కన వీరికి సమాధి గావించబడినది. వీరి రెండవ కుమారుడు. ఖాజీ బదరుద్దౌలా "రిజ్వానుల్లా అలైహ్"గా మరణ తిధిని తీశారు.

21.హజరత్ మౌల్వీ గులాం మొహియుద్దీన్ మౌజిజ్

మౌల్వీ గులాం మొహియుద్దీన్ మౌజిజ్ 1759లో ఆర్కాటులో జన్మించారు. వీరి తండ్రి పేరు మహమ్మద్ నదీముల్లా. మౌజిజ్ ఉదయగిరి నివాసి అమీరుద్దీన్ అలీషా వద్ద అరబ్బీ నేర్చారు. ఎన్ని కష్టాలు యెదురైనను వీరు ఎవరి ముందు చేయి చాచలేదు. అజీముద్దౌలా నవాబుకాక ముందు వారికి ట్యూటర్‌గా ఉండినారు. నవాబైన పిదప మదారుల్ ముహాఫీ (దీవాణము) అను పదవి స్వీకరించమని కోరగా అందుకు మౌజిజ్ అంగీకరించలేదు.

మౌజిజ్ ఎల్లప్పుడు ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం గురించి నాతియా (స్తోత్రము), ఔలియా అల్లా (దైవ ప్రియులను) గురించి మన్ఖీబత్ వ్రాస్తూ ఉండేవారు. వీరు ప్రవక్త హజరత్ మొహమ్మద్‌సొల్లెల్లాహు అలైహివసల్లం, జగద్గురు హజరత్ షేక్ అబ్దుల్ ఖాదర్ జీలాని మహబూబె సుబహానీ, మహనీయుల స్తుతి రక్షణకు మార్గమని భావించేవారు. వీరు 1813లో స్వర్గస్తులయ్యారు.

మౌజిజ్ గారి భక్తి రస ఆధ్యాత్మిక కవితలు :

కజ్‌రవీ సె చర్ఖ్‌కె మౌజిజ్ న దర్నా జీన్‌హార్

తూ గులామె మొహిద్దీన్ హై హర్‌బలాసే పాక్ హై

అర్థము : ఓ మౌజిజ్ ఆకాశపు దుష్టశక్తులతో నీవు భయపడవలదు. నీవు మొహియుద్దీన్ రజి. గులామువి. ఏ దుష్టశక్తినీ దరిచేరదు.

జొసూరత్ తెరీ అయ్ సనమ్ దేఖ్‌తేహై-

సనం ఖాన ఐనే హరం దేఖతేహై-

అర్థము : ఓ ప్రియురాల! మేము తిలకించే నీ మోమును, నీవు వెలసిన ఆలయాన్ని మేము కాబాగా చూచుచున్నాము.

తెరే నాజ్ కి సర్‌గిరానీకె ఆగే

సరే అర్ష్ ఆజంకొ ఖం దేఖ్‌తే హై-

అర్థము : నీ ప్రసంశమైన శ్రేష్ఠమైన లక్షణాల ఎదుట, ఆకాశమందు గల భగవంతుని సింహాసనం సిరస్సువంచుట చూచుచున్నాము.

హమీ కాబఓ దైర్ సే కుఛ్ నహీ-కాం

కె హర్‌జా తెరా జల్వ హం దేఖ్‌తే హై-

అర్థము : మాకు మందిరంతో మసీదుతో పనిలేదు, ప్రతిచోట నీ ప్రకాశాన్ని దర్శించుచున్నాము.

గర్ షౌఖ్ హై బఖాకా దిల్ మే తెరే అయ్ ఫానీ

హస్తీక హుర్ఫ్ లూహ్ ఖాతిర్ సతే మిటాలే

బిన్ తేరె కోయీ ఉస్కా వాలీ నగీ-హై యా గౌస్

మౌజిజ్ కి ఆబురూ కో దోజగ్‌మె తూ బచాలే

అర్థము : ఓ నాశనమగువాడా! అవినాశత్వపు కోరిక నీయందు వుంటే నేను నాది అనే భావన నీ హృదయ ఫలకం నుండి చెరుపుకొనుము. ఓ గౌసె ఆజం రజి. మీరు తప్ప మౌజిజ్‌కు హితుడు లేడు. ఇరు లోకాలందు అతని మానమును కాపాడండి.

ముర్షద్ షూద్ బసూమా దారాన్ ఆస్మాన్

అజ్ సిద్‌ఖ్ హర్‌కె పీర్ మొగాన్ రా మురీద్ షుద్

అర్థము : మత్తును త్రాపు ఆధ్యాత్మిక గురువు వద్ద పవిత్ర మనస్సుతో శిష్యుడగు వ్యక్తి ఆకాశమందు ధర్మనిష్ఠ గల వారికి మార్గదర్శి అగును.

అజ్ జల్వయే తూ దర్‌మన్ షూరిదా సర్ యఖీన్

మజ్‌మూన్ నహ్‌ను అఖ్ రబ్ హబ్ లీల్ వరీద్ షుద్

అర్ధము : నీ సాక్షాత్కారముతో నా అస్తిత్వము కలత చెందెను. నా స్థితి “నహ్‌ను అఖ్‌రబ్ హబ్‌లిల్ వరీద్” (నేను నీ జీవనాడి కంటే దగ్గర గలను) అనగా దేవుని స్వభావము నా అస్థిత్వములో రక్తములా వ్యాపించియున్నది.

మౌజిజ్ బబాబ్ ఆలెనబి కున్ రుఖ్ మురాద్

జీ–దర్ షునీదయె కె కసినా ఉమీద్ షుద్

అర్ధము : మౌజిజ్ నీవు నిరాశ నిస్పృహకు లోనైనచో ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం వారి వంశపు ద్వారము వద్దకు పొమ్ము. ఏలననగా ఆ ద్వారము నుండి ప్రతి నిరాశ పరుని ఆశ నెరవేరును.

22. హజరత్ హకీం గులాం అలీ మూసా రజాఖాన్ రాయఖ్

హజరత్ హకీం గులాం మూసా రజాఖాన్ రాయఖ్ 1180 హి. క్రీ.శ 1766లో ఆర్కాటులోని మహమ్మదాపూర్‌లో జన్మించారు. వీరి తండ్రి పేరు హకీం రుక్నుద్దీన్ హసన్ నాయతీ. వీరి జేజనాయన హకీం బాఖిర్ హుసైన్ ఖాన్ గొప్ప వైద్యులు. ఆర్కాటుపై హైదర్ అలీఖాన్ (మైసూరు యుద్ధము) దండెత్తినప్పుడు వీరి కుటుంబము ఉదయగిరి చేరిపోయెను. వీరు సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ వారి దర్బారులో నియమించబడ్డారు. ఇచ్చట రాయఖ్ అరబీ, పారసీ సయ్యద్ అమీరుద్దీన్ అలీ వద్ద నేర్చారు. కొంత కాలానికి ఉదయగిరి నుండి మదరాసు చేరి మౌలానా బాఖర్ ఆగా వద్ద చదువు పూర్తి గావించి వారి వద్దనే అరబీ, పారసీ పద్య, గద్య రచనలు నేర్చుకొన్నారు. వీరు మంచి సాహితీవేత్త, వ్యాకరణ నిపుణుడు. జీవితమందు కవిత్వాన్ని వీడలేదు. నవాబ్ ఉందతుల్ ఉమ్రా కాలంలో ఆర్కాటులో వీరు మున్షీగా నియమించబడ్డారు. ఉందతుల్ ఉమ్రా మరణానంతరం వీరు తిరిగి మదరాసు చేరిన మీదట నవాబ్ ఆజంజా వీరిని కోర్టులో వైద్యులుగాను, వారి ప్రైవేటు కార్యదర్శిగాను నియమించుకొనెను. వీరి కలము పేరు "రాయఖ్".

నవాబ్ ఆజంజా "సిరాజుత్త వారిఖ్" అను గ్రంథ రచన బాధ్యత వీరికి అప్పగించారు. తమ రచనలందు ప్రముఖ పారసీ కవులు బేదిల్, జుహూరి అబుల్ ఫజ్ల శైలిని అనుకరించుటకు ప్రయత్నించారు. 1795లో "గుల్‌దస్త కర్ణాటక్" పేరుతో కర్ణాటక కవులను గురించి వ్రాశారు.

నవాబ్ ఆజంజా చే 1240 హి.క్రి.శ 1824 సం. జిల్ హజ్ నెల 29తేదీన మక్కాకు పంపబడిన మెట్ల సెట్టును పవిత్ర స్థలపు ద్వారమునకు బిగించబడినదను విషయము తెలుసుకొనిన రాయఖ్ నవాబుకు అభినందనలు తెలుపుచు ఖసీదా వ్రాశారు. వీరు 1248 హి.క్రి.శ 1833 రజబ్ నెల 5వ తేదీన స్వర్గస్తులయ్యారు.

23. హజరత్ అబూ సయీద్ నక్ష్ బందీ వాలా

హజరత్ అబూ సయీద్ 1190 హిజ్రీ అనగా 1776లో అనుమ సముద్రం పేట (రహమతాబాదు)లో జన్మించారు. వీరి తండ్రి పేరు హజరత్ అబూతయ్యబ్ ఇమామి. జేజనాయన పేరు హజరత్ సయ్యద్ జైనుల్ ఆబిదీన్ ఇమామి. హజరత్ ఖ్వాజా నాయబె రసూల్ స్వర్గస్తులయ్యే నాటికి వీరి వయస్సు ఐదేండ్లు. అనుమసముద్రంపేట నుండి రెండు మైళ్ళ దూరములో గల చందలూరు పాడులో నివసించేవారు. వీరు ఖాదరియా, నఖష్ బందియా పరంపరలో షారఫీయుద్దీన్ ఖందహారి వద్ద మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) అయ్యారు. తమ ఆధ్యాత్మిక గురువు గారి పట్ల ఎంతో భక్తి ప్రేమ కలిగి ఉండేవారు. ప్రారంభ విద్య పారశీ హజరత్ అమీరుద్దీన్ ఉదయగిరి గారి వద్ద అభ్యసించారు. మౌల్వీ షా అమీనుద్దీన్ నెల్లూరు గారి వద్ద అరబీ భాష, ఉదయగిరి వాసులైన హజరత్ సిబగ్‌తుల్లా నవైతి ఉర్ఫ్ షాసాహెబ్ గారి వద్ద మంచి దస్తూరి నేర్చెను. వీరికి కవిత్వం పట్ల అభిరుచి ఉన్నందున మదరాసులో మౌల్వీ మొహమ్మద్ బాఖర్ ఆగా గారి వద్ద కవితా శైలి నేర్చారు. వీరి కలము పేరు "వాలా" రోమ్ దేశపు ప్రఖ్యాత పారశీ కవి, పండితుడు మస్నవీ షరీఫ్ రచయిత అయిన మౌలానా జలాలుద్దీన్ రూమి (మౌలానా రూమ్) గారి మస్నవీ, ఫిరదౌసి గారి షాహనామాలోని పూర్తి పంక్తులను వీరు కంఠస్తముగావించారు. ఆగా మరణానంతరం వీరు తిరిగి రహమతాబాదు చేరారు.

అబూసయీద్ గారి రచనలు :

హజరత్ సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా నాయబే రసూల్ గారిని గురించి "బహరె రహమత్", "బహరె గాం", "ఆయినా-ఏ-రహమత్" వీరి ప్రముఖ రచనలు.

1250 హిజ్రీ క్రీ.శ. 1834లో వీరి కుమారుడైన సయ్యద్ అహ్మద్ గారి అకాల మరణంతో ప్రభావితులై జీవితంపై వైరాగ్యం చెంది ఆధ్యాత్మిక ఫకీరుగా మారిపోయి రెండవసారి మదరాసు చేరుకొని అచ్చటి పల్లెలందు తిరిగేవారు. వీరి చిన్నాయన సయ్యద్ మహమ్మద్ యాహ్యా ఖాన్ వీరిని అక్బర్ జంగ్ బహదూర్ నవాబ్ గులాంగౌస్ ఖాన్ గారితో పరిచయం గావించారు. వారు అబుసయీద్ గారి ఆధ్యాత్మిక శిష్యులై "గుల్జారె ఆజం" "సుబహ వతన్" అను గ్రంధ రచనలు గావించారు. తమ గురువును వెండితో తూచి ఆ వెండిని గురువు గారికి సమర్పించుకొన్నారు. తమ తండ్రి గారికుండిన "అబూతయ్యబ్ ఖాన్ బహదూర్" అనే బిరుదును గురువు గారికి ప్రధానం గావించారు.

అబూసయీద్ వాలా 1264 హిజ్రీ క్రీ.శ. 1847లో తమ 74వ యేట మదరాసులో స్వర్గస్తులయ్యారు. వీరి సమాధి ముత్యాలపేట మసీదులో చిన్నాయన జియావుద్దీన్ గారి సమాధి ప్రక్కన కలదు.

24. హజరత్ షాయఖ్ అలీఖాన్ షాయఖ్

షాయఖ్ అలీఖాన్ షాయఖ్ పూర్తి పేరు గులాం మొహియుద్దీన్ ఖాదరి. కలము పేరు "షాయఖ్". వీరు 1202 హిజ్రీ అనగా 1787లో ఉదయగిరిలో జన్మించారు. వీరు హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారి బావమరిది షా అహ్మద్ అబుతురాబ్ ఖాదరీ గారి కుమారుడు. వీరు చాలా కాలము ఉదయగిరిలో సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ గారి పోషణలో ఉండి చివరికి మదరాసు చేరారు.

షాయఖ్ కుమారుని పేరు మహమ్మద్ సైపుద్దీన్. జేజనాయన మొహమ్మద్ హుసైన్ అలియాస్ షేఖ్ సాహెబ్ ఉదయగిరిలో స్థిరనివాసమున్నారు. షాయఖ్ తమ తండ్రితో కొంత కాలం కాళహస్తిలో గడిపి తదుపరి మదరాసు చేరి అక్కడ మౌల్వీ అబ్దుల్ ఖాదర్, సిరాజుల్ ఉలేమా మొహమ్మద్ సయీద్ అస్లామీ, మౌల్వీ మొహమ్మద్ హుసైన్ షర్ఫుల్ ముల్కు గార్ల వద్ద అరబీ, పారసీ అభ్యసించారు.

షాయఖ్ పారసీ, ఉర్దూలో కవి :

షాయఖ్ పారసీ, ఉర్దూ భాషల్లో కవిత్వమల్లే వారు. తమ పారసీ కవితలను సరిదిద్దడానికి తొలుత మౌలాన బాఖర్ ఆగా, సయ్యద్ ఖైరుద్దీన్ ఖాన్ షాయఖ్ ఇమామి ముందు, ఉర్దూ కవితలను మీర్జా అలీబఖ్ష్ అజ్ ఫరీ, మీర్ షా హుసైన్ హఖీఖత్ ముందు ఉంచే వారు. షాయఖ్ అబుతయ్యబ్ వాలాతో అప్పుడప్పుడు కలిసే

వారు. వీరు పదమూడు రోజుల్లో ముప్పది ఏడు పద్యములను వ్రాసి నవాబ్ ఆజంజాకు అంకితంగావించారు. వీరు సూఫీ, పండిత కుటుంబానికి చెందిన వారు. తమ మామగారైన ప్రముఖ సూఫీ సయ్యద్‌షా మన్సూర్ ఖాదరి వద్ద ఖాదరియా పరంపరలో ఆధ్యాత్మిక శిష్యుడై యెన్నో సాధనాలు చేశారు. షాయఖ్ నవాబ్ ఆజంజా గారి వద్ద ఉద్యోగిగా ఉండినారు. ఆజంజా వీరికి "షాయఖ్ అలీఖాన్ బహదూర్" అను బిరుదునిచ్చి సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ అరబీ పాఠశాలలో పారసీ ఉపాధ్యాయునిగా పనిచేశారు. వీరు ప్రముఖ పారసీకవి అబ్దుల్ ఖాదర్ బేదిల్ శైలిని అనుకరించి రచించారు. 1249 హిజ్రీ అనగా 1833 రజ్జబ్ నెల 25వ తేదీన తమ యుక్త వయస్సులో స్వర్గస్తులయ్యారు. వీరి తమ్ముడైన మీరాన్ మొహియుద్దీన్ వాఖిఫ్ షాయఖ్ మరణ తేదీని కవితా రూపంలో ఈ విధంగా రాశారు.

బేదిల్ అసర్ హజరత్ షాయఖ్ ఖుదసల్లా సిర్రహూస్ సామి
కామ్‌దిల్ జుస్తే చూ- బఖుర్ధే ఇలా కె జహాన్ అస్త్ జాయెనా కామి
హాతిఫం సాల్‌రహలతిష్ ఫర్‌మూద్ రఫ్త హే హాత్ హందం జామి.

అర్ధము : అలనాటి బేదిల్ వలె హజరత్ షాయఖ్ ఈ కాలానికి బేదిల్. దేవుడు వారి మంచితనాన్ని కాపాడుగాక. మనస్సు భగవంతుని లీనత్వాన్ని కోరింది. ఈ ప్రపంచం కృతార్థం కాని చోటు అదృశ్యపు దూత మరణ సంవత్సరాన్ని ఇలా తెలిపే "నా సహవాసి జామి ప్రపంచానికి దూరమైనందుకు చింత కలిగే తేదీ 1249 హిజ్రీ".

షాయఖ్ గారి పారసీ రచనలు :

1. "రౌజ ఏ ఖుదసియా-దర్ అహవాలె బుజరుగా-" (పవిత్రుల సమాధులు వారిని గురించి విషయాలు) అనే ఈ పుస్తకం ఉదయగిరి పెద్ద మశీదు ప్రాంతములో గల మౌల్వీ మొహమ్మద్ హుసైన్ ఇమాముల్ ముదరసీన్ గారి కుటుంబ వ్యక్తులను గురించి రాశారు. ఈ పుస్తకము పారసీ భాషలో మూడు భాగాలుగా విభజితమైంది. దీనిని 1236 హిజ్రీ అనగా 1820లో పూర్తిగావించారు. ఈ పుస్తకము మదరాసులోని రాయపేటలో గల దీవాన్ సాహెబ్ బాగ్ గ్రంథాలయంలో గలదు.

కొన్ని పారశీ కవితలు :

అజ్ హబూబ్ నసీం అన్ ఫాసిం షద్ చూ ఈ–
రోజా బా అరం హందోష్
సాల్ అత్‌మామ్ బనాం ఆన్ అజ్‌గైబ్
రౌజఏ ఖుద్‌సియా– రసీద్ బగోష్

అర్థము : నా చల్లటి శ్వాస వలన ఈ గుమ్మటం స్వర్గ నమూనాగా మారే. అదృశ్యపు ధ్వని ఇలా తెలిపె. "ఈ గుమ్మటం పూర్తియైన తేది" రోజయే ఖుదసియా–"

2. మరజల్ బహ్రైన్ :

షాయఖ్ ఈ పుస్తకం ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం, జగత్‌గురు హజరత్ మహబూబె సుబహానీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ గురించి రాసిన కవితా సంగ్రహం. దీనిలో అరబీ భాషలో వ్రాసిన ఒక పెద్ద పద్యముంది. ఆ పద్యము చివరి పంక్తులు :

సర్ఫుతుల్ ఉమ్ర ఫి షౌఖుల్ విసాల్= ఫయా గౌసుల్ వరా అర్ హంబహాలి
దమూముఖ్ లతీఫీ హం హిజ్రక్=తమత్ హత్తా జురత్ ఫౌఖుల్ జబాల్
వలం యఖ్ ఫజ ఇలా యౌ యుత్తనాద్ =లవా ఎక్ఫిల్ అలీ మాజాల్ అలీ
నుజూం పాయరుల్ అఖ్‌తాబ్ ఖత్ ఆ వ అన్ త షమ్స్ ఫీ బరజుల్ జలాల్
ఫవాఖీత్ రిజాజుల్లా : జం ఆ= వ అన్ తల్ బాజ్‌ఫీ ఔజుల్ కమాల్
షయూఖుల్ దహెర్‌లమా లం యనాలవా= మఖామాఖస్ బిజ్జాత్ అల్‌మాలీ
ఫఖుల్‌నా కైఫ ఫిఖర్ బుల్‌ము అలీ=వహం ఖాము ఆమతి సఫుల్ న ఆల్
ఫవాదీ షాయఖ్ తు ఫిన జీర్= తర్‌హం అన్‌త యాఖైరుల్ రిజాల్

అర్థము : మీరు మీ జీవితాన్ని దేవునిలో లీనం చేయటానికి గడిపారు. గౌసుల్ వరా! నా స్థితిపై కరుణించండి. మీ ఎడబాటు దు:ఖంలో నా కనులు వర్షిస్తున్నాయి. మీరు పర్వత శిఖరాలు చేరుకున్నారు. మీ జండా ఔన్నత్యాన్ని కోల్పోలేదు. అది యుగాంతం వరకు అలాగే వుంటుంది. ధృవ నక్షత్రాలన్నీ నిస్సందేహంగా నక్షత్రాలే. మీరు దేవుని రాసులలో సూర్యుడు. దేవుని సేవకులందరును, మీరును పరిపూర్ణతలో ఉ

న్నత దశకు చేరుకొన్నారు. ఆధ్యాత్మిక గురువులు మీ కరుణ పొందకపోతే వారు ఔన్నత్యాన్ని ఎలా పొందగలరు? వారు కూడా వరుసకట్టి నిలిచియున్నారు. మీరు జనులలో ఉత్తములు. షాయఖ్ బలహీనతపై కరుణించండి.

3. దీవాన్-ఏ-షాయఖ్ :

ఈ పుస్తకమందు పారశీ, ఉర్దూ పద్యాలు, క్వాట్రైన్స్ గలవు.

షాయఖ్ తమ దీవాన్ (కవితా సంపుటి) చివరిలో పదకొండు పేజీల పారసీ ఉత్తరాలు ప్రముఖ పారసీ కవి బేదిల్ శైలిని అనుసరించి రాశారు.

4. ఖసాయద్-ఏ-షాయఖ్ :

ఈ పుస్తకంలో ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లం గురించి స్తోత్రాలు సలాములు రాశారు. ఒకచోట షాయఖ్ తమ తప్పులను, బలహీనతలను వెల్లడిస్తూ పాపపుణ్య విచారణ దినాన సిఫార్సు చేయమని హజరత్ మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వసల్లంను వేడుకొంటున్నారు.

మష్ఫిఖా ఫిద్ వీన వాజాసర్వరా-ఖిబ్లగాహా ఫైజ్ బక్షా మెహతరా
గర్ఖ్ దర్యాయే మ ఆనీ గుష్తఅం -మస్త్ సహాబా - ఏ - తబాహీ గుష్త అం
రోజ్ ఓ షబ్ నర్ద్ నవాహి బాఖ్తం బాహవాయె నఫ్స్ దూన్ పర్ దాఖ్తం
అల్గయాస్ అయ్ రహనుమాయే గుమ్రహాన్ -
అల్గయాస్ అయ్ ఆయహాయ్ రహమత్ నషాన్
కున్నిగా హి అజ్ ఇనాయత్ సవీమన్ వార్ హానం అజ్కుమంద్ ఖవిమన్
దర్ హరీం ఆపీయత్రా హంబదా=అజ్ ఇనాయత్ హర్ చెమీ ఖ్వాహంబదా
అజ్హుజూర్ హజరత్ ఖవీషంనవాజ్=బాబ్మఖ్సూదం బరూయం సాజ్బాజ్
అల్గరజ్ ఈ -షాయఖ్ దిల్ ఖస్తరా=దర్దో ఆలం దార్ బేరం జో ఇనా
హజరత్ నవాబ్ ఓ సాహెబ్ జాదగాన్ =హంజనాబ్ బేగం ఆలీనషాన్
అజ్ మురాదాత్ దిలీషాదా-షూన్=దాయం ఆజ్ ఇషో తరబ్ నాజా-షూన్ద్
కున్ ఇజాబత్ హందువాయం యారసూల్
= నీస్త్ జుజ్ ఈ-ముద్దు వాయం యారసూల్

అర్థము : ఓ కరుణామయా! నీకు అర్పణమగు వానికి సంతోషంతో అనుగ్రహించు. మహనీయుల ప్రసాదాన్ని పొందు అభిముఖాన్ని ప్రసాదించు. పాపాల సాగరమందు మునిగి ఉన్నా. వినాశపు సారాయిలో స్మృతి తప్పియున్నా. రేయింబవలు నిషేధిత వస్తువులతో చుట్టబడి ఉన్నాను. నీచమైన కోరికల కార్యమగ్నుడై ఉన్నా. పాప పుణ్య విచారణకై లేచు దినమున దేవునితో సిఫార్సు చేయు ఓ మహనీయ!

ఆ దినాన శరణమివ్వు. ఓ సహాయకారి! దేవుని దర్బారులో శరణమిమ్ము. దారితప్పిన వారికి దారిచూపు మార్గదర్శీ! శరణమిమ్ము. ఓ సర్వలోక కరుణమయా! (రహమతుల్ లిల్ ఆలమీన్) శరణమిమ్ము. మీ అనుగ్రహ చూపు నాపై పడవలె. దురలవాట్ల నుంచి నాకు విముక్తినివ్వు. నీ స్వస్థత హద్దుల్లో నాకు దారినిమ్ము. నీ దయతో నేను కోరినది ప్రసాదించు. హజరత్ వారి అనుగ్రహము నాకు లభించాలి. నా ఉద్దేశపు ద్వారాన్ని తెరువు. చివరికి భగ్న హృదయపు షాయఖ్‌ను, నవాబు గారికి వారి సంతానాన్ని వారి శ్రీమతిని ఇరులోకాలందు దు:ఖసంకటాల నుంచి దూరముంచు. మీ అభిప్రాయములో మనస్సులు సంతోషపడుచున్నాయి. సదా సుఖసంతోషాలతో గర్వపడుతున్నాయి. ఓ ప్రవక్తా! మా ఈ ప్రార్థనను అంగీకరించు. ఇంతకు మించి కోరికేది లేదు.

షాయఖ్ తన పేదరికాన్ని గురించి ఇలా వ్రాస్తారు:

అజ్ జఫాయే సిపహర్ మీనాలం=అయ్ మదద్‌గార్ నాతవా-మదదే
జేరె ఖర్జీ గిరా-గిరఫ్తారం=అయ్ సుబక్ సాజ్ హర్‌గిరా-మదదే

అర్థము : ఆకాశపు దౌర్జన్యంతో నేను ఏడుస్తున్నా. ఓ సహాయకారి! బలహీనునికి సహాయపడు. అప్పు భారము నాపై పడింది దాన్ని తేలికచేయు. ప్రతి ఒక్కరికి సహాయపడు.

ఓ షాయఖ్! నా పనితనము నా కవిత్వంతో వెల్లడవుతుంది. అలంకారయుక్తమైన భావం నా పద్యంలో దాగి ఉంది.

5. రష్కె బిహిష్త్ :

షాయఖ్ ఉర్దూ భాషలో "రష్కె బిహిష్త్" అను మస్నవీ (పద్యమాలిక) రాశారు.

25. హజరత్ మీరా మొహియుద్దీన్ వాఖిఫ్

మీరా మొహియుద్దీన్ వాఖిఫ్ షాయఖ్ అలీకు తమ్ముడు అగుదురు. వీరు 1790లో ఉదయగిరిలో జన్మించారు. కొంత కాలం కాళహస్తిలో ఉంటూ మదరాసు చేరారు. అచ్చట మౌలానా అలావుద్దీన్ అహ్మద్ మలికుల్ ఉలేమా, గులాం మొహియుద్దీన్ మౌజిజ్ గార్ల వద్ద అరబ్బీ, పారశీ అభ్యసించారు. వాఖిఫ్ పారశీ ఉర్దూ భాషలందు మంచి కవి, వీరి కలము పేరు వాఖిఫ్ (నెరిగినవాడు). తమ కవితలను సరిదిద్దుటకై కవులైన మౌజిజ్, షాయఖ్ ముందు ఉంచేవారు. వీరు మౌజిజ్‌ను అనేక సందర్భాలలో పొగిడారు. వాఖిఫ్ మంచి పారశీ కవిగా పండితునిగా మదరాసులో పేరు ప్రతిష్టలు పొందారు.

మీ కుంద్ కార్ మసీహా షేర్ సహెర్ ఏజాజ్ ఉస్తాద్‌మా

తాగులాం మొహిద్దీన్ మౌజిజ్ బూద్ ఉస్తాద్‌మా

అర్థము : మా గురువు గులాం మొహియుద్దీన్ మౌజిజ్ ఉన్నంత వరకు మంత్ర మోహనమగు మా కవిత్వం ప్రాణదాతవలె పనిచేయును.

వాఖిఫ్ తమ మేనమామ గారైన సయ్యద్ షా మన్‌సూర్ ఖాదరీ గారి మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) కాక మునుపు తమ కలము పేరు "బిస్మిల్" అని వ్రాయు చుండిరి. మురీదు అయిన పిదప బిస్మిల్‌కు బదులుగా వాఖిఫ్ (నెరిగిన వాడు) అని కలము పేరు మార్చుకున్నారు.

వాఖిఫ్ తమ ఉర్దూ కవితలో ఒక యదార్థాన్ని ఇలా వెల్లడించారు:

సి(రె మఖ్ఫీసె అనల్ హాఖ్ కి నథా మై వాఖిఫ్

జబ్ తలక్ షేఖ్ మెరా హాజ్ రతె మన్ సూర్ నథా

అర్థము : నేను నా ఆధ్యాత్మిక గురువు (ముర్షద్) హజరత్ మన్‌సూర్ గారి ఆధ్యాత్మిక శిష్యుడు కాకమునుపు "హాఖ్ నేనే" (యదార్థమనెడిది నేనే) అను అద్వైత జ్ఞానము నాకు లేకుండినది.

అన్న గారైన షాయఖ్ మరణానంతరం 1833లో వాఖిఫ్ గారి పారశీ బాషా ప్రావీణ్యతను గుర్తించి స్టేట్ పాఠశాలలో పారశీ ఉపాధ్యాయునిగా నియమించారు. నవాబ్ గులాం గౌస్ ఖాన్ గారు మదరాసులో నిర్వహించిన ముషాయిర-ఏ-ఆజం అను ప్రధాన ఉర్దూ కవీ సమ్మేళనం కవితా గోస్టుల్లో ముగ్గురు న్యాయనిర్ణేతలలో వాఖిప్ ఒకరు. నవాబ్ గౌస్ ఖాన్ గారు "తజ్‌కీ రయే గుల్జార్-ఏ ఆజం" పుట 389లో ఇలా వ్రాశారు:

అం రోజ్ దరీ-ఆబాది కోస్ షహర్ ఊస్తాది మీనవాజగ్వా

ఔర్ అబ్జా అస్త వాహిదుల్ హుక్ మైన్ మహఫిలె ముషాఎర ఏ ఆజం

బూద అన్ ఫి సాల్ రద్ ఓ ఖద: ఫీ మా బైన్ షోరామి

పా జద్ ఓ ఔర్ అసజా అస్త

అర్థము : ఈ దినం ఈ పట్టణంలో ఇంతమంది జనుల సమక్షంలో నా గురువు గారికి గౌరవం లభిస్తోంది. ఈ గొప్ప ముషాయిరాకు అధ్యక్షత వహించడం వీరికే చెల్లింది. కవుల కవిత్వాన్ని గురించి అభ్యంతరం చేయు, ఆపివేయు హక్కు వీరికి గలదు.

ఎందరో కవులు తమ కవితలను సరిదిద్దడానికి వాఖిఫ్ ముందు వుంచేవారు. వీరి శ్రీమతి సర్వరున్నీసా ఉర్ఫ్ బీజాన్ మౌల్వీ మొహమ్మద్ బాఖర్ అగా గారికి మనుమరాలు (కూతురు బిడ్డ) అగుదురు. వాఖిప్ 1853లో స్వర్గస్తులయ్యారు.

26. హజరత్ సయ్యద్ అబ్బాస్ అలీఖాన్

సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారికి ప్రథమ పుత్రులు. తండ్రి మరణానంతరం కర్ణాటక నవాబు అమీరుల్ హింద్ వాలాజా 1780లో సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ పదవి విరమణ గావించిన తదుపరి సయ్యద్ అబ్బాస్ అలీ ఖాన్ సాహెబ్‌కు ఉదయగిరి జాగీర్ దారుగా నియామక ఉత్తర్వులివ్వడమైనది. నెల్లూరు కలెక్టరు, ఈస్టు ఇండియా కంపెని ప్రముఖులు, ఉద్యోగస్తులందరు చేరి అబ్బాస్ అలీ గారికి "ఖాన్ బహదూర్" అను బిరుదాంకితం గావించారు.

దీవాణముగా నవాయత్ హసన్ ఖాన్ :

అబ్బాస్ అలీ ఖాన్ పదవి నలంకరించి నవాయత్ హసన్ సాహెబ్ (నెల్లూరు ప్రముఖ కవి హబీబుల్లా జుకా గారి చిన్నాయన)కు తమ దీవాణపు హోదా కల్పించారు. దీవాణు సలహాపై తాత తండ్రుల కాలము నుండి సేవకులుగా శ్రేయోభిలాషులుగా వుండిన వారందరినీ తొలగించారు. వీరిలో అనేకులు తమ జీవనోపాధికై దూరప్రాంతాలకు వెళ్లిపోయారు.

మోసకారుడైన రెండవ దీవాణు: మొదటి దీవాణు నవాయత్ హసన్ ఖాన్ మృతి చెందగా అబ్బాస్ అలీ ఖాన్ తమ రెండవ దీవాణుగా మౌల్వీ మెహదీ సాహెబ్‌ను నియమించారు. భవిష్యత్తు ఎలా ఉండునోనని, ఈ అవకాశాన్ని జారవిడువ కూడదని మెహదీ యెన్నో మాయమాటలు చెప్పి నవాబును తమవానిగా చెసుకోదలచెను.

వ్యాపారమందు నష్టము సంభవించుట:

దీవాణు మెహదీ సలహాపై అబ్బాస్ అలీ ఖాన్ వ్యాపారం ప్రారంభించ దలచి చెన్నపట్టణము (మదరాసు)లో రెండు పెద్ద పెద్ద ఓడలను కొన్నారు. ఎక్కువ లాభాలు పొందవచ్చునని యాభై అరవై వేల రూపాయల సరుకును ఓడలలో నింపి మెహదీ సలహాపై బెంగాలు, బొంబాయి పట్టణములకు పంపారు. వ్యాపార భారమంతా దీవాణుపై ఉంచారు. కోస్తాలందు మా సరుకంతా నీటిలో తడిచి పోయినదని, తడిచిన సరుకును బెంగాలులోని గోదాములందు ఉంచడమైనదని అవకాశం వస్తే అమ్ముటకు ప్రయత్నిస్తామని బెంగాలు వ్యాపారస్తులు వ్రాసినటుల రెండు ఉత్తరాలు సృష్టించి స్వార్థపరుడైన మెహదీ నాటకమాడెను. రహస్యముగా అసలు, లాభమును బెంగాలు నుండి తెప్పించుకొనెను. కొన్ని దినములు గడిచిన పిదప సరుకు అమ్ముడు పోలేదని మొత్తము డెబ్బై వేలు నష్టమైనదని ఈ విషయము బెంగాలు నుండి జాబు ద్వారా తెలిసినదని అబ్బాస్ అలీ ఖాన్‌కు మెహదీ జాబును చూపించెను. ఇదే విధంగా రెండవసారి కూడా మెహదీ మోసగించి డబ్బు దాచుకొని స్వామి ద్రోహి ఆయెను.

అబ్బాస్ అలీ ఖాన్ కుమారులు:

వీరికి గౌస్ సాహెబ్, అలీ హుసైన్ సాహెబ్ అను ఇద్దరు కుమారులుండిరి.

అబ్బాస్ అలీ ఖాన్ - గుఱ్ఱపు స్వారీ:

అబ్బాస్ అలీ ఖాన్ ఈత, కత్తిసాము, గుఱ్ఱపు స్వారీయందు ప్రత్యేక నైపుణ్యమును కలిగి ప్రజల ప్రశంసలందుకొన్నారు. ప్రత్యేకించి గుఱ్ఱపు స్వారీయందు అతనికి సాటియగు మేటి ఆనాడు కానరాలేదు.

అబ్బాస్ అలీఖాన్ పై స్టోన్‌హౌస్ కన్నుపడుట

వహాబి వుద్యమకర్తగా బ్రిటీష్‌వారు అనుమానించుట:

వహాబి ఉద్యమం : వహాబి ఉద్యమం అరేబియా దేశంలోని నజద్ అనే ప్రాంతంలో పుట్టింది. నజద్ ప్రాంతంలో ఒక తెగ జన్మించి కలతలు, రేపునని వారికి ప్రవక్తల పట్ల దైవమిత్రుల (ఔలియా అల్లా) పట్ల భక్తి భావముండదని 14వందల సంవత్సరాల క్రితం ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివసల్లం కాలజ్ఞానం పలికారు. అలాగే మహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ నజదీ (1703-1792) ఈ ఉద్యమాన్ని ప్రారంభించెను. కాని ఆ ఉద్యమ సంస్కరణలు స్థానిక (నజద్) ప్రభువులకు గిట్టలేదు. ఉద్యమకర్తను దేశం నుంచి బహిష్కరించారు.

వహాబి ఉద్యమ సంస్కరణలు :

ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం, ఇతర మహనీయుల ద్వారా అనగా వారి అండతో ప్రార్థించుట, అడుగుట షిర్క్. ప్రవక్తల, మహనీయుల సమాధి దర్శనంగావించడం, వారితో మొక్కుబడులు కోరుట నిషేధం అని మహనీయుల సమాధులను కూలగొట్టారు.

పై సంస్కరణలు స్థానిక ప్రభువులకు గిట్టక ఉద్యమకర్తను దేశబహిష్కరణ గావించారు. చివరికి మొహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ పొరుగు రాజ్యంలోని అమీర్ మొహమ్మద్ బిన్ సాద్ అనే ప్రముఖుడిని ఆశ్రయించెను. అతని అండతో శుక్రవారపు పవిత్ర రాత్రులందు దరూద్ చదవటం నిషేధించబడింది. చదివిన వారికి కఠిన శిక్ష విధించేవారు. దరూద్ షరీఫ్ ప్రాముఖ్యతను తెలుపు పుస్తకాలు “దలాయలుల్ ఖైరాత్” తదితర గ్రంధాలను అగ్నిలో పడవేయించారు. సంస్కరణలను వ్యతిరేకించిన వేలాది మందిని హతమార్చారు. నజదీలు హజరత్ సయ్యదినా అబ్బాస్ రజి. సమాధిని నేల మట్టంగావించారు. హజరత్ అమినారజి. హజరత్ అబూతాలిబ్ రజి. హజరత్ జుబైర్ సమాధులను కూడా ఇలాగే చేశారు. వారి ఈ సిద్ధాంతాలపై నడువని ముస్లిం ముస్లిం కాదని ప్రకటించారు.

అమీర్ మొహమ్మద్ బిన్‌సాద్ తరువాత అతని కుమారుడు అధికారంలోకి వచ్చి అరేబియాలోని పలు ప్రాంతాలు జయించాడు. వహాబి ఉద్యమాన్ని విస్తరింపచేశాడు. మక్కా మదీనాలను ఆక్రమించుకున్నాడు.

బ్రిటీషు ప్రభువులకు కన్నుకుట్టుట :

అరబ్ రాజ్యాలను వహాబీలు ఆక్రమించుకొనడం, టర్కీ దేశీయులకు కంపరం పుట్టించింది. మన దేశంలోని బ్రిటిష్ ప్రభువులకు కూడా కన్ను కుట్టింది. బ్రిటీషు వారి దృష్టిలో వహాబి ఉద్యమం ఒక విద్రోహకరమైన పితూరి. వహాబీలను కుట్రదారులుగా, తిరుగుబాటు దారులుగా చిత్రించారు. 1809లో కెప్టెన్ వెయిన్‌రైట్ కర్నల్, జనరల్ సర్‌వైనాల్ స్మిత్ అనే సైనికోద్యోగుల ఆధిపత్యంలో నౌకదళాన్ని బొంబాయి నుంచి టర్కీకి బ్రిటీషువారు పంపించారు. మస్కట్ ఇమాంతో కలిసి బ్రిటీషు వారు రాజ్య విస్తరణ గావిస్తున్న అరేబియాలోని వహాబి ఉద్యమాన్ని అణచివేశారు.

భారతదేశంలో ప్రవేశించిన వహాబి ఉద్యమం :

క్రమేపి వహాబి ఉద్యమం భారతదేశంలో ప్రవేశించింది. ఈ దేశాన్ని బ్రిటీష్‌వారు పరిపాలిస్తున్నారు. వహాబి ఉద్యమనాయకుల దృష్టిలో భారతదేశం పరదేశీయుల హస్తగతంకావడం తీవ్రమైన ఆవేదనను కలిగించింది. బ్రిటీషు వారిపై జిహాద్ జరపడం తమ కర్తవ్యంగా భావించారు. ఇది సాయుధ పోరాట రూపంలో ఉండాలని విశ్వసించారు.

నవాబుల నుంచి రాజ్యాన్ని పొందు బ్రిటీషు వారి అకాంక్ష : విభజించి పాలించు అను సిద్ధాంతంతో బ్రిటీషు వారు నవాబులు నవాబులకు, జాగీర్‌దారు జాగీరుదారులకు మధ్య తగాదాలు సృష్టించి తమ రాజ్య విస్తరణగావించడం బ్రిటీషువారిపై నవాబులకు వ్యతిరేకత ఏర్పడింది. వారిని అణచివేయడానికి కొందరు నవాబులు, జాగీరుదారులు ఇక చేసేది లేక బ్రిటీషు వ్యతిరేక ఉద్యమంగా మారింది. దేశంలో అన్ని ప్రాంతాలలో దీన్ని విస్తరింపచేయడం నాటి ఆశయం. ఈ ఉద్యమం చెన్న రాజధాని (మదరాసు)కు చేరింది. మదరాసులోను తదితర సైనిక స్థావరాలలోను

వహాబీ ప్రచారకులు చాలా చురుకుగా పనిచేశారు. మశీదుల్లో ఆనాడు మత ప్రబోధంతో పాటు జిహాద్‌ను బోధించేవారు.

నెల్లూరులో వహాబి ఉద్యమం :

నెల్లూరులో,పల్లవరంలో సిఫాయిలను తమ వైపు తిప్పుకొనడానికి ఉద్యమ నాయకులు ప్రయత్నించారు. కౌదామియా అనే వ్యక్తి చదరంగం ఆడే మిషమీదా సైనికోద్యోగ్యుల ఇళ్ళకు వెళ్ళి వారిని ఉత్తేజితులను చేసేవాడు. నెల్లూరులోని బ్రిటీష్ సేనాని ఈ వైనాలను అధికారులకు లేఖ ద్వారా తెలిపారు.

1801 దాకా నెల్లూరు ఆర్కాటు నవాబుల ఆధీనంలో ఉండేది. నెల్లూరు ఫౌజుదారులను ఆర్కాటు నవాబే నియమించేవాడు. ఈ ఫౌజుదారులు సాధారణంగా ముస్లింలే. అయిన వారితో పాటు ఉమ్మడిగా కొందరు హిందువులు కూడా నెల్లూరు ఫౌజుదారీలో ఉండేవారు.

నెల్లూరు ఫౌజుదారులుగా హిందువులు :

నజీబుల్లాతో ఎనిమిదిదేళ్లు, కుతుబుద్దౌలాతో నాలుగేళ్ళు రామన్న పంతులు ఫౌజుదారుగా చేసెను. సర్వేపల్లి వెంకట్రావు, మల్లవరపు వెంకటాచలం పంతులు, మల్లవరపు సీతన్న, నాగులపాటు వెంకటరావు అనే హిందువులు కూడా నెల్లూరు ఫౌజుదారులుగా పని చేశారు.

బ్రిటీష్ వారి చేతిలో నెల్లూరు :

1801లో నెల్లూరు బ్రిటీష్ వారి చేతికి వచ్చింది. హిందువుల్లోను, ముస్లిముల్లోను అసంతృప్తి ఏర్పడింది. వహాబీ ఉద్యమం నెల్లూరుకు కూడా పాకింది.

అబ్బాస్ అలీఖాన్‌ను స్టోన్‌హౌన్ అనుమానించుట :

1835లో టి.వి. స్టోన్‌హౌన్ నెల్లూరు జిల్లాకు కలెక్టరయ్యాడు. ఇతడు ఇంతకు ముందు అసిస్టెంట్ కలెక్టర్‌గానూ, హెడ్ అసిస్టెంటుగానూ, సబ్ కలెక్టర్‌గానూ ఈ

జిల్లాలో పని చేసినవాడే. జిల్లా వ్యవహారాలన్నీ స్టోన్‌హౌస్‌కు కరతలా మలకమే. నెల్లూరు మండలంలో వహాబి ఉద్యమానికి ఉదయగిరి జాగీర్‌దార్ సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ బహద్దూర్ పట్టుకొమ్మని బ్రిటీష్ వారు భావించారు. వీరి పూర్వీకులు ఇస్లాంమత విద్యలలో నిష్ణాతులు.

స్టోన్‌హౌస్ కొంత రాజకీయం నడిపి రకరకాల కేసులు అనేక మందితో పెట్టించి అబ్బాస్ అలీఖాన్‌ను ఖైదు చేయించుట: ఉదయగిరి జాగీర్‌దారు సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ కుమారులు అలీ హుసేన్, గౌస్ సాహెబ్ వీరిద్దరూ (సీరత్ జాదా, సాహెబ్ జాదా) హైదరాబాదు రత్నాల వ్యాపారిని అతని కొడుకును కొట్టించారని ఆ రత్నాల వర్తకుడు నెల్లూరు వచ్చి ప్రిన్స్‌పల్ కలెక్టర్ స్టోన్‌హౌస్‌కు విన్నవించుకున్నాడు.

కల్‌క్టర్ గారికి మొదటి నుండి పరిచయస్తుడైన నెల్లూరు కాపురస్తుడు హమీదుద్దీన్. అసిస్టెంట్ కలెక్టరుతో పాటు ఉదయగిరి జాగీర్‌దారు దగ్గరకు విచారణ నిమిత్తం వెళ్ళి అక్కడి వారిని లంచం అడగగా ఇవ్వనందున బ్రిటీషు వారిని చంపి రాజ్యం హస్తగతం చేసుకొనుటకు మందుగుండు సామాగ్రి తయారు చేయించుచున్నారని తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కలెక్టరు గారిని నమ్మించెను. ఈ సంగతులు జరుగు తున్నప్పుడు స్టోన్‌హౌస్ దగ్గర వెంకటరావు అనే అతను హెడ్ మునసబుగా ఉండెను. హమీదుద్దీన్ ఖాన్‌తో దగ్గరగా ఉంటూ అనేక సంగతులు తెలుసుకొని అబ్బాస్ అలీఖాన్ పైన అబద్ధపు సాక్ష్యాలు ఇప్పించిన సంగతి గ్రహించెను. హమీదుద్దీన్ స్టోన్‌హౌస్ దగ్గర వెంకటరావు అనే అతను మునసబుగా ఉండెను. హమీదుద్దీన్ స్టోన్‌హౌస్ గారికి తంటాలు చెప్పి క్రిమినల్ నేరం మోపడం, అబద్దపు ఉత్తరములు సృష్టించడం వగైరా అన్ని విషయాలు వెంకట గోవిందరావు వివరంగా చెప్పెను. కాని కలెక్టరు గారు తమకు ఈ యధార్ధము తెలియకముందే గవర్నమెంటు వారికి లేఖలు పంపి తగు ఉత్తర్వులు పొందెను. అబ్బాస్ అలీఖాన్ గారిని స్టోన్‌హౌస్ నెల్లూరుకు పిలిపించెను. కాని ఖాన్‌సాహెబ్ నేను రాలేనని చెప్పారు. దీన్ని అలుసుగా తీసుకొని ఖాన్‌సాహెబ్ బ్రిటీషు వారి మీద తిరుగబడినట్లు తంటాలు చెప్పాడు. కొంత రాయబారాలు జరిగాక అబ్బాస్ అలీఖాన్‌తో సహా కొడుకులు, అల్లుళ్లు, వకీళ్ళు

అబ్బాస్ అలీఖాన్ సాహెబ్‌కు సహకరించిన 'కాసా మేజర్' పేరున రోడ్డు

నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. ఖాన్‌సాహెబ్ గారిని అల్లూరులోని మాజీ ప్రిన్స్‌పల్ కలెక్టర్ ఐ.బి.విష్ గారి స్వంత బంగళాలో ఖైదు చేసి ఉంచారు.

యధార్థం తెలుసుకొన్న స్టోన్‌హౌస్ హమీదుద్దీన్ ఖాన్ వల్ల తాను మోస పోయానని గ్రహించి అతన్ని వెంటనే బర్తరఫ్ చేసెను. అతని తండ్రి ఏడుస్తూ తమ కుమారుడు అవమానభారముచో ఆత్మహత్యకు పూనుకొన్నాడని కలెక్టర్‌కి వేడుకొనెను. కలెక్టర్ కొంత అలోచించి తాను రాసిన కొన్ని ఉత్తరములు అతని దగ్గర ఉండటం వల్ల అవి బయటపడితె తనకు ప్రమాదమని కొందరిని పంపించి ఓదార్చమని చెప్పెను.

ఆ తరువాత కచ్చేరి హెడ్డు వెంకటగోవిందరావుతో స్టోన్‌హౌస్ దొర హమీదుద్దీన్ ఖాన్ అబద్ధాల వల్ల జరిగిన నష్టాన్ని చెప్పి ప్రభుత్వం వారికి జాగీర్‌దారు మీద మొదట రాసిన విధంగా సాక్ష్యం చెప్పించకపోతే నా మాట పోతుంది గనుక తప్పో ఒప్పో జాగీర్‌దారుని విషయంలో నేరం బనాయించాలని గోవిందరావుని సాయ మడిగెను. అతడట్లే చేస్తానని మాట ఇచ్చెను. కొంత మంది జనులను పిలిపించెను వారితో పాటు ఒక ఉన్నత కుటుంబ వ్యక్తి కూడా ముందుకు వచ్చెను.

అబ్బాస్ అలీఖాన్ మీద అబద్దపు సాక్ష్యాలు చెప్పించుట :

బ్రిటీష్ వారిని చంపించి రాజ్యం హస్తగతం చేసుకొనుటకు మందుగుండు సామాగ్రి తయారు చేయించుచున్నారు. జిల్లేడు కట్టెలు కాల్పించి తుపాకి మందు చేయించుచున్నారు. నవాబుపేట వర్తకుల వద్ద రెండు వందల ఎద్దుబండ్లలో సూరేకారము కొనుటకు వచ్చారు. చెన్నపట్నంకు వెళ్లి ఐదువేల రూపాయల గంధకం కొని తెచ్చినట్లు, కొందరిని హైదరాబాదు నుండి పిలిపించి ఫిరంగులు తయారు చేయించెనని అబద్ధపు సాక్ష్యాలు చెప్పించెను.

ఇది ఇలా ఉండగా ప్రభుత్వం కేసు విచారణ నిమిత్తం కాసా మేజర్ కమీషనర్‌ని నియమించెను. చివరికి నిజమేమిటో అతను గ్రహించాడు. స్టోన్‌హౌస్ గారిని హమీదుద్దీన్ పక్కదోవ పట్టించడం, ఉదయగిరి జాగీర్ దారు అమాయకత్వం అనేక సాక్ష్యాలు సేకరించి పెట్టుకొని ఉన్నట్లు కాసా మేజర్ తెలుసుకొన్నాడు.

కమీషనర్ గారిని పిలిపించి విచారణ ప్రారంభించారు. జనం వచ్చి చూడసాగిరి. కలెక్టర్ జనాన్ని దూరంగా వెళ్ళగొట్టమని ఆజ్ఞాపించాడు. జనం తిరగబడ్డారు. ఈ గలభా సంగతి కమీషనర్ తెలుసుకొని ఇది బహిరంగ విచారణ వచ్చి చూడమని ప్రజలకు చెప్పాడు. దీనికి స్టోన్‌హౌస్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఏమి చేయలేక ఊరుకొన్నాడు. సాక్షులను ముద్దాయిలను పిలిచాడు దొంగ ఉత్తరాలలో సంతకాలు పరిశీలించి తప్పుడు ఉత్తరాలని తేల్చాడు. స్టోన్‌హౌస్ గారికి అవమానం జరిగినట్లు భావించి విచారణ తిరస్కరించి వెళుతున్నట్లు లేచి వెళ్లిపోయాడు.

కమీషనర్ కాసా మేజర్ అవమానపడి ప్రభుత్వము వారికి వివరంగా ఉత్తర్వు రాశారు. ఈ కమీషనర్ సాక్షులను తికమకబెట్టి బెదరగొడుతున్నాడని వేరే కమీషనర్‌ను వేయమని స్టోన్‌హౌస్ ప్రభుత్వాన్ని కోరాడు. కాని ప్రభుత్వం అందుకు సమ్మతించలేదు. మరలా కాసా మేజర్ విచారణకై నెల్లూరు రావడం జరిగింది. అల్లూరులో ఖైదు చేయబడిన అబ్బాస్ అలీఖాన్ వారి కుమారుల చేత కూడా సాక్ష్యం ఇప్పించగా హమీదుద్దీన్ లంచం అడగడం ఇవ్వనందువల్ల ఖైదు చేయడం జరిగిందని, తాము ఎలాంటి కుట్రలు చేయలేదని సంతకాలు చేసి కమీషనర్ గారికి సమర్పించుకున్నారు. కమీషనర్ గారు అవన్నీ చదివి మరికొంత మంది సాక్షులను విచారించెను.

కొన్ని ఫిరంగులు స్టోన్‌హౌస్‌కు సహకరించిన ఒక సంపన్న వ్యక్తి దగ్గర పూర్వం నుండి వేడుక కోసం ఉంచినవేగాని కొత్తవిగావు. కాని కలిగిరి తాహశీలుదారు వాటిని బండ్లకు ఎత్తించుకొని వెళ్ళి వెంగంపల్లె చెరువులో వేయించినట్లు జనం చెప్పుకొన్నారు.

కాని ఈ అబద్ధపు సాక్ష్యలన్నీ కల్పించినవని కమీషనర్ గారు తెలుసుకోలేక పోయారు. కమీషనర్ మన సాక్ష్యాలను కొంత వరకు నమ్మినారు. గనుక మరికొంత కష్టపడి నమ్మకమైన తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కేసును బలపడేటట్లు చేద్దామని నిర్ణయించుకొనిరి. సీసపు గోలీలను కుండలలో వేసుకొని సంపన్న వ్యక్తి గుమాస్తా వెంకట రామయ్య వెంటరాగ కొంత మంది వెట్టివాండ్లు ఆత్మకూరు చెరువు కట్ట మీద కాలినడకపోతూ ఉండగా ఆ సమీపంలో కమీషనర్ కాసా మేజర్ సబ్ కలెక్టర్ మెడిసిన్ దొరగారు గుడారాలు వేసుకొని ఉండగా గుమాస్తా వెంకటరామయ్యను చూచి అనుమానించి అవి ఏమిటని అడిగారు. కలిగిరి, దుత్తలూరు తహశీలుదారు పళ్ళె క్రిష్ణారావు కలెక్టర్ వారి శెలవు ప్రకారము చవటమన్ను కుండలలో వేసుకొని కలెక్టరు వారి కచేరికి తీసుకొనిపోతున్నామని చెప్పగా వారు అనుమానించి నీవు ఎవరు అని అడిగితే తాను దుత్తలూరి తాలూకా గుండెమడకల పేష్కరునని చెప్పాడు. అతనిని అనుమానించి ఆ కుండల్లో ఏముందో చూడాలని చెప్పగా తహశీలుదారు ఉత్తర్వు లేనిది చూడడానికి లేదని తకరారు చేసినాడు. వారు బలవంతంగా ఆ కుండలను పరిశీలించి చూడగా తుపాకి మందు కన్పించినది. వాటిని ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొని వచ్చి వారిని ప్రత్యేక ఖైదులో ఉంచి విచారించిరి. వారిని నిజం చెప్పమని బెదిరించగా నిజం ఒప్పుకొనక తప్పలేదు. మా పెద్దాయన మాట ప్రకారం నెల నుంచి చాకలి కొండ గ్రామములో తుపాకి గుండ్లు చేస్తున్నామని వీటిని జాగీర్‌దారు ఇలాకా గ్రామాల్లో పూడ్చి రమ్మన్నాడని వారు చెప్పిరి.

గుమాస్తా వెంకట రామయ్య తమ మనిషి అయినప్పటికి రహస్యం బయటపడినందుకు కలెక్టరు గారు అతనికి ఐదు రూపాయలు జరిమానా విధించి ఆ డబ్బులు వెంకటగోవిందరావు చేత కట్టించినాడు.

కమీషనర్ ఉదయగిరిలో ఉన్న సమయమందు కలెక్టర్ స్టోన్‌హౌస్ వెంకటగోవిందరావుతో కలిసి చర్చించి జాగిర్‌దారు తమ్ముడు వెంగంపల్లె, చిరువెళ్ళ, బండారుపల్లె గ్రామాలకు ఈనాందారుడయిన ముస్తఫా అలీఖాన్ చేత అబ్బద్ధపు సాక్ష్యం చెప్పించడానికి నెల్లూరుకు పిలిపించి ఖైదు చేయించెను.

సదరు సయ్యద్ ముస్తఫాను 20 దినములు తప్పుడు సాక్ష్యం చెప్పమని గట్టిగా బెదిరించగా మా అన్నా ఒట్టి అమాయకుడు. మీ యందు ఎంతో గౌరవం కలవాడు వృద్ధుడైనందు వల్ల మిమ్ములను కలుసుకోలేకపోతున్నాడని, వృద్ధుడైన మా అన్న గారు మీ మీద ఎలాంటి తిరుగుబాటు చేయడానికి సమర్ధుడు కాడు అని చెప్పినాడు. అతను మంచివాడే. జరిగిపోయిన సంగతుల వల్ల ఉపయోగం లేదు. నేను చెప్పినట్లు విన్నట్లయితే మీ మూడు గ్రామాలు ఈ నాములతో పాటు మరికొన్ని మేళ్లు జరిపిస్తామని కలెక్టరు గారు చెప్పగా అలాంటి తప్పుడు పని నేను చేయలేనని తిరస్కరించెను. చివరకు కలెక్టరు వదలక నిర్భందించగా మీ ఇష్టప్రకారం రాసుకోండి సంతకం పెడతానని చెప్పగా పారశీ భాషలో వాంగ్మూలం రాయించి సంతకం తీసుకొన్నాడు. ఈ వాంగ్మూలం కమీషనర్ గారికి పంపగా ఆయన దానిని చదివి ఇది అబద్ధమని నిర్ణయానికి వచ్చి ముస్తఫా ఆలీని పిలిపించి అనేక విధముల నిజం చెప్పమని బతిమాలెను. నిన్ను బెదిరించి కలెక్టరు గారు రాయించారని తెలుసు. నీవు నిజము చెబితె నీ అన్న కుటుంబానికి న్యాయం జరుగుతుందని చెప్పెను. కాని ముస్తఫా అలీ నిజము చెప్పలేదు. కమీషనర్ కొన్నాళ్ళు ఉండి వెళ్ళిపోయెను. కమీషనర్ గారు ఆ రిపోర్టులో మొదటి నుండి చివరి వరకు జరిగినదంతా వివరించి రాసెను. అన్యాయంగా జాగిర్‌దారుని అతని కుటుంబ సభ్యులను నౌకర్లను కలెక్టర్ గారు శిక్షించినాడని నిస్సందేహంగా చెప్పవచ్చునని ఆ రిపోర్టులో వ్రాసి పంపుటకు సిద్ధపడెను. స్టోన్‌హౌస్ గారు తన పరువుపోతుందని బ్రతిమాలెను. తన భార్య పిల్లలతో వచ్చి కమీషనర్ గారిని పరిపరి విధముల వేడుకొనెను. భర్తను ప్రజలంతా దూషించుతారని ఆ ధూషణములు సహించలేక ప్రాణత్యాగము చేయునని మొరపెట్టుకొనగా కమీషనర్‌గారు కొంత ఆలోచించి దుర్మార్గుడైన స్టోన్‌హౌస్ అంతపని చేయునని భావించాడు. ఆ రిపోర్టు మార్చి ప్రబలం లేకుండ రాయించి స్టోన్‌హౌస్‌ను రక్షించెను.

ఈ దుర్మార్గం జాగీర్‌దారుకి తెలియకుండ వారి కుమారులు రహస్యముగా కుట్రపన్నారు. కొన్నాళ్ళకు కుట్ర తెలుసుకొనిన జాగీర్‌దారు వారిని మందలించి ప్రభుత్వం వారిని తెలియపరచకుండా ఉన్నందున అతను తప్పు చేసినట్లేనని తలచి ఎలాగు జాగీర్‌దారు తదనంతరం ఉదయగిరి జాగీరును ప్రభుత్వం వశం చేసుకోబోతున్నది గనుక అతని తదనంతరం అతని కుమారులకు జీవనభృతి నిర్ణయించ వచ్చునని రిపోర్టు రాసినట్లు తెలియుచున్నది. ఆ రిపోర్టు పంపి కాసా మేజర్ దొరగారు 1840 ఫిబ్రవరిలో చెన్నపట్నం చేరగా ఆయనను రెవెన్యూ బోర్డు మెంబరుగా ఆపాయింటుమెంటు చేసారు.

అస్లం గారి అమ్మమ్మ సమాధి

కమీషనర్ చెన్నపట్నం చేరగానే కలెక్టర్ జాగీర్‌దారుని అతని బంధువులు కొడుకులు అల్లుళ్ళ లను చెన్నపట్నంలో ఖైదు చేయమని లేఖలు రాయగా ప్రభుత్వం వారినంత చెంగల్‌పట్టుకు చేర్పించి 1840 సం.మార్చిలో కోటలోని ఒక బంగ్లాలో బంధించి ఉంచిరి. ఆరు నెలలకు 1840 సెప్టెంబరు నెలలో జాగీర్‌దారు మరణించెను. శరీరమును శుభ్రపరచి ఒక పెట్టెలో పెట్టి ఏడు నెలల తర్వాత అతని స్వస్థానం ఉదయగిరికి తరలించి వారి తండ్రి సమాధికి దక్షిణంగా సమాధి గావించడమైనది.

జాగీర్‌దారుని భార్య కొడుకులు, అల్లుళ్ళకు ఒక్కొక్కరికి 100/-రూ.లు వంతున ఇప్పించి తమ ఇష్టమొచ్చిన చోట నివసించవచ్చునని చెప్పగా ఈ విషయము తెలిసిన స్టోన్‌హౌస్ జాగీర్‌దారుని బంధువులు, జనులు గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు గనుక వారు ఉదయగిరి నెల్లూరు రాని విధంగా ఉత్తర్వు లిప్పించవలసినదిగా లేఖలు పంపుకొనెను. దానిపై సైదాపేట పరిసరాలలో ఉంటూ నాలుగు, ఐదు మైళ్ల దూరం దాటిపోకూడదని శాసనం చేసిరి.

అప్పటి నుండి సాహెబ్ జాదా గౌస్ సాహెబ్ సీరత్ జాదా అల్లీ హుసేన్ సాహెబ్ వీరి బావమరదులైన భలే అద్మీలు ఇద్దరున్ను సైదాపేట ఒక బంగ్లాలో

కాపురముండి నెల్లూరు ఉదయగిరి నుండి తమ వాళ్ళను పిలిపించుకొని చూసి మాట్లాడి పంపిస్తూ జీవనం సాగించుచుండిరి.

ఒక తప్పును సమర్ధించుకొనడానికి అమాయకుడైన ఒక జాగీర్‌దారుపట్ల ఎన్ని తప్పులైన చేయడానికి వెనుకాడని ఒక ఉన్నతోద్యోగి దుర్మార్గం.

అబ్బాస్ అలీఖాన్ మసీదు :

అబ్బాస్ అలీఖాన్ వంశస్థులు నెల్లూరు పెద్ద బజారులో వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు దక్షిణాన ఒక మసీదు నిర్మించారు. అది అబ్బాస్ అలీఖాన్ మసీదుగా పిలువబడుతోంది.

అబ్బాస్ అలీఖాన్ గురించి

అబ్బాస్ అలీఖాన్ గారి వారసులు :

అబ్బాస్ అలీఖాన్ గారి కుమారుడు

సయ్యద్ ఇబ్రహీంఖాన్

మనుమడు

సయ్యద్ మొహమ్మద్‌ఖాన్

నెల్లూరులో రాజభరణం పొందిన వారసులు :

1. సయ్యద్ కరీముల్లా
2. సయ్యద్ దావూద్ అలీ
3. సయ్యద్ గౌస్‌భాష (హదరాట్)
4. శ్రీమతి జైనబ్‌బేగం (సయ్యద్ హంజాహుసేని వురఫ్ అస్లం, ఖాలిది ఉదయగిరి వారి అమ్మమ్మ)

వీరి సమాధి హజరత్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారి దర్గాలో ఉత్తరాన గలదు. తూర్పు గోడకు ఆనుకొని ఉన్నది.

27. హజరత్ షేఖ్ మహమ్మద్ ఉస్మాన్ సావీ (ఉస్మాన్‌సా హజరత్)

హజరత్ మహమ్మద్ ఉస్మాన్ సావీ తండ్రి పేరు అబ్దున్నబీ అలియాస్ అసదుల్లాసాహెబ్. జేజ నాయన పేరు హజరత్ మఖ్ధూం అబ్దుల్ హఖ్ సావీ ఉరఫ్ దస్తగిర్ సావీ. వీరి పూర్వీకులు టర్కీ దేశానికి చెందిన సావా ప్రాంతీయులు. వీరు రోమ్ చక్రవర్తుల వంశానికి చెందినవారు.

ఒక రోజు మఖ్ధూం అబ్దుల్ హఖ్ సావీ వజద్ ఒ ఇస్తెగ్రాఖ్ (తదేక ధ్యానము)లో ఉండి "కొన్నేళ్ళ తదుపరి నా వంశంలో ఒక పరిపూర్ణ మహనీయుడు జన్మిస్తాడు" అని కాలజ్ఞానం పలికెను. అలాగే ఉస్మాన్ సావీ మదరాసులో జన్మించి చాలా ప్రసిద్ధిగాంచారు.

ఉదయగిరి చేరుట :

కొన్నేళ్ళు గడిచాక హజరత్ ఉస్మాన్ సావీ వారి పెద్దల ఆజ్ఞపై మదరాసు నుంచి ఉదయగిరి వచ్చి స్థిరపడ్డారు. ఆనాడు ఉదయగిరిలో వీరి ఇల్లు దిలావర్ భాయీ వీధిలో గల సూర్య భవన్‌కు ఉత్తరాన ఉండేది. అక్కడుండిన రేగుపండ్ల చెట్టు వీరు నాటిందే.

ఆధ్యాత్మిక శిష్యుడగుట :

మహమ్మద్ ఉస్మాన్ సావీ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ గారి

వద్ద మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు) అయ్యారు. ఆధ్యాత్మిక మార్గంలో వీరి గొప్ప తనాన్ని గురించి వీరి ఆధ్యాత్మిక శిష్యుడైన “కరామాతె ఖాదరియా” పుస్తక రచయిత మహమ్మద్ నజీబ్ పారశీ భాషలో ఇలా ప్రశంసించాడు.

మకాతీకె అజ్ మవాస్త్ బారీక్‌తర్

ఫిగాఫద్ బ తేగ్ జబాన్ సర్ బసర్

కిసీరా తీస్త్ పేషఫ్ తాఖతే గుఫ్త్

దిల్ అస్త్ అజ్ హైబత్ వూసఖ్త్ భాషా

అర్థము : వెంట్రుకకంటె సూక్ష్మమైన అంశాలను తమ వాగ్ధాటితో వెల్లడించేవారు. వారి ఎదుట నిలబడి మాట్లాడు శక్తి ఎవరికిని లేదు. భయంతో గుండెలు మౌనం వహిస్తాయి.

ఆర్కాటులోని తాజ్‌పుర యందు మొహమ్మద్ అలీ షా ఖాదరీ షత్తారీ సిబగ్‌తుల్లా అలై అను వారు హజరత్ ఉస్మాన్ సావీ గారి మురీదు (ఆధ్యాత్మిక శిష్యుడు). వీరి సమాధి మదరాసులో ఉస్మాన్ సావీ గారి జేజనాయన దర్గా ఆవరణలో గలదు.

హజరత్ ఉస్మాన్ సావీ మహిమలు :

మదరాసులో ఉండిన వీరి కుమార్తె జైబున్నీసా బేగం హజ్ కోసం మక్కా వెళ్ళదలచి ఉదయగిరిలోని తమ తండ్రి గారిని దర్శించుకొనదలచారు. కూతురు, అల్లుడు మదరాసు నుంచి ఉదయగిరి బయలుదేరారు. మార్గమధ్యన కూతురి కాలు వాచి నడువలేకపోయారు.

ఆ సమయంలో మురాఖిబా (ధ్యానం)లో ఉండిన హజరత్ ఉస్మాన్ సావీ కొందరిని పిలిచి “నా కుమార్తె ఉదయగిరి వస్తోంది. ప్రస్తుతం ఆమె ఫలానా చోట ఉంది. మీరు పల్లకితో వెళ్ళి అమ్మాయిని పిలుచుకురండి” అని ఆజ్ఞాపించారు. సేవకులు పల్లకిలో అమ్మాయిని తీసుకొని వచ్చారు.

“నీవు హజ్ చేయలేవు. నీ కూతురు చేస్తుంది”. అని అమ్మాయితో కాలజ్ఞానం పలికారు. కొన్నేళ్ళ తదుపరి అలాగే జరిగింది.

మహిమ :

ఉదయగిరి దుర్గంపై "సైకా హుజరా" (జ్ఞాని గృహం) ఉంది. అందులో ఒక జ్ఞాని ఉంటుండే వారు. ఒక రాత్రి వారు మంత్ర విద్యలో నిమగ్నమైయున్నారు. సాధనలో ఏదో పొరపాటు జరిగినందుకు మవక్కలు (మంత్రముగ్ధులు) వీరిని ఆకాశంపైకి ఎత్తుకొని పోవుచుండిరి. దివ్య దృష్టిగల ఉస్మాన్‌సావి రహ. వెంటనే ఒక శిష్యుని పిలిచి ఏడు లోటాలు నీళ్ళందించమని ఆజ్ఞాపించారు. ప్రతి నీటి లోటాపై ఏదో చదివి ఆ నీటిని పైకెగురవేశారు. శిష్యుడు కరీమా వీధిలో ఉండిన జలాల్ సాహెబ్ గారి తండ్రి షేక్. అహ్మద్‌ను పిలిచి నీవు వెంటనే కొండపైకి వెళ్ళి సై-తో కలిసి రమ్మని ఆజ్ఞాపించారు. స్వామి గారి ఆజ్ఞానుసారం కొండ ఎక్కుడు ఎక్కుతుండగా "అస్సలాం అలైకుం" అని పలుకుచు సై-ఎదురొచ్చారు. "నేను క్షేమంగా ఉన్నానని స్వామితో చెప్పండి" అని కోరారు.

మహిమ : నెల్లూరువాసియైన ఒక బ్రాహ్మణ వ్యక్తి ఉదయగిరి తాలూకా తహశీలుదారుగా పనిచేస్తుండేవారు. వారు హజరత్ ఉస్మాన్‌సావీ గారి భక్తుడు.

నెల్లూరులోని భార్యాబిడ్డల వద్దకు వారానికి లేదా రెండు వారాలకు ఒకసారి వెళ్ళి వస్తుండేవారు. భక్త ఇలా ఆలస్యంగా వస్తున్నందుకు అబ్బాయి ఆరోగ్యం సరిగా లేదని వచ్చే ఆదివారము తప్పకుండా నెల్లూరు రావలెనని భార్య ఉత్తరం రాసింది. తహశీలుదారు ఉత్తరం చదివి స్వామిని దర్శించుకొని నెల్లూరు వెళ్ళదలచారు. స్వామి వద్దకు వెళ్ళి అబ్బాయి ఆరోగ్యం సరిగాలేదని ఇంటి నుంచి ఉత్తరం వచ్చిందని చెప్పారు. కొంతసేపటికి స్వామి అతనిని దగ్గరకు పిలిచి “నీ తలనునా భుజంపై ఉంచి కళ్ళు మూసుకో” అని ఆజ్ఞాపించారు. స్వామి చెప్పినట్లే చేసిన ఆ తహశీలుదారు ఆశ్చర్యపోయారు. తన బిడ్డను సేవకుడు మిద్దెపై ఆడిస్తున్నాడు. బిడ్డ క్షేమంగా ఉన్నాడు. అబ్బాయి చేతిలో ఒక పండు కూడా ఉంది. మరుసటి రోజు తాను ఇంటికి వెళ్ళి చూడగా క్షేమంగా ఉన్నాడు. సేవకుని పిలిచి నిన్న ఫలానా సమయంలో నీవు అబ్బాయిని ఎక్కడెక్కడా ఆడించావని అడిగారు. మిద్దెపై ఆడించానని అతడు జవాబిచ్చాడు. అబ్బాయి చేతిలో ఏమైనా ఉండిందా అని అడిగారు. నారింజ పండు ఉండినదని సేవకుడు జవాబిచ్చాడు. అలా ఎందుకు ఉత్తరం వ్రాశావని తన భార్యను అడిగారు. వచ్చే ఆదివారం మీరు నెల్లూరుకు వస్తారో లేదోనని అలా రాశానని భార్య సమాధానమిచ్చింది. దాంతో ఆయన తాను చూసిన దృశ్యాన్ని తలచుకొని ఆశ్చర్యపోయారు.

హజరత్ ఉస్మాన్ సావి అప్పుడప్పుడు సత్రం ఎదురుగా (ఈనాటి సూర్యభవన్ వద్ద గల కాలువ రాళ్ళపై) కూర్చునేవారు. నీటికై ఆ దారి గుండా ఓబన్న బావి (అంజనేయ దేవాలయము ప్రక్కన ఉండిన బావి)కి వెళ్ళే స్త్రీలు అపరిశుభ్రంగా ఉంటే స్వామి వారికి ఎదురు వెళ్ళక వెనుదిరిగి వేరే దారి గుండా బావి వద్దకు వెళ్ళే వారు.

ఉదయగిరి వాసులెందరో వీరి సేవకులుగాను, ఆధ్యాత్మిక శిష్యులుగాను ఉండేవారు. మా (ఈ పుస్తక రచయిత) తాత హైదర్‌సాహెబ్ ఉరఫ్ నన్నేసా గారి తండ్రి ఛాబు వీరి ఆధ్యాత్మిక శిష్యులై వీరి పోషణలో ఉండేవారు.

హజరత్ ఉస్మాన్ సావీని గురించి ఆనాటి ఉదయగిరి తహశీలుదారు మొహమ్మద్ సాహెబ్ మౌదూది పారశీ భాషలో ప్రశంసిస్తు గజల్ వ్రాశారు :

సుర్మయే ఐనుల్ యఖీన్ ఖాక్ దర్ ఉస్మాన్ మా

జల్వయేకె తూర్ దారద్ మన్జరే ఉస్మాన్ మా

అర్థం : మా హజరత్ ఉస్మాన్ ఖాదరి గారి ద్వారపు మట్టి విశ్వసించిన కనులకు సుర్మా వంటిది మా ఉస్మాన్ ఖాదరి గారి దర్శనము కొహెతూర్ (అరబ్బు దేశమందలి సీనా పర్వతం) మీద పడు వెలుగును చూడటం వంటిది.

బారకల్లా దర్ నజరె నాబద్ బచష్మ గైర్దోస్త్

హర్కెరా బీనం షుమారం మజ్హరే ఉస్మాన్ మా

అర్థం : దేవుడు చూపులో భాగ్యం కలుగజేయుగాక. మేము మా కనులతో ప్రియుని తప్ప వేరొకరిని దర్శించుకూడదు. నేనెవరిని చూచినను మా ఉస్మాన్ గారి ప్రతిబింబముగా భావిస్తాను.

ఆస్మా లర్జైద్ అజ్ బారిక్ ఉబర్ ఖుద్ ఖషీదన్

ఇన్న హూకానా జలూమన్ మహజర్ ఉస్మాన్మ

అర్థం : ఆకాశం దేవుని పై విశ్వాశపు భారాన్ని మోయుటకు కంపించిపొయె. (ఇన్నహు కానా జలూమన్) కాని మానవులు ఆ భారాన్ని మోయగలిగెను. ఇది మా ఉస్మాన్ గారి ప్రకాశపు ఒక తళుకు.

అబ్షుద్ సదఫ్ ఖత్రయే నయాన్ సదఫ్ రా దర్ షికం

నాబకఫ్ ఆవర్ద హంచూ-గౌహరే ఉస్మాన్ మా

అర్థం : నూరు వర్షపు బిందువులు ముత్యపు చిప్పలో చేరి నీరుగానే ఉండిపోయే. మా ఉస్మాన్ చేతిలోకి అవి వచ్చి ముత్యములాయె.

షాద్రా ఎక్ ఖత్రయే షా అజ్దో జహా మద్హూస్ కర్ద

అఫ్రీన్ సద్ అఫ్రీన్ బర్ సాగరే ఉస్మాన్ మా

అర్థం : మా ఉస్మాన్ పాన పాత్రకు వందల కొలది అభివందనములు. ఒక చుక్క ఇరులోకాల సుఖాలతో సంబంధం లేకుండా చేసె.

హజరత్ ఉస్మాన్సాపీ 14జీ ఖైదా 1292 హి.జ్రీ. అనగా క్రీ.శ. 1875సం.లో ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు.

గంధమహోత్సవములో పాల్గొనుచున్న వారసులు :

40 ఏండ్ల క్రితం పుస్తక రచయితకు పరిచయమైన మదరాసు వాసి హజరత్ ఉస్మాన్‌సావీ రహ. గారి మునిమనుమరాలి కుమారుడు మహమ్మద్ మజహర్ అలీ తొలిసారిగా తమ తల్లి శ్రీమతి మహమూదా బేగం వెంట ఉరుసులో హాజరయ్యారు. క్రమేపి వారి అన్నతమ్ములు మహమ్మద్ హసన్, మహమ్మద్ ఖయ్యూం ఆలీ కూతుర్లు డా. సయిదా కోడలు డా.గౌహర్ సుల్తానా ఉరుసులో కొంతకాలం హాజరగుతూ వచ్చారు. ఈ పుస్తక రచయిత ఇంటికి విచ్చేసి అచ్చటి నుండి శ్రీవారి గంధంతో దర్గా చేరేవారు. తల్లి మరణానంతరం క్రీ.శ. 2005 తమ అన్నలతో చెల్లెలు హాజరగుచుండిరి. హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ దర్గా ఆవరణలోని హజరత్ ఉస్మాన్ సావి రహ. సమాధిపై గుమ్మటాన్ని మహమ్మద్ ఖయ్యూం అలీ నిర్మించదలచి సం. 2004లో పని ప్రారంభించారు. కానీ పని పూర్తిగావించలేకపోయారు. ఆ పనిని దర్గా కమిటీ పూర్తి గావించినది. ఖయ్యూం అలీ సం. 2014లో మక్కాలోను,

వారి అన్న మహమ్మద్ మజ్‌హర్ అలీ సం. 2016లో మదరాసులో స్వర్గస్తులయ్యారు. వారి చెల్లెలు శ్రీమతి డా. సయీదా గారు నేటికి ఉదయగిరి విచ్చేసి గంధ కార్యక్రమాన్ని నిర్వహించుచున్నారు. దర్గాయందు దర్గా కమిటి గంధంతో పాటు ఈ గంధ ప్రసాదం భక్తులకు పంచబడుతుంది. ఈ పవిత్ర కార్యక్రమంలో హిందూ ముస్లీం భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులగుచుందురు.

హజరత్ ఉస్మాన్‌సావీ 14 జీ ఖైదా 1292 హి.జ్రీ. అనగా క్రీ.శ. 1875 సం.లో ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు.

షిజర ఏ ఖాదరియా (ఆధ్యాత్మిక పరంపర)

1. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ సుల్తానుల్ అంబియా వ బుర్‌హానుల్ అస్ఫియా అహమద్ ముజతబా మొహమ్మద్ ముస్తఫా సొల్లెల్లాహు అలైహి వ అస్‌హా బ వసల్లం.

2. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ అమీరుల్ మోమినీన్ ఇమామే హుసేన్ రజి అల్లాహు తాలా అన్ హు.

3. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ సయ్యద్ ఇమామ్ జైనుల్ ఆబిదీన్ రజి అల్లాహు తాలా అన్‌హు.

4. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ సయ్యద్ ఇమామ్ మొహమ్మద్ బాఖిర్ రజి అల్లాహుతాలా అన్‌హు.

5. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ సయ్యద్ ఇమామ్ జాఫర్ సాధిఖ్ రజి అల్లాహుతాలా అన్‌హు.

6. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ సయ్యద్ ఇమామ్ మూసాకాజిమ్ రజి అల్లాహుతాలా అన్‌హు.

7. ఇలాహి బహుర్మతే ఖిర్‌ఖయే ఖిలాఫత్ అలీమూసా రజా రజి అల్లాహుతాలా అన్‌హు.

8. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే షేఖుల్ మషాయఖ్ షేక్ మారుఫ్ కర్ఖి ఖుదసల్ల సిర్రహుల్ అజీజ్.

9. ఇలాహి బహుర్మతే షేఖుల్ మషాయఖ్ షేఖ్ అబిల్ హసన్ సర్రిసిఖ్తి ఖుదసల్ల సిర్రహుల్ అజీజ్.

10. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ ఖ్వాజా అబుల్ ఖాసిం జునైద్ బొగాది ఖుదసల్ల సిర్రహుల్ అజిజ్.

11. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ అబుబకర్ అబ్దుల్లా షిబ్లి ఖుదసల్ల సిర్రహుల్ అజిజ్.

12. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ అబుల్ ఫజ్ల్ అబ్దుల్ వాహిద్ బిన్ అబ్దుల్ అజీజ్ యమని ఖుదసల్లా సిర్రహుల్ అజిజ్.

13. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ అబుల్ ఫరాహ యూసుఫ్ తర్తూసి ఖుదసల్లా సిర్రహుల్ అజిజ్.

14. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ షర్వుద్దీన్ అబిల్ హస్న్ అలి బిన్ మహమ్మద్ యూసుఫ్ అల్ ఖురైషియుల్ హంకారి ఖుదసల్లా సిర్రహుల్ అజిజ్.

15. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ అబి సయీదుల్ ముబారక్ అలల్ ముఖమరూమి ఖుదసల్లా సిర్రహుల్ అజిజ్.

16. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ ఖుత్బుల్ అఖ్తాబ్ ఫర్దుల్ అహబాబ్ జద్దుల్ కామిలీన్ రయీసుల్ మహబూబైన్ గౌసుల్ ఆజం మీరాన్ మొహియుద్దీన్ షేఖ్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ హసనియుల్ హుసేనియుల్ జాఫరుల్ జీలాని రజి అల్లాహు తాలా అన్ హు వ అర్ జహు అనా.

17. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ తాజుద్దీన్ అబ్దుల్ రజాఖ్ ఖాదరి ఖుద్దస్ సల్లా సిర్రహుల్ అజీజ్.

18. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ సయ్యద్ షంషద్దీన్ అబి నస్ర సాలహ్ ఖాదరి ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్.

19. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ అబినస్ర మొహియుద్దీన్ ఖాదరీ ఖుదస్ సిర్రహుల్ అజీజ్.

20. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ సయ్యద్ మొహమ్మద్ అహమ్మదుల్ ఖాదరీ ఖుదసల్లాహుల్ అజీజ్.

21. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ హాజీ ఇస్హాఖ్ మొహమ్మద్ ఖాదరీ ఖుదసిర్రహుల్ అజీజ్.

22. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ రాజీ మొహమ్మద్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్.

23. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ దరియా మొహమ్మద్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్.

24. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ నాసిరుద్దీన్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్.

25. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ మొహమ్మద్ మఖ్ధూమ్ అబ్దుల్ హాఖ్ జ్ఞాన్ భండారి అల్ ఖాదరీ ఖుద సిర్రహుల్ అజీజ్.

26. ఇలాహి బహుర్మతే ఖిర్ఖయే ఖిలాఫత్ షేఖుల్ మషాయఖ్ షేఖ్ అబ్దుల్ ఖాదర్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్.

27. ఇలాహి బ ఇజో నియాజ్, ఫఖైర్ మొహమ్మద్ ఉస్మాన్ ఖాదరీ బలగుల్ల తాలా లికమాల్ బయతె మొహమ్మద్ రసూలల్లా సల్లెల్లాహు అలైహి వఆలిహి వఅస్హాబిహి వసల్లం జాహిరున్ వబాతినన్ వఅవ్వలన్ వఆఖిరన్.

28. మౌల్వీ అబ్దుల్ వహాబ్ మదరుల్ ఉమ్రా

మౌల్వీ అబ్దుల్ వహాబ్ మదరుల్ ఉమ్రా మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ గారి పెద్ద కుమారుడు. వీరు 1793లో మదరాసులో జన్మించారు. వీరి కొంత బాల్యము ఉదయగిరిలో గడిచింది. ఉదయగిరి మహనీయులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారి పిన్నమ్మ అగ్నా సాహెబాకు ఈయన మునిమనుమడు. హఫీజ్ మహమ్మద్ హబీబుల్లా, మీర్ హైదర్‌ల వద్ద ఖురాను అభ్యసించారు. ఖురాను పూర్తి చేసిన సందర్భంలో జరిపిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖ పండితులందరు హాజరయ్యారు 1826లో హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జీలాని మహబూబె సుభహాని సంతతికి చెందిన ప్రముఖ పండితులు ఖారి సయ్యద్ అలీబిన్ సయ్యద్ అబ్దుల్లా అల్ హమవీ అల్ బగ్దాది ఒకసారి మదరాసు వచ్చారు. అబ్దుల్ వహాబ్ వీరి వద్ద "ఖిరాతు" విద్య నేర్చారు. తమ తండ్రి వద్ద అనేక పుస్తకాలు చదివారు. కర్ణాటక నవాబు అజీముద్దౌలా కుమారుడు నవాబ్ ఆజమ్‌జా అబ్దుల్ వహాబ్‌కు సన్నిహితులు. తండ్రి మహమ్మద్ గౌస్ మరణానంతరం ఆ స్థానంలో అబ్దుల్ వహాబ్‌ను నియమించారు.

దర్బారు బిరుదులు :

అబ్దుల్ వహాబ్ గారికి తమ తండ్రికి లభించిన షర్ఫుల్ ముల్క్, షర్ఫుద్దౌలా, ఖాన్ బహద్దుర్, గాలిబ్ జంగ్ బిరుదులన్నీ లభించాయి. 1822లో నాగూరు బయలుదేరిన నవాబు ఆజంజా వండలూరు చేరి అక్కడి తహశీలుదారులకు, కలెక్టర్‌లకు అబ్దుల్ వహాబ్ చేతుల మీదుగా పతకాలను ప్రదానంగావించారు.

హజ్‌యాత్ర :

1861లో అబ్దుల్ వహాబ్ హజ్‌కు బయలుదేరారు. వీరి వెంట ఇద్దరు కుమారులు ఇద్దరు అల్లుళ్ళు ముగ్గరు దక్షిణ ఆఫ్రికా వాసులైన సేవకులు, ఇద్దరు ప్రత్యేక సేవకులు మొత్తం పది మంది ఉన్నారు.

మక్కాలో ప్రముఖ పండితులతో భేటి :

మక్కాలో షేక్ అబ్దుల్లా బిన్ మొహమ్మదల్ మర్‌యీా ముఫ్తీ హనఫీయా, సయ్యద్ మొహమ్మద్ ఉమ్రబిన్ అబిబకరుర్రయీాస్ ముఫ్తి షాఫియా, షేఖ్ మొహమ్మద్ అల్ మర్‌జూఖి ముఫ్తీ మాలికియా, షేఖ్ మొహమ్మద్ బిన్ యహ్యా ముఫ్తీ హనాబిలా, షేఖ్ ఉస్మాన్ దమ్యాతి మొహద్దీస్, షేఖ్ అహ్మద్ దమ్యాతి మొహద్దీస్ మొదలగు ప్రఖ్యాత ముఫ్తీలను, మొహద్దీస్‌లను కలుసుకొన్నారు.

మదీనాకు పయనం :

ప్రిన్స్ వాలాజా న్యాయవాది మొహమ్మద్ దస్తగీర్ సాహెబ్ మదీనా ప్రయాణంలో అబ్దుల్ వహాబ్ ఉండిరి. దారిలో గల లోయ సఫ్రాచేరి అక్కడి ప్రముఖ మహనీయులు హాజరత్ అబుజర్ గఫారి. రజి. సమాధి దర్శనముగావించారు. మదీనాలో పది రోజులుండి పవిత్ర స్థలాలను దర్శించారు. అచ్చటి ప్రముఖ పండితులు మౌల్వీ అబ్దుల్లా, ఉపఖాజి సయ్యద్ మొహమ్మద్ మదనీతో కలిశారు.

మదరాసు చేరిక :

మదరాసులో ఓడ దిగిన అబ్దుల్ వహాబ్‌కు నవాబుగౌస్ ఖాన్ బహాదుర్ ఇతర ప్రముఖులు స్వాగతం పలికి ఆలింగనం గావించుకొన్నారు. వారి తిరిగి రాక సందర్భంలో

మదరాసు కోట నుంచి పదిహేను ఫిరంగులను పేల్చారు. నవాబు గౌస్ ఖాన్ బహదూర్ తమ సొంత వాహనంలో మౌల్వీ గారిని వారి ఇంటి వరకు తోడ్కొని వచ్చి వదిలిపెట్టారు. వీరి రెండో హజ్ తిరుగు ప్రయాణంలో అనగా 1862లో మదరాసు నూతన ప్రభుత్వ ఏజెంటు ఉన్సన్ వీరిని కలుసుకొన్నారు.

ఆనాటి అబ్దుల్ వహాబ్ నివాసం :

వీరి తండ్రి మౌల్వీ మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ బహాదూర్ గారికి సముద్రపు ఒడ్డున గల ప్రస్తుత ప్రెసిడెన్సీ కాలేజీకి దక్షిణాన ఇవ్వబడిన ఒక అందమైన భవనమందు అన్నదమ్ములు అబ్దుల్ వహాబ్, ఖాజి బదరుద్దౌలా వీరి సంతానం నివసిస్తూ వచ్చారు. కొంత కాలానికి ఈ భవంతిని ప్రభుత్వం స్వాధీనపరచుకొంది.

మదరాసు రాయపేటలో తోట కొనుగోలు :

మౌల్వీ అబ్దుల్ వహాబ్ 1854లో ఉద్యోగానికి రాజీనామ చేశారు. తమ్ముని బిడ్డలకై 14వేల రూపాయలకు 1857లో షేఖ్ ఇమామ్ సంతానమైన అహ్మద్ అలీ, ఖాదర్ హుసాన్ వద్ద నుంచి మదరాసు రాయపేటలో గల విశాలమైన తోటను వారి శ్రీమతి రుఖియాబీ పేరిట కొన్నారు. అది నేడు "దీవాన్ సాహెబ్ బాగ్"గా ప్రసిద్ధిగాంచినది.

మౌల్వీ అబ్దుల్ వహాబ్ రచనలు :

మదరుల్ ఉమ్రా అబ్దుల్ వహాబ్ 16 ప్రసిద్ధ పుస్తక రచనలు గావించారు.

వహాబి గ్రంథ వ్యతిరకేత :

మౌల్వీ మహమ్మద్ ఆలీ రాంపూరి వహాబీ సిద్ధాంతాలను ఆచరించేవారు. రెండవ దఫా అనగా 1835లో మదరాసు రాగా వహాబీ సిద్ధాంతాలతో కూడిన మౌల్వీ ఇస్మాయిల్ దెహల్వీ రచన "తఖ్వి యతుల్ ఈమాన్" గురించి అల్లర్లు మొదలయ్యాయి. అందులో చేతులు కట్టుకొని నిలబడుట ఎవరి పేరిటయైన డబ్బు

ఖాజీ బదరుద్దౌల, మౌల్వీ అబ్దుల్ వహాబ్ గారి సమాధులు

ఖర్చుపెట్టుట ఉపవాసముండుట షిర్క్ (దేవుని అద్వితీయత్వ భంగము) అని చెప్పబడెను. ఈ పుస్తకాన్ని దక్షిణ భారతదేశపు ఉలేమాలు (పండితులు) ఎందరో ఖండిస్తూ సంచికలు రాశారు. మౌల్వీ అబ్దుల్ వహాబ్ కూడా తమ అరబీ రచన "సనదు జాయరీన్ ఫీరద్దుల్ వహాబైన్"లో తఖ్వియతుల్ ఈమాన్ పుస్తక ప్రతి అంశాన్ని ఖండిస్తూ వచ్చారు.

ఆధ్యాత్మిక శిష్యరికం :

మౌల్వీ అబ్దుల్ వహాబ్ 1839లో ప్రముఖ సూఫీ సయ్యద్ ఆలీ మొహమ్మదుల్ హుసైనియల్ ఖాదరీ గారి ఆధ్యాత్మిక శిష్యుడు (మురీదు) అయ్యారు.

ఆధ్యాత్మికతను గురించి మౌల్వీ అబ్దుల్ వహాబ్ : మనిషికి కఠినమైనటువంటి ఆధ్యాత్మిక గమ్యాన్ని చేరుకొనుట చాలా అవసరమని అదిలేనిదే మనిషి ఇన్‌సానె కామిల్ (పరిపూర్ణుడు) కాలేడని భావించేవారు.

మౌల్వీ గారి దినచర్య :

మౌల్వీ అబ్దుల్ వహాబ్ అర్ధరాత్రి తరువాత నిద్రలేచి "తహజుద్" నమాజు చదివే వారు. ఉదయం నమాజు వరకు వజాయఫ్, ఖురాన్ పఠనంగావించేవారు. నమాజు అనంతరం రెండు గంటలు పుస్తక రచనలో లీనమయ్యేవారు. 8 గంటలకు కొంత ఆహారము తీసుకొని 11 గంటల వరకు విద్యార్థులకు బోధించేవారు. కొంత విశ్రాంతి అనంతరం చేపాక్‌లోని కలస్‌మహల్ వెళ్ళి కార్యాలయ పనులు చూచుకొనేవారు. సాయంత్రం 4 గంటలకు ఇల్లు చేరి వజాయఫ్, గ్రంధ పఠనం గావించేవారు. మగరిబ్ నమాజు అనంతరం రాత్రి భోజనం అయిన పిమ్మట ఇషా నమాజు చదివి నిద్రపోవుట వీరి దినచర్య.

తుదిశ్వాస :

మక్కా ప్రముఖ పండితులు, మహనీయులైన హాఫిజ్ ఇబ్న్ హజ్ర మక్కీ గారి ప్రఖ్యాత గ్రంధము "అల్ జవహరుల్ మున్ జం ఫిజియారతుల్ ఖబ్రుల్ ముకర్రం" అను సమాధి దర్శనాన్ని గురించి వ్రాసిన పవిత్ర గ్రంధాన్ని నకలుగావిస్తూ అల్ ఆషరత యంబగీ లహు అన్ ఎస్ తహజర్ హయాతసల్లెల్లాహుత ఆలా అలైహి వసల్లం ఫి ఖబ్రహుల్ ముకర్రం వరకు వ్రాస్తూ కలాన్ని ఆపివేసిన మౌల్వీ 1868 జూన్ 26వ తేది శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు తుది శ్వాస విడిచారు.

29. హజరత్ మౌల్వీ మొహమ్మద్ సిబగ్ తుల్లా ఖాజీ బదరుద్దౌలా

మౌల్వీ మొహమ్మద్ సిబగ్ తుల్లా ఖాజీ బదరుద్దౌలా మొహమ్మద్ గౌస్ షర్ఫుల్ ముల్క్ గారి రెండో కుమారుడు. ఉదయగిరి మహనీయులు హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ గారి పిన్నమ్మ అగ్నా సాహెబాకు మునిమనుమడు. 1798 రబివుల్ అవ్వల్ నెల 30వ తేదీన వీరి తల్లి హలీమా కడప జిల్లా సిద్ధోటులో పాముకాటుకు గురియై మరణించగా తండ్రితో పాటు ఇద్దరు బిడ్డలు ఉదయగిరి చేరుకొన్నారు. వీరి కొంత బాల్యము ఉదయగిరిలో గడిచింది. వీరికి దేవుడు గొప్ప జ్ఞాపక శక్తి ప్రసాదించాడు. తమ ఎనిమిదో యేటనే ఖురాన్ పూర్తి చేశారు. హాఫీజ్ హబీబుల్లా వీరి తొలి గురువు. ఖురాన్ పూర్తిగావించిన సందర్భములో మదరాసులో పెద్ద కార్యము నిర్వహించి పట్టణ ప్రముఖ పండితులను ఆహ్వానించారు. మలికుల్ ఉల్మా మౌల్వీ అలా ఉద్దీన్ అహ్మద్ బిన్ షేక్ అహ్మద్ అన్వారుల్ హఖ్ వద్ద ఫిఖ్హా, వేదాంతం, తర్కశాస్త్రము చదివారు. వీరు తండ్రి నుంచి ఎంతో జ్ఞానము సముపార్జించుకొని వజాయఫ్ అనుమతి కూడా పొందారు.

ఆధ్యాత్మిక శిష్యరికం :

మౌల్వీ మొహమ్మద్ సిబగ్‌తుల్లా ఖాజీ బదరుద్దౌలా 1849లో హజ్‌యాత్రకు గాను మక్కా వెళ్ళి అక్కడి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు షేక్ ముల్లా మహమ్మద్ జాన్ నక్ష్ బందీ నుండి జ్ఞానాన్ని పొందారు. పై ఆధ్యాత్మిక గురువులిద్దరును హజరత్ గలాం అలీషా దెహెల్వీ గారి ఆధ్యాత్మిక శిష్యులు (మురీదులు), ఖలీఫాలు, వీరి

ఆధ్యాత్మిక పరంపర (సిల్‌సిలా) హజరత్ మజ్‌హర్ జాన్ జానా షహీద్ నుంచి హజరత్ ముజద్దద్ అల్ఫ్‌సానీ షేక్ అహ్మద్ సర్‌హింద్ ఇమాంరబ్బాని వరకు కలుస్తుంది.

మౌల్వీ గారి పఠనం :

వీరు ఎక్కువగా హదీసు, ప్రవక్త జీవితాన్ని తెలుపే గ్రంధాలు చదివేవారు.

నమాజును ఖజా చేయలేదు :

వీరు నమాజు, ఉపవాసాలు తప్పకుండ పాటించేవారు. తమ పదో ఏట నుంచి నమాజు ఖజా (మానుట) చేయలేదు. రాత్రి రెండు గంటలకు లేచి తహజుద్ నమాజు చదివేవారు.

ప్రముఖ పండితుల నుంచి అర్హతా పత్రాలు పొందుట :

ప్రముఖ పండితులు ముల్లా అబ్దుల్ అలా బహెరుల్ ఉలూం వద్ద మీజానుల్ తస్‌రీఫ్ చదివారు. హజరత్ షేక్ అబ్దుల్ హక్ ముహద్దీస్ దెహల్వీ సంతతికి చెందిన మౌల్వీ ఇబ్రాహిం రాంపూరి నుంచి మౌతా ఇమాం మాలిక్ సిహాసిత్తాను వివరించు అనుమతిని పొందారు.

ప్రముఖ పండితులు షేక్ అబుఉబేదా మొహమ్మద్ బిన్ మొహమ్మద్ అలాముల్ ముల్క్ గారు 1814లో జిద్దా నుంచి బెంగాల్‌కు వెళ్లే ఉద్దేశంతో మదరాసులో ఓడ దిగారు. కర్ణాటక నవాబు అజీముద్దౌలా వీరిని కలుకొని తమ వెంట షాదీమహల్ వరకు తీసుకొని వచ్చారు. షేక్ గారు చివరకు వరకు మదరాసులోనే వుండిపోయారు. ఖాజీ బదరుద్దౌలా వీరి వద్ద హదీస్ ముసల్‌సల్ బిల్ అదలియత్, హదీస్ ముసల్ సల్ బిల్ ముసాఫా అర్హతా పత్రాలను పొందారు. తమ తండ్రి వద్ద దలాయలుల్ ఖైరాత్ చదివారు.

బిరుదులు -ఉన్నత హోదాలు :

నవాబు ఆజంజా గారు ఖాజీ గారికి అజీంనవాజ్ ఖాన్ బహదూర్ మోతమిద్ జంగ్ అను బిరుదులతో సత్కరించారు. నాగూరులో వెలసిన మహనీయులు హజరత్ సయ్యద్ షాహుల్ హమీద్ ఖాదర్ వలి గంజ సవాయి వారి సమాధి దర్శనార్థం

నాగూరు వెళ్ళిన ఆజంజా అక్కడ ఖాజీ బదరుద్దౌలా గారికి సదరస్సుదూర్ (అధ్యక్షులకు అధ్యక్షుడు)గా నియమించారు. ఉందతుల్ ఉల్మా బదరుద్దౌలా అనే గౌరవ బిరుదులతో సత్కరించారు.

కర్ణాటక ప్రాంతాన్ని ఆంగ్లేయులు స్వాధీన పరచుకొన్న మీదట ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అఫజులల్ ఉల్మా మౌల్వీ ఇర్తెజా అలీఖాన్ బహదూర్ ఖుష్నూద్‌ను ముస్లిమ్ ఖాజీగా నియమించారు.

ఖాజీవుల్ ఖజ్జాత్ :

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తరపున ఖాజీబదరుద్దౌలా ఖాజీవుల్ ఖజ్జాత్ (చీఫ్ జస్టిస్)గా నియమితులయ్యారు. సామాన్య ప్రజలు తమ ఫిర్యాదులను ఎక్కువగా ఖాజీ బదరుద్దౌలా ముందు ఉంచేవారు. కాబట్టి వారి న్యాయస్థానానికే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది.

మదరాసులో వహాబి సిద్ధాంతాల ప్రచారం : సయ్యద్ అహ్మద్ బరేలి ఖలీఫాలలో ఇస్మాయిల్ దెహెల్వీ సయ్యద్ మొహమ్మద్ అలీ రాంపూరి ప్రముఖులు. మొహమ్మద్ అలీ రాంపూరి 1829లో మదరాసు వచ్చి నవాజ్ ఆజంజాను కలుసుకొన్నారు. ఆజంజా గౌరవించి వసతి ఏర్పాటు చేశారు. ఒకటి రెండు చోట్ల మొహమ్మద్ అలీ రాంపూరి ఉపన్యసించిన మీదట ప్రతి చోట నుంచి ఉపన్యసించవలసినదిగా ఆహ్వానములందేవి. షిర్క్, బిద్దత్ గురించి ఉపన్యాసాలు వినిన శ్రోతలెందరో మహమ్మద్ అలీ శిష్యులుగా మారేవారు. ఆర్కాటు నవాబైన మొహమ్మద్ అలీ వాలజా శ్రీమతి కూడా వీరి శిష్యురాలయ్యెను.

మొహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ అనుచరులని ప్రచారం జరుగుట:

ఇంతకు ముందు అనగా 1821లో ఇస్మాయిల్ దెహెల్వీతో పాటు హజ్ కొరకు మక్కా వెళ్లి వచ్చిన మహమ్మద్ అలీ అక్కడ వహాబీ సంస్కరణలతో ప్రభావితులై వాటి ప్రచారంలో లీనమై ఉన్నారని ఎవ్వరికీ అనుమానం కలుగలేదు. 1830లో పంజాబులోని బాలకోటలో జరిగిన పోరాటంలో సయ్యద్ అహ్మద్ బరేల్వి ఇస్మాయిల్

దెహెల్వీ హత్యగావింపబడిన మీదట వీరు వహాబి ఉద్యమ సృష్టికర్త అయిన మొహ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ అనుచరులని ప్రచారము జరిగింది. వీరి హృదయంలో హాజరత్ రసూలల్లా అలైహి వఆలిహి వఅస్హాబిహి వసల్లం, ఇతర ప్రవక్తలు, ఔలియా (మహనీయులు) పట్ల ఉన్నత స్థానం లేదని గ్రహించారు. వీరు ప్రవక్తలు, మహనీయుల గొప్పతనాన్ని దిగజార్చి మనుష్యులే కాదు జంతువులకన్న తక్కువగా భావించారు. దీనికి రుజువుగా ఇస్మాయిల్ దెహెల్వీ పుస్తకము "తఖ్వీయతుల్ ఈమాన్'లోని అంశాలు సంచలనాన్ని సృష్టించాయి. ఉదా : "ప్రతి జీవరాశి అది పెద్దదైన చిన్నదైన దేవుని గొప్పతనం ముందు చమార్ (చర్మాకారుడు) కన్నను హీనమని విశ్వసించవలెను" ఈ అంశంలో అన్ని జీవరాశులు చమార్ కన్న హీనమని చెప్పడాన్ని పండితులు ఖండించారు. "ఆ రాజాధిరాజు గొప్పతనమేమనగా తాననుకొంటె' 'అయిపొమ్ము' అను ఒక ఆజ్ఞాతోటి ఒక క్షణంలో కోటానుకోట్ల ప్రవక్తలు, మహనీయులు, దయ్యాలు, దేవదూతలు, మొహమ్మద్ సల్లెల్లాహు అలైహివసల్లంతో సమానులను పుట్టించగలడు". ఎవరైన పవిత్ర దర్శనార్థ స్థలాలను దర్శించిన, వాటిముందు చేతులు కట్టుకొని నిలబడిన, సమాధులపై గలేబు (కప్పు గుడ్డ) వేసిన, ద్వారము కడ నిలబడి ప్రార్థించిన, సమాధి కడ పూజారియై సమాధి చుట్టు కాంతి ఏర్పాటు చేసిన, శుభ్రపరచిన, తివాచి పరచిన, అచ్చటి నీటిని పవిత్రంగా భావించి తాను త్రాగి ఇతరులకు త్రాగించిన, కానుకగా ఇచ్చిన అది షిర్క్ (నిషిద్ధము) అవుతుందని, ఒకరి పేరిట ఫాతిహాచేసి ఆ అన్నం తాము తిని ఇతరులకు తినిపించినవారు, హజరత్ షా మద్వార్ మాలీద చేసినవారు హజరత్ బూ అలీ షాఖలందర్ సియామని చేసిన వారు ముష్రిక్ అని తఖ్వీయతుల్ ఈమాన్ అను పుస్తకంలో రాశారు.

తఖ్వీయతుల్ ఈమాన్ పుస్తక వ్యతిరేకతలో ఖాజీ బదరుద్దౌలా:

ప్రవక్త, మహనీయుల పట్ల ముస్లిముల విశ్వాసాలకు దెబ్బతీస్తున్న తఖ్వీయతుల్ ఈమాన్ పుస్తకాన్ని గురించి మీ ఉద్దేశాన్ని వెల్లడించాలని 1835జీ ఖైదా నెల ఒకటో తేది శుక్రవారం వాలజా మశీదులో ఇస్మాయిల్ దెహెల్వీ మిత్రులు సమకాలికులైన సయ్యద్ మొహమ్మద్ ఆలీ రాంపూరీని ఉలేమాలు (పండితులు) కోరారు. కొంతసేపు

ఉపన్యసించి చేతిలో ఖురాను తీసుకొని మొహమ్మద్‌అలీ ఇలా పలికారు "తఖ్వియతుల్ ఈమాన్‌లో రాసిన మాటలు ప్రవక్త సర్వరె ఆలం సల్లెల్లాహు అలైహి వసల్లం ఔనత్యాన్ని తగ్గించు అర్థం వస్తున్నందున ఈ ఫకీరు శిష్యులు, ఖలీఫాలలో ఎవరైన విశ్వసించిన తాను దారి తప్పి ఇతరులను దారి తప్పించునట్లు చేయువారగుదురు" అని మొహమ్మద్ అలీ పలుకుతూ పండితుల కోరికపై ఒక కాగితంపై తమ అభిప్రాయాన్ని వ్రాసి ఆజ్ఞాపత్రంగా సంతకం చేసి ముద్రవేశారు. సదరు పత్రముపై ఇతర ఉలేమాలతో పాటు ఖాజీ బదరుద్దౌలా కూడా తమ ముద్ర వేయడం జరిగినది.

తఖ్వీయతుల్ ఈమాన్ ప్రతులు నీటిలో పడవేయుట :

మొహమ్మద్ అలీ రాంపూరి ఉపన్యాసాలతో ప్రభావితులై కొనిన తఖ్వీయతుల్ ఈమాన్ 50 ప్రతులను అలీ రాంపూరి గారి అభిప్రాయం వెల్లడైన మీదట నవాబ్ ఆజంజా వాలజా మశీదులోని తొట్టెలో పడవేశారు.

మదరాసు నుంచి వెలువడు "సర్క్యులేటర్" అను ఆంగ్లపత్రికలో మౌల్వీ మొహమ్మద్ అలీ ముస్లింల మత విశ్వాసాలకు వ్యతిరేక ప్రచారం గావిస్తున్నారని పేర్కొన్నారు. వీరి వల్ల నగరంలో అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని వెంటనే ఇచ్చటి

నుంచి పంపివేయవలసిందిగా కొందరు చీఫ్ మేజిస్ట్రేట్‌ను కోరారు. మౌల్వీ గారిని వెంటనే మదరాసు నుంచి నీటి మార్గం గుండా వెళ్ళిపోవాలని మేజిస్ట్రేట్ ఆజ్ఞాపించిన మీదట 1835 ఏప్రిల్ నెల 15వ తేదీన ఉదయగిరి జాగీరుదారు సయ్యద్ అబ్బాస్ అలీఖాన్ సాహెబ్ గారి నర్సాపూరు వెళ్ళే ఓడలో బయలుదేరి నర్సాపూర్ చేరి అక్కడి నుంచి కలకత్తా వెళ్ళిపోయారు.

ఖాజీ వేసిన ముద్రగల పత్రాన్ని కలకత్తాకు పంపుట :

మొహమ్మద్ అలీ రాంపూరి కలకత్తా వెళ్ళిపోయిన మీదట తఖ్వీయతుల్ ఈమాన్‌ను గురించి వారు వెల్లడించిన అభిప్రాయ పత్రాన్ని మద్రాసు ఉలేమాలు కలకత్తా ఉలేమాలకు చేరవేశారు. అక్కడా చర్చ మొదలైంది.

ఖాజీగారి హజ్‌యాత్ర :

1849 మొహరం నెల 16వ తేదీన ఖాజీ బదరుద్దౌలా తమ కార్యాలయాన్ని తమ కుమారుడు మౌల్వీ మొహమ్మద్ అబ్దుల్లా సదారత్ ఖాన్ బహద్దూర్ ఆధీనపరచి హజ్‌యాత్రకు బయలుదేరారు. నవాబ్ గులాం గౌస్‌ఖాన్ బహదూర్ వీడ్కోలు పలికారు. ఓడ "అదన్" తీరానికి చేరుకొంది. మరుసటి రోజు ఉదయం ఖాజీ బదరుద్దౌలా తమ కుమారుడు నాసిరుద్దీన్ అబ్దుల్ ఖాదర్ అమీర్ నవాజ్ జంగ్‌ను వెంటబెట్టుకొని అదన్ పట్టణం చేరి అక్కడి మహనీయులు షేఖ్ ఈద్‌రూస్ ఖుదసిర్రహు సమాధిని దర్శించారు. జమాదివుల్ అవ్వల్ ఒకటో తేదీన ఓడ "మర్సా ఇబ్రాహిం" చేరింది. అక్కడ షేక్ ఇబ్రాహిం సమాధి చాలా ప్రసిద్ధి. ఆ సమాధిని కొందరు హజరత్ ఇబ్రాహింబిన్ అధంగారి సమాధి అంటారు. జమాదివుల్ అవ్వల్ ఆరో తేదిన ఓడ జిద్దా చేరింది. అక్కడి ఓడల అధికారి ఓడలో వచ్చి ఖాజీ గారిని కలుసుకొన్నారు. వాలజా ప్రభుత్వ న్యాయవాదియైనహాజీ మొహమ్మద్ దస్తగీర్ సాహెబ్ కూడా ఖాజీ గారిని కలుసుకొనుటకై మక్కా నుంచి జిద్దా వచ్చారు. వారి వెంట జంజం నీటిని తెచ్చారు. ఖాజీ గారు ఆ పవిత్ర నీటిని త్రాగారు. జిద్దాలో హజరత్ హవ్వా అలైహి సల్వాతు వస్సలాం సమాధిని దర్శించారు. అక్కడ ప్రముఖ పండితులైన షేక్ ఇమాం బిన్

హసన్, షేఖ్ అబ్దుల్ వహాబ్ షాఫీలతో కలుసుకొన్నారు. 10వ తేదీ మక్కా చేరుకొని కాబెతుల్లా తవాఫ్‌గావించారు.

మక్కాలో ప్రముఖులతో :

మక్కాలోని చాలా మంది ప్రముఖ పండితులు ఖాజీగారి పేరు విన్నారు. ఖాజీ గారు వారందరిని కలుకొన్నారు. వీరిలో హరమ్ షరీఫ్ ఉపఅధిపతి షేఖ్ సయ్యద్ అలీ రయీసుల్ ముద్రీసీన్, షేఖ్ జమాల్ హాఫ్తీ షాఫీ, షేఖ్ అహ్మద్ దమ్యాతి, ముఫ్తీ మాలికి షేఖ్ హుసైన్, షేఖుల్ ఖుత్‌బా షేక్ అహ్మద్ దహలాన్, ముదరసీన్ షేఖ్ సిద్దీఖ్, షేఖ్ అబ్దుల్లా మర్దాద్, ఖతీబ్ షేఖ్ ఉమ్రా అజీమి, ఖతీబ్‌షేక్ అబ్దుల్ అజీజ్ మర్దాద్, ఖతీబె షేఖ్ మొహమ్మద్ అబ్దుల్ రసూల్, ఖాజీ ఖతీబ్ షేఖ్ అబ్దుల్ సలాం, ముదరిస్ షేఖ్ ఇబ్రాహిం ఫతాహ్ గలరు.

29వ తేది శనివారం ఖాజీ గారు రాజు హసీబ్‌తో కలుసుకోవడానికి బయలుదేరారు. రాజు గారి సభలో చాలా మంది ప్రముఖ సర్దారులు, పండితులున్నారు. హిజాజ్ అమీరైన షరీఫ్ పాదషా కూడా ఒక కుర్చీలో కూర్చొని ఉన్నారు. రాజైన హసీబ్ పాషా ఖాజీగారిని చాలా గౌరవ మర్యాదలతో స్వాగతం పలికారు. అక్కడి సంప్రదాయం ప్రకారం ఖాజీగారికి "ఖహవా" (త్రాగే వస్తువు) ఇచ్చారు. కొద్దిసేపటి తర్వాత భోజన యేర్పాట్లు గావించి ఖాజీతో పాటు వారి వెంట ఉండిన వారందరిని భోజనానికి ఆహ్వానించారు. కాని ఖాజీ, తోటివారు "ఉజర్" (స్వీకరించలేము) అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ప్రతి దినము దైవ ప్రార్థన, సాధనలో గడిపేవారు. వివిధ పండితులతో కలిసి ఒకరి భావాలు ఒకరు వెల్లడించుకొనేవారు. మంచి అరబి పుస్తకాలు కొనేవారు. ముల్లా జాన్ నక్షబందీతో అంతర్జ్ఞానాన్ని పొందేవారు. ఖాజీ గారి కుమార్తె హబీబతుర్ రెహమాన్ 1848 బక్రీదు నెల 19వ తేది శుక్రవారం తమ ఆరో ఏట స్వర్గస్తులయ్యారు. జన్నతుల్ మొఅల్లాలో వారికి సమాధిగావించారు.

మదీనా చేరిక :

1850 మొహరం నెల 30వ తేదీన ఖాజీగారు మదీనామునవ్వరాకు బయలుదేరి

సఫర్ నెల 2వ తేది రాత్రి రెండు గంటలకు చేరారు. వీరికై పట్టణ ప్రవేశ ద్వారము తెరిచి ఉంచారు. ఉదయాన్నె స్నానం చేసి ప్రవక్త గారి పవిత్ర సమాధి దర్శనముగావించుకొన్నారు. రబివుల్ అవ్వల్ నెల 20వ తేది వరకు మదీనాలో ఉంటూ వివిధ పవిత్ర స్థలాలను దర్శించుచుండిరి. 12వ తేదీన హరమ్ షరీఫ్ ఉపఅధికారి దావుద్ పాషా గారితో కలిశారు. రెండవ రోజు ఉపఖాజీ సయ్యద్ మొహమ్మద్ మదనీతో కలిశారు. ఖాజీ గారి రాక విషయాన్ని తెలుసుకొన్న ముఫ్తి షాఫియా సయ్యద్ ఇబ్రాహిం, ముఫ్తి హనఫియా షేక్ అబుసవూద్ వచ్చి ఖాజీ గారిని కలిశారు.

ఖాజీగారు మదరాసు చేరుకొనుట : 1850 రంజాన్ నెల మొదటి తేదిన ఓడ మదరాసు తీరము చేరింది. ఖాజీ గారికి స్వాగతం పలకడానికి నవాబ్ గులాంగౌస్‌ఖాన్ బహదూర్, పట్టణ ప్రముఖులు, బంధువులు నౌకాశ్రయం చేరారు. అందరికంటే ముందు నవాబు గులాం గౌస్‌ఖాన్ బహదూర్ ఘనస్వాగతం పలికి ఆలింగనం గావించుకొన్నారు. తమ సొంత వాహనంలో ఖాజీ గారిని ఇంటి వరకు తెచ్చి కొంత సేపు ఖాజీ గారితో గడిపి తమ మహలుకు బయలుదేరారు.

ఖాజీ గారి రచనలు :

ఖాజీ బదరుద్దౌలా మౌలానా బాఖర్ ఆగా వెల్లూరు వలె అరబీ, పారశీ, ఉర్దూ కవి మాత్రము కాదు. కాని ఈ మూడు భాషల్లో రచయితగా అత్యున్నత స్థానాన్ని పొందారు. 29 అరబీ, 24 పారశీ, 14 ఉర్దూ పుస్తక రచనలు గావించారు. ఆగా, బదరుద్దౌలా దక్షిణ భారత దేశంలో ఉర్దూ భాషకు శాశ్వత స్థానాన్ని ప్రసాదించారు. ఆగా హఫ్త్ బిహిష్త్ అను ప్రవక్త గారి జీవిత చరిత్రను పద్యరూపములో రచించారు. కొంత కాలానికి తొహఫతుల్ అహబాబ్, రియాజుల్ జన్నాన్, మమ్‌బూబుల్ ఖులూబ్ అను పేరిట ప్రవక్త గారి అనుచరులు, హజరత్ అలీ 'రజి' వారి సంతతీ, హజరత్ షేఖ్ అబ్దుల్ ఖాదర్ జీలాని మహబూబె సుబహాని 'రజి' వారి జీవిత చరిత్రను రాశారు. అదే విధంగా ఖాజీ బదురుద్దౌలా స్త్రీల కోసం ఇస్లాం మత సిద్ధాంతాలను తెలుపు "రియాజున్నిస్వాన్" అందరికై "ఫవాయద్ బదరియా" గద్య రూపంలో

రచించారు. ఫైజుల్ కరీం పేరుతో ఖుర్అన్ తఫ్సీర్ (వివరణ) రాశారు. ఇంతటి వివరణ అరబీ భాషలో కూడా లేదు. హజ్ చేసే పద్ధతులను గురించి వ్రాసిన గ్రంథం అరబీ, పారశీ భాషలందు కూడా కానరాదు.

ఫవాయద్ బదరియా రచన :

ఖాజీ గారు హదీసు, సైర్ (ప్రవక్త జీవిత చరిత్ర)లో ప్రవీణులు. వీరి రచన "ఫవాయద్ బదరియా" ప్రవక్త హజరత్ మొహమ్మద్ సల్లెల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర చాలా ప్రసిద్ధిగాంచినది.

కర్ణాటక నవాబైన ఆజంజా కోరిక మేరకు 1823లో "నూరుల్ అబ్సార్ ఫీసైర్ సయ్యదుల్ అబ్రార్" అను పారశీ భాషలో గ్రంథ రచన గావించారు. అత్యధికులు ఈ గ్రంథాన్ని చదివి లాభం పొందడానికి ఉర్దూ భాషలో అనువదింపవలసినదిగా నవాబ్ ఆజంజా ఖాజీగారిని కోరారు. వారి కోరిక మేరకు అనువాదపు పని ప్రారంభమైంది. అంతలో నవాబ్ ఆజంజా స్వర్గస్తులయ్యారు. వారి కుమారుడు నవాబ్ గులాంమ్ గౌస్ఖాన్ కాలంలో అనగా 1839 సెప్టెంబరు 15వ తేదీన ఉర్దూ భాషలో గ్రంథం పూర్తిఅయింది.

"ఫవాయద్ బదరియా" ఆధార గ్రంథాలు :

1. అయూనుల్ అసర్ లాబిన్ సయ్యదున్నాస్
2. జాదుల్ మాద్లాబిన్ఖీం
3. ఫతహుల్ బారి లాబిన్ హ్రజ అస్ఖలాని
4. ఖసాయసుల్ కుబ్రలల్స్యూతి
5. అల్మవాహి బుల్లదనియల్ మఖ్సత్లాని
6. మదారజుల్ నబువతుల్ అబ్దుల్ హాఖ్ దహెల్వీ

ఈ గ్రంథం 1847లో కిషన్రాజ్ ప్రెస్ మద్రాసు నుంచి వెలువడింది. తదుపరి బొంబాయి, బెంగుళూరు మరియు హైదరాబాదులో ఎనిమిది పర్యాయాలు

ముద్రింపబడింది. దక్షిణ భారతదేశంలో రబ్బియుల్ అవ్వల్ నెలలోని మొదటి పండ్రెండు రోజులు ఈ గ్రంథాన్ని చదివి భక్తులకు వినిపిస్తారు. నేటికి ఎన్నో ప్రాంతాలలో ఈ పుస్తక పఠనం జరుగుతోంది. 1931లో హైదరాబాదులో ముద్రింపబడిన ఈ గ్రంథాన్ని ఉదయగిరిలోని పెద్ద మశీదు, చిన్న మశీదులందు ప్రవక్త గారి పవిత్ర జన్మదినము "మీలాదున్నబి" రోజున చదువుదురు. ఈ పుస్తకంలో 404 పేజీలు ప్రతి పేజీలో 21 పంక్తులు గలవు.

ఖాజీగారు స్వర్గస్తులగుట :

"అక్సర్ ఆమార్ ఉమ్మతి మాబైనుస్సతైన్ వస్సబిఐన్" (నాపై విశ్వాసముంచిన నా వారి వయస్సు అరవై డెబ్బై సంవత్సరాలలోపు ఉండును). "ప్రవక్త గారి ఈ హదీసు ప్రకారం నా వయస్సు పూర్తి అయింది. మీరందరు త్వరగా మీ పాఠ్యపుస్తకాలను ముగించండి" అని ఖాజీగారు తమ విద్యార్థులతో చెప్పేవారు. 1863 మొహరం నెల 21వ తేదీన అకస్మాత్తుగా ఖాజీ ఆరోగ్యం క్షీణించింది. ఆ పరిస్థితిలో కూడా నమాజు వదలకుండా సకాలంలో చదివేవారు. 1863 జూలై నెల 13వ తేది సోమవారం ఉదయం నమాజు చదివారు. ఆరోగ్యం క్షీణించిన దృష్ట్యా బాధ ఎక్కువైంది. సూర్యుడు ఉదయిస్తుండగా ఖాజీ గారు తుదిశ్వాస విడిచారు. ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్.

వీరి మరణంతో వీరి కుటుంబమే కాదు పట్టణ ముస్లిములందరు దు:ఖ సాగరంలో మునిగారు. అధిక సంఖ్యలో జనం వీరి ఇంటి వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం నమాజు సమయంలో వాలజా మసీదు వద్దకు ఖాజీగారిని తీసుకొనిపోగా ముందుగానే అక్కడ అసంఖ్యాకులు చేరుకొన్నారు. నమాజు తదుపరి మసీదుకు ఒక ప్రక్కన సమాధిగావించారు.

30. హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖాలిస్

హజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖాలిస్ సాహితీవేత్త, కవి 1337 హి.క్రి.శ. 1918లో ఉదయగిరిలో జన్మించారు. ప్రముఖ కవి పండితులైన రాఖింకు శిష్యులు. మదరాసులో నిర్వహించిన ప్రధాన ముషాయిరా (ఉర్దూ కవి సమ్మేళనం)లో వీరు ప్రధాన పాత్ర పోషించారు. గురువు గారైన రాఖిం వీరి ఆలోచనశక్తి, మేధస్సును గురించి ప్రసంసించారు. ప్రధాన ముషాయిరా సందర్భంలో ప్రారంభించిన ప్రత్యేక గ్రంధాలయానికి పర్యవేక్షకునిగా ఉండిరి.

31. హజరత్ అబ్దుల్ వహాబ్ పీర్

ఉదయగిరికు పశ్చిమంగా కొద్ది దూరములో కాలినడకన కొండకు పోవు మార్గములో ఒక దర్గా కలదు. దానిని అబ్దుల్ వహాబ్ పీర్ దర్గా అంటారు. వారు ఏ కాలపు మహనీయులో తెలియదు. తమ కోరికలు తీరిన భక్తులు ఆ స్వామిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకొందురు. ప్రతి సంవత్సరము స్వామి వారి గంధము షాబాన్ నెల 3వ తేదీన హక్కుదారులైన చాంద్ బాష, టీచర్ సర్దార్ గారి ఇంటి నుంచి దర్గా చేరిన మీదట చదివింపుల తదుపరి భక్తులకు ప్రసాదము పంచబడుతుంది. ఈ గంధ మహోత్సవములో హిందూ ముస్లిం భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొనుచుందురు.

"రౌజతుల్ ఖుదసియా" అను ఉదయగిరి మహనీయుల సమాధులను గురించి తెలుపు పారసీ పుస్తకంలో ఈ ప్రాంతములో హజరత్ మొహమ్మద్ గౌస్ మహనీయులు ఉన్నారని వ్రాయబడినది. హజరత్ అబ్దుల్ వహాబ్ పీర్ దర్గాకు ఎదురుగా రాళ్ళతో నిర్మించిన అరుగు మీద రెండు సమాధులు గలవు. వాటిలో ఒక చిన్న సమాధికి హజరత్ బదరుద్దీన్ అలీ ఖాన్‌సాహెబ్ సమాధి(ఈ సమాధి ఉదయగిరి పెద్ద మసీదు మఖబరాయందు గలదు) చుట్టు చేసిన విధంగా నగిషీపని చేసియున్నారు. ఆ నగిషీని బట్టి బహుశా వీరే మహమ్మద్ గౌస్ ఉండవచ్చునని హజరత్ బదరుద్దీన్ అలీఖాన్ సమకాలికులై ఉండవచ్చునని రచయిత అభిప్రాయం (యధార్ధం దేవుని కెరుక).

32. హజరత్ షాహదా (గంజె షహిద్)

ఉదయగిరికి తూర్పున పెద్ద చెరువు ఒడ్డున రెండు రాతి సమాధులు గలవు ఈ షహీదులు (మృత వీరులు) నెల్లూరులోని బారాషహీద్‌ల సమకాలికులై ఉ ండవచ్చునని రచయిత అభిప్రాయం. (నిజము దేవుని కెరుక). ఈ దర్గా వద్ద ప్రతి ఏటా మొహరం వెళ్ళిన మూడో రోజు జరిగే రొట్టెల పండుగ సర్వమత సామరస్య వేదికగా, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా విరాజిల్లుతోంది. వందల ఏళ్ళ క్రితం కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడి మతాన్ని విస్తరింపజేయాలని కొంత మంది ఇస్లాం మత ప్రచారకులు ప్రపంచ పర్యటన గావిస్తూ ఈ ప్రాంతం చేరారు. ఇక్కడ మత ఛాందస్సులు, వ్యతిరేకులు వారిని ప్రతిఘటించారు. ఇరు వర్గాల మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఇద్దరు అమరులయ్యారు. వారికి రాతి సమాధులు కట్టారు. ఈ దర్గాకు "పత్థర్ ఖబరా–" (రాతి సమాధులు) అని పిలుస్తారు. కొందరు గంజ్ షాహదా (అమరవీరుల ఖజానా) అని కూడా అంటారు.

మహిమ :

గతంలో ఈ రెండు సమాధుల మధ్య దూరము మూడు నాలుగు అడుగులు మాత్రమే. ప్రస్తుతం ఈ రెండు సమాధుల మధ్య దూరం పెరిగి మధ్యలో ఎక్కువ

మంది నడవ గలిగినంత కాళీ ఏర్పడింది. అనగా దక్షిణం వైపు ఉండిన సమాధి ఉత్తరం వైపు సమాధికి చాలా దగ్గరగా ఉండేది, అది ప్రస్తుతం దక్షిణం వైపుకు జరిగిపోయెను.

మహిమ : ఒక రోజు సాయంత్రం ఉదయగిరి నివాసి భోగి బీడి ప్రొప్రైటర్ అయిన జనాబ్ కాలేషా సమాధుల దర్శనానికి దర్గాలోనికి వెళ్ళుటకు అడుగు పెట్టగా రెండు పెద్ద పులులు ఆనాటి చిన్న గోడలు ఎగిరి దూకి దాసరిపల్లె కొండ వైపు పరిగెత్తాయి. దర్గాకు కొంత దూరమున మేకలను మేపు వ్యక్తితో "పెద్ద పులులు వస్తున్నాయి" అని బిగ్గరగా కేకలు వేయగా "కనబడలేదే!" అని ఆ వ్యక్తి సమాధానమిచ్చెనని కాలేషా తెలిపారు. తదుపరి వారు దర్గా చుట్టు గోడలు నిర్మించి గంధోత్సవాన్ని ప్రారంభించారు. మధ్యలో కొంత కాలం గ్రామ పంచాయితీ కుళాయి నీరు వదిలే అబ్దుల్ అజీజ్ సాహెబ్ వారి ఇంటి నుంచి మొహరం నెల పండ్రెండవ తేదీన ఆ మహనీయుల గంధము దర్గా చేర్చి చదివింపుల తదుపరి హిందూ ముస్లిం భక్తులకు ప్రసాదం పంచేవారు. కాలేషా గారు మరలా ఈ గంధోత్సవాన్ని చేపట్టారు.

33. హజరత్ పాఛాపీర్ ఔలియా

ఉదయగిరి గ్రామ పంచాయితీ కార్యాలయం వెనుకనున్న ఆస్తాన-ఏ-ఖాదరియా ఒ ఖాన్ ఖాహె చిష్తియాకు ప్రక్కన గల సమాధులలో హజరత్ పాఛాపీర్ ఔలియా సమాధి గలదు. వీరు హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి వారికి బంధువులగుదురు. గతంలో ఈ సమాధి ఒక పెద్ద అరుగు పై ఉండెడిది. ప్రస్తుతం సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహబ్ ఖాదరీ దర్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ మన్‌సూర్ రోజ్‌దార్ ఈ దర్గాకు ప్రహరీ నిర్మించారు.

మహిమ :

నా బాల్యంలో (గ్రంధ రచయిత) ఒక్క ఇల్లు కూడా లేని ఈ ప్రాంతాన్ని "నూరుల్లాసాహెబ్‌కి దొడ్డి" అనే వారు. ఇక్కడ నుంచి కరీమావీధి చాలా దగ్గర. ఆ వీధిలో ఉండిన ఆనాటి లారీ ఓనరు జనాబ్ బుర్హానుద్దీన్ (ఆర్టీసి డ్రైవర్ హుసేని గారి తండ్రి) అవసర నిమిత్తం అర్ధరాత్రి ఆ దొడ్డిలోకి వెళ్ళారు. వారి చూపు దర్గా వైపు వెళ్ళింది. తెల్లటి తలపాగా, తెల్లటి బట్టలు ధరించిన వ్యక్తి ఆ సమాధుల వద్ద కనిపించారు. వెంటనే అక్కడి నుంచి తమ ఇంటికి చేరుకొనిన బుర్హానుద్దీన్ గారు తెల్లవారగా షీన్ (పెద్ద పళ్ళెం)లో ప్రసాదంగా పప్పు బెల్లాలు చదివింపులు ఇచ్చి అక్కడ చేరిన వారందరికి పంచారు. అచ్చుట చేరి ప్రసాదాన్ని అందుకొన్నా వారిలో ఈ గ్రంధ రచయిత కూడా కలదు.

34. హజరత్ ఖాదర్ సాహెబ్ ఔలియా

ఉదయగిరి నుండి ఝుట్ పట్ బీబీ దర్గా దాటి కొండకుపోవు మెట్ల మార్గాన కొద్ది దూరంలో కుడి చేతి వైపు హజరత్ ఖాదర్ సా ఔలియా వారి దర్గా గలదు.

సుమారు వంద సంవత్సరాల పూర్వము ఆ ప్రాంతమంతా చెట్లతో నిండియుండెను. విహారయాత్రకై కొండకు వచ్చే వారికి, ఆ మెట్ల గుండా కొండ పైకిపోవు దుర్గంపల్లెవారికి అచ్చట సమాధులున్న విషయము తెలియదు. దిలావర్ భాయి వీధి వారు ఆనాడు కూడా వనభోజనాలకై ఎక్కువగా కోనయందు మెట్ల గుండా వెళ్ళి దుర్గంపల్లెలోని వల్లభరాయుని దేవాలయం వద్ద ఒక రాత్రి గడిపేవారు. ఆ వీధిలోని ఒకరిద్దరికి స్వప్నంలో ఒక మహనీయుడు మెట్ల ప్రక్కన గల చెట్ల పొదలో నిలబడి "నేను ఇచ్చట ఉన్నాను" అని ఇలా రెండు మూడుసార్లు కనబడి

చెప్పెనని కలగన్నవారు ఒక చోట చేరి ఈ విషయాన్ని గురించి చర్చించుకొన్నారు ఒకరోజు కొడవళ్ళు గొడ్డళ్ళతో బయలుదేరి మెట్ల ప్రక్కనగల చెట్లను నరుకుచుండగా ఒక చోట పాతబడిన సమాధులు కనబడెను. వాటి చుట్టు రాళ్ళతో గోడలు కట్టి అప్పటి నుండి ఎంతో భక్తితో గంధోత్సవం జరిపేవారని ఈ విషయాన్ని కొయ్యతో నగిషీ పనిచేసి ప్రఖ్యాతిగాంచిన నాన్ భాయి ఖాజామియా (మేళం వాయించే మొహమ్మద్ గారి తండ్రి) ముప్పై ఏళ్ళ క్రితం ఈ గ్రంధ రచయితకు చెప్పారు.

ప్రతి సంవత్సరం ఆఖరి చహార్ షుంబ(చివరి బుధవారము) రోజు వనభోజనాలకై వచ్చు వారు ఎంతో భక్తితో ఈ సమాధిని దర్శించుకొనుచుందురు. రాతి గోడలు కలిగియుండిన ఈ దర్గాను ఉదయగిరి వాసులు షేక్ ముజాహిద్ సుల్తాన్, అజ్మల్ వారి బంధుమిత్రులు, భక్తుల సహకారంతో ఈ దర్గాను అతి సుందరంగా తయారు చేయడమైనది. ప్రతి సంవత్సరం జమాదియుల్ ఆఖర్ నెల 19వ తేదీన శ్రీవారి గంధం జనాబ్ ముజాహిద్ సుల్తాన్ ఇంటి నుండి బయలుదేరి శ్రీవారి దర్గా చేరుతుంది. ఆ రాత్రి ఆ ప్రాంతమంతా విద్యుద్దీపాలతో మెరిసి పోతూ భక్తులతో కళకళలాడుతుంది. తమ కోరికలు తీరిన వారు ఇచ్చట చేరి మొక్కుబడులు తీర్చుకొనుచుందురు.

35. హజరత్ ఫరీదుద్దీన్ పాషా

ఉదయగిరి కొండపై 'టపకా" నుండి చిన్న మసీదుకు వెళ్ళు దారిలో కుడి ప్రక్కన ఒక జండా చెట్టు కనబడుతుంది. అచ్చట ఒక సమాధి గలదు. అది హజరత్ ఫరీదుద్దీన్ పాషా సమాధి అని అంటారు.

బ్రిటీషు వారి కాలంలో ఒక ఇంగ్లీషు మహిళ ఆ స్థలములో జరుగు భక్తి కార్యక్రమాలను చూచి "ఇచ్చట ఏముందని మీరు ఇలా చేయుచున్నారు" అని గర్వంగా చెప్పుచుండగా గర్భవతిగా ఉండిన ఆమెకు గర్భస్రావం జరిగిపోయిందని దిలావర్ భాయి వీధి కురువృద్ధులు కొయ్య నగిషీ పనిలో పేరు గడించిన స్వర్గీయ నాన్ భాయి ఖాజామియా ఈ పుస్తక రచయితతో చెప్పిరి.

దిలావర్ భాయి వీధికి చెందిన గఫార్ భాయి మొహమ్మద్ అలీ గారి కుమారుడు సలీం వెల్లడించిన హజరత్ ఫరీదుద్దీన్ పాషా గారి మహిమ :

నా పన్నెండవ ఏట వన భోజనాల రోజు మా అవ్వగారి వెంట కొండకు వెళ్ళినాను. కొంత మంది స్నేహితులతో కలిసి చిన్న మసీదు వరకు వెళ్ళి తిరిగి వస్తూ ఒంటికి కూర్చొన్నాను కొంచెం ముందుకు రాగా అచ్చట ఒక జెండా చెట్టు కనబడెను. దాని ప్రక్కన దీపము పెట్టు గూడు అందులో పావల నాణెము కనబడెను. దానిని తీసుకొని జేబులో వేసుకొన్నాను. స్నేహితులను పిలువగా నాకంటె కొంచెము ముందుకు వెళ్ళిపోయినందుకు నా పిలుపు వారికి వినబడలేదు. నాకు ఎటు తోచక భయంతో ఏడ్చినాను. అంతలో తెల్లని బట్టలు, తలపాగా ధరించిన ఒక వ్యక్తి నా ప్రక్కన వచ్చి నా తలపై చేయి ఉంచగా నాకు తెలియకుండానే నేను కొండలోని కోన ప్రాంతంలో ఉన్న నా అవ్వ వద్దకు చేరిపోయాను".

కొండ వెనుకగల బిజ్జంపల్లె గ్రామ ముస్లిములు భక్తిశ్రద్ధలతో హజరత్ ఫరీదుద్దీన్ పాషా సమాధిని దర్శించుచుందురు. వారిలో చాలా మంది తమ మగపిల్లల పేర్లు ఫరీద్ సా అని పెట్టుకొనుచుందురు.

36. హజరత్ దుర్వేష్ ఔలియా

ఉదయగిరి లోకల్ లైబ్రరీకి ఎదురుగా వెలసి ఉన్న హజరత్ సయ్యద్ దుర్వేష్ మొహమ్మద్ ఖాద్రి సుమారు 400 సంవత్సరాలనాటి మహనీయులు. వీరి తండ్రి పేరు హజరత్ సయ్యద్ షా మఖ్దూమ్ ఇస్ హాఖ్ ఖాదరీ. ఉదయగిరి యందు వీరిది మొదటి సంతతి. హజరత్ సయ్యద్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ గారిది రెండో సంతతి. హజరత్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ వంశం జగత్ గురువు హజరత్ మహబూబే సుహానీ ర.తో కలుస్తుంది. అనగా వారి పెద్ద కుమారులు సయ్యద్ అబ్దుల్ రజాక్ ఖాదరీ రహ. సంతతికి సంబంధించినవారు. హజరత్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ కుమారులలో ఒకరిద్దరు సయ్యద్ షా మొహమ్మద్ మీర్ ఖాదరీ ఉర్ఫ్ సయ్యద్ షా బదరె ఆలం ఖాదరీ, సయ్యద్ షా సదరె ఆలం ఖాదరీ ఉదయగిరి వదలి సిద్దోటు చేరారు.

సిద్దోటులో సదరె ఆలం ఖాదరీకి నవాబు సాదతుల్లా బహదూర్ ఇనాములు సమర్పించుకొన్నారు. సదరె ఆలం ఖాదరీ వారి శ్రీమతి ఫాతిమా ఖైరున్నిసా వీరిద్దరి

సదరె ఆలం ఖాదరి, ఫాతిమ ఖైరున్నిసా సమాధులు - సిద్దోటు.

సమాధులు సిద్దోటులో కలవు. వీరి కుమారుడు సయ్యద్ షా మఖ్దూమ్ ముష్తాఖ్ ఖాదరీ సయ్యద్ షా ఖాదర్ వల్లి ఖాదరీ అలియాస్ నజరే ఆలం ఖాదరీ 1120లో స్వర్గస్తు లయ్యారు. నందవరంలో వీరి ఉరుసు రజ్జబ్ నెల 22వ తేదీ జరుగును. సయ్యద్ షా అబుల్ ఫతా ఖాదరీ సాని. వీరు టిప్పుసుల్తాన్ తండ్రి హైదర్ అలీ నిఖా చదివించారు. సయ్యద్ మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ దక్కని ఉర్దూలో రచన మస్నవీ యుసుఫ్ జులెఖ వ్రాసి ప్రసిద్ధిగాంచారు.

సయ్యద్ షా దర్వేష్ మొహమ్మద్ ఖాదరీ సాని రచన మఖ్జనుల్ అరాస్ ప్రసిద్ధిగాంచెను. వీరు 1282 హిజ్రి.లో స్వర్గస్తులయ్యారు. సయ్యద్ షా అహ్మద్ మీర్ ఖాదరీ 1304 హిజ్రిలో స్వర్గస్తులయ్యారు. సయ్యద్ షా అహ్మద్ మీర్ ఖాదరీ 1304 హిజ్రి.లో స్వర్గస్తులయా&్యరు. సయ్యద్ షా సయ్యాదా సాని ఖాదరీ సయ్యద్ షా లలామియా ఖాదరీ అలియాస్ నజరే ఆలం ఖాదరీ మహబుబ్ బాషాకు ముత్తాత అగుదురు. వీరు సిద్దోటులో 1926లో సమాధి అయ్యారు. సయ్యద్ షా మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ సిద్దోటులో 1974లో స్వర్గస్తులయ్యారు. వీరు మహబుబ్ బాషా గారికి జేజనాయన అగుదురు. సయ్యద్ షా అహ్మద్ ఖాదరీ క్రి.శ. 2015లో సిద్దోటులో స్వర్గస్తులయ్యారు. వీరు మహబుబ్ బాషా గారికి తండ్రి అగుదురు.

నసబ్‌నామా (వంశవృక్ష సూచిక)

హజరత్ మహబూబె సుబహాని పీరానేపీర్ దస్తగీర్

హజరత్ సయ్యద్ అబ్దుర్ రజాఖ్ ఖాదరీ

హజరత్ సయ్యద్ అబుసాలెహా నసీరుద్దీన్ ఖాదరీ

హజరత్ సయ్యద్ అలీరజా ఇలాహీ ఖాదరీ

హజరత్ సయ్యద్ దావూద్ సర్‌మస్త్ ఖాదరీ

హజరత్ సయ్యద్ జలాలుద్దీన్ ఖాదరీ

హజరత్ సయ్యద్ బహూవుద్దీన్ ఖాదరీ

హజరత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాదరీ

హజరత్ సయ్యద్ అబుల్‌ఖైర్ ఖాదరీ ఖైర్ ఆబాదీ (యు.పి.)

హజరత్ సయ్యద్ అబుయూసుఫ్ ఖాదరీ

హజరత్ సయ్యద్ షా సుల్తాన్ ఖాదరీ

హజరత్ సయ్యద్ మొహమ్మద్ మీర్ ఖాదరీ

హజరత్ సయ్యద్ షా అబుల్ ఫతా ఖాదరీ

సయ్యద్ షా మగ్‌దూమ్ ఇస్ హాఖ్ ఖాదరీ

సయ్యద్ మొహమ్మద్ దుర్‌వేష్ ఖాదరీ (ఉదయగిరి)

మొహమ్మద్ మీర్ ఖాదరీ అలియాస్ సయ్యద్ షా బదరె ఆలం ఖాదరీ

సయ్యద్ షా ఖదరె ఆలం ఖాదరీ వీరు సిద్దోటు నవాబు మ్యాన అబ్దుల్ కరీంఖాన్ గారి ఆధ్యాత్మిక గురువు ఎన్నో గ్రంధాలు రచించారు. "మస్నవీ మహఫూజ్ ఖానీ" ఈ గ్రంధము హైదరాబాదులోని ఆసిఫియా గ్రంధాలయమందు కలదు.

అహ్మద్ మీర్ ఖాదరీ అలియాస్ సయ్యద్ షా సదరె ఆలం ఖాదరీ

సయ్యద్ షా మఖ్‌దూమ్ ముష్‌తాఖ్ ఖాదరీ

సయ్యద్ షా ఖాదర్‌వలీ ఖాదరీ అలియాస్ సయ్యద్ షా నజరె ఆలం ఖాదరీ. వీరు 1120 హి.జ్రీ అనగా క్రి.శ. 1708లో నందవరంనందు స్వర్గస్తులయ్యారు. వీరి ఉరుసు రజ్జబ్ నెల 22వ తేది. జరుగును.

సయ్యద్ షా అబుల్ ఫతా ఖాదరీ సానీ :

సయ్యద్ మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ (మొదటి కుమారుడు)

సయ్యద్ మొహమ్మద్ దుర్వేష్ ఖాదరీ సానీ (రెండవ కుమారుడు)

సయ్యద్ మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ వీరి రచన యుసుఫ్ జులెఖా దక్కని ఉర్దూ భాషలో ప్రసిద్ధిగాంచినది.

అబుల్ ఫతాఖ్ ఖాదరీ గారి కుమారులు :

మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ

సయ్యద్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ సానీ

సయ్యద్ షా దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ సానీ వీరి రచన "మజహరుల్ ఆరాస్". వీరు 1282 హి.డ్రీ. అనగా క్రీ.శ. 1865లో స్వర్గస్తులయ్యారు.

దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ గారి కుమారులు :

సయ్యద్ షా అహ్మద్ ఖాదరీ వీరు 1304 హి.డ్రీ. అనగా క్రీ.శ. 1886 లో స్వర్గస్తులయ్యారు.

సయ్యద్ షా సయ్యదాన్ ఖాదరీ సానీ

సయ్యద్ షా లాలామియా ఖాదరీ అలియాస్ సయ్యద్ షా నజరె ఆలం ఖాదరీ (వీరు సయ్యద్ అహ్మద్ ఖాదరీ గారి కుమారులు సజ్జాద ముతవల్లీ అస్తాన ఫతేమియా సిద్దోటు వారికి జేజనాయన అగుదురు. వీరు క్రీ.శ. 1974లో సిద్దోటు యందు స్వర్గస్తులయ్యారు.

సయ్యద్ షా అహ్మద్ ఖాదరీ వీరు మహబూబ్ బాషా గారి తండ్రి క్రీ.శ. 2015లో సిద్దోటు యందు స్వర్గస్తులయ్యారు.

సయ్యద్ మహబూబ్ బాషా ఖాదరీ (తండ్రి సయ్యద్ అహ్మద్ ఖాదరీ)

సజ్జాద నషీన్ ముతవల్లీ అస్తాన ఫత్తమీయ్య సిద్దోటు.

చిన్నపాటి మొండి గోడలున్న ఆ రోజుల్లో దేవలాల గడ్డ వీధికి చెందిన సాదిఖ్ హుసేన్ గారు హజరత్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ గారి దర్గా గురించి కొంత శ్రద్ధ వహించారు. తదుపరి కొంత మంది ఉదయగిరి యువకులు ఈ దర్గా అభివృద్ధికై కృషి చేశారు. తమ కోరికలు తీరిన వారు దర్గాకు హాజరై మొక్కుబడులు తీర్చుకొందురు.

ప్రతి సంవత్సరము జమాదియుల్ ఆఖర్ నెల 14వ తేది సాయంత్రం మహబూబ్ వాటర్ ప్లాంట్ యజమాని జనాబ్ ముర్తుజా హుసైన్ ఇంటి నుండి శ్రీవారి గంధ మహోత్సవం బయలుదేరి దర్గా చేరును. ఈ ఉత్సవములో హిందూ ముస్లీం భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొందురు. చదివింపుల తదుపరి భక్తులకు ప్రసాదము పంచబడును.

దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ 1053 హి.శ్రీలో సిద్దోటు యందు మసీదు నిర్మించుట :

వీరు గోల్కొండ నవాబు సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలములో (1036 నుండి 1083) కడపకు తొలి పరిపాలనా కేంద్రంగా ఉండిన సిద్దోటులో ఆనాటి సైనికాధికారి మీర్‌జుమ్లా అధికారంలో ఈ తొలి మసీదును దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ నిర్మించెను. వారచ్చట కుటుంబ సమేతంగా ఉంటూ ఇస్లాం మతాభివృద్ధికై కృషి చేశారు. వీరికి రోజు వారి ఖర్చులకని మీర్‌జుమ్లా ఒక నాణెము ఇచ్చుటకు ఆజ్ఞాపించెను. వీరి మరణానంతరం వారి బిడ్డలకు కూడా నాణెము ఇచ్చుటకు ప్రఖ్యాత పరిపాలకుడు నవాబ్ దావూద్‌ఖాన్ పన్ని 1127లో ఉత్తర్వు జారీచేసెను. ఈ విషయం కర్నల్ కొలన్ మెకన్‌జీ 1821లో తన రికార్డులో ప్రస్తావించెను.

హజరత్ సయ్యద్ దుర్వేష్ మొహమ్మద్ ఖాదరీ ఆధ్యాత్మిక పరంపర సూచిక :

లాయిల్లాహ ఇల్లల్లా మొహమ్మదుర్ రసూలలల్లా

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యదుస్ సఖలైన్ మొహమ్మద్

రసులల్లా సల్లెలాహు అలైహి వసల్లం

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ అమీరుల్ మోమినీన్ అలీ ఇబ్నే అబి తాలిబ్ రజిఅల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఇమామ్ హసన్ ఒ ఇమామ్ హుసైన్ రజిఅల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ జైనుల్ అబిదీన్ రజి అల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ ఇమామ్ మొహమ్మద్ బాఖర్ రజి అల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ ఇమామ్ జాఫర్ సాధిఖ్ రజి అల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ ఇమామ్ మూసా కాజిం రజి అల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ మారుఫ్ కర్ ఖి రజి అల్లాహు అన్హు

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబుల్ హసన్ సిరి ఒ సిఖతి ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబుల్ ఖాసిం జునైదీ ఒ బగ్దాది ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ అబుబకర్ షిబ్లి ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబ్దుల్ వాహిద్ అజీజుల్ హసైని ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబుల్ఫరా బిన్ యూసుఫ్ తర్తూసి ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబుల్ హసన్
ఖురైషియుల్ హంకారి ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా అబుల్ సయీద్
ముబారకుల్ ముతహరి ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ ఖాజా సుల్తానుల్ ఔలియా
బుర్‌హానుల్ అస్ఫియా మెహెబూబె సుబహాని మాషుబె రహమానీ పీరానే పీర్
దస్తగీర్ మీరా మొహియుద్దీన్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జీలానీ అల్ హసనియుల్
హుసైనీ ఖుదస్ అల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ సయ్యద్ అబ్దుల్
రజాఖ్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ మౌలానా హజరత్ సయ్యద్ అబుసాలెహా
నసీరుద్దీన్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ అలీరాజెఇలాహి
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ దావూద్ సర్‌మస్త
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ జలాలుద్దీన్ ఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మత్ బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ తాజుద్దీన్
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ అబుల్‌ఖైర్ ఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ సుల్తాన్ ఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ అబుల్ ఫత్హాఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ షా మఖ్‌దూమ్ ఇస్
హాఖ్ ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ దుర్వేష్ మొహమ్మద్
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ బదరే అలం ఖాదరీ
ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ షా సదరే ఆలం
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ మఖదూమ్ ముష్తాఖ్
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ షా నజరే ఆలం
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ సాని అబుల్ ఫత్హా
ఖాదరీ ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ మొహమ్మద్ పీర్
బాదెషా ఖాదరీ ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ మొహమ్మద్ దుర్వేష్
ఖాదరీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ అహ్మద్ ఖాదరీ
ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ సయ్యదన్ షా ఖాదరీ ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ నజరే ఆలం ఖాదరీ ఖుదసల్లా ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ మొహమ్మద్ పీర్ బాషా ఖాదరీ ఖుదసల్లా ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ దాదా పీర్ ఖాదరీ ఖుదసల్లా ఖుదసిర్రహుల్ అజీజ్

ఇలాహి బహుర్‌మతె రాజ్ ఒ నియాజ్ హజరత్ సయ్యద్ ఆన్ హజరత్ హుమ్ ఫర్‌జంద్ ఖుద్ యానీసయ్యద్ దాదా పీర్ ఖాదరీ సజ్జాదా నషీన్ సిద్దోట్ ఫర్‌మూదంద్

వీరి ఆస్తానలోని పవిత్ర చిహ్నాల పట్టిక

హజరత్ సయ్యద్ మొహమ్మద్ ముస్తఫా సొ.. వారి ఒక పవిత్ర కేశము, ఒక పవిత్ర తలపాగ, ఒక పవిత్ర గలేబు, ఒక పవిత్ర కంబళం, ఒక పవిత్ర జుబ్బ, ఒక పవిత్ర రుమాలు, హజరత్ సయ్యద్ అమీరుల్ మోమినీన్ అలీ ఇబ్నె అబితాలిబ్ రజి. వారి పవిత్ర టోపి, పవిత్ర జుబ్బ, ఒక పవిత్ర తలపాగ, సయ్యదా బీబీ ఫాతిమా రజి. వారి పవిత్ర దుప్పటి హజరత్ సయ్యదినా ఇమామ్ హుసేన్ రజి. వారి పవిత్ర చేతి రాత ఉత్తరం. హజరత్ సయ్యద్ మహబూబె సుబహానీ ఖుదసల్లా సిర్రహుల్ అజీజ్ వారి పవిత్ర తలపాగ, ఒక పవిత్ర జుబ్బా, ఒక పవిత్ర రుమాలు, ఒక పవిత్ర విసనకర్ర, ఒక పవిత్ర కేశము.

ఉరుసు : ఈ ఆస్తానయందు రబ్బివుల్ అవ్వల్ తే. 9, 10 లలో కార్యక్రమాలు జరుగును. 9వ తేది రాత్రి ఖసిదా ఖ్వాని, 10వ తేది ఉదయం 4 గం.ల నుండి పవిత్ర వస్తువుల ప్రదర్శన జరుగును.

37. హజరత్ షాషా వలి

ఉదయగిరిలోని పెద్ద మసీదుకు ఉత్తరాన ఉన్న ముస్లిముల స్మశాన స్థలంలో సున్నపురాయి ఇటుకలతో కట్టిన నాలుగు గోడల మధ్య రెండు పెద్ద సమాధులు ఒక చిన్న సమాధి గలదు. అవి సుమారు రెండు వందల సంవత్సరాలనాటి సమాధులుగా భావించబడుతున్నాయి. వారు ఏ మహనీయులో తెలియదు కాని షాషా వలి దర్గా అని పిలుచుచున్నారు. గతములో ఆ ప్రాంతమంతా సమాధులతో నిండి ఉన్నందున గండిపాలెం రోడ్డుకు చేరాలంటే ఆ దారి గుండా నడిచి వెళ్ళేవారు. 43 సంవత్సరాల నాడు కరీమా వీధికి చెందిన ఇస్మాయిలు గారు ఆనాటి సమితి ఆఫీసులో అటెండరుగా పనిచేస్తూ అప్పుడప్పుడు తెల్లవారుజామున ఆ దారి గుండా ఆఫీసుకు చేరేవారు. ఒక రోజు ఆ దారి గుండా దర్గా సమీపంలో చేరగా సాంబ్రాణి కడ్డీల వాసన వచ్చినది. ఈ విషయము ఈ గ్రంధ రచయిత అయిన నాతో చెప్పారు. కొంత మంది ఆ దారిన వస్తూ ఖురాను చదువు శబ్ధం విన్నారు. ఈ దర్గా ఉరుసు ప్రతి సంవత్సరం మొహరం నెల 20వ తేది జరుగుతుంది. విద్యుదీపాలంకరణతో పాటు దర్గా ఆవరణలో అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. భక్తులకు ప్రసాదం పంచబడుతుంది.



38. హజరత్ హబీబుల్ల జుకా

ప్రముఖ ఉర్దూ, పారసీ కవి హబీబుల్ల కలము పేరు జుకా. వీరు నవాయిత్ వంశానికి చెందిన వారు. వీరి జేజనాయన హఫీస్ మొహమ్మద్ అలీ నాయతీ తమతో పాటు కొంత మంది వీరి వంశస్తులను ఉదయగిరి ఫౌజుదారు సయ్యద్ ముస్తఫా అలీఖాన్ (హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరీ గారి జేజనాయన) కోరిక మేరకు బీజాపూర్ నుండి ఆర్కాటు వచ్చారు. అచ్చటి నుండి ఉదయగిరి పిలిపించుకొని హఫీస్ మొహమ్మద్ అలీని తమ రాయబారిగా నియమించుకొనెను. చివరికి వారు ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు. జుకా తండ్రి మొహమ్మద్ మీరా నాయతీకి ఐదుగురు కుమారులు ఇద్దరు కుమార్తెలు కలిగారు. వీరు నెల్లూరు సంతపేటలోని మొహమ్మద్ గౌస్ సత్రం (సంతపేట మార్కెట్) అను చోట జన్మించారు. ఇది వీరి మేనమామ (మీరా నాయితి బావమరిది) గౌస్ సాహెబ్ ఇల్లు. మీరానాయతి తాను బతికి ఉండగానే ఉదయగిరి కంటె నెల్లూరులో విద్యావకాశాలు బాగున్నాయని తమ వారిని నెల్లూరులో బావమరిది మొహమ్మద్

గౌస్ వద్ద ఉంచారు. జుకా తండ్రి హాఫీస్ మొహమ్మద్ మీరానాయతి 1837లో ఉదయగిరిలో స్వర్గస్తులయ్యారు. జుకా చిన్నాయన హసన్ నాయితి ఉదయగిరి జాగీరుదారు అబ్బాస్ అలీఖాన్‌కు దీవానుగా ఉండిరి. సంతపేట రైల్వే ఫీడర్స్ రోడ్డుకు ప్రారంభములోనే మొహమ్మద్ గౌస్ గారి బట్టల అంగడి, ఇల్లు ఉండేది. వీరు ఉద్యోగానికంటే వ్యాపారానికి ప్రాముఖ్యత ఇచ్చిన నీతి నిజాయితీగల జౌళీ వ్యాపారస్తులు. జుకా పెద్దన్నయ్య హాజీ రహమతుల్లా వీరి కలము పేరు రసా. 1820-21 నెల్లూరులో జన్మించారు. మేనమామ అయిన మొహమ్మద్ గౌస్‌కు బిడ్డలు లేనందున రహమతుల్లా రసాను దత్తత తీసుకొన్నారు. రసా మౌల్వీ బాజీ అలీ బెంగాలీ, కావలి తహశీలుదారైన షేక్ అబ్దుల్ ఖాదిర్ హమ్‌రాజ్ గార్ల వద్ద పారశీ అరబీ అభ్యసించారు. మదరాసు వెళ్ళి మీర్ మొహమ్మద్ తాఖీబ్ వద్ద కూడా చదివారు. వీరు రసాకలము పేరుతో కవితలు వ్రాసి హంరాజ్, తాఖిబ్ ముందు వుంచేవారు. ఇషారతే బీనిష్ రచయిత అయిన బీనిష్‌తో కూడా సంప్రదించారు. ప్రధమంగా వీరు బట్టల వ్యాపారి. తదుపరి వీరు నెల్లూరు కోర్టులో ఏజెంటుగా నియమించబడ్డారు. నవాబ్ గులాంగౌస్ ఖాన్ బహదూర్ కాలంలో వీరు మదరాసు యందు నిర్వహించుచుండిన ముషాయిరా (ఉర్దూ కవి సమ్మేళనము)లందు పాల్గొనేవారు.

నవాబు గారి మరణానంతరం రసా నెల్లూరులో స్థిరపడ్డారు. కొంత కాలం వెంకటగిరి రాజా శ్రీ కుమార్‌కు దీవానుగా పనిచేసి ఆఖరి దశలో పిల్లల విద్యాబోధనలో గడిపారు. నెల్లూరు సంతపేట మసీదు వీరు నిర్మించినదే. నెల్లూరు చిన్నబజారులో ఉండిన అపోలో బీడీ ఫ్యాక్టరీని దీవాన్ రహమతుల్లాసా బిల్డింగ్ అని అంటారు. వీరు పారశీ భాష ప్రవీణులు. అయినను తమ కవితలను, ఉత్తరాలను భద్రపరచలేదు. తమ తమ్ముడు జుకా గారి కవితలను, ఉత్తరాలను క్రోడికరించి "ఖాష్-ఓ-ఖుమాష్" అను పేరుతో 1885లో ముద్రించెను.

రసా తమ 80వ ఏట 1317 హిజ్రీ జమాదియల్ అవ్వల్ నెల 24వ తేది అనగా క్రీ.శ. 1899 అక్టోబరు నెల 11వ తేదీన నెల్లూరులో స్వర్గస్తులయ్యారు. వీరి సమాధి సంతపేట మసీదు స్మశాన స్థలములో కలదు. వీరే నెల్లూరు వీ ఆర్ కళాశాల భవనదాత (ఆనాటి నెల్లూరోళ్ళు" పేజి 41) వీరి కుమార్తెను ఈ గ్రంధ రచయిత

ఆధ్యాత్మిక గురువు గారి గురువర్యులైన హజరత్ వజుదిషా, అబ్దుల్ ఖాదర్ ఫఖైర్ (1895లో మదరాసు నుండి వెలువడిన ప్రముఖ ఉర్దూ పత్రిక "మఖ్‌బరే దకన్" సంపాదకులు) గార్ల అన్నగారైన సయ్యద్ సుల్తాన్ మొహియుద్దీన్ ఉర్ఫ్ పీరా వివాహమాడారు.

జుకా క్రీ.శ. 1828-29లో నెల్లూరుయందు జన్మించారు. అన్నగారైన మొహమ్మద్ రహమతుల్లా రసా వద్ద కొంత పారశి నేర్చిన పిమ్మట మదరాసు వెళ్ళి సయ్యద్ మొహమ్మద్ సాఖిబ్, సయ్యద్ మొహమ్మద్ బేనిష్ గార్ల వద్ద అరబి పారశి క్షుణ్ణంగా నేర్చారు.

జుకా మద్రాసు సందర్శించుచునప్పుడు తరచుగా అచ్చటి నవాబైన వాలజా మొహమ్మద్ గౌస్ ఖాన్ నిర్వహించు ముషాయిరా (ఉర్దూ కవి సమ్మేళనము)లందు పాల్గొనేవారు. తమ 26వ ఏటనే తమ కవిత్వం దక్షిణ భారతదేశమందు ప్రఖ్యాతిగాంచెను. వీరి కుమారుడైన మీరాన్ కలము పేరు "సహో" కొంత కాలానికి జుకా తమ జీవనోపాధికై హైదరాబాద్ వెళ్ళారు. అచ్చట సర్‌సాలార్జంగ్ వద్ద ఉద్యోగంలో చేరారు.

జుకాకు తమ అన్నగారైన రహమతుల్లా రసా నుండి 900 వందల సంవత్సరముల వ్రాత ప్రతులు లభించాయి. ఆ గ్రంధాలను గురించి తెలుసుకొనిన ఏషియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్ వారు వాటిని విక్రయించమని కోరారు. అందుకు జుకా ఇట్లు ప్రత్యుత్తరము ఇచ్చిరట "హబీబియా లైబ్రరీ అని పేరు పెట్టి నెల్లూరులోనే ఈ గ్రంధములను నుంచితే నేను ఖరీదు తీసుకొనక గ్రంధములన్నియు యిచ్చివేసెదను" నెల్లూరులో స్థాపించబడిన అంజుమన్ లైబ్రరీకి రెండు వేల రూపాయల వెల చేయు గ్రంధములనిచ్చెనట. హైదరాబాదులోని ఒక గొప్ప గ్రంధాలయమునకు హబీబుల్లా గారు పదివేల రూపాయల గ్రంధాలను ఇచ్చివేసిరట. అందుకుగాను నవాబు ఆయనకు నెలకు 100 రూపాయలు ఇచ్చునట్లు ఉత్తర్వు చేసిరట. ఆయన అప్పుడప్పుడు వ్రాసిన ఖండకావ్యములు అయిదు వాల్యూములు నిండనున్నవి. ఒక వాల్యూము ముద్రింప బడినది. తన పాండిత్యమునుపయోగ పెట్టుకొనువారు నెల్లూరులో నెవరు లేరని ఆయన చింతిల్లెను. వీరు సాధుస్వభావం కలవారు. గర్వమే మాత్రం లేదు.

మీర్జాగాలిబ్‌ను కలుసుకొను ప్రయత్నము :

ప్రముఖ ఉర్దూ కవి మీర్జాగాలిబ్ గారి పారశిక గద్య పద్యములు వారి వ్యక్తిత్వముతో ప్రభావితుడైన జుకా ఎలాగైన గాలిబ్‌ను కలుసుకోదలచెను. దాని కొరకు ఆతని మనసు తహతహలాడుచుండెను. జుకా కడ అభిమానము తుదకు పిచ్చివాని దశకు చేర్చినది. గాలిబ్‌ను దర్శించె సమయమునకై నిరీక్షించుచుండెను. మొదట హైదరాబాదు చేరుటయే మార్గమని తలచెను. కాలినడకన హైదరాబాదు చేరెను. అచ్చట ఒక మిత్రుని ద్వారా జుకా పరిస్థితి తెలుసుకొనిన గాలిబ్ తన పట్ల జుకా చూపిన అభిమానముపై ఆశ్చర్యచకితుడై ఢిల్లీ నుండి జుకాకు ఈ విధముగా ఉత్తరం వ్రాసెను.

"భాయీ! మై-నహీ-జాన్తా ఇత్నే యిరాదత్ ఔర్ తుంకొ ముఝ్‌సె ఇతనీ మొహబ్బత్ క్యూ - హై. బాతిని మామిలయే అర్వాహ్‌హై, అజ్బాబ్ జాహెరీకూ ఇస్మే దఖల్ నహీ-". (మక్తూబెగాలిబ్ బనాం జుకా తేది:15-02-1867)

అర్థము: భాయీ! మీకు నా పట్ల ఈ ఎనలేని అభిమానము, ప్రేమ యెందుకో నేనెరుగను. ఇది మా ఇరువురి ఆత్మలకు సంబంధించిన అంతర్ విషయము. ఇందులో బాహ్య కారణాల ప్రసక్తే లేదు.

ఈ గ్రంథ రచయిత ఆధ్యాత్మిక గురువుగారి గురువర్యులైన హజరత్ సయ్యద్ బాదషా ముహియుద్దీన్ వజూది రహ.. గారికి జుకా గారితో నెల్లూరులో పరిచయం ఏర్పడినది. జుకా పారసీ భాషలో ఒక నాత్ (ప్రవక్త గారి స్తోత్రము) వ్రాసి దానిని సరిదిద్దుటకై వజూది గారికి ఇచ్చిరని ఈ విషయము పాకిస్థాన్ నుండి వెలువడు ఒక ఉర్దూ పత్రికలో ముద్రింపబడినదని తెలిసినది. జుకా పై పరిశోధన చేయు నిమిత్తం ఉమ్రయాఫయి అను వారు జుకా గారి రచనలకై హజరత్ వజూది రహ. గారితో కలవగా పేరు ప్రతిష్టలకు ఇష్టపడని హజరత్ వజూది రహ. "జుకా గారి పూర్తి రచనలు ఇచ్చెదను కాని ఒక షరతు, ముద్రించునప్పుడు నా పేరు వ్రాయవలదు. మాకు పనితో పని కాని పేరుతో పనే ముంది" అనిరట. "మహమ్మద్ హబిబుల్లా జుకా" పై పరిశోధన గావించిన, నా కవితలను సరిదిద్దిన నెల్లూరు విఆర్ కాలేజి ఉర్దూ రీడర్ డా. అబ్దుల్‌వహాబ్ తస్నీం నెల్లూరి గారు జుకా రచనల అన్వేషణలో హజరత్ వజూది గారి పీఠాధిపతి, నా గురువర్యులు హజరత్ ఖాలిద్ వజూ దిరహ.

గారితో హైదరాబాదులో కలుసుకొన్నారు. కాని వారి కోరిక నెరవేరలేదు.

జుకా ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహి వసల్లం పై భక్తి, ప్రేమలో ఒక స్తోత్రములో యిలా అంటారు:

హుజూరె ఆలి మె పహుంచే మెరా సలాం కహా c
జనాబె ఖ్వాజయే ఆలం కహా– గులాం కహాc
ఏ ఆర్ జూ హై జుకా హష్ర మే ఒ ఫర్మాయేc
ఖులాలో ఉస్కు హమారా హై ఓ గులాం కహాc

అర్థము: ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొల్లెల్లాహు అలైహివ సల్లం వారి సేవలో నా సలాం చేరే అంతటి వాడనా! సర్వలోక ప్రభువు ఎక్కడ? ఈ గులాం ఎక్కడ? జుకా! నాదొక కోరిక అదే మనగా పాపపుణ్య విచారణ దినమున మా గులాం అయిన అతడు ఎక్కడున్నాడో పిలవండని వారు ఆజ్ఞాపించవలె.

క్యా అజబ్ హై సర్ఖురూమహషర్ మెగర్ ఉఠే జూకా
జోఫిదా సౌరంగ్హూ ముస్తఫాకి ఆల్పర్

అర్థము: ప్రవక్త వారి వంశముపై వందరకాలుగా ఎవడు దిగదుడుపు అగులో పాపపుణ్య విచారణ దినమున ఆ వ్యక్తి మంచి స్థితిలో లేచుట ఆశ్చర్యమేముంది?

ఈ విశ్వంలో ఉండే కష్టాలు, విశ్వంలో మానవ జీవితం, భూమిపై జీవనం జుకా గారి కవిత ప్రేరణలు.

జుకా గారి ఇల్లు నెల్లూరు చిన్నబజారు యందు పాతకూరగాయల మార్కెట్టు వీధిలో ఉండెను.

కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి గారు (నెల్లూరు) ప్రముఖ పారసీ కవి షేక్ సాదీ గారి పారసీ రచన "గులిస్తాన్" తెలుగులో అనువదించునప్పుడు కొన్ని సందేహములు తీర్చుకొనుటకు, సంప్రదాయసిద్ధమైన ఉచ్ఛారణము నలవరచుకొనుటకు జుకా గారి వద్దకు పోవుచుండెడివారు. ఆ రచనను తెలుగులో 'పూదోట' అని అనువదించారు. దానికి జాతీయ అవార్డు లభించెను.

జుకా జమాదివుసాని క్రీ.శ. 1291 హి.శ్రీ, క్రి.శ 1874లో తమ 47వ ఏట హైదరాబాదులో స్వర్గస్తులయ్యారు. వీరి సమాధి చంచల్గూడ మసీదు ఆవరణలో గలదు.

సయ్యద్ అహమద్ సా పీర్, వారి మనుమడు మరియు మునిమనుమడు

39. హజరత్ మీరా సయ్యద్‌షా మొహమ్మదుల్ హుసైనియల్ ఖాదరీ ఉర్ఫ్ సయ్యద్ అహ్మద్ సా పీర్

ఉదయగిరి యందు తొంభై ఏండ్ల క్రితం ఒక ప్రముఖ ఆధ్యాత్మిక గురువు హజరత్ మీరా- సయ్యద్‌షా మొహమ్మదుల్ హుసైనియల్ ఖాదరీ నివసించారు. వీరు సయ్యద్ అహ్మద్‌సా పీర్‌గా ప్రఖ్యాతి గాంచారు. వీరి తండ్రి పేరు సయ్యద్ షా కరీం మొహమ్మదుల్ హుసైని యల్ ఖాదరీ. వీరి సమాధి మదరాసుయందు గలదు. వీరి పూర్వీకులు ఆధ్యాత్మిక గురువులు. సయ్యద్ అహ్మద్‌సా పీర్ గారి ఇల్లు నాగులబావి ఎదురుగా ఉండిన పాత పోస్టు ఆఫీసు ప్రాంతంలో ఉండెను. ఆనాటి ప్రముఖులైన ఉస్తాద్‌ఖాదర్ మొహియుద్దీన్ ఖాఖ్‌సార్, సయ్యద్ మూసా అబ్దాల్ చిష్తి, నాన్‌బాయి ఖాజామియా, రంపకోతదావూద్ సాహెబ్, ఈ గ్రంధ రచయిత తాత గారైన హైదర్ సాహెబ్ ఉరఫ్ నన్నేసా, అనేకమంది వీరి ఆధ్యాత్మిక శిష్యులైరి. కొందరు వీరి

మహిమలను గురించి చెప్పుకొనేవారు.

సయ్యద్ అహ్మద్‌సా పీర్ చాలాకాలం ఉదయగిరి యందు గడిపి చివరికి 1918లో హైదరాబాదు చేరారు. వారి వంట మనిషి, శిష్యుడు రసూలా వీరి వద్ద ఉన్నందుకు అందరు వీరిని పీర్‌కా రసూలా– అని పిలుచుచుండిరి (అంగల్‌వాడి టీచరు శ్రీమతి ఇమాంబి గారికి తాత అగుదురు). వీరు కూడా గురువు గారి వెంట హైదరాబాదు వెళ్ళిపోయారు. గురువు గారు స్వర్గస్తులైన పిదప తిరిగి ఉదయగిరి చేరారు. సయ్యద్ అహ్మద్ సా పీర్ గారి సమాధి హైదరాబాదు కింగ్‌కోఠి స్మశాన స్థలములో గలదు. వీరికి ఇద్దరు కుమారులు సయ్యద్ మొహమ్మద్ హబీబుల్లా, సయ్యద్ షామొహమ్మద్. వీరు మదరాసులో స్వర్గస్తులయ్యారు. ముగ్గురు కుమార్తెలు ఒక కుమార్తె కరీమున్నిసా వివాహమైన 18 దినములకు స్వర్గస్తులయ్యారు.

నెల్లూరులో జాయింట్‌కలెక్టరుగా పనిచేసిన వీరి మనవడు సయ్యద్ మహమూద్ హుసైని ఐ.ఏ.ఎస్ గారితో కలుసుకొని సయ్యద్ అహ్మద్‌సా పీర్ వారి తండ్రి, బేజనాయన గారి గురించి కొన్ని విషయాలు తెలుసుకొనుటకై ఈ గ్రంథ రచయిత 1986 సం. జూన్ నెల 29వ తేదీన హజరత్ సయ్యద్ అహ్మద్ సా పీర్ గారి శిష్యులు దిలావర్‌భాయి వీధిలోని ప్రముఖవ్యక్తి రంపకోత దావూద్ సాహెబ్ గారి సహకారముతో హైదరాబాదులోని ఆసిఫ్‌నగర్‌లో గల వారి ఇల్లు “కాషాన–ఏ–హబీబ్”కు వెళ్లడమైనది. ఆనాటికి వారి వయస్సు 86 సంవత్సరాలు. ఉదయగిరిలోని కొంతమంది వ్యక్తులు మూసా అబ్దాల్ చిష్తి, హజరత్ మియా చిష్తి, వారి దూద్‌భాయి రంపకోత దావుద్ సాహెబ్‌ను గురించి అడిగి తెలుసుకున్నారు. వీరు తమ బాల్యములో రంపకోత దావుద్‌సాహెబ్ తల్లి ఉచ్చుమా గారి పాలు త్రాగారన్నారు.

హజరత్ సయ్యద్ అహ్మద్‌సా పీర్ గురించి కొన్ని విషయాలు తెలుసుకొనుటకును, వ్రాత ప్రతులు చూచుటకు వచ్చినానని తెలుపగా, వయస్సు మళ్లి మంచముపై ఉండినందున వారు నా కోరిక తీర్చలేకపోయారు. “ఈ పరిస్థితిలో నేనేమి యివ్వలేను. కుమారులు విదేశాలలో ఉన్నారు. మరలా ఒకసారి కలవండి” అన్నారు. మీరు ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారని అడుగగా “హజరత్ వజూదిషా గారి సజ్జాదా నషీన్

అయిన నా ఆధ్యాత్మిక గురువర్యులు హజరత్ ఖాలిద్ బిన్ జాన్‌నిసార్ యార్‌జంగ్ వారి ఇంటి వద్ద ఉంటున్నానని జవాబిచ్చాను. "వజూదిషా గారు బంధుత్వములో నాకు జేజనాయన అగుదురని పలికారు.

అదే కోరికతో కొన్నేళ్ళ తర్వాత ఆసిఫ్ నగర్ వెళ్ళి చూడగా కాషాన-ఏ-హబీబ్ అను పేరు ఎచ్చటను కానరాలేదు. ఎంతో ప్రయత్నముతో ఆ ఇంటిని కనుగొని తలుపు తట్టగా నా పాత పరిచయస్తులైన ఆల్ ఇండియా ఉర్దూ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు శ్రీ మహమ్మద్ జలీల్ పాషా తలుపు తెరిచి ఎదురాయిరి. మిద్దెపై తీసుకొని వెళ్ళి నేను వచ్చిన విషయాన్ని గురించి అడుగగా, విషయం వివరించాను "ఈ ఇంటిని నేను వేరే వారి నుండి కొన్నాను. మహమూద్ హుసైని గురించి గాని వారి బిడ్డలు ఐసిఆర్ఐఎస్ఏటిలో పనిచేసిన సయ్యద్ ఖాజా మొహియుద్దీన్, సయ్యద్ కరిముల్లా గురించి గాని నాకు తెలియదు" అని జవాబిచ్చారు. ఈ పుస్తకము ప్రచురించేవరకు కూడా వారి బిడ్డల వివరాలు తెలుసుకొనలేక పోయాను.

హజరత్ సయ్యద్ అహ్మద్‌సా పీర్ గారి జేజనాయిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ అజీముల్ హుసైనియల్ ఖాదరి (షా అబ్దుల్ హుసైని తాలిఫ్) గారు ఉదయగిరి యందు స్వర్గస్తులయ్యారు. వీరిని ఆదంసా పీర్ అని కూడా పిలుచుచున్నారు. వీరి సమాధి బస్టాండుకు ఉత్తరాన నాలుగు గోడల మధ్య కలదు. కూల్‌డ్రింక్ షాపు యజమాని సయ్యద్ ఆదమ్‌సాహెబ్, బస్టాండు ముతాకూలీలు శ్రీవారి దర్గానిర్మాణానికై కృషి చేశారు. సయ్యద్ మహమూద్ హుసైని నెల్లూరు జాయింట్ కలెక్టరుగా ఉన్నపుడు ఒకసారి ఉదయగిరి వచ్చి సమాధి దర్శనము గావించుకొని, వారి పరిచయస్తులను, దూద్‌భాయి దావుద్‌సాహబ్‌ను కలుసుకొన్నారు. సయ్యద్ అహ్మద్‌సా పీర్ గారి ఆధ్యాత్మిక పరంపరను తెలుపు "షిజరా"ను స్వర్గీయ సయ్యద్ మూసాఅబ్దాల్ చిష్తి నుండి ఈ గ్రంథ రచయిత పొందియున్నాడు.

బిస్మిల్లా హిర్రహమా నిర్రహీమ్

అల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా రసులహి మొహమ్మదిన్ వ అస్ హా బిహీ అజ్‌మయీన్ అమాబాద్ ఫయఖూలుల్ అబదుల్

ఫఖైరుల్ హాఖరు ఇల్లలాహ తాలా మీరాన్ సయ్యద్ షా మొహమ్మదుల్ హుసైనియుల్ ఖాదరీ అఫా అలాహు అన్ హు అల్ బస్తు ఖిర్ ఖతుల్ ఇరాదతి బాదిల్ అఖ్‌ది అల్ మానవి షేక్ ఖాదర్ మొహియుద్దీన్ ఖాదరీ అల్లాహుమ్మా వఫాఖిహు కమాతుహిబ్బుహు వతర్జా ఇజాజతి షేఖి వహాదియుద్దారైనుల్ ఆరిఫి బిల్లాహి పీర్ దస్తగీర్ సుల్తాన్ సయ్యద్ షా కరీం మొహమ్మదుల్ హుసైని ఆల్ ఖాదరీ ఖుదస్ సిర్రహు వహు మిన్‌షేఖిహి వఅబిహి పీర్ దస్తగీర్ సుల్తాన్ సయ్యద్ షా అబ్దుల్ అజీముల్ హుసైనియుల్ ఖాదరీ ఖుదస్ అల్లాహు సిర్రహు వహు మిన్‌షేఖిహి వ అబిహి పీర్ దస్తగీర్ సుల్తాన్ సయ్యద్ షా కరీం మొహమ్మదుల్ హుసైనియుల్ ఖాదరి ఖుద్దస్ అల్లహు సిర్రహు వహు మిన్‌షేఖిహి వఅబిహి పీర్ దస్తగీర్ సుల్తాన్ సయ్యద్ షా అబ్దుల్ అజిముల్ హుసైని అల్ ఖాదరీ వహుమిన్ షేఖిహి వఅబీహిల్ ఆరిఫి బిల్లాహి మజేహరి వజహుల్లాహి పీర్ దస్తగీర్ సుల్తాన్ సయ్యద్ షా అజీ జుల్లాహిల్ హుసైని అల్ ఖాదరీ ఖుదస్ అల్లాహు సిర్రహు వహుమిన్ షేఖిహి వఅఖీహి ఖుద సిర్రహుల్. మౌజదీన్ మురాదిన్ మొమినిన్ పీర్ దస్తగీర్ హాజరత్ సుల్తాన్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ అల్ హుసైనియుల్ ఖాదరి ఖుదస్ మొమినిన్ పీర్ దస్తగీర్ హాజరత్ సుల్తాన్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ అల్ హుసైనియుల్ ఖాదరి ఖుదస్ అల్లాహు సిర్రహు మహువా మిన్ షేఖిహి వఅబిహి సుల్తానుల్ మొహాఖఖిన్ మురాదుల్ మురైదైన్ సుల్తాన్ సయ్యద్ షా కరీం మొహమ్మదుల్ హుసైని అల్ ఖాదరి ఖుదసల్ల సిర్రహు వహువా మిన్ నా అబిహి ఫర్ దుల్ హాఖీఖతి సహెబుల్ వఖత్ ఖుతుబుల్ ఆలమీ మినల్ అజ్‌లి ఇలల్ ఆమది.

పీర్ దస్తగీర్ అబి జైనుదీన్ హాజరత్ మీరాన్ సయ్యద్ షా మొహమ్మద్ ముదరసుల్ హుసైనియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహుల్ వహువా మిన్ షేఖిహిల్ కామిలిల్ ఆరిఫి బిల్ లాహి షేఖ్ అబ్‌దుల్ అజీమ్ మహమ్మదుల్ మకివుల్ హనఫి ఖుదసల్ల సిర్రహు వహు మిన్ షేఖిహిల్ కామిలుల్ ఆరిఫి బిల్ లాహి నాయబే రసులల్లా పీర్ దస్తగీర్ హాజరత్ సయ్యద్ షా సిబగ్ తుల్లా అల్ హుసైనియల్ ఖాదరీ ఖాదస్ సిర్రహు వహువమిన్ షేఖిహిల్ కామిలుల్ అరిఫి బిల్ లాహి సయ్యద షా వజిహుద్దీన్ హుసైనియుల్ ఖాదియుల్ ఖాదరీ ఖుదసిర్రహు.

మహువ మిన్ షేఖియుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా హాజీ హమీద్ ఉర్ఫ్ సయ్యద్ షా మొహమ్మద్ గౌస్ అల్ గ్వాలియరి ఖుదసల్ల సిర్రహు.

వహుమిన్ షేఖిహుల్ కామిల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ జహూర్ హాజుర్ ఖుదసల్ల సిర్రహు వహు మిన్ షేఖుల్ కామిల్ ఆరిఫ్ బిల్లాహి షేఖ్ అబిల్ ఫతా హిదాయతుల్లా సర్ మస్త్ ఖుదసల్ల సిర్రహు వహువమిన్ షేఖుల్ కామిల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ ఫామినుష్ షత్తారి ఖుదసల్ల సిర్రహు వహువా మిన్ షేఖిహిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబ్దుల్ వహబ్ ఖాదరీ అబిల్ ఫతా హిదాయతుల్లా సర్ మస్త్ ఖుదసల్ల సిర్రహు వహువా మిన్ షేఖుల్ కామిల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ ఫాజి మినష్ షత్తారి ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్షేఖిహిల్ కామిల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబ్దుల్ వహాబ్ అల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబ్దుల్ రవూఫల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహుమిన్ షేఖిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ మహమూదుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువామిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబ్దుల్ గఫారు సిద్దీఖియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ మహమ్మదన్ అల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహు మిన్ షేఖుల్ కామిలుల్ వఆరిఫ్ బిల్లా షేఖ్ అలీయుల్ హుసైనియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖుల్ ఆరిఫ్ బిల్లా షేక్ జాఫర్ అహమద్ అల్ హుసైనియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ ఇబ్రాహిమ్ అల్

హుసైనియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖిల్ కామిల్ ఆరిఫ్ బిల్లాహి షేఖ్ అబ్దుల్లా అల్ హుసైనియుల్ ఖాదరీ ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లాహి సయ్యద్ అబ్దుల్ రజాక్ ఖాదరీ రజి.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ అక్ మిలుల్ ఖుతుబే రబ్బాని అల్ గౌసియుస్ సందాని షేఖుల్ కామిల్ హాదియుసుమిలి సుల్తానుల్ ఔలియా ఇమాలుల్ ఉష్షాఖ్ ఖుల్గుర్బా రయీసుల్ మాషూఖ్ ఖైరుల్ మహబూబైన్ మీరాన్ మొహియుద్దీన్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ అల్ హస్ని వల్ హుసైనీ అల్ జాఫరియుల్ జిలాని రజి. అల్లాహు తఆల అన్ హు వర్జా వలా హరంనా వ బర్కాతహు.

వహువా మిన్ షేఖిహి కామిలుల్ ఆరిఫ్ బిల్లాహి షేఖ్ అబుసయీద్ ముబారక్ ఖుదసల్ల సిర్రహుల్. వహువా మిన్ షేఖిహిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబుల్ హసన్ అలియుల్ ఖురేషియుల్ హంకారి ఖుదసల్ల సిర్రహు.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా వతషేఖ్ అబిల్ ఫతా యుసుఫ్ తర్తౌసి ఖుదసల్ల సిర్రహు.

వహుమిన్ షేఖిహిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా హిష్ షేఖ్ అహమ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్యమని ఖుదసల్లహు.

వహువా మిన్ షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లాహి షేఖ్ అబిల్ అబ్బాస్ ఖుదసల్ల సిర్రహు.

వహువా షేఖుల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా షేఖ్ అబి బక్ర అబ్దుల్లాహిల్ షబిఅఖుదసల్లహు.

వహువా మిన్షేఖిహిల్ కామిలుల్ ఆరిఫ్ బిల్లా సయ్యదుద్ తాయిఫతీ ఖాజా జునైదుల్ బొగ్దాది

ఖుదసల్లా సిర్రహు వహువా మిన్షేఖిహిల్ ఆరిఫ్ బిల్లాహిష్ షేఖ్ సరియుల్

సఖ్తి ఖుదసల్ల సిర్రహు

వహువ మిన్‌షేఖిల్ కామిలుల్ అక్‌మలుల్ ఆరిఫ్ బిల్లా ఖ్వాజా మారుఫ్ కర్‌ఖి రజి అల్లాహు తాలా

అన్‌హు వహువా మినుల్ అమాముల్ హమామ్ అలి అమామ్ ముసా ఖాజిమ్ రజి. వఅర్‌జాహు

వహువ మినుల్ ఇమాముల్ హమాముల్ ఇమామ్ జాఫర్ సాధిఖ్ రజి వర్‌జా.

వహువా మినల్ ఇమాముల్ హుమామ్ అల్ యిమామ్ మొహమ్మద్ బాఖర్ ఆగా రజి. వఅర్‌జాహు సయ్యద్ షబాబ్ అహలుల్ జన్నతా అమీరుల్ మొమినిన్ జైనుల్ ఆబిదీన్ సయ్యదు షోహద అల్ ఇమామ్ హుసైన్ జల్లె జలాలహు అలైహి వతహ్యాతు వల్ మస్నాన వహువా మిన్ అమీరుల్ మొమినీన్ ఇమాముల్ ముత్తఖైమ్ అసదుల్లాహిల్‌గాలిబ్.

మజహరుల్ అజాయిబ్ వల్ గరాయబ్ వమిఉల్ ముస్‌తఫా సొ.

కరీముల్లా వహువజ్ హువా రజి. అల్లాహు తాలా అన్‌హు వర్‌జా వలా హరంనా మిన్ బర్‌కాతిహి వహువా మిన్ సయ్యదుల్ ముర్ సలీన్ రసులే రబ్బిల్ ఆలమీన్ షఫీయుల్ ముజ్‌నబీన్ అతనబాయుల్ అమీరి వఅహ్మదే ముజుతెబా మొహమ్మద్ ముస్తఫా సో. వఆలిహి వఅస్‌హాబిహి వఅజ్‌వాజిహి అజ్‌మయీన్ అల్లాహుమ్మా అగ్ ఫిర్‌లనా వఅర్‌హంనా వల్ జమీయుల్ మొమినీన్ వల్‌మొమినాతి వల్‌ముస్‌లిమీనా వల్ ముస్‌లిమాతి బిరహ్మతీక య అర్హమర్ రహమీన్.

40. హజరత్ హాజీ మొహమ్మద్ గౌస్

అలనాటి ఉదయగిరి ప్రముఖులలో హాజీ మొహమ్మద్ గౌస్ ఒకరు. వీరి తండ్రి పేరు హాజీ షేక్. గులాం ఖాదర్. వీరిద్దరు ఉదయగిరిలో తొలి హాజీలు. వీరి జేజనాయన షేక్ సులేమాన్ కర్నూలు నుండి ఉదయగిరి వచ్చి స్థిరపడ్డారు. వీరు ఇస్లాంమత నియమ నిబంధనలను తప్పకపాటించేవారు. ఫోటో తీయించుకొనుట వీరికి ఇష్టంలేదు. వీరి గుణగణాలను అర్థం చేసుకొన్న మదరాసు వ్యాపారస్తులు ఎలాగైనా వీరి ఫోటో తీయదలచి వారు కుర్చీమీద కూర్చొని ఉండగా రహస్యంగా ఫోటో తీశారు. చిన్న మసీదులో పిన్నలకు పెద్దలకు ఖురాను బోధించేవారు. వీరిని అందరు గౌరవించేవారు. ప్రతివారిని "మీరు" అని సంభోదించేవారు. కొనుగోలు విషయంలో మరుమాట్లాడక అడిగిన ధర చెల్లించేవారు. అడిగిన వారికి లేదనకుండా ధర్మం చేసే వారు. వీరు తంగేడుచెక్క వ్యాపారి. సరుకును మద్రాసుకు ఎగుమతి చేసేవారు. గుణగణాలలో ఖ్యాతిగాంచిన వీరి సరుకును మద్రాసు వారు కాటావేసేవారు కాదు. తమ తండ్రి వెంట హజ్‌కు వెళ్ళే సన్నాహాలలో ఉన్న రోజులలో ఇంటికి ఎదురుగా ఉన్న అరుగుపై ఒక మస్తాన (అవధూత) ఎదురయ్యాడు. అతని స్థితిపై జాలిపడిన మొహమ్మద్ గౌస్ మాసిన బట్టలను తొలగించి సుభ్రమైన బట్టలు తొడిగించి అన్నపానియాల పట్ల శ్రద్ధవహించుచుండెను. మరుసటిరోజు హజ్‌యాత్రకై వెళ్లాలి. "మేము వెళ్ళిన ఇతని గురించి శ్రద్ధ వహించేవారు లేరే" అని ఆలోచిస్తూ బయటకి వచ్చి అరుగుపై చూడగా ఇన్ని రోజులుండిన వ్యక్తి ఆనాటి నుండి ఎవ్వరికిని కానరాలేదు.

వీరు ఆనాటి ఉదయగిరి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సయ్యద్ అహ్మద్‌సా పీర్ గారి శిష్యులని వారి సంబంధీకులు తెలిపారు. చాలాకాలం వరకు వీరికి సంతానం కలుగలేదు. ఒకరోజు నాగూరు పట్టణంలో వెలసి ఉన్న హజరత్ ఖాదర్ అవ్‌లియా దర్గా వెళ్ళి మొక్కుబడి చేసుకొన్న మీదట అమ్మాయి జన్మించెను. ఆ అమ్మాయికి ఖాదర్‌బి అని నామకరణం గావించారు. ఆ అమ్మాయే ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థల దాత హాజీ ఖాజా మొహిద్దీన్ గారి తల్లి. హాజీ గారికి ఉర్దూ, పారశీ, అరబీ భాషలతో మంచి పరిచయముండెడిది. ప్రముఖ పారశీ కవి షేక్. సాదీ గారి రచనలు గులిస్తాన్, బవస్తాన్ (పూలతోట, పండ్లతోట)లోని కొన్ని వచనలు కంఠస్థం గావించారు. వీరి వద్ద ప్రముఖ గ్రంధాలతో పాటు ఫిరదోసి గారి ప్రఖ్యాత రచన "షా నామ" కూడా ఉండెడిది. వీరికి ఆరు మంది కుమార్తెలు, ఒక కుమారుడు కలిగెను. వీరి సంబంధికులు వివిధ శాఖలలో ఉద్యోగస్తులు, రచయితలు, పత్రిక సంపాదకులు, ఉపాధ్యాయులుగా ఉండిరి. ఈ పుస్తక రచయిత అవ్వగారైన సుల్తాన్‌బీకు వీరు బంధువులగుదురు.

42. హజరత్ ఖాదర్ మొహియుద్దీన్ ఖాక్‌సార్

20వ శతాబ్దపు ఉదయగిరి ఉర్దూ కవి ఖాదర్ మొహియుద్దీన్. వీరి తండ్రి పేరు సత్తార్ హుసేన్. వృత్తిరీత్యా కార్పెంటర్, బ్లాక్‌స్మిత్. వీరికి ఇద్దరు కుమారులు నలుగురు కుమార్తెలు గల మధ్యతరగతి కుటుంబం. ఉర్దూతో పాటు కొంత తెలుగు పాండిత్యం నెరిగి ఉన్నందున తెలుగులో కూడా కవిత్వం అల్లేవారు. వీరి కలము పేరు ఖాక్‌సార్. దిలావర్ భాయి వీధిలోని సత్రం నందు పిన్నలకు పెద్దలకు అరబి, ఉర్దూ నేర్పేవారు. వీరికి సాహిత్యం మీద ఉన్న మక్కువ సంపాదన మీద ఉండేది కాదు. తన భార్య బిడ్డల బాగోగులు పట్టించుకొనక ఊరికి వెలుపల ఏకాంతంలో కవితారచనలో మునిగిపోయేవారు. ఉర్దూ భాషలో నాటిక రచించి ఉదయగిరిలో ప్రదర్శించిన తొలి వ్యక్తి. ఇతను కళా హృదయుడు. సంగీత, సాహిత్య ప్రియుడు. ప్రవక్త హజరత్ మహమ్మద్ సా. మహనీయుల స్తోత్రములు వ్రాసి తన సొంత బాణీలు కట్టి మీలాదున్ నబి, పీర్ల పండుగ, ఉరుసు సందర్భాలలో తాను పాడుతూ తమ శిష్య బృందం చే పాడించేవారు. కర్బలా మైదాన మందు ప్రవక్త సొ. వారి మనుమలకు, యజీదుకు మధ్య జరిగిన ధర్మపోరాట సంఘటనలను కళ్ళకు అద్దినట్లుగా కవితాగేయాలను పీర్ల పండుగ దినాలలో జట్లు జట్లుగా శిష్యులచే పాడిస్తూ అభినయం చేయిస్తూ (గిరో) శ్రోతలను దు:ఖ సాగరంలో ముంచేవారు. జిల్లా ప్రముఖులు ఉదయగిరి నవాబు సంతతి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఆఫాన్ (ఛాబు దొర) వీరు రచించిన ఖర్బలా సంఘటన కవితాగానాన్ని విని కన్నీరు గార్చారని

కానుక సమర్పించారని చెప్పబడుచున్నది. ఆనాటి ఉదయగిరి ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువర్యులు హజరత్ మీరా సయ్యద్ షా మొహమ్మదుల్ హుసైనియల్ ఖాదరి. ఉరఫ్ సయ్యద్ అహ్మద్ సా పీర్ వీరి పరిపూర్ణ గురువర్యులు.

వీరికి ఆయుర్వేదం, యూనాని వైద్యంలో మంచి అనుభవం ఉండేది. ఎందరో సంతానం లేని వారికి దైవప్రార్ధనలతో సంతానాన్ని కలగజేసేవారు. దుష్టశక్తులు ఆవరించిన పీడితుల్ని తమ అంత్రాలచే నయం చేసేవారు.

ఖాదర్ మొహియుద్దీన్ సమకాలికులైన హైందవ సోదరులు శ్రీ వెంకటరత్నం, శ్రీ ఆవుల వెంకటయ్య, నాయీ బ్రాహ్మణులు శ్రీ రామచంద్రయ్య వేదాంతాన్ని గురించి చర్చించుకొనేవారు. వీరి ఆధ్యాత్మిక శిష్యులలో చిన్న చెరుకూరు నివాసి మౌలాసాహెబ్ జును, కదిరినేనిపల్లి నివాసి రసూల్ సాహెబ్ ముఖ్యులు వీరిరువురు అధిక సమయం వీరి సాంగత్యంలో గడిపేవారు.

ఒకనాడు వీరి సంకలో ఒక గడ్డ ఏర్పడి వ్యాధి గ్రస్తులయ్యారు. స్థానికంగా ఎంత ప్రయత్నించిన వ్యాధి నయంకాలేదు. మెరుగైన చికిత్సకై అభిమానులు నెల్లూరులోని వైద్యశాలలో చేర్పించారు. కాని వ్యాధి తీవ్రత వైద్యశాలలో ఎక్కువై 1955 సం.మే నెల 15తేదీన స్వర్గస్తులయా&్యరు. వీరు స్వర్గస్థులైన విషయాన్ని తెలుసుకున్న హిందూ, ముస్లిం సోదరులు, శిష్యులు ఒక మంచి కళాకారుని, పండితుని కోల్పోయినందుకు దు:ఖసాగరంలో మునిగిపోయారు. వీరి అంతిమ యాత్రలో స్థానికులతో పాటు అనేక మంది ఇతర ప్రాంతీయులు పాల్గొన్నారు. ఖాదర్ మొహియుద్దీన్ మన ముందు లేకున్న ప్రతి సంవత్సరం పీర్ల పండుగ, మిలాదున్నబి రోజున వారి కవితలను విని వారిని గుర్తు చేసుకొనుచున్నాము.

ఉదయగిరిలో ఆస్థాన -ఏ-చిష్తియా వ్యవస్థాపకులు హుసేన్ అలీ షా ఖాదరీ ఉరఫ్ హుసెన్ బాషా తాతగారి కలము పేరు 'ఖాఖ్‌సార్'తో కవితా రచనలు గావించుచున్నారు.

తమ రచనలను "బిస్మిల్లా" (దేవుని నామంతో) అని ప్రారంభించేవారు ఆపద రహస్యాన్ని, గొప్పదనాన్ని ఇలా వివరిస్తారు.

ఖాస్‌నామే ఖుదాహై ఎ బిస్మిల్లా

క్యా కలామే క్యా కలామే ఖుదాహై ఎ బిస్మిల్లా

అర్థం : సొంత నామంబు బోధాత్మ బిస్మిల్లా

మహావాక్యంబు మహావాక్యంబు బోధాత్మ బిస్మిల్లా

పఢో అయ్ మోమినో హర్ దమ్ తసద్దుఖ్ హూకే బిస్మిల్లా

ఇతర్ అంబర్ గులాబి సే జబా-కో ధోకె బిస్మిల్లా

అర్థం : ఓ విస్వాసులారా సుగంధాలతో అత్తరు పన్నీరులతో సదా నోటిని సుభ్రపరుస్తు బిస్మిల్లాపై దిగదుడుపుకండి.

హై బిస్మిల్లా హకా బేకా జొనుక్తా సబ్ జగత్ ఘేరా

సమఝ్ కామిల్‌సె జా సీఖో ఖులేగా రాజ్ బిస్మిల్లా

అర్థం : బిస్మిల్లా యందలి తొలి అక్షరపు క్రింది బిందువు రహస్యం జగమంతా వ్యాపించి ఉన్నది. పరిపూర్ణుని సాంగత్యంలో ఆ రహస్యం తెలుసుకోమంటారు.

ప్రవక్త హజరత్ మొహమ్మద్ (సొ.అ.వ) గురించి ఒక స్తోత్రములో ఇలా అంటారు.

హఖ్ కా మహబూబ్ సర్‌దార్ కుల్ అంబియా మేరా అఖా రసులే ఖుదాహై

తూనె బక్షిష్ కా వాదా కియాహై తూనె బక్షిష్ కా వాదా కియాహై

అర్థం : నీవు దైవ ప్రియుడివి ప్రవక్తలందరి సర్దారువి నా సామి నీవు ప్రవక్తవి మమ్ము క్షమించు వాగ్దానం చేశావు, మమ్ము క్షమించు వాగ్దానం చేశావు

సనాజొ తేరి కర్తా ఖుదాహై బందా మై తేరా దిల్‌సే ఫిదా హై

సచ్ హై కె అఖా తూ నూరే ఖుదాహై ఖాఖ్‌సార్ ఖాదర్ తుఝ్ పే ఫిదా హై

అర్థం : ఓ ప్రవక్త దేవుడు నిన్ను ప్రశంసించుచుండె

ఖాక్సార్ నీపై దిగదుడుపుండె

హమ్ నే సునా తు పాక్ హై హర్ యేక్ కా తు సాథ్ హై

కిస్ సే తూహై హోకర్ జుదా తెరి పాక్ జాత్ హై అయ్ ఖుదా

అర్థం : నీవు పరిపూర్ణుడని వింటిమి నిన్ను అందరిలో కంటిమి నీవు లేని చోటేలేదు నీవు లేదనే లేనేలేదు

ప్రవక్త హజరత్ మొహమ్మద్ (సొ.అ.వ) గురించి ఒక స్తోత్రములో ఇలా అంటారు.

తుం నాయబే ఖుదాహెూ అయ్ సర్వరే దో ఆలం
మఖ్లూఖ్ సే జుదాహూ అయ్ సర్వరే జో ఆలం
సాయానథా జమీపర్ మఖ్ఖీ నా బైఠి తన్ పర్
తుం మఖ్సదే ఖుదాహెూ అయ్ సర్వరే దో ఆలం
తుం లాడిలె ఖుదాకే సాతో- ఫలక్ పె జాయే
అల్లాహ తక్ రసాహెూ అయ్ సర్వరే దో ఆలం
తుం హెూ అజల్ సె మష్హూర్
జాతే ఖుదా కె హెూ నూర్
నబియో-కె పేష్వా హెూ అయ్ సర్వరే దో ఆలం
ఖాదర్ తెరా గదా హై దిల్ జాన్సె ఫిదాహై
తుం హ్రషమె బచావో అయ్ సర్వరే దో ఆలం

అర్థం :

ఓ ప్రభువా! మీరు దేవునిచే ఎన్నుకోబడిన దైవ ప్రతినిధి సృజింపబడిన ప్రాణాలకంటే ప్రత్యేకము కలవారు. ఈ భువిపై మీ ఛాయలేదు. తనువుపై ఈగ వాలదు. మీరు దైవ ఉద్దేశియులు దేవుని లాలకుడివై సప్త ఆకాశాలు పయనించి దైవ సన్నిధి చేరారు. మీరు ఆది నుండి ప్రసిద్ధమను దైవ స్వభావపు కాంతివి, ప్రవక్తల మార్గదర్శివి. ఖాదర్ మీ భిక్షకుడు మోహితుడు. పుణ్యపాపముల విచారణ దినమున అతనిని రక్షించండి.

42. హజరత్ ఝుట్ పట్ బీబీ దర్గా

దుర్గం పల్లె మెయిన్ రోడ్డు నుండి ఎడమ ప్రక్కగా దుర్గానికి పోవు దారిలో నాలుగు గోడల మధ్య రెండు సమాధులు గలవు. 30 సం.ల క్రితం దట్టమైన చెట్ల పొదలలో అవి బయటపడ్డాయి. అవి ఏ మహనీయుల సమాధులో తెలియదు. కోరికలు తొందరగా నెరవేరుతాయని "ఝుట్‌పట్ బీబీ దర్గా" అని పిలుచుచున్నారు.

ప్రతి సంవత్సరము ఇస్లామీ సఫర్ నెల వన భోజనాల రోజు ఈ మహనీయుల గంధమహోత్సవము జరుగును.

43. బస్టాండులో బస్ షెల్టర్ ప్రక్కన గల దర్గా

బస్టాండులోని బస్ షెల్టర్‌కు ఉత్తరాన పెద్ద పెద్ద రాళ్ళను కూర్చి తయారు చేసిన అరుగుపై సమాధులు కలవు. అరుగు చుట్టు గల పురాతన గోడల పై శ్రమతో కూడిన సున్నితమైన నగిషీ పని కానవచ్చుచున్నది. ఆనాడు ఇంతటి భారీ నిర్మాణము ఉదయగిరిలోని ఏ సమాధికి చేపట్టలేదు. ఆ సమాధులు ఎంతో ప్రాధాన్యతగల వారివని అర్ధమగుచున్నది.

1696లో చక్రవర్తి ఔరంగజేబు పాలనలో విద్యలో నిష్ణాతులు, ఔరంబజేబుకు సలహాదారులైన హజరత్ ఇమాముల్ ముద్రసీన్ మౌలానా మొహమ్మద్ హుసైన్ బీదరీ షహీద్ రహ. వారి సిఫారసు పై హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహబ్ గారి జేజనాయన హజరత్ సయ్యద్ ముస్తఫా అలీఖాన్ సాహెబ్ గారిని ఉదయగిరి కోటకు ఖిల్లాదారునిగా నియమించడమైనదని మనము తెలుసుకొనియున్నాము. వీరి పరిపాలనా కాలమందే హజరత్ మెహమ్మద్ హుసైన్ బీదరీ షహీద్ గారి తల్లి హజరత్ అగ్నా సాహెబా ఉదయగిరి విచ్చేసి చివరికి ఇచ్చటనే స్వర్గస్తులయ్యారు. హజరత్ మొహమ్మద్ హుసైన్ బీదరీ షహీద్ గారు ముస్తఫా అలీ గారికి గురువు కూడా అగుదురు. దీనిని బట్టి బహుశ అది ఆ మహనీయుని తల్లి గారి సమాధి అయి వుంటుందా? వారి గౌరవార్ధము ఇంతటి నైపుణ్యముతో కూడిన నిర్మాణము చేపట్టి ఉంటారా అని ఈ గ్రంధ రచయిత అభిప్రాయము. యధార్ధము దేవునికెరుక.

44. ఆనకట్ట తూర్పున గల ఔలియా అల్లా దర్గా

ఆనకట్టకు తూర్పున కావలి, నెల్లూరు కూడలిలో నాలుగు గోడల మధ్య రెండు సమాధులు గలవు. అవి ఏ మహనీయుల సమాధులో తెలియదు. కొన్నేళ్ళ క్రితం దర్గాకు ఎదురుగా గల ఇంటిలో ఒక పోలీసు అధికారి ఉండెను. ఒక రోజు క్యాంపు వెళ్ళి అర్ధరాత్రి దాటి ఇల్లు చేరెను. ఇంటికి ఉత్తరాన ఉన్న కిటికి నుండి చూడగా ఒక మహనీయుడు తలపాగా తోటి ఆనకట్ట రోడ్డు నుండి సరాసరి దర్గా వద్దకు వెళ్ళిపోవుట గమనించెను. ఈ విషయము ఆ అధికారి కొందరితో వెళ్ళడించెనని తెలిసినది (యదార్ధము దేవునికెరుక).

ప్రతి గురు, శుక్రవారములు భక్తులు దర్గా దర్శనము గావించుచుందురు. ప్రతి సంవత్సరము వీరి గంధమహోత్సవము మొహరం నెల 25వ తేదీన జరుగును.

45. మూఏముబారక్ ప్రాధాన్యత - హజరత్ మఖ్దూమ్ అబ్దుల్ హఖ్ సాబి భక్తిభావం - ఉదయగిరిలో మూఏ ముబారక్

మూఏముబారక్ ప్రాధాన్యత :

మూఏషరీఫ్ (ప్రవక్త పవిత్ర కేశము) గురించి షేఖుల్ హింద్ హజరత్‌షా అబ్దుల్‌హఖ్ ముహద్దీస్ దెహల్వీ "అష్అతుల్ లలిఆత్"లో ఈ విధంగా హదీసు వ్రాసిరి. "హజరత్ ప్రవక్త సొ.స. తమ కేశములను అనుచరులైన అబుతలహా అన్‌సారి రజి. కు ప్రసాదించి వీటిని జనాలలో పంచండని ఆజ్ఞాపించారు".

అర్‌వాబిన్ మసూద్ సఖఫీ రజి. తాము కండ్లార చూచిన విషయాన్ని ఇలా వెల్లడించారు. "ప్రవక్త గారి కేశము పడునప్పుడు అనుచరులు పవిత్రంగా దానిని భద్రపరచేవారు". (మదారిజుల్ నబూవ మొదటి భాగము).

మౌలానా రహమతుల్లా సింధీ రహ. తమ మీనస్క్ ముతవస్తలోని సంభాషణాన్ని ముల్లాఅలీ ఖారి ఇలా వ్యాఖ్యానించారు. "ప్రవక్త మొహమ్మద్ సొ.స.కు సంబంధించిన మశీదులు, బావులు, గుర్తులు విడువబడిన వస్తువులు వాటి దర్శనము అంగీకారమైనదని, దానిని సున్నత్ జమాఅత్ నలుగురు ఇమాములైన ఇమాం అబుహనీఫా రహ. ఇమాం మాలిక్ రహ. ఇమాం షాఫయీ రహ. ఇమాం అహ్మద్ బిల్‌హంబల్ రహ. ఏకీభవించారు".

ఖాజీ అయాజ్ రహ. తమ "షఫా" అను గ్రంధములో ప్రవక్త సొ.స. గారి వస్తువులను వారు అవతరించిన స్థలాలను గౌరవించుట ప్రవక్త సొ.స. వారిని గౌరవించునటులేనని రాసారు.

మౌలానా సయిాద్ అస్లమీ మద్రాసీ తమ గ్రంధము "సఫీనతుల్ నజాత్"లో ప్రవక్త గారి మూఏ షరీఫ్ (పవిత్ర కేశము) గురించి ఎటువంటి ఆధారం దొరకక పోయినను దానిని గౌరవించాలి అని రాసారు.

హజరత్ మఖ్దూమ్ అబ్దుల్ హఖ్ సావి భక్తి భావం :

ఉదయగిరిలో వెలసియున్న హజరత్ ఉస్మాన్ సావి (ఉస్మాన్‌సా హజరత్) రహ. వారి జేజనాయన ఖిద్‌వతుల్ మొహఖ్ఖైన్, జుబేదతుల్ ముదఖ్ఖి ఖైన్, అస్వతుల్ ఆరిఫైన్, లిఖావతుల్ వాసిలైన్, వాఖిఫే ఇస్రారె రబ్బాని, ముజద్దిదుల్ అల్ ఫసానీ, జామియుల్ షరీయత్ వతరీఖత్, కాషిఫేరమూజుల్ మారిఫత్ వల్‌హఖీఖత్ హజరత్ షా అబ్దుల్ హఖ్ మొహమ్మద్ మఖ్దూముల్ హఖ్ఖానియుల్ కాదరియుల్ సావి రహ. వివరించిన విషయం వారి ఆధ్యాత్మిక శిష్యులు హజరత్ సయ్యద్‌షా అబుల్ హసనల్ ఖాదరి అల్ ఖుర్‌బీ గారి తల్లిదండ్రులు తమ రచనలో ఇలా రాసారు. "ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొ.స. వారికి సంబంధించిన వస్తువులను భక్తుల దర్శనానికి తెచ్చునప్పుడు భక్తి మర్యాదలతో నిలబడి స్వాగతించెదరు. ఏలననగా పవిత్ర హజ్ వీడ్కోలు సమయంలో ప్రవక్త తమ తల వెంట్రుకలను తీయించి వారి అనుచరులకు ఇచ్చి వీటిని జనాలలో పంచండని ఆజ్ఞాపించిరి".

"ఆసియా ఖండములోని వివిధ దేశాలలో సంచరించుచుండిన ఈ ఫకీరు ఒక రోజు మహమూద్ బందర్ ప్రాంతానికి చేరుకున్నాను అచ్చట ప్రవక్త గారికి సంబంధించిన వస్తువు ఉన్నందుకు. దానిని దర్శించదలచాను. ఇద్దరు విద్యార్థులు తోడై వాటిని దర్శించరాదని, ఇవి ప్రవక్తకు సంబంధించిన వస్తువులు కావని తమ పేరు ప్రతిష్ఠలకై కొందరు అబద్ధము చెప్పుదురని, మీరు అంత దూరము వెళ్ళుట ఏమి లాభమని ప్రశ్నించిరి. ప్రవక్త గారి పేరు పట్లఈ ఫకీరుకు గల భక్తి గౌరవము చాలని, విద్యార్థులకు జవాబిచ్చి వారి మాటలను పట్టించుకోక ఆ పవిత్ర వస్తువును

దర్శించుకున్నాను. నా శిష్యుడు కూడా వారితో ఏకీభవించుచుండెను. అర్ధరాత్రి దాటినది. ఆ ఇద్దరు విద్యార్థులు ఏడుస్తూ ఈ ఫకీరు వద్దకు వచ్చి మేము కలలో ప్రవక్త గారిని చూచాము. "ఇలా తిరస్కరించుట మంచిది కాదని, ఇలాంటి తిరస్కారముతో అబూజహల్ అబులహబ్ చెడిపోయిరి" అని ప్రవక్త పలికారని ఆ విద్యార్థులు చెప్పుకొని పశ్చాత్తాపం పడ్డారు.

ఉదయగిరిలో మూఏ ముబారక్ :

1. పెద్ద మశీదులో మూఏ ముబారక్ : క్రీ.శ. 17వ శతాబ్దంలో సిద్దోటు బద్వేలి, ఉదయగిరిని ముస్లిం సోబేదారులు పరిపాలించారు. సిద్దోటు నవాబులు సేకరించిన ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా సో., ఇతర మహనీయుల పవిత్ర వస్తువులను (ఆసారె ముబారక్) నేటికి మిలాదున్నబీ (ప్రవక్త గారి జన్మదినం) నాడు సిద్దోటు కోటలో ఎందరో భక్తులు దర్శించుకొనుచుందురు.

సిద్దోటు, ఉదయగిరి నవాబులకు సంబంధాలుండెవి. వారి కాలములో సేకరించబడిన ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొ.స. వారి పవిత్ర కేశమును ఉదయగిరి నవాబుల సేకరించి ఉంటారని రచయిత అభిప్రాయం. వారి తదుపరి ఇచ్చటి ప్రముఖులు ఆ పవిత్ర కేశాన్ని గురించి జాగ్రత్త వహించారు. చివరికి వారు కూడా కుటుంబసమేతంగా మదరాసు, హైదరాబాదు వెళ్ళుతూ వారికి సంబంధించిన వ్యక్తులకు ఆ పవిత్ర కేశాన్ని అప్పగించారు. చివరిగా దానిని స్వర్గీయ మోటార్ దస్తగీర్ సాహెబ్ (అమానుల్లా ఖాలిది గారి తండ్రి)కు అందివ్వడం జరిగింది. దస్తగీర్ సాహెబ్ బంధువులు, ఉదయగిరి ప్రముఖులు ఆఫాన్ అబ్దుల్ ఖాదర్ (ఛాబు దొర) గారు దానిని పవిత్ర స్థలములో భద్రపరచు ఉద్దేశంతో పెద్ద మశీదులో మీనారు దగ్గర ఒక అల్‌మైరా తయారు చేసి ఆ కేశాన్ని చిన్నపాటి గాజు సిసాలో ఉంచి ఒకపెట్టెలో భద్రపరచి ఆ అల్ మైరాలో ఉంచడమైనది.

2. చిన్న మశీదులో మూఏ ముబారక్ : చిన్న మశీదులో హజరత్ మొహమ్మద్ ముస్తఫా సో... వారి పవిత్ర కేశము జగత్ గురువు హజరత్ మెహబూబె సుబహాని సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జీలాని ర.. వారి పవిత్ర కేశములు ఉదయగిరి జాగీర్‌దారు

మహనీయులైన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ కుమార్తె శ్రీమతి సర్వర్‌బీ వంశస్థులైన పాఛాసాహెబ్ (స్వర్గీయ స్యయద్ హజరత్ మియా చిష్తి గారి జేజనాయన) పొందియుండిరని వారి వంశస్తులు తెలిపారు (వల్లాహు ఆలం). వాటిని చిన్న గాజుసీసాలో ఉంచి దానిని ఒక పెట్టెలో పెట్టి మశీదు యందు ప్రత్యేకంగా చేయబడిన ఒక అల్‌మైరాలో ఉంచడమైనది. మిలాదున్నబి దినమున భక్తులు పవిత్ర కేశములను దర్శించుకొనుటకై పెద్ద మశీదు చిన్న మశీదులలో భక్తి శ్రద్ధలతో హాజరగుదురు. అచ్చట చదివే ఫవాయద్‌బదరియ అను గ్రంధము ద్వారా ప్రవక్తగారి జన్మదిన విశేషాన్ని తెలుసుకొందురు. ఖసీదాఖాని (స్తోత్రములు) చదివింపులు అయిన మీదట మిఠాయిలు పంచి 15 వందల సంవత్సరాల నాటి ఆ పవిత్ర కేశాన్ని భక్తులకు చూపెట్టుదురు. రోగులపట్ల ఆ పవిత్ర కేశ ప్రాముఖ్యత హదీసె షరీఫ్‌లో వెల్లడించబడినందుకు భక్తులు తాము తెచ్చిన నీటి గ్లాసులందు పవిత్ర కేశము గల గాజు సీసాను ముంచి ఆ నీటిని రోగులకు త్రాపించుదురు.

3. ఆసారెఖద్‌మె ముబారక్ : గతములో నెల్లూరులోని కామాటి వీధిలో సయ్యద్ హంజాహుసైని ఖాలిది చిష్తియుల్ ఖాదరి (అస్లం) గారి తాతగారైన నవాబ్ సయ్యద్ అబుల్ హసన్ హుసైని రజ్వీ గారి ఇంట్లో మీలాదున్నబీ నాడు 14 వందల సంవత్సరాలకు పూర్వం రాతిపై పడిన హజరత్ మొహమ్మద్ సొ.స. వారి పాదం గుర్తు (ఆసారె ఖదమె ముబారక్) ను భక్తులకు చూపేవారు. క్రమంగా దానిని హంజహుసైని పిన్నమ్మలు ఆ కార్యాన్ని నిర్వహించేవారు. వారి తదుపరి ఉదయగిరిలో ఉండిన హంజహుసైని ఖాలిదిగారి తల్లిగారైన స్యయద్ ఫాతిమాబేగం ఖాలిది ఉర్ఫ్ సయ్యద్ పీర్‌జాది వారసురాలైరి. 30 సంవత్సరముల క్రితం నెల్లూరు నుండి తేబడిన ఆపవిత్ర పాదచిహ్నాన్ని మీలాదున్నబీ దినమున భక్తులు దర్శించుకొనుటకై హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ దర్గా కమిటి వారు దర్గాయందు ఏర్పాటుగావించుదురు.

మీలాదున్నబీ రోజు సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ, మేళతాళాలతో వైభవోపేతంగా దర్గాకమిటి ఆధ్వర్యంలో దర్గా వద్ద నుండి ఊరేగింపు బయలుదేరును.

వందలకొలది భక్తులు ఈ ఉత్సవములో పాల్గొని జండాలు చేతబూని భక్తిశ్రద్ధలతో "ఆమదే ముస్తఫా మర్‌హబా" (ముస్తఫారాక మేలుమేలు) నినాదాలతో పురవీధుల గుండా మెయిన్ బజారు చేరుకొందురు. వందలాది పచ్చని జండాల మధ్య యువకుల కర్రసాము ప్రదర్శన చూపరులకు ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా షామీర్ సాహెబ్ వీధిలోని ఈ పుస్తక రచయిత ఇంటి నుండి నాతియా మహఫిల్ తదుపరి "సర్కార్‌కి చాదర్" (హజరత్ ప్రవక్త సొ.స. పేరిటగలేబు) ఉత్సవము బయలుదేరి ప్రధాన ఊరేగింపులో కలుసుకొనును. ఊరేగింపు బస్టాండు మీదుగా సయ్యద్ హంజహుసైని ఖాలిదిగారి ఇంటి వద్దకు చేరుకొని పవిత్ర పాదచిహ్నాన్ని స్వాగతం పలుకగా హంజా హుసైని ఆ పవిత్ర చిహ్నం గల పెట్టను ఎత్తుకొని ఊరేగింపుగా దర్గాషరీఫ్ చేరుదురు. అచ్చట చదివింపుల తదుపరి పవిత్ర చిహ్నాన్ని భక్తుల దర్శనార్థం ఉంచుదురు. ఆ రాత్రి దర్గా కమిటీ వారు అన్నదాన కార్యక్రమము జరుపుదురు.

4. హజరత్ మహబూబె సుబహాని ర.జి. వారి మూఏముమారక్ : చిన్న మశీదులోని జగత్‌గురువు హజరత్ మహబూబె సుబహాని సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జీలాని రజి. వారి పవిత్ర కేశాన్ని రబియుస్సాని నెల 11వ తేదీన ఖసీదాఖాని, హజరత్ వారి జన్మదిన విశేషాన్ని గ్రంధం ద్వారా భక్తులకు తెలిపి, చదివింపుల తదుపరి మిఠాయిలు పంచి 8 వందల సంవత్సరముల నాటి ఆ పవిత్ర కేశాన్ని భక్తులకు చూపెట్టుదురు.

హజరత్ మహబూబె సుబహాని ర.జి. వారి పవిత్ర టోపిని ఉదయగిరి నవాబు ప్రసాదించుట :

ఏ.ఎస్.పేట మండలం రసూల్ అబాద్‌లో హజరత్ మహబూబె సుబహాని ర.జి వారి కులాముబారక్ (పవిత్రటోపి) కలదు. దానిని ఉదయగిరి నవాబు తమ వద్ద వడ్రంగిగా పని చేస్తుండిన కాలెగౌస్ సాహబ్ గారికి ప్రసాదించారని గౌస్ సాహెబ్ వంశస్తులు తెలిపారు. రబియుస్సాని నెల 11వ తేదీన రసూల్ అబాద్ యందు భక్తుల దర్శనార్థం ఆ పవిత్ర టోపీని ఉంచుదురు. ఆ రోజు ఎందరో భక్తులు ఆ టోపీని దర్శించుకొని తరించుదురు.

46. దర్శనీయ ప్రదేశాలు

1. నషానె ముబారక్ హజరత్ మహబూబె సుబహాని రజి :

ఉదయగిరి సీతారామపురం రోడ్డుకు పశ్చిమాన మహబూబ్ సాహెబ్ గారి స్థలములో హజరత్ మహబూబె సుబహాని రజి. వారి నషానె ముబారక్ గలదు. పూర్వము నిర్మించబడిన పాత నషానె ముబారక్ స్థానములో స్వర్గీయ జైనుల్ ఆబిదీన్ (ఆబిద్ బాబా) గారు వారి హిందూ ముస్లిం శిష్యుల అభిమానుల సహకారముతో గమ్మటము గల ప్రస్తుత నషానె ముబారక్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నిర్మాణములో యువకులతో పాటు ఉర్దూ మున్షీ ప్రముఖ రచయిత స్వర్గీయ గులాం ఖాదర్ లాంటి వారు కూడా భక్తి శ్రద్ధలతో ఈ నిర్మాణ శ్రమదానములో పాల్గొన్నారు.

ఇచ్చట ప్రతి సంవత్సరము రబివుస్సాని నెల 26వ తేదిన హజరత్ మహబూబె సుబహాని రజి. వారి గంధమహోత్సవము అతివైభవముగా జరుగును. ఖవాలి పాట కచేరితో పాటు అన్నదాన కార్యక్రమము జరుగును. సుదూర ప్రాంతాల నుండి భక్తులు గంధమహోత్సవములో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులగుచుందురు.

2. నషానె ముబారక్ జైనుల్ ఆబిదీన్ ఖాదరి (ఆబిద్ బాబా) రహ.:

ఉదయగిరి శీతారామపురం రోడ్డు ప్రక్కన గల కోన కాలువ సమీపములో హాజరత్ జైనుల్ అబిదీన్ ఖాదరి వారి నషానె ముబారక్ గలదు. వీరి జన్మ స్థలము పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు. వీరికి పన్నెండేంళ్ళ ప్రాయములోనే దైవాన్వేషణ మొదలైనది 'వీరి ఆధ్యాత్మిక గురువు హాజరత్ సూఫీ రహం బక్ష్ చిష్తియుల్ ఖాదరి మీరటి. బాబా కొన్నేళ్ళు ఉదయగిరి యందు గడిపారు. హాజరత్ మహబూబె సుబహాని పాత నషానె ముబారక్ స్థానములో కొత్త నషానె ముబారక్, బీబీ ఫాతిమత్తుజహిరా రజి. నషానె ముబారక్ నిర్మాణం చేపట్టారు. ఉదయగిరిలో వీరికి అనేక మంది హిందూ ముస్లిం శిష్యులు, భక్తులు గలరు. వీరు ఇస్లామి సఫర్ నెల 8వ తేది తమ 54వ ఏట స్వర్గస్తులైనారు. 9వ తేదీన సమాధిగావించబడినది.

వీరికి ఎందరో శిష్యులు భక్తులు గల ఉదయగిరిలో తాజమహలు ఆకారములో వీరి నషానె ముబారక్ నిర్మించబడినది. దీని యందు బాబా గారు ధరించె కంబళి ఉంచబడినది. ఉదయగిరిలో వీరి గంధోత్సవము ప్రతి సంవత్సరము ఏప్రిల్ నెల 10వ తేదిన జరుగును. ప్రతి శుక్రవారము అన్నదాన కార్యక్రమము జరుగును.

3. ఆస్తాన యె ఖాదరియా ఒ ఖాన్ ఖాహె చిష్తియా :

1976 సంవత్సరం మా ఆధ్యాత్మిక గురువర్యులు హజరత్ ఖ్వాజా అబుల్ ఫైజ్ షామొహమ్మద్ ఖాలిద్ వజూది హైదరాబాది రహ. వారి వద్ద మేము శిష్యులమయ్యాము. ఒకచోట కూడి ఆధ్యాత్మిక విషయాల గురించి మాట్లాడుకొనుటకై ఒక ఆస్తాన (గురుకుల ద్వారము) అవసరమని భావించాము. స్థల అన్వేషణ ప్రారంభించాము చివరికి ఉదయగిరి గ్రామ పంచాయితి కార్యాలయానికి దక్షిణంగా గల నూరుల్లాసా వారి దొడ్డిలో హజరత్ పాఛాపీర్ వారి దర్గాకు ప్రక్కన ఖాళీ స్థలాన్ని చూడడమైనది. ఆ స్థలాన్ని పొందుటకై హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరి వారి దర్గా కమిటి అధ్యక్షులు సయ్యద్ మన్సూర్ గారి తండ్రి సయ్యద్ రోజ్‌దార్ అబ్దుల్ ఖాదర్ (టీచర్) గారి సహకారంతో ఆనాడు సదర్‌గ ఉండిన నేను ఆత్మకూరుయందు గల స్థల హక్కుదారులైన వారి బంధువులు మా తండ్రి గారి మిత్రులను కలుసుకొని వారితో మా రాక ఉద్దేశాన్ని వెల్లడించాను. మా ఉద్దేశాన్ని విన్న విషయం తెలుసుకొనిన స్థల దాతలు ఇది మంచికార్యమని భావించి కొన్ని షరతులతో హజరత్ పాఛాపీర్ దర్గా హద్దుగా ఆస్తానయే ఖాదరియాకు స్థలాన్ని వక్ఫ్ చేయుటకు అంగీకరించారు. దైవ కార్యక్రమాలకై ఉపయోగపడు సంస్థ కాబట్టి

భవిష్యత్తులో అన్యాక్రాంతము కాకుండా వక్ఫ్ (భూరి విరాళం) అని అగ్రిమెంటు వ్రాస్తామని చెప్పగా. ఆ రోజులలో నేను సదర్‌గా ఉన్నను మా సీనియర్ పీర్ భాయి మా గురువర్యుల ఖలీఫా గారైన ఖ్వాజా అబుల్ ఇర్‌ఫాన్ షా అబ్దుల్ అజీజ్ ఖాలిదీ చిష్తియుల్ ఖాదరీ గారి గౌరవార్థం భూరి విరాళం వక్ఫ్ అగ్రిమెంటు వారి పేరిట వ్రాసి ఇచ్చుటకు దాతలకు మనవి చేశాను. నా మనవి ఆలకించి కొన్ని షరతులతో 1979 సం. అగ్రిమెంటు వ్రాసి ఇవ్వడమైనది. సదర్ అయ్యేవారు ఆస్థాన నిర్వహణ బాధ్యతలు నిర్వహించెదరు. సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ వారి గంధము తీయుటకు, ఆ దినములలో ఉండుటకు మాత్రమే మాకు మా వారసులకు ఆస్థాన యెందు హక్కు కలిగి ఉన్నది అని వ్రాయడమైనది. మా ఆధ్యాత్మిక గురువర్యుల అనుమతి, వారి విరాళము, వారి శిష్యుల (మా పీర్ భాయిల) విరాళాలతో ఆస్థానయేఖాదరియా నిర్మాణం చేపట్టడమైనది. కొన్నేళ్ళు ఆస్థానమందు కార్యక్రమాలు నిర్వహిస్తు వచ్చాము. నా తదుపరి సదర్ అయిన పీర్‌భాయి ఖ్వాజా అబుల్ ఫత అహమద్ బాషా ఖాలీదీ చిష్తియుల్ ఖాదరీ వారి శిష్యుల, పీర్ భాయిల, హిందు ముస్లీం భక్తుల విరాళాలతో ప్రస్తుత నూతన ఆస్థాన ఉత్తర ముఖంగా నిర్మించడమైనది. ప్రతి సంవత్సరం రబ్బీవుల్ అవ్వల్ నెల మీలాదున్నబి రోజున హైదరాబాదు నుండి తీసుకోరాబడిన ప్రవక్త హజరత్ మొహమ్మద్ సొలెల్లాహు అలైహి వసల్లం వారి పవిత్ర కేశాన్ని భక్తులదర్శనార్థం ప్రదర్శించెదరు. రబివుస్సాని మాసములో జగత్‌గురు హజరత్ మహబూబె సుబహాని రహ. వారి పేరిట జెండా ప్రతిష్టించి భక్తులకు వారి కేశాన్ని ప్రదర్శించి ప్రసాదము పంచబడును.

ప్రస్తుత ఆస్తాన యె ఖాదరియా

4. ఆస్తాన-ఏ-చిష్తియా (హుసైనీ చమన్) :

ఉదయగిరి దిలావర్ భాయి వీధిలోని షబ్బీర్ కాలనీలో హుసైన్ అలీషా ఖాదరీ 2007లో ఆస్తాన-ఏ-చిష్తియా స్థాపించారు. వీరి తండ్రి పేరు ఇబ్రాహిం వీరి తాత గారు ఖాదర్ మొహియుద్దీన్ ఖాక్ సార్. వీరిని ఉస్తాద్ ఖాదర్ మొహియుద్దీన్ అని పిలిచేవారు. వీరు నెల్లూరు వాసి గౌస్ అలీషా ఖాదరి చేతిపై ఆధ్యాత్మిక శిష్యరికం పొందారు. సౌదీ అరేబియాలో మంచి ఉద్యోగములో ఉంటూ తమ ఆధ్యాత్మిక గురువర్యులు స్వర్గస్తులైన విషయం తెలుసుకొని ఉద్యోగం వదిలి నెల్లూరులోని జనార్ధనరెడ్డి కాలనీలో గురువర్యులు స్థాపించిన ఆస్తన-ఏ-ముర్షదియాకు సజ్జాద నషీన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు ఇస్లామియత్‌లో డిగ్రీ చేసారు. వీరు ఉర్దూ కవులు. వీరి కలము పేరు ఖాక్‌సార్. ఈ పుస్తక రచయిత నుండి ఖాదరియా పరంపరలో ఆధ్యాత్మిక ఉత్తరాధికారాన్ని (ఖిలాఫత్) పొందారు. ఈ ఆస్తాన యందు హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తిఅజ్మీరి వారి గంధమహోత్సవము ఇస్లామీ రజబ్ నెల ఆరవ తేదీన జరుగును. ఆ రాత్రి అన్నదాన కార్యక్రమము జరుపుదురు.

5. నషాన్-యె-ముబారక్ హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ రహ:

ఉదయగిరి నెల్లూరు రోడ్డు మీదగల బి.సి.కాలని యందు 10 ఏళ్ళ క్రితం పట్టే వాలే బాబా అనే మహనీయుడు హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ పేరిట నషాన్-ఏ-ముబారక్ స్థాపించారు. వీరి అసలు పేరు షేక్ సలీమ్. వీరి జన్మస్థలము నాగూరు నాగపట్నం. వీరు హజరత్ సయ్యద్ ఎదుల్లా హుసైని చిష్తియుల్ ఖాదరీ కడప వారి ఆధ్యాత్మిక శిష్యులు. ఈ నిర్మాణములో బాబా గారి హిందూ, ముస్లిం శిష్యులు భక్తులు ప్రముఖ పాత్ర వహించారు. ప్రతి సంవత్సరం ఏప్రెల్ నెలలో ఇచ్చట గంధమహెూత్సవము జరుగును. భక్తులకు అన్నదానం ఏర్పాటుగావించెదరు.

47. సయ్యద్ -హజరత్ మియా-చిష్తి

ఉదయగిరి వాసులైన హజరత్ మియా–చిష్తి అసలు పేరు సయ్యద్ ఖ్వాజా రహమతుల్లా చిష్తి. వీరి తండ్రి పేరు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ చిష్తి వుర్ఫ్ బడేసా చిష్తి వీరు మంచి వ్యక్తిత్వం గల వారు, వీరి మూర్తిమత్వంలో గంభీరత ఆకర్షణీయనమైన ముఖతేజస్సు సహనం బహిర్గతమౌతుంది. ప్రతి వారితో నవ్వుతూ మాట్లాడు స్వభావం గలవారు. వీరి ఇంటి ప్రక్కన మశీదు వున్నందున ఉదయాన్నే నమాజు తదుపరి వ్యాయామం వీరి దినచర్యలో ఒక భాగం. వీరికి ఇద్దరు కుమారులు సయ్యద్ హైదర్ అలీ చిష్తి, సయ్యద్ సర్వర్ అలీ చిష్తి. వీరు చిష్తియా పరంపరకు సంబంధించిన వారు. ఆనాటి ఆధ్యాత్మిక గురువు అయిన అలగోజే వాలె మస్తాన్ (పిల్లనగ్రోవి మస్తాన్) వీరి ఆధ్యాత్మిక గురువు. వీరికి ముస్లిం భక్తులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులైన హిందు శిష్యులు అనేకులు. వీరు ఉదయగిరి మహనీయులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ వారి కుమార్తె శ్రీమతి సర్వర్ బి సాహబ వారసులు. వీరి వద్ద

సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ వారు ధరించిన పవిత్ర జుబ్బ కలదు. ఉరుసు దినములలో ఆఖరి రోజు దానిని భక్తుల దర్శనార్థం ప్రదర్శించెదరు. వారి ఇంటికి విచ్చేసిన భక్తులతో చాలా మర్యాదగా మెలిగేవారు. గతములో దర్గాలో మేము నిర్వహించినయౌమె ఆషురా కార్యక్రమములకు ఆహ్వానిస్తే తప్పకుండ హాజరయ్యేవారు. గాలి దోషం వలన బాధపడే వారికి అంత్రాలు వేసేవారు. ప్రతి సంవత్సరం చిన్న మశీదు యందు మీలాదున్నబి నాడు మరియు జగత్ గురువు మహబూబె సుబహాని గ్యారవీ షరీఫ్ రోజు గ్రంథ పఠనం గావించి భక్తులకు వివరించెదరు. కొన్ని కార్యక్రమాలందు మేము ఆహ్వానిస్తే తప్పక హాజరయ్యే వారు. మా ఆధ్యాత్మిక గురువు హజరత్ ఖ్వాజా అబుల్ ఫైజ్ షామొహమ్మద్ ఖాలిద్ వజుది ఉదయగిరి విచ్చేసిన రోజు వారితో కలుసుకొనుటకు వచ్చిన హజరత్ మియా గారు గురువు గారి పాదాలకు తాకి కళ్లకు అద్దుకున్నారు. ఆ రోజు యేర్పాటు చేసిన విందులో కూర్చున్న వారందరికి తమ చేతితో మంచి నీరు అందించారు. అవసర నిమ్మిత్తం వారి శిష్యులు హైదరాబాదు వెళ్ళిన, గురువు గారితో కలుసుకొని రండని ఆజ్ఞాపించేవారు. మా గురువు పట్ల మంచి భక్తి కలదు. తమ 78వ యేట అనగా 1989వ సంవత్సరం డిసెంబరు నెల 25వ తేదీన చిష్తి గారు స్వర్గస్తులయ్యారు. మా పీర్ బాయి మొహమ్మద్ ఖ్వాజా ఖాలిదీ హైదరాబాదులో గురువు గారి వద్ద ఉంటూ సంవత్సరానికి ఒకసారి వచ్చేవారు. అనుకోకుండా ఆ దినం ఉదయగిరి రావడం, వీరి అంత్యక్రియలలో పాల్గొనడం దైవనిర్ణయంగా భావించుచున్నాను. చిష్తి గారిని వారి సొంత తోటలో సమాధి గావించారు. వీరి ప్రక్కన వీరి శ్రీమతి ఖైరున్నిసా సాహెబ సమాధి కలదు. బంధువులు శిష్యులు సమాధిపై గుమ్మటాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం డిసెంబరు నెల 25వ తేదీ వీరి గంథమహోత్సవం జరుగును. ఆరోజు అన్నదాన కార్యక్రమంతో పాటు ఖవాలి పాట కచేరి నిర్వహించెదరు.

తొలి ఉరుసు రోజు బాణాసంచ కాల్చుటకై రచయిత తమ్ముడు అయిన సందానికి చిష్తి గారి శిష్యులు కోటేశ్వరరావు, రామారావు పైకమిచ్చి తెల్లవారు జామున గంథ మహోత్సవములో రావలెనని కోరారు. రెండవరోజు ఉదయాన్నే గంథము బయలుదేరే

సమయానికి సందాని నిద్దుర పోవుచున్నాడు. చిష్తి గారు అతని కలలో కనపడి మశీదు బావిలో చేతులు కడుగుతూ “క్యా మియా తుం అభీ యహాఁహై!’ యేమయ్యా నీవు ఇక్కడే ఉన్నావు అని పలికెనని వెంటనే లేచి వెళ్ళడమైనదని సందాని రచయితతో వెల్లడించెను. –

పయె రబ్ పంజతన్ వ గౌసె జమన్
వ బహఖ్ఖె మొఈనుద్దీన్ హసన్
సద్‌ఖయె షంసుద్దీన్ వజూది షా
షా హె ఖాలిద్ కరమ్‌కున్ బహాలతెమన్.

సయ్యద్ దావూద్ హుసైని రూహ్ చిష్తి

సుబ్‌హాన రబ్బిక రబ్బిల్ ఇజ్జతి అమ్మా యసిపూన్ వసలామున్ అలల్ ముర్ సలీన్ వల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

48. ఉదయగిరి వజ్రం - హనీఫ్ హజరత్

(1950 – 2026)

"నూటికో కోటికో ఒక్కరూ
ఎప్పుడో ఎక్కడో పుడతారు
అది మీరే మీరే మాస్టారు"

అని ఒక తెలుగు కవి రాశారు. ఇది హనీఫ్ ఉస్తాద్ (మాస్టారు)కు సరిగ్గా సరిపోతుంది.

హనీఫ్ ఉస్తాద్ అంటే ఉదయగిరిలో తెలియని వ్యక్తి లేరు. ఆదర్శప్రాయమైన గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం. నిత్యం ముఖంపై చెరగని చిరునవ్వు. అందరికీ ప్రేమతో పలకరింపు. మాటల్లో ఉట్టిపడే అభిమానం. మృదు, శాంత స్వభావం. ఎవరి మనసు నొప్పించని సత్ప్రవర్తన. విద్యార్థులంటే అభిమానం. వారి ఉన్నతి కోసం ఎంతో శ్రమించిన తత్వం. వెరసి హనీఫ్ ఉస్తాద్.

హనీఫ్ ఉస్తాద్ ఆదర్శప్రాయమైన గొప్ప గురువే కాదు మంచి కవి. ఉర్దూ భాష అభివృద్ధి కోసం జీవితాంతం కృషిచేసిన ఉర్దూ పండితుడు. హాయి గొలిపే

మధుర గాయకుడు. పేద విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడిన విద్యావేత్త. ఉదయగిరి పైన అభిమానంతో దశాబ్దాలు శ్రమించి **"ఉదయగిరి మహనీయులు"** అనే ఒక అరుదైన పుస్తకాన్ని రాసిన అద్భుత రచయిత. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయనలో ఎన్నెన్నో కోణాలు కనిపిస్తాయి. వేటికవే భిన్నంగా గోచరిస్తాయి.

హనీఫ్ ఉస్తాద్ 1950 జూలై 1వ తేదీన ఉదయగిరిలో జన్మించారు. వారి తల్లిదండ్రులు చినిగిషా, ఖాతూన్ బి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు

హనీఫ్ ఉస్తాద్ మొదట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత హైస్కూల్ టీచర్‌గా ఉదయగిరి ప్రాంతంలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో పని చేశారు. ఎక్కడ పని చేసినా మంచి పేరు తెచ్చుకున్నారు. స్థానికుల ప్రశంసలు అందుకున్నారు. ఎంఏ, బీఈడీ ఆయన విద్యార్హత. నిత్యం పుస్తక పఠనం చేస్తూ ఉర్దూ భాషలో, సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలలో గొప్ప ప్రవేశాన్ని సాధించారు. హెడ్మాస్టర్ గాను గౌరవ మన్ననలు అందుకున్నారు. విద్యార్థులకు చక్కటి బోధన చేశారు. వేలాదిమంది విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేశారు. అందుకే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సైతం గెలుచుకున్నారు. అప్పటి విద్యాశాఖ మంత్రి పీవీ రంగారావు చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ఉర్దూ భాషాభివృద్ధి కోసం....

ఉదయగిరి ప్రాంతంలో ఉర్దూ మాట్లాడే వారి సంఖ్య ఎక్కువ. అందువల్ల ఉర్దూ భాషకు మరింత ఉన్నతి కల్పించాలనే ఉద్దేశంతో 'అంజుమన్ తరఖీ ఉర్దూ' అనే సంస్థ శాఖ ఉదయగిరిలో 1978లో ఏర్పాటయింది. దీనిని కొన్ని దశాబ్దాల పాటు కొనసాగించారు. ఉర్దూ భాష అభివృద్ధి కోసం నిర్విరామ కృషిని చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకుల్లో ఈయన ముఖ్యులు. ఉర్దూ భాష అభివృద్ధి కోసం అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి వినతులు అందించారు. ఈ సంస్థ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు సహాయపడ్డారు. ఉర్దూ చదివే విద్యార్థుల ఉన్నతి కోసం

చేతనయినంత సహాయాన్ని అందించారు. ఉర్దూ టీచర్లుగా శిక్షణకు వెళ్లే వారికి మెలుకువలు నేర్పి మార్గం సులభం చేశారు. ఉద్యోగాలు ఎలా పొందాలో, విద్యార్థులకు ఎలా బోధన చేయాలో కూడా నేర్పారు. ఇతరత్రా విషయాల్లో కూడా సహాయ సహకారాలు అందించారు. జిల్లాలోని పలుచోట్ల ఉర్దూ స్కూళ్ల ఏర్పాటు కోసమూ మార్గదర్శకుడిగా పాటుపడ్డారు.

స్టడీ సెంటర్ ద్వారా ఎందరికో డిగ్రీలు

ఉదయగిరి పట్టణంలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ ఎందరో ఉర్దూ మీడియంలో డిగ్రీలు పొందారు. అందులో పట్టభద్రులు(బి.ఏ), ఉన్నత పట్టభద్రులు(ఎం.ఏ) చాలామంది ఉన్నారు. దీనికంతటికి మూలపురుషుడు హనీఫ్ ఉస్తాద్. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను ఉదయగిరికి తెచ్చారు. ఉదయగిరి సమీపంలోని వెంకటంపేటలో దాదాపు 15ఏళ్ల పాటు ఈ స్టడీ సెంటర్‌ను నడిపారు. విద్యా బోధన చేశారు. ఈ కారణంగా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలామంది ఉర్దూలో బి.ఏ, ఎం.ఏ, బి.ఈడిలు పూర్తి చేశారు. హనీఫ్ ఉస్తాద్ పుణ్యమా అని ఉర్దూ మీడియంలో ఎందరో డిగ్రీ, పీజీ, బీఈడీలను పూర్తిచేసి ఉపాధి పొందే అవకాశం కల్పించారు. మధ్యలో చదువు ఆపేసిన వారిని ఉన్నత విద్యావంతులుగా మార్చడంలో ఆయన అపార కృషి దాగి ఉంది.

మధుర గాయకుడు

హనీఫ్ ఉస్తాద్ మధుర గాయకుడు. ఆయన గాత్రం మృదుమధురంగా ఉంటుంది. ఆయన ఒక పాట పాడినా, గజల్ ఆలపించినా పరవశం కలిగిస్తుంది. కపటం లేని ఆయన మనసులాగే ఎంతో హాయి గొలుపుతుంది. రాష్ట్రస్థాయిలో పాటల పోటీల్లో పలు బహుమతులు పొందారు. అంతేకాదు, ఆల్ ఇండియా రేడియోలో తన గాత్రాన్ని పలుమార్లు వినిపించి హాయి గొలిపారు. అలాగే చర్చాగోష్టుల్లోనూ పాల్గొన్నారు. ఉదయగిరి వాసులకు ఆయన గాత్రం బహు సుపరిచితం. ఆయన

నాతియా గీతాలు, సలాములు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవి. మృదువైన ఆయన కంఠం నిత్యం చిరస్మరణీయం.

ఉర్దూ మధుర కవి

హనీఫ్ ఉస్తాద్‌కు ఉర్దూ భాష అంటే ప్రాణం. ఉర్దూ మహాకవి అల్లమా ఇక్బాల్ అంటే చాలా ఇష్టం. ఆయన రాసిన కవితలు దాదాపుగా అన్ని కంఠోపాఠం. అలాగే ఉర్దూ కవులు మీర్జా గాలిబ్, మీర్ తాఖీమీర్, హ్రసత్ మౌహాని, జఫర్, దాగ్ దేహలావి తదితరులు రాసిన కవితలు చాలావరకు ఆయనకు జ్ఞాపకం. సందర్భానుసారంగా కవిత రూపంలో మాట్లాడటం ఆయన ప్రత్యేకత. ఉర్దూ మహాకవులు మీర్జా గాలిబ్, అల్లమా ఇక్బాల్ జయంతుల సందర్భంగా అంజుమన్ తరఖీ ఉర్దూ ప్రాంగణంలో చాలాసార్లు, జూనియర్ కళాశాలలో పలుమార్లు ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహించేవారు. ఇందులో రాష్ట్రస్థాయి కవి సమ్మేళనాలు కూడా ఉన్నాయి. పలు ప్రాంతాల నుంచి ప్రముఖ కవులు విచ్చేసి తమ కవిత గానాలతో కవిత్వ పరిమళాలను వెదజల్లారు. ఇటువంటి సందర్భాల్లో భాష మరింత పరిపుష్టమవుతుందని ఆయన భావన.

ఆయన మంచి కవి. ఉర్దూ పండితుడు. ఉర్దూ భాషలో ఆయన రాసిన కవితలు అనేకం. అందులో నాతియా గీతాలు, మన్ఖీ బత్తు, గజళ్లు ఉన్నాయి. ఆయనకు ఉర్దూ కవి సమ్మేళనాలు (ముషాయిరాలు) చాలా ఇష్టం. అక్కడ తోటి కవుల కవిత్వం విని ప్రశంసించడం చాలా ఇష్టం. తన కవితా రీతిని తోటి కవుల ముందు వ్యక్తీకరించడం ఇంకా ఇంకా ఇష్టం. సహజంగానే ఆయన కవితాశైలి అందరినీ ఆకట్టుకునేది. సునిశిత భావాలతో గిలిగింతలు పెట్టేది. ఉదయగిరిలో మరెందరో ఉర్దూ కవులు ముందుకు రావాలని భావించేవారు. చాలామందిని ప్రోత్సహించి తన వెంట తీసుకు వెళ్లేవారు. ఏమాత్రం కవితా ప్రవేశం ఉందని భావించినా, వారిని ప్రశంసించేవారు. అది ఆయన హృదయ వైశాల్యం. హనీఫ్ ఉస్తాద్‌లో ఎక్కడ కోపం, అసూయ, ద్వేషం, అసహనం దాఖలాలు కనిపించవు. అందుకే ఆయన అజాతశత్రువు. అందరి చేత ప్రేమించబడిన అరుదైన వ్యక్తి.

ఆధ్యాత్మిక గురువు

హనీఫ్ ఉస్తాద్ ఖాలిది ఆధ్యాత్మిక గురువు. సూఫీ మార్గంలో నడిచిన ఒక ఆధ్యాత్మికవేత్త. ఎందరో శిష్యులు, ప్రశిష్యులు ఆయనకు ఉన్నారు. వారిని తన వెంట నడిపించారు. అవసరమైనప్పుడు వెంట నడిచారు. చెప్పేది ఒకటి ఆచరణ మరొకటి కాదు. రెండు ఒకేలా ఉండే గురుమూర్తి. అందుకే ఆయనంటే అందరికీ ఇష్టం. స్వార్థరహితంగా బతకాలనేది ఆయన ఆలోచన. అలాగే నడిచారు. నిలిచారు.

హనీఫ్ ఉస్తాద్‌కు లైఫ్ టైం అచీవ్మెంట్ (జీవితకాల సాఫల్య) పురస్కారం

హనీఫ్ ఉస్తాద్ మాట్లాడేది తక్కువ. చేతలు ఎక్కువ. ఆయన మాట మృదు మధురం. చేతలు బహు ఆదర్శం. అందుకే ఆయనకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ (జీవితకాల సాఫల్య పురస్కారం) అవార్డు లభించింది. పాతిక వేల రూపాయల నగదు పారితోషికంతో పాటు జ్ఞాపిక వరించింది. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ఆయనకు అందించింది. 2021లో అప్పటి డిప్యూటీ సీఎం అంజద్ బాష ఈ అవార్డును అందించారు.

ఒక గొప్ప గురువుకు ఈ అవార్డు లభించడం ద్వారా ఆ అవార్డుకే ఘనత చేకూరింది. ఉదయగిరిలో జన్మించిన హనీఫ్ ఉస్తాద్ ఈ ప్రాంతానికే గర్వకారణంగా నిలిచారు. అందరి హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోయారు.

ఉదయగిరి మహనీయులు

హనీఫ్ ఉస్తాద్ మంచి రచయిత. సహజంగా ఆయన ఉదయగిరి ప్రేమికుడు. ఈ ప్రాంతంలో ఎందరెందరో మహనీయులు జన్మించారు. వారందరి చరిత్ర పది తరాలకు తెలియాలని భావించారు. అందుకోసం నాలుగు దశాబ్దాలకుపైగా చారిత్రక పరిశోధన చేశారు. అరుదైన "ఉదయగిరి మహనీయులు" పుస్తకాన్ని రచించారు. "ఉదయగిరి మహనీయులు" పుస్తకాన్ని చదువుతుంటే ఆనంద పరవశం కలుగుతుంది.

ఇంతటి మహనీయులు ఉదయగిరిలో జన్మించారా?! అని ఆశ్చర్యం కలుగుతుంది. ఈ పుస్తక రచనకు ఆయన చేసిన కృషి మాటల్లో చెప్పలేనిది. అక్షరాల్లో వర్ణించతరం కానిది. ఆయన ఒక పేజీ రాయడానికి ఒక సంవత్సరం పట్టిన దాఖలాలు కూడా ఉన్నాయి. వందల ఏళ్ల చరిత్రను ఆయన పరిశీలించారు. పరిశోధించారు. నిజాల నిగ్గు కోసం అనేక ప్రాంతాలకు వెళ్లారు. అరుదైన గ్రంథాలయాల్లో రోజుల తరబడి, నెలల తరబడి పరిశోధన చేశారు. ఒక పుస్తకం రాయడానికి 40 ఏళ్లకు పైగా పట్టిందంటే అదెంతటి మహత్తర రచనో అర్థం చేసుకోవచ్చు. ఉదయగిరిపై ప్రేమతో ఇంతటి ప్రేమను కురిపించిన హనీఫ్ ఉస్తాద్ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతారు. రాబోయే తరాలు ఈ కృషిని తప్పక గ్రహిస్తాయి. ఉదయగిరి ప్రాంతం ఎంత గొప్పదో తెలుసుకుంటాయి. ఈ పుస్తకావిష్కరణ ఆయనకు జీవితకాలంగా మిగిలిపోయిన ఒక తీయని కోరిక. ఆయన లేకపోయినా ఉదయగిరి వాసుల మనసుల్లో ఒక ధ్రువతారలా చిరస్థాయిగా ఉండిపోతారు.

భక్తుల దర్శనార్థం హజరత్ గారి దివ్యసమాధి
ఉదయగిరిలోని ఆస్తాన-ఎ-చిష్టియా నందు కలదు.

గ్రంథ రచయిత ఆధ్యాత్మిక పరంపర

అప్పుడు నా వయస్సు సుమారు 17 సంవత్సరములు, ఒకనాడు నేను దారిలో వస్తుండగా ఒక ఫకీరు ఎదురుపడి ఈ వాక్యము వ్యక్తపరిచారు. "తరీఖత్‌మె ఫూల్ బన్‌జా".. అనగా ఆధ్యాత్మిక మార్గంలో నునుమెత్తని పుష్పములాగా మారిపో. ఇదే నాకు నిజమై 1976 సంవత్సరములో నాకు సద్గురు చరణ కమలాల ద్వారా ఆధ్యాత్మిక మార్గము దొరికినది.

లాయిలాహ యిల్లల్లాహు ముహమ్మదుర్ రసులుల్లాహి యా హజరత్ షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలాని షైఅన్ నిల్లా

మురీది హిమ్ వతిబ్ వష్తహ్ వ గన్న
వ యిఫ్అల్ మాతషావుఫల్ యుస్ను ఆలి
మురీది లా తఖఫ్ అల్లాహు రబ్బి
అతాని రిఫ్ అతున్ నిల్ తుల్ మనాలి

1. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సుల్తానుల్ అంబియా వల్ ముర్సలీన్ రహమతుల్ లిల్–ఆలమీన్ షఫీయిల్ ముజ్నబీన్ అహమదే ముజతబా – ముహమ్మద్ ముస్తఫా సాల్లెల్లాహు అలైహి వ ఆలి హి వ సల్లిమ్ రూహి ఫిదా బి అబీ వ ఉమ్మి.
2. ఇలాహీ బహుర్మతె రాజోనీయాజ్ హజరత్ యిమాముల్ మషారిఖిన్ వల్ మగారిబ్ అసదుల్లా హిల్ గాలిబ్ అమీరిల్ మోమినీన్ అలీ యిబ్నె అబి తాలిబ్ కర్రమల్లాహు వజ్ హు వల్ అహ్రమనా బ బర్కాతహు.
3. ఇలాహి బహుర్మతె రాజోనియాజ్ అమీరిల్ మోమినీన్ సయ్యదిష్ షాహదా హజరత్ ఇమామె హుసేన్ షహిదె దష్తె కర్‌బలా అలైహిసన్ సలాం.

4. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ ఇమాముల్ ఆబిదీన్ అమీరిల్ మోమినీన్ జైనుల్ అబిదీన్ అలైహిస్ సలాం.

5. ఇలాహీ బహుర్మతె రాజోనియాజ్ హజరత్ యిమాముల్ ముత్తఖీన్ అమీరిల్ మోమినీన్ ఇమామ్ ముహమ్మద్ బాఖర్ అలైహీస్ సలాం.

6. ఇలాహీ బహుర్మతె రాజోనియాజ్ హజరత్ యిమాముస్ సాదిఖీన్ అమీరిల్ మోమినీన్ జాఫర్ సాదిఖ్ అలైహిస్ సలాం.

7. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ ఇమాముల్ కామిలీన్ అమీరిల్ మోమినీన్ మూసా కాజిమ్ అలైహిస్ సలాం.

8. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ యిమాముల్ వాసిలీన్ అమీరిల్ మోమినీన్ అలీ మూసా రజా అలైహిస్ సలాం.

9. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ షేఖ్దీన్ మారూఫ్ కర్ఖీ రజిఅల్లాహు అన్హు.

10. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ షేఖ్ జియాపుద్దీన్ సిర్రి సిఖ్తి రజి అల్లాహు అన్హు.

11. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యదిత్ తాయిఫా జునైద్ బొగ్దాది రజి అల్లాహు అన్హు.

12. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ షేఖ్ అబ్దుల్లా అబూబకర్ షిబ్లీ రజి అల్లాహు అన్హు.

13. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ అబుల్ ఫజల్ అబ్దుల్ వాహిద్ తమీమి రజి అల్లాహు అన్హు.

14. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ అలావుద్దీన్ అబుల్ ఫరహ్ తర్తూసీ రజి అల్లాహు అన్హు.

15. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ అబుల్ హసన్ అలీయుల్ ఖుర్తైషీ యిల్ హంకారీ రజి అల్లాహు అన్హు.

16. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ అబూ సయీద్ ముబారకల్ మఖ్రమి రజి అల్లాహు అన్హు.

17. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ ఖుత్బుల్ ఆరఫీన్ ముర్షదీస్ సాలికీన్ మీరా సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ జీలాని మహబూబె సుబ్హాని రజి అల్లాహు అన్హు.

18. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ రహ్మాతుల్లాహి అలైహ్.

19. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ ముహమ్మద్ హిత్తాక్ రహ్మాతుల్లాహి అలైహ్.

20. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ షంసుద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

21. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ షర్పుద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

22. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ జీనుద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

23. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ వలీయుద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

24. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ నూరిద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

25. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ యహ్యా రహ్మాతుల్లాహి అలైహ్.

26. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ అబీబకర్ రహ్మాతుల్లాహి అలైహ్.

27. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ హుసాముద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

28. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ ముహమ్మద్ దర్వేష్ రహ్మాతుల్లాహి అలైహ్.

29. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ నూరుద్దీన్ రహ్మాతుల్లాహి అలైహ్.

30. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అబ్దుల్ వహ్హాబ్ రహ్మాతుల్లాహి అలైహ్.

31. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ ఇస్మాయిల్ రహ్మాతుల్లాహి అలైహ్.

32. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అబీబకర్ సాని రహ్మాతుల్లాహి అలైహ్.

33. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ సాని రహ్మాతుల్లాహి అలైహ్.

34. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అలీ రహ్మాతుల్లాహి అలైహ్.

35. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ ముస్తఫా రహమ్మతుల్లాహి అలైహ్ వల్ అహ్రమనా బ బర్కాతుహు.

36. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ సయ్యద్ అబ్దుల్లా షా సాహెబ్ రహ్మాతుల్లాహి అలైహ్.

37. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ ఆజిజ్ నవాజ్ మహబూబె రబ్బాని ఖాజా షంసుద్దీన్ ముహమ్మద్ చిస్తివుల్ ఖాదరి రహ్మాతుల్లాహి అలైహ్.

38. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ బేకస్ నవాజ్ ఖాజా షా అబూబరజా సయ్యద్ ముహమ్మద్ బాదషా మెహయ్యద్దీన్ వజూది యిల్ ఖాదరి రహ్మాతుల్లాహి అలైహ్.

39. ఇలాహీ బహుర్మతె రాజో నియాజ్ హజరత్ జ్రానవాజ్ ఖాజా అబుల్ ఫైజ్ షా ముహమ్మద్ ఖాలిద్ వజూదియిల్ ఖాదరి రహ్మాతుల్లాహి అలైహ్.

40. ఇలాహి బయిజ్ జొ యింకెసార్ ఖ్వాజా అబుల్ ఫారుఖ్ షా మొహమ్మద్ హనీఫ్ ఖాలిది చిష్టివుల్ ఖాదరి ఆఖిబతే.

మహ్మద్ గర్దావ బతుఫైలే పీరానె వుజ్జామ్ దర్ దునియా వ వుఖ్బాబా యిమాన్ వసుర్ఖ్ రూదార్ ఆమీన్ ఆమీన్ ఆమీన్ యా రబ్బుల్ ఆలమీన్ బహఖ్ఖే తహా వ యాసిన్.

మెరిహస్రతేఁ మెరిచాహతేఁ
సర్కార్హోఁ మెరె సామనే
మెరె ఆఖరీ ఔఖాత్మే గంఖార్ హో
మెరె సామనే

హనీఫ్ అయాజ్ ఖాలిది